జూలై 2015
ఆషాఢ|శాలివాహన శకం 1937 ₹ 5

ఆంధ్రప్రదేశ్



గుండెల్లో గోదారి | పరవళ్ల పుష్కరానికి సర్వం సిద్ధం

మహాసంకల్పం

సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుంటాం, దేశంలో ఆంధ్రప్రదేశ్‌ని అగ్ర రాష్ట్రంగా నిలబెడతాం అని జూన్ 8 న మహాసంకల్పం చెప్పారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ప్రభుత్వాన్ని ఏర్పరిచి ఏడాది పూర్తయిన సందర్భంగా, ప్రమాణ స్వీకారం చేసిన నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో మహాసంకల్ప సభ జరిగింది. గవర్నర్ ఈ ఎస్ ఎల్ నరసింహన్, రాష్ట్ర మంత్రిమండలి సభ్యులూ, లక్షలాది ప్రజానీకం హాజరైన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం బులెట్ లాగా దూసుకెళతానని చంద్రబాబు ఈ సమావేశంలో ప్రకటించారు.





ఫొటో టి శ్రీనివాసరెడ్డి

ఈ సంచికలో...



22

గోదావర్యైనమః

భరతఖండంలో పచ్చని కలలు పండించే నదీమతల్లి గోదావరి. ఇప్పుడు పుష్కరుడితో కలిసి భారతీయుల కోసం పుణ్యాల పంటను పండించబోతోంది.

28


వైభవంగా ఆరంభం కానున్న గోదావరి మహా పుష్కరాలు



8

రాజధాని అమరావతికి భూమిపూజ





12

విభజన చట్టాన్ని అమలు చేయాలి

తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితం

సంపుటి 58 సంచిక 12

శాలివాహన శకం 1937 ఆషాఢ

పబ్లిషర్ & కమిషనర్
ఎన్ వి రమణారెడ్డి, ఐఆర్‌పిఎస్

ప్రధాన సంపాదకుడు
కందుల రమేష్

సంపాదకుడు
నున్నా నరేష్

సహ సంపాదకులు
నీరుకొండ ప్రసాద్
జాస్తి గోపాల ప్రసాద్
డబ్బీరు రామకృష్ణ పట్నాయక్

ముఖచిత్రం
గోదావరి హారతి

రెండవ కవర్
మహాసంకల్ప సభలో ముఖ్యమంత్రి

మూడవ కవర్
నవనిర్మాణ దీక్ష చేయిస్తున్న ముఖ్యమంత్రి

నాల్గవ కవర్
'నీరు-చెట్టు' ప్రకటన

ప్రచురణ
సమాచార, పౌరసంబంధాల శాఖ
సమాచార భవన్, ఎ.సి.గార్డ్స్
హైదరాబాద్ - 500 028
ఫోన్: 040 - 23300258

రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవి కానక్కరలేదు.

రూపకల్పన
కార్తీక్ బీసు

ముద్రణ
కాక్స్‌టన్ ఆఫ్ సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

web: www.andhrapradeshmagazine.org
Email: apchiefeditor@gmail.com
www.ipr.ap.nic.in



సవాళ్లను ఎదుర్కోగల సంకల్పం!

ప్రభుత్వాన్ని నడపడమంటే మాటలు కాదు. మాటలు మాత్రమే చెప్పేవాళ్లు మంచిపాలనను అందించలేరు. ఆటుపోట్లు ఎన్ని ఎదురైనా, లక్ష్యాన్ని విస్మరించని నాయకత్వమే ప్రగతికి రక్ష. విభజన చేదు ఫలితాలు వెంటాడి వేధిస్తున్నాయి. అయినా, గమ్యం చేరుకోవడంపైనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దృష్టి అంతా. తాజా పరిణామాలే ఇందుకు రుజువు. ఉమ్మడి రాజధానిలో ఎదురవుతున్న ఇబ్బందుల మీద ఒకవైపు ఎడతెగని పోరాటం. అదే సమయంలో, ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో ముందడుగు వేసేందుకు అవసరమైన కార్యాచరణకు సన్నద్ధం.

పట్టిసీమను రికార్డు సమయంలో పట్టాల మీదకి ఎక్కించేందుకు పురికొల్పడం కావచ్చు. దాదాపు 2,500 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదముద్ర వేయడం కావచ్చు. పుష్కరాలను ఒక సాంస్కృతిక పండుగగా జరపడానికి సకల ఏర్పాట్లు చేయడం కావచ్చు. నవ నిర్మాణ దీక్షకు పునరంకితమై, మహా సంకల్పాన్ని స్వీకరించడం కావచ్చు. అన్నిటికి మించి ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలిచిన రాజధాని అమరావతికి భూమిపూజ చేయడం కావచ్చు. ఒక్క నెలలో ఎంత ఎదురీత! ఎన్ని కార్యక్రమాల నిర్వహణ! కష్టాలకు, కడగండ్లకు వెరవని ముఖ్యమంత్రి నిబద్ధత ఇది.

అభివృద్ధికి శ్రమిస్తూనే, మన సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేయాలన్న సంకల్పం ఈ ప్రభుత్వానిది. అందుకే, గోదావరి పుష్కరాలను ఒక ప్రజాపండుగగా, ఒక వేడుకగా, ప్రకృతికి ఒక నివాళిగా ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, నదీనదాలతో మనకుండే సంబంధాన్ని, బాంధవ్యాన్ని స్మరించుకునే పుష్కరాల ప్రత్యేకంగా 'ఆంధ్రప్రదేశ్' పత్రిక ఈ సంచిక వెలువడుతోంది. ఒక నూత్న రాష్ట్రంగా నవ్యాంధ్రప్రదేశ్ నిలదొక్కుకుంటున్న వేళ, 'ఆంధ్రప్రదేశ్' పత్రిక ఇప్పుడు ఒక కొత్తరూపు దాలుస్తోంది. ఆధునిక సాంకేతిక, సమాచార పనిముట్లను ఉపయోగించుకుంటూ, అంతర్జాలంలో తనకంటూ ఒక కొత్త చిరునామాను స్వీకరించింది. ఆంధ్రప్రదేశ్ పత్రికను మీరిప్పుడు ప్రపంచంలో ఎక్కడనుంచైనా www.andhrapradeshmagazine.org లో కూడా చదవొచ్చు. ఈ చిరునామాలో ఇక నుంచి పాతసంచికలతో పాటు, ఎప్పటికప్పుడు ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం కూడా ఉంటుంది. ఎల్లలు దాటి విస్తరించి 'ఆంధ్రప్రదేశ్'ను మీకు మరింత చేరువ చేసే ప్రయత్నమిది.

కందుల రమేష్
చీఫ్ ఎడిటర్



సామాజిక స్పృహతో వ్యవహరిద్దాం

మరోసారి గోదావరి నదిలో పుష్కరుడు ప్రవేశిస్తున్నాడు. జూలై 14న ప్రవేశిస్తున్నాడు కాబట్టి 12రోజుల పాటు గోదావరి నదీజలాలు అతి పవిత్రతను సంతరించుకుంటున్నాయి. ఆ పన్నెండు రోజులూ దేవతలంతా గోదావరి నదిలోనే నివసిస్తారని మన నమ్మకం. పుష్కరాలలో పవిత్ర గోదావరిలో మునక వేయాలని వచ్చే భక్తులలో అత్యధిక శాతం ఆ 12 రోజుల్లోనే గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించడానికి, పితృ దేవతల కోసం పిండ ప్రదానాలు వంటి కార్యాలు ఆచరించటానికి వస్తారు.

పుష్కర సంవత్సరం చివర్లో అంత్య పుష్కరాలు కూడ వస్తాయి. అయినా ఆది పుష్కరాలలోనే తమ తమ విశ్వాసాలకనుగుణంగా పితృయజ్ఞం చేయటానికి సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వస్తుంటారు.

ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర దేశాల నుంచి కూడా భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. 2003లో జరిగిన గోదావరి పుష్కరాలలో రెండున్నర కోట్ల మంది పాల్గొన్నారని ఒక అంచనా. టెలివిజన్‌లతో పాటు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా గోదావరి పుష్కరాల గురించి ప్రచారం 2003లో కన్నా ఇప్పుడు విస్తృతంగా జరగటంతో నాలుగు కోట్ల దాకా భక్తులు ఈ పుష్కరాలలో గోదావరి తల్లిని సందర్శిస్తారని అంచనా వేస్తున్నారు.

ఇలా జరిగితే ఆ తాకిడి బాగా ఎక్కువగా ఉభయ గోదావరి జిల్లాల్లోనే వుంటుంది. రైళ్ళు, బస్సులు, విమానం, కార్లు వంటి రవాణా వాహనాల మీద వచ్చే వాళ్ళకి గోదావరి తీర క్షేత్రాలను చేరుకోవడం సులభం.

ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసిన ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు ఎనిమిది మాసాల క్రితం నుంచే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ వచ్చారు. వీధి లైట్లు, మరుగుదొడ్లు, రేవులలో మహిళలకు ప్రత్యేక సదుపాయాలు, అనాయసంగా ట్రాఫిక్ కదులుతూ వుండేలా రోడ్ల విస్తరణ చర్యలు, మురుగునీటి పారుదల, త్రాగునీటి సరఫరా వంటి అనేక అంశాల విషయంలో ముఖ్యమంత్రి సారథ్యంలో అధికార యంత్రాంగం చాలా చురుగ్గా వ్యవహరిస్తూ పనిచేస్తోంది. ముఖ్యంగా భద్రత విషయంలో అతి జాగరూకతతో వుండాలని ముఖ్యమంత్రి పదేపదే ప్రకటనలు చేయటం, సమీక్షా సమావేశాల్లో హెచ్చరించటం జరిగింది.

ప్రభుత్వం ఎంత చేసినా, ప్రజల సహకారం లేకుండా ఆశించిన ఫలితాన్ని సాధించలేం.

ప్రపంచవ్యాప్తంగా జలకాలుష్యం భయంకరమైన సమస్యగా తయారైంది. ఒక తాజా సర్వే ప్రకారం అమెరికాలోని వివిధ జలవనరుల్లో 30 – 45 శాతం కాలుష్యంలో మునిగి తేలుతున్నాయి. చైనాలో 75శాతం జనాభా తాగుతున్నది కలుషిత జలాలే. ఏటా అయిదు కోట్ల మంది ప్రజలు కలుషిత నీటి సంబంధమైన జబ్బులతోనే ప్రపంచవ్యాప్తంగా చనిపోతున్నారని జల నిపుణుడు మైకేల్ హోగన్ పేర్కొంటున్నారు. ఈ మరణాలలో అధిక శాతం ఆసియా, ఆఫ్రికా దేశాలలో జరుగుతోంది.

జలకాలుష్యానికి కారణాలు అనేకం వున్నాయి. కాని, వీటిల్లో మనుషులు వల్ల జరిగే కాలుష్యమే చాలా ప్రమాదంగా పరిణమిస్తోందని వేర్వేరు నివేదికలు పేర్కొంటున్నాయి.

ఈ నేపథ్యంలో మన గోదావరి నది పుష్కర ఘట్టాన్ని కూడా చూడాల్సి ఉంది.


ఈ నది మనకి పవిత్రమైనది మాత్రమే కాదు, లక్షలాది ప్రజలకి త్రాగునీరు సరఫరా చేసేది. లక్షలాది పశువులకు జీవనాధారమైనది. ప్లాస్టిక్ పదార్థాలు, డిటర్జెంట్‌లు, వ్యర్థ పదార్థాలు, కుళ్ళిపోయిన చెత్తా చెదారం...ఇలాంటి కాలుష్యం ఈ నదిలో సాధారణ రోజుల్లోకన్నా అనేక రెట్లు ఎక్కువగా చేరటానికి అవకాశమిచ్చే ఘట్టం కూడా ఈ పుష్కరాలే.

నది పవిత్రతనూ కాపాడాలి, కాలుష్యం నుంచి జీవ, వృక్షరాశినీ కాపాడాలి. అందుకే ఈ పుష్కరాల కాలంలో గోదావరి నదిని కాలుష్యం నుండి మరింత అప్రమత్తతతో కాపాడుకోవాలని ముఖ్యమంత్రి తపిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం విశ్వప్రయత్నం చేస్తోంది.


'దక్షిణ గంగ'గా ప్రసిద్ధి చెందిన ఇంత పెద్ద నది మన రాష్ట్రంలోంచి ప్రవహించటం మన అదృష్టం. ఈ అదృష్టాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే ఈ పుష్కరకాలంలో ఈ జలాలు కలుషితం కాకుండా స్వచ్ఛంద సంస్థలు ప్రజలను అప్రమత్తం చేయాలి. అడుగడుగునా సామాజిక స్పృహతో యాత్రికులు వ్యవహరించేలా చూడాలి. ప్రభుత్వ ప్రయత్నాలకు తగిన సహకారం అందేలా చేయాలి.

"ఈ నది నాది – దీన్ని కాపాడుకోవటం నా విధి" అన్న భావన ప్రతి భక్తుడి గుండెలో కార్యరూపం దాల్చాలి. అప్పుడే, యాత్రికులు మర్చిపోలేని మధుర స్మృతులతో తిరిగి వెళ్ళేలా చేయాలన్న ప్రభుత్వ కృషి అర్థవంతమవుతుంది.

ఇది మన రాష్ట్రం – ఇది మన గౌరవ ప్రతిష్ఠలకు సంబంధించిన విషయం. ఈ పుష్కరాలతో ఆ పతిష్టను ఇనుమడింప జేద్దాం.



ఎన్ వి రమణారెడ్డి
సమాచార కమిషనర్



వైవిధ్యభరితం

జూన్ సంచిక వైవిధ్యమైన శీర్షికలతో చక్కగా ప్రచురితమైంది. అయితే కొన్ని కొరతలు కనిపించాయి. కవితలు, కథల సంఖ్య తగ్గటం కొంత నిరుత్సాహ పరిచింది. గోదావరి మహాపుష్కరాల గురించి 'వేదంలా ఘోషించే గోదావరి'లో కీలకమైన విషయాలను ప్రస్తావించారు. చంద్రబాబు నేర్పరితనం, పరిపాలనాదక్షత 'అతడు అడవిని జయించాడు' అనే శీర్షికతో బహిర్గతం అయింది. ఆచరణలో, ఆదర్శాలలో దాసరి చెరువు సంరక్షణ వివరాలు తెలియజేస్తూ, ఇతరులు ఆ మార్గాన్ని అనుసరించవలసిన అవసరం తెలిపారు. కోనసీమ చాయాచిత్రం వివరాలు అహ్లాదకరంగా అమిరాయి. స్మార్ట్ విలేజ్ – స్మార్ట్ వార్డు వైపు ఎలా పురోగమించగలమో చక్కగా చెప్పారు. మల్లేశ్వరి రచించిన 'శత పత్ర సుందరి' కథ మనోరంజకంగా ఉంది. శ్రీరమణ శీర్షిక పత్రికకు చక్కటి ముగింపు.

– డాక్టర్ శివభూషణం, కర్నూలు.

ప్రతి పేజీ అపురూపం

జూన్ నెల "ఆంధ్రప్రదేశ్" పత్రిక లోని ప్రతి పేజీ చాలా బాగుంది. "ఏరువాకసాగారో రన్నోరైతన్న" అనే శీర్షికలో ఎరువుల ధరలు పెరిగిన విధానాన్ని మీరు గుర్తించారు. మంచిదే. మరి రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర రావటానికి మార్గం చూపమని వ్యవసాయ ఆర్థిక వేత్తలను అడిగి ఒక సాయం చేయండి.

'అజరామరం అమరావతి' వ్యాసం అద్భుతం. కాటన్‌కు నిజ నివాళే. డా. కె.ఎల్ రావు గారి గురించి స్థూలంగా అని సూక్ష్మంగా వ్రాసారు. ఏడాది ప్రజా ప్రభుత్వం – మధ్య పేజీలో ఫోటో చూచి మరో శ్రీ కృష్ణ దేవరాయలుగా చంద్రన్న అవుతాడని ఆశగా ఉంది. కావాలి. సంకల్ప దీక్ష మాత్రమే చాలదు. సంపద కావాలి – నవ నిర్మాణం చేయటానికి ప్రతి సిమెంట్ ఫ్యాక్టరీ నెల రోజుల ఉత్పత్తి ఇచ్చే భాగస్వామి కావాలి. మరో ప్రపంచం పిలిచినా ఎవరు పిలిచినా సరే పట్టెడన్నం పెట్టే వ్యవసాయాన్ని మరువవద్దు.

– ఎన్. మధుసుధన్, ఒంగోలు

పుష్కర సంచిక కోసం ఎదురుతెన్నులు

ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక వచ్చే నెల పుష్కరాల నిమిత్తం ఎక్కువ పేజీలతో ఉండాలి. ఆలయాలు, కట్టడాలు, చారిత్రక ప్రదేశాలు, మహానుభావుల వర్ణ చిత్రాలు ప్రచురించాలి. సప్త గోదావరుల గురించి వివరణ, స్నాన వివరాలు, పిండ ప్రధాన వివరాలు తెలియజేయగలరు. మళ్ళీ పుష్కరాలు వచ్చేంత వరకు దాచుకునేలా ఉండాలి.

జూన్ సంచికలో తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచం నలు దిశల చాటి చెప్పిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారితో రచయిత రావులపాటి సీతారామారావు గారి అనుభవాల వ్యాసం ఒక మహావ్యక్తి క్రమ శిక్షణ తెలియచేసింది. సినీరంగానికి చెందిన దూండి గారి గురించి రావి కొండలరావు గారి వ్యాసం గతం గుర్తు చేసింది.

– వాసుదేవ, అవనిగడ్డ

రచయితలకు గమనిక

'ఆంధ్రప్రదేశ్' పత్రికపై అభిమానంతో రచనలను పంపుతున్న రచయితలు రచనతోపాటు తమ బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ ఫోటో కాపీ గానీ, బ్లాంక్ చెక్కు కొట్టేసి పంపితేనే, ప్రచురితమైన రచనలు పారితోషికం ఆయా అకౌంట్ లో జమ చేయడం జరుగుతుందని అకౌంట్స్ అధికారి తెలియజేస్తున్నారు. రచయితలూ, రచయిత్రులు దీని ప్రాధాన్యత గ్రహించి, మాతో సహకరించవలసిందిగా కోరుకుంటున్నాం.

– సంపాదకులు

'ఆంధ్రప్రదేశ్' పత్రికకు చందా ఇలా కట్టాలి

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికకు చందాదారులుగా చేరాలనుకుంటున్న వారు వార్షిక చందా నిమిత్తం 50 రూపాయల మనియార్డరును 'అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్' పేరిట పంపాలి. తమ పూర్తి చిరునామాను, తాము 'ఆంధ్రప్రదేశ్ ' పత్రికను ఏ భాషలో కోరుకుంటున్నారో కూడా ఆ మనియార్డరులో రాయాలి. ఆ మనియార్డర్‌ను ఈ క్రింది చిరునామాకు పంపాలి.

అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, సమాచార భవన్, ఏ.సి.గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ – 500 028.

చందాదారులు తమ చిరునామా మార్పు, కాపీలు అందకపోవడం గురించి ఈ ఫోన్ నెంబరుకు కాల్ చేసి వివరాలు కనుక్కోవచ్చు 040 23399048 ఎక్స్‌టెన్షన్ 123

తెలుగు పలుకుబడులు

'ఆంధ్రప్రదేశ్' పత్రికలో తెలుగు పలుకుబడులు చక్కని శీర్షిక. రచయిత శ్రీరమణ శ్రమకోర్చి ఎన్నో విలువైన విషయాలు తెలియజేస్తున్నారు. ఆ స్ఫూర్తితో ఇది రాస్తున్నాను. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, జిల్లాలలో కొన్ని పల్లెల్లో, పట్టణాలలో పూర్వపు రోజులలో ఎక్కువగా మాట్లాడే భాషలో కొన్ని పదాలు ఇప్పుడు తెలుగులో కనుమరుగవుతున్నాయి. కాబట్టి పాఠకులకు తెలియాలని ఆ పదాలను సేకరించి ఇక్కడ పొందుపరుస్తున్నాను.

వాడుక భాష	–	ప్రచార భాష	వాడుక భాష	–	ప్రచార భాష
ఉష్ణము	–	జ్వరము	వర్రగుండ	–	కారపు పొడి
గోకర్ణం	–	పులుసు మజ్జిగ వడ్డించే గిన్నె	బైస్కోపు	–	సినిమా
			కోక	–	చీర
చెక్కలు	–	వక్కలు	పేత	–	చెమటకాయలు
పన్ని	–	దువ్వెన	పాడుము	–	నస్యం
బొట్టి	–	కన్నెపిల్ల	అరటి దవ్వ	–	అరటి ఊస
అప్ప	–	అక్క	బేపి	–	కుక్క

– మహా భాగ్యం నరసింహారావు, విజయనగరం.

చంద్రయోగం



యోగా ప్రాధాన్యాన్ని ఎంతో ముందు గుర్తించిన కొద్దిమంది రాజకీయనాయకుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒకరు. కొద్దికాలం కిందటే, ప్రభుత్వంలోని ముఖ్యులందరికి సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణను ఇప్పించారు. జూన్ 21 న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా పాల్గొని, యోగాసనం వేసిన దృశ్యం.

రాజధాని అమరావతికి భూమిపూజ

నవ్యాంధ్రకు పునాది నవోదయానికి నాంది!

"నా సంకల్ప బలం చాలా గొప్పది. సంక్షోభంలోనే అవకాశాలు వెతుక్కుంటా. రాజధాని నిర్మాణాన్ని ఎవరూ అడ్డుకోలేరు" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచంలోనే అత్యాధునిక రాజధాని నిర్మాణానికి మంత్రివర్గ సహచరులు, వేలాది మంది ప్రజల సమక్షంలో శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు.

జూన్ 6, 2015- జ్యేష్ఠ బహుళ చతుర్థి శనివారం... ఉదయం 8 గంటల 49 నిమిషాలు!

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడం గ్రామం ఒక మహోజ్వల ఘట్టానికి కేంద్రమైన మధుర ఘడియ...

గత- వర్తమాన- భవిష్యత్తులని వేర్వేరుగా తోచే కాలం ఒక్కటై నిలిచిన అద్భుత క్షణం...

రేపటి మహోదయాన్ని ఒక ఉమ్మడి కలగా కోట్లాది కన్నులు కాంచే అపురూప సందర్భం....

..... ఆంధ్రుల సరికొత్త రాజధాని 'అమరావతి'కి అంకురార్పణ జరిగినప్పుడు, నిన్నటి దాకా ఆకుపచ్చ శోభలా అలరారిన నేల రేపటి రాజధానికి స్వాగత తోరణమైనప్పుడు, అనుకోని అతిథుల్లా కమ్మిన మబ్బులు చిరుజల్లుల జలాక్షతలు చల్లినప్పుడు, వేద మంత్రోచ్చారణల మధ్య 'అమరావతి'కి భూమిపూజ జరిగింది.

ఇది నాణేనికి ఒక వైపు!

మరో వైపు- ఆ అపూర్వమైన ఆనందానికి, అవధుల్లేని సంబరాలకీ కర్త, కర్మ, క్రియా అయిన నవ్యాంధ్ర సారథి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖాన ఓ గంభీరమైన నీడ. అడ్డగోలు విభజనతో రోడ్డున పడిన రాష్ట్రంలో మౌలిక సౌకర్యాల లేమి, ఏడాదిగా తీరని బాలారిష్టాలు, పాలనాపరమైన సంక్షోభాలు, కష్టాలు, ఆర్థిక నష్టాలు, ఇంటా బయటా ఎన్నో పెను సవాళ్లు, విపక్షాల విమర్శలు... వీటన్నింటికీ ఎదురొడ్డి, ఏటికి ఎదురీదిన ధీమంతుని వదనంలో తారాడిన మిశ్రమ భావాలు. వెయ్యేళ్ల ఘనమైన గతం, మరో వెయ్యేళ్ల ఉజ్వల భవిష్యత్తు దిశగా తిరుగుతున్న చారిత్రాత్మకమైన మలుపు దగ్గర కారకుడిగా, కార్యసాధకుడిగా నిలిచిన నిలువెత్తు మూర్తి - ముఖ్యమంత్రి చంద్రబాబు! ఉత్సవాల ఉత్సాహం కంటే, దీర్ఘకాలిక లక్ష్యాన్ని గమ్యం చేర్చే బాధ్యత తాలూకు ఉద్వేగమే ఆయనలో.

తన సతీమణి భువనేశ్వరి, తనయుడు లోకేష్‌లతో



కలిసి సంప్రదాయ వస్త్రధారణలో 8 గంటల31 నిమిషాలకు భూమి పూజ ప్రదేశానికి వచ్చారు చంద్రబాబు. సతీ సమేతంగా శిలాస్థాపన చేశారు. శిలపై అక్షింతలు చల్లారు. వెండి బేసిన్‌లో కలిపిన సిమెంటు, ఇసుక మిశ్రమాన్ని బంగారు పూత పూసిన వెండి తాపీతో శిలపై వేశారు.

చారిత్రాత్మక గ్రామంలో కొత్త చరిత్ర

'శ్రీరుద్రమదేవి భువం! యస్యా జన్మమహోత్సవమూ గణపతేః విక్రమ స్త్రి క్షోణిత జగద్దళం ప్రతిబళ ప్రధ్వంసి జన్మోత్సవః' – అని చెబుతోంది మందడం గ్రామంలోని వెయ్యేళ్ల నాటి శిలాశాసనం. కాకతీయ ప్రభువుల రారాణి, గణపతిదేవుడి కుమార్తె రాణీ రుద్రమదేవి జన్మదిన వేడుకలకు మందడమే వేదికయ్యిందని ఆ శిలాశాసనం నిర్ధారిస్తుంది. అటువంటి చారిత్రాత్మక గ్రామం, నిర్మితం కానున్న రాజధానికి ఈశాన్యంగా ఉండటమే కాకుండా, ఈ గ్రామానికి ఉత్తరంగా కృష్ణానది ప్రవహిస్తున్నందువల్ల వాస్తురీత్యా ఎంతో ప్రాశస్త్యాన్ని సంతరించుకుంది. ఆ మందడంలో భూమిపూజకు ఎంపిక చేసిన ప్రాంగణంలో జూన్ 5 సాయంత్రం నుంచే సందడి మొదలయ్యింది. పూజాసామగ్రిని అర్ధరాత్రి దాటాక తీసుకొచ్చారు. శనివారం తెల్లవారుజామున 3 గంటలకే లలితా సహస్రనామ పారాయణంతో కార్యక్రమాలు మొదలయ్యాయి. 4 గంటల నుంచి సిద్ధాంతి దాశరథి ఆధ్వర్యంలో వేద పండితులు భూమి పూజ ప్రక్రియ ప్రారంభించారు. పంచ నదులు, మానస సరోవరం నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో సంప్రోక్షణ చేశారు. గణపతి హోమంతో కార్యక్రమం మొదలైంది. అనంతరం భూమిపూజ చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టదిక్పాలక పూజ, నవగ్రహ ఆరాధన, వాస్తుపురుష పూజ వంటి కార్యక్రమాలు వరుసగా నిర్వహించారు. శిలాన్యాసం కోసం తొమ్మిది చదరపు అడుగుల పరిమాణంలో గొయ్యి సిద్ధం చేశారు. రత్నన్యాసం, అష్టధాతు పూజలు జరిగాయి.

ముఖ్యమంత్రి దంపతుల శిలాస్థాపన తర్వాత లోకేష్, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు, ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, పలువురు రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.వై.ఆర్.కృష్ణారావు, డీపీజీ జె.వి.రాముడు కూడా సిమెంటు–ఇసుక మిశ్రమాన్ని శిలపై వేశారు. అనంతరం చంద్రబాబు దంపతులు హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన వేదపండితులు ఆశీర్వచనం పలికారు. ఆ తర్వాత చంద్రబాబు దంపతులు గోమాతకు పూజ, హలయజ్ఞం చేశారు. ఒంగోలు గిత్తలు పూన్చిన అరకతో చంద్రబాబు ఉత్తర దిశగా దున్నారు. ఆయన సతీమణి భువనేశ్వరి నవధాన్యాలు చల్లారు. ముఖ్యమంత్రి రైతులా తలపాగా చుట్టుకుని, చర్నాకోలతో గిత్తలను అదిలించడం ఈ మొత్తం కార్యక్రమానికి ఒక గొప్ప ముక్తాయింపు.

సింగపూరును తలదన్నేలా రాజధానిని నిర్మిస్తా

భూమి పూజ వేదికపై నుంచే చంద్రబాబు చరిత్రాత్మక ప్రసంగం చేశారు. సింగపూర్‌ను తలదన్నేలా అమరావతిని నిర్మిస్తానని, ఈ కార్యక్రమంలో తానే మొదటి కూలీనని స్పష్టం చేశారు. 'ఓ ఇటుక విరాళమివ్వండి...పడి లేచిన కెరటంలా దూసుకెళ్దాం' అని రాష్ట్ర ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణానికి డబ్బులు ముఖ్యంకాదని, ఆలోచన విధానమే ప్రధానమని చెప్పారు. ఒక చరిత్ర సృష్టిస్తున్నందుకు అందరం గర్వపడదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, 'ఎగిరే కెరటం కింద పడినప్పుడు కాదు. పడిన కెరటం మళ్లీ పైకి ఎగిరినప్పుడే నాకు ఆనందం' అన్న స్వామి వివేకానంద సూక్తిని ప్రస్తావించారు. రాష్ట్రం ఇప్పటికే రూ.15,700 కోట్ల లోటు బడ్జెట్‌లో ఉందని, ఈ సమయంలో రాజధాని కట్టాలంటే కేంద్రం నిధులు ఇవ్వాలని, లేకపోతే అప్పు తీసుకురావాలని, కానీ, అప్పు తీసుకొచ్చే పరిస్థితి లేదని, ఈ నేపథ్యంలోనే సింగపూర్, చైనా, జపాన్, కొరియా దేశాల సహకారంతో రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు. "నా పేరు చెబితే సింగపూర్, జపాన్, చైనా దేశాలే ముందుకొస్తున్నాయి. అదీ నా క్రెడిబిలిటీ" అని వ్యాఖ్యానించారు.

"ఇప్పటి రైతులు రేపటి నుంచి వ్యాపారాలు ప్రారంభించాలి. వ్యవసాయ కూలీలు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి" అని పిలుపునిచ్చారు. "రాజధానికి భూములు ఇచ్చే రైతులు పెరుగుతున్నారు. నా ప్రయత్నంలో ఏమైనా తప్పులుంటే.. చెబితే సరి చేసుకొంటాను. కానీ, అడ్డు తగిలితే కొండనైనా బద్దలు చేయగల శక్తి నాకుంద"న్నారు.

"ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచంలోనే అత్యద్భుత రాజధానిని నిర్మిస్తా. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తా. రాజధాని నిర్మాణంలో నేనే మొదటి కూలీని అవుతా. ఇకపై వారానికి మూడు రోజులు ఇక్కడే ఉంటా. అవసరమైతే ఐదు రోజులు ఇక్కడే ఉండి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తా. నా సంకల్ప బలం చాలా గొప్పది. సంక్షోభంలోనే అవకాశాలు వెతుక్కుంటా. రాజధాని నిర్మాణాన్ని ఎవరూ అడ్డుకోలేరు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

ఏపీ రాజధాని నిర్మాణానికి విరాళాలు

ఏపీ రాజధాని నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా పలువురు దాతలు విరాళాలు అందించారు. హరికథలు చెప్పుకుని జీవనం సాగించే వ్యక్తి ఉడతాభక్తిగా తన వంతు సాయం చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, రైతులు ఇలా ప్రతి ఒక్కరూ విరాళాలు ఇచ్చి రాజధాని నిర్మాణానికి చేయూత ఇచ్చారు. భూమి పూజను పురస్కరించుకుని చిన్నారి ఆకుల ఏష, లోహిత్ , హర్షిత వైభవ్‌లు తిరుపతి నుంచి స్కేటింగ్ చేసుకుంటూ రావడమే కాకుండా వారు దాచుకున్న హుండీని రాజధాని నిర్మాణానికి విరాళంగా ఇచ్చి ముఖ్యమంత్రి ప్రశంసలకు పాత్రమయ్యారు. మందడం గ్రామానికి చెందిన ముప్పవరపు కృష్ణారావు వారి గ్రామంలోని 5వేల మంది తరఫున రూ.10 లక్షలు, మందడం పాఠశాల విద్యార్థులు దాచుకున్న డబ్బును విరాళంగా ఇచ్చి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు.

రాజధాని స్వరూపం

మొత్తం రాజధాని ప్రాంత భూమి: 53,621 ఎకరాలు (217 చ.కి.మీ.)

(రైతుల నుంచి సమీకరించిన 33 వేల ఎకరాలకు అదనంగా ఈ ప్రాంతంలో ఉన్న రహదారులు, జలాశయాలు, దేవాలయాలు, అటవీ శాఖల భూములన్నీ కలిపి)

ప్రాథమిక వసతుల కోసం కేటాయించాల్సింది: 22,000 ఎకరాలు

రైతులకు ఇవ్వాల్సింది: సుమారు 10,000 ఎకరాలు

గుట్టలు, జలాశయాలు, అటవీ భూములు పోగా అందరికీ అందుబాటులో ఇళ్ళ కోసం మరికొంత కేటాయించగా ప్రభుత్వానికి మిగిలేది: సుమారు 8,000 ఎకరాలు

(వీటిని ప్రయివేటు సంస్థలకు లీజుకిచ్చే ప్రాథమిక వసతులు సహా కాలుష్య రహిత పరిశ్రమలు, నివాస, వాణిజ్య సముదాయాలు నిర్మించాలన్నది ప్రభుత్వ ప్రణాళిక)

కార్యాలయాలుండే సీడ్ కేపిటల్ కోసం కేటాయించాల్సింది: సుమారు 3,706 ఎకరాలు

2035 నాటికి జనాభా: 1.1 కోట్లు

2050 నాటికి జనాభా: 1.35కోట్లు

2050 తర్వాత జనాభా– 2 కోట్లు ఉంటారని అంచనా.

దేశంలో మరే నగరానికి లేనన్ని ప్రత్యేకతలతో

కూడిన హరిత నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు వీలుగా అన్ని హంగులకు రూపకల్పన చేశారు.

పరిధి రెట్టింపు

రాష్ట్ర రాజధాని పరిధిని తాజాగా రెట్టింపు చేశారు. రాజధాని అమరావతి పరిధిని 217.23 చదరపు కిలోమీటర్లుగా ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10-6-2015న ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ప్రకటించిన దానికంటే ఇది రెండు రెట్లు ఎక్కువ. ఆదిలో రాజధాని కోసం ఎంపిక చేసిన 29 గ్రామాలకుతోడు ఇప్పుడు మరో మూడు మండలాల్లోని అదనంగా 25 గ్రామాలు కొత్తగా రాజధాని పరిధిలోకి తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొన్నారు. తుళ్ళూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లోని పలు గ్రామాలు కొత్తగా రాజధానిలో భాగం కానున్నాయి. మొదట్లో రాష్ట్రప్రభుత్వం భూసమీకరణ చేసిన 29 గ్రామాల పరిధిలోని భూముల్లో సుమారు 60 లక్షల మంది నివాసానికి వీలుగా ప్రణాళిక ఉంది. సుమారు 30 శాతం వాణిజ్య సముదాయాల నిర్మాణానికి కేటాయించారు. పర్యావరణ సమతూకంలో భాగంగా పచ్చదానికి, మోటార్ రహిత ప్రయాణ మార్గాలకు ప్రాధాన్యమిచ్చారు. ఉద్యానవనాలకు 21 శాతాన్ని, కాలువలు, చెరువులు, జలాశయాలకు మూడు శాతం భూమిని కేటాయించారు. గృహసముదాయల నుంచి విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలకు నడచి వెళ్ళేలా మండళ్ళ ప్రణాళికలో ప్రాధాన్యమిచ్చారు. భవిష్యత్ విస్తరణకు అనుగుణంగా, ఏ మార్గంలో కావాలనుకుంటే అక్కడ మెట్రోని విస్తరించేందుకు వీలుగా రహదారుల ప్రణాళిక రూపొందింది.

నవ్యాంధ్ర రాజధాని అమరావతి సుమారు 55 వేల ఎకరాల పరిధిలో విస్తరించనుంది. దీని విస్తీర్ణం 217 చదరపు కిలోమీటర్లు ఉంటుందని అంచనా. రాజధాని పరిధిని మొత్తం తొమ్మిది భాగాలుగా విభజించారు. మొత్తం రాజధాని ప్రాంతం 7,420 చదరపు కిలోమీటర్లు. ఇందులో కేంద్ర ప్రణాళిక ప్రాంతం 854 చదరపు కిలోమీటర్లు. ఇందులోనే 217 చ.కి.మీ.ల్లో రాజధాని నగరం ఉండబోతోంది.

బ్రహ్మస్థానం

మాస్టర్ ప్లానులో వాస్తుకు పెద్దపెట వేశారు. రాజధాని నగరంలో కృష్ణానదికి అభిముఖంగా ఈశాన్యం వైపున త్రిభుజాకారంలో కొంత ప్రాంతాన్ని ఖాళీగా ఉంచాలని ప్రతిపాదించారు. దీన్నే 'బ్రహ్మస్థానం' గా పేర్కొన్నారు. ఆ భాగం పక్కగా విజయవాడ కనకదుర్గ ఆలయం నుంచి వెలువడే శక్తి ప్రసరించే మార్గం ఉంటుంది. మరోమార్గం కొండపల్లి రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని చూపుతుంది. రాజధాని చుట్టూ అపార జలవనరులు ఉన్నాయి. వాటిని కాపాడుకుంటూ జలరవాణాకు పెద్ద పీట వేశారు. హరిత వనాలను పెంచుతూ ప్రజా పార్కులను ఏర్పాటు చేస్తున్నారు. క్రికెట్ స్టేడియం, గోల్ఫ్ కోర్టులు వంటి వాటి నిర్మాణానికీ చోటు కల్పిస్తున్నారు. రాజధాని నగరమంటే ఒకటీ రెండు సంవత్సరాల కోసం కాకుండా, శతాబ్దాల పాటు చిరస్థాయిగా నిలిచి ఉండేలా నిర్మించనున్నారు.

దసరాకు పనులు ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత ప్రణాళిక, అమరావతి నగర మాస్టర్ ప్లానును సింగపూర్ ప్రభుత్వం రూపొందించింది. జూలైలో సీడ్ కేపిటల్ ప్రణాళిక అందిన తర్వాత రాజధాని నగర నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి. దసరా రోజు జరిపే శంకుస్థాపనకు ప్రధాని మోదీని, సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధుల్ని ఆహ్వానించనున్నారు.

అమరావతి ప్రజా నగరంగా, ఆహ్లాదకరంగా, స్మార్ట్ రోడ్డులతో స్మార్ట్ సిటీగా, అతి గొప్ప ప్రజా రవాణాతో భాసిల్లనుంది.

మౌలిక సదుపాయాలు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం "రాజధాని నగర అభివృద్ధి, నిర్వహణ సంస్థ (సీసీడీఎంసీ) ' పేరిట ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. సీసీడీఎంసీ అమరావతి అభివృద్ధి, అక్కడ ఆకర్షణీయ నగరాల ప్రమాణాల మేరకు మౌలిక సదుపాయాల కల్పన, అమలు, నిర్వహణ బాధ్యత చేపట్టనుంది. రాజధాని అభివృద్ధి, నిర్మాణానికి ప్రభుత్వ నిధులకు అదనంగా అవసరమైన ఆర్థిక వనరులను ఇది సమకూర్చుకుంటుంది.

నగరాభివృద్ధికి మాస్టర్ డెవలపర్

అమరావతి నగరాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ డెవలపర్‌ను నియమించనున్నారు. పెట్టుబడుల్ని ఆకర్షించే పని ప్రధానంగా మాస్టర్ డెవలపరుదే. రాజధాని నగరంలో తేలికపాటి, కాలుష్య రహిత పరిశ్రమల్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రత్యేక పారిశ్రామిక విధానం ఉండాలని నిర్ణయించారు. హైదరాబాదులో ఐటీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు వీలుగా మొదట్లో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల్ని తీసుకురావడంతో ఇతర సంస్థలు సులువుగా వచ్చాయని, అలాగే అమరావతిలోనూ తొలుత భారీ ప్రోత్సాహకాలిచ్చైనా పెద్ద సంస్థ వచ్చేలా చూడాలని నిర్ణయించారు.

రూ. 72 వేల కోట్లతో తొలివిడత రాజధాని

నవ్యాంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో తొలి దశ నిర్మాణాలకు రూ. 72 వేల కోట్ల వ్యయం కాగలదని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి



రాజధాని నగరమంటే ఒకటీ రెండు సంవత్సరాల కోసమో, దశాబ్దాల కోసమో కాదు. శతాబ్దాల పాటు చిరస్థాయిగా నిలిచి ఉండేలా ఆంధ్రప్రదేశ్‌ని రాజధాని అమరావతిని నిర్మించనున్నారు.

రాజధానికి శోభాయమానంగా ఉండేలా కృష్ణా నదిని పూర్తి స్థాయిలో వినియోగించుకోనున్నారు. రాజధానికి అభిముఖంగా 16 కి.మీ. పొడవునా నది పారుతోంది. దీని రెండు ఒడ్డు కలిపి 35 కి.మీ. ఉంటాయని అంచనా. వీటి పొడవునా వినోద, విహార కేంద్రాలు, పార్కులు రానున్నాయి.



రాజధాని నిర్మాణానికి అయ్యే వేల కోట్ల రూపాయల ఖర్చును సొంతంగా భరించగలిగే స్థితిలో ఏపీ ప్రభుత్వం లేదు. కేంద్రం నుంచి వచ్చే సాయం కూడా స్పష్టంగా తెలియని స్థితిలో ప్రయివేట్ పెట్టుబడులను సమీకరించడమే ప్రభుత్వం ముందున్న మార్గమని అధికార వర్గాలు భావిస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలను నాలుగైదు విభాగాలుగా విభజించి వేటికవి సమాంతరంగా నిర్మాణం జరిగేలా చూస్తున్నారు. ఈ విభాగాలను ప్రత్యేక కంపెనీలుగా ఏర్పాటు చేసి దేనికి దానికి ప్రత్యేకంగా నిధుల సమీకరణ జరుపుతారు. మాస్టర్ ప్లానును కూడా ఇలా విడివిడిగానే రూపొందిస్తున్నారు. సింగపూర్ ప్రభుత్వం మాస్టర్ ప్లానును మొత్తం 14 భాగాలుగా విభజించింది. ప్రతి విభాగానికి విడివిడిగా ఒక ప్రణాళికను తయారు చేస్తున్నారు.

రాజధాని మధ్యలో జలమార్గాలు

కృష్ణానదికి అభిముఖంగానే రాజధాని నగర నిర్మాణం జరుగుతున్నా మళ్ళీ దాని మధ్యలో ఒక అలంకృత జలమార్గం నిర్మించనున్నారు. దాని పక్కనే ఢిల్లీలోని రాజపథ్ తరహాలో ఒక ప్రధాన రహదారి వస్తుంది. దీనికి అటుఇటూ ఉద్యానవనాలు రానున్నాయి. ఈ జలమార్గంలో లాంచీలు, పడవల్లో ప్రయాణం చేసే వీలు కల్పిస్తారు. రాజధాని నగరంలో పచ్చదనానికి, నీటి ప్రవాహాల అనుసంధానానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పచ్చదనానికి మొత్తం 21 శాతం ప్రాంతాన్ని వదలాలని నిర్ణయించారు. రాజధానిలో అంతర్భాగంగా ఉన్న వాగులు, వంకలు, చెరువులు, కుంటలను ప్రతిదానినీ అభివృద్ధి చేస్తారు. వాటి గట్లపై పెద్దఎత్తున చెట్లు, హరిత వనాలను పెంచుతారు. సివిక్ పార్కు, సెంట్రల్ పార్క్ పేరుతో రెండు భారీ పార్కులు నిర్మిస్తారు. ఇవికాక, కృష్ణా నది ఒడ్డున కెనాల్ పార్కులు ఏర్పాటు చేస్తారు. నదికి సమాంతరంగా పారుతున్న కొండవీటి వాగును మరింత వినియోగంలోకి తేవడానికి దానిపై రెండు కొత్త రిజర్వాయర్లు నిర్మించనున్నారు. రాజధాని ప్రాంతంలో మూడు శాతం ప్రాంతంలో జలాశయాలు, జల మార్గాలు ఉంటాయి. వీటి పొడవు 80 కిలోమీటర్లు. 200 కిలోమీటర్ల విస్తీర్ణంలో పచ్చదనం ఉంటుందని అంచనా.

సగం ప్రాంతం మౌలిక వసతులకే

రాజధాని ప్రాంతంలో సగం ప్రాంతం మౌలిక వసతులకే పోనుంది. సుమారుగా 22-23 వేల ఎకరాల భూమిని రోడ్లు, పార్కులు, జలమార్గాలు, పైప్ లైన్లు, మెట్రో మార్గాలు, పాఠశాలలు, ఆస్పత్రులు వంటి సామాజిక అవసరాలకు కేటాయిస్తారు. రైతుల వాటా కింద వారికి పది వేల ఎకరాల భూమి ఇస్తున్నారు. ఇందులో రెండు వేల ఎకరాలు వాణిజ్య భూమిగా ప్రత్యేకించి విడిగా ఇస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లో గృహాల లభ్యత కోసం కనీసం పది శాతం భూమి కేటాయించాల్సి వస్తోంది. అప్పుడే ఆ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలు నివాసం ఉండటం సాధ్యపడనుంది. ఇవి పోను ప్రభుత్వ అవసరాలకు సుమారుగా ఏడు వేల ఎకరాల భూమి మిగులుతోంది. దీనిలోనే ప్రభుత్వం తన అవసరాలు, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు కేటాయించాల్సి ఉంది.

ఆకర్షణీయంగా లంకలు

రాజధానికి శోభాయమానంగా ఉండేలా కృష్ణా నదిని పూర్తి స్థాయిలో వినియోగించుకోనున్నారు. రాజధానికి అభిముఖంగా 16 కి.మీ. పొడవునా నది పారుతోంది. దీని రెండు ఒడ్డు కలిపి 35 కి.మీ. ఉంటాయని అంచనా. వీటి పొడవునా వినోద, విహార కేంద్రాలు, పార్కులు రానున్నాయి. కృష్ణా నదిలో పర్యాటకులకోసం విస్తృతంగా వాటర్ ట్యాక్సీలను అందుబాటులోకి తేనున్నారు. కృష్ణానదిలో లంకలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. వీటిలో 7వేల ఎకరాల భూమి ఉంది. వరదలు వచ్చినపుడు ఇందులో కొంత మునుగుతుంది. ఇందులో ముంపునకు గురికాని 2500 ఎకరాల లంక భూములను పర్యాటక ఆకర్షణతో తీర్చిదిద్దనున్నారు. నదికి అభిముఖంగా క్రికెట్ స్టేడియం, పెద్ద పార్కు, యూనివర్శిటీ, యాంఫీ థియేటర్ వంటివి రానున్నాయి.

చారిత్రక ప్రదేశాలతో అనుసంధానం

రాజధాని నగరం చుట్టూ ఏడు చారిత్రక ప్రదేశాలను గుర్తించారు. నగరాన్ని వాటితో అనుసంధానిస్తున్నారు. వాటిలో కనకదుర్గ ఆలయం, మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అమరావతి, ఉండవల్లి గుహలు, భవానీ ద్వీపం, కొండపల్లి ఖిల్లా, నీరుకొండ, అనంతవరం ఆలయాలు ఉన్నాయి. వీటిని మెట్రో రైల్, రోడ్లు, జలమార్గాల ద్వారా రాజధానికి అనుసంధానిస్తారు. రాజధాని నగరంలో అంతర్గతంగా విశాలమైన రోడ్లను నిర్మిస్తారు. 200 అడుగుల వెడల్పు ఉండే ఎక్స్‌ప్రెస్ రహదారులతోపాటు చిన్న రహదారులు కూడా ఉంటాయి. బాగా చిన్న రహదారి కూడా 80 అడుగులు ఉంటుంది. కాలుష్యం పెరిగిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో విదేశాల్లో లాగా సైకిళ్ళను విరివిగా ఉపయోగించడానికి ప్రత్యేక రహదారులుంటాయి.

భవిష్యత్ తరాలకు బహుళ ప్రయోజనకారిగా ఉండేలా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించేందుకు వీలుగా 5 వేల ఎకరాలను తుది మాస్టర్ ప్లానులో కేటాయించారు.



జాస్తి గోపాల ప్రసాద్

విభజన చట్టాన్ని అమలు చేయాలి



ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నది. ఈ నేపధ్యంలో విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా వాస్తవిక స్ఫూర్తితో సెక్షన్ 8ని అమలుచేయాలని రాష్ట్రపతి, ప్రధాని, హోం శాఖ మంత్రిని కోరాం.

– చంద్రబాబు నాయుడు
ముఖ్యమంత్రి

రాష్ట్ర విభజన సమయంలోనే హైదరాబాద్ ను పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా నిర్ణయించారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆస్తుల రక్షణ, శాంతి భద్రతల నిర్వహణ కోసం సెక్షన్-8 ద్వారా గవర్నర్‌కి కొన్ని ప్రత్యేక అధికారాలు, హక్కులు కట్టబెట్టడం జరిగింది. దీని ప్రకారం ఉమ్మడి రాజధానిలో నివసించే ఏపీ ప్రజల ఆస్తులు, స్వేచ్ఛ, వారి భద్రతలను కాపాడే ప్రత్యేక బాధ్యతలను గవర్నర్‌కి అప్పగించారు. అయితే, ఈ సెక్షన్ అమలుకు నోచుకోలేదు. ఈ కారణంగా గత ఏడాదిగా ఉమ్మడి రాజధానిలో నివసించే ఏపి ప్రాంత ప్రజలు అభద్రతాభావంతో కాలం గడిపారు. ఉమ్మడి రాజధానిలోనే కార్యకలాపాలు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపైనా అడుగడుగునా నిఘా ఉందని ఇటీవల వెల్లడవడంతో, ఉమ్మడి రాజధానిలో శాంతిభద్రతల వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది.

ఈ ఏడాది కాలంలో జరిగిన కొన్ని సంఘటనలు పరిశీలిస్తే ఉమ్మడి రాజధానిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఎన్నో

- ఉన్నత విద్య సంస్థ కింద పదేళ్ల పాటు అడ్మిషన్లు జరగాలి. కానీ ఏడాదిలోనే ఉన్నత విద్యలో వేర్వేరుగా అడ్మిషన్లు జరిపించారు.
- ఫాస్ట్ అనే పథకం పెట్టి 1956 కంటే ముందు పుట్టినవారే అర్హులని, తెలంగాణ విద్యార్థులకి మాత్రమే సాయం అందేలా జీఓ తీసుకొచ్చారు. ఎంసెట్ కౌన్సిలింగ్ విషయంలోనూ పేచీ పెట్టారు.
- రవాణా వాహనాలకు ఎంట్రీ ట్యాక్స్‌లంటూ జీఓ నంబర్ 43 విడుదల చేశారు. తెలంగాణలో ఏపి అనే పేరు కనపడకుండా వాహనాల నంబర్ ప్లేట్లను 24 గంటల్లో మార్చేయాలని జీఓ నంబర్ 3 తీసుకొచ్చారు.
- శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి విషయంలోనూ ఎన్నో ఆటంకాలు సృష్టించారు.
- న్యాక్ విషయంలోనూ, ఏపి ఫుడ్ సంస్థలకు సంబంధించి కూడా ఏక పక్ష నిర్ణయాలు తీసుకున్నారు.
- నితమ్ సంస్థలోకి ఐఏఎస్ అధికారి చందనాఖాన్ ప్రవేశించకుండా తెలంగాణ పోలీసులు అడ్డుకున్నారు.
- కార్మిక శాఖ ఖాతాల విషయంలో బ్యాంకు అధికారులను బెదిరించి, అరెస్టులకు కూడా పాల్పడ్డారు.
- విద్యుత్ శాఖకు చెందిన వెయ్యికి పైగా ఆంధ్రప్రదేశ్ ప్రాంత ఉద్యోగులను కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి బలవంతంగా రిలీవ్ చేశారు.
- సెక్రటేరియట్‌లో రెండు రాష్ట్రాల కార్యాలయాల నడుమ ముళ్ల కంచ వేసి ఉద్యోగుల మధ్య వైషమ్యాలు పెంచారు.
- నాగార్జునసాగర్ వద్ద కృష్ణా డెల్టాకి నీళ్ళు నిలిపివేసి, రెండు రాష్ట్రాల పోలీసుల మధ్య చిచ్చుపెట్టారు.
- ఎన్.జి.రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ఏకపక్షంగా పేరు మార్చి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా పెట్టారు.


ఈ విధంగా ఉమ్మడి రాజధానిలో నివాసం ఏర్పరుచున్న పొరుగు తెలుగువారికే కాకుండా, పక్కన ఉన్న తెలుగు రాష్ట్ర ప్రభుత్వం మీద కూడా ఉమ్మడి రాజధానిలో వివక్ష చూపిస్తున్నారని తెలంగాణ ప్రభుత్వంపై అనేక సార్లు కోర్టు అక్షింతలు కూడా వేసింది. అయినా, రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడిన తొలినాళ్లలోనే భేదాభిప్రాయాలు పెచ్చరిల్లకూడదనే సదుద్దేశంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెక్షన్ 8 మీద పూర్తి ఒత్తిడి తీసుకురాలేదు.

అయితే పరిస్థితులు శృతిమించిన నేపథ్యంలో, తాజా పరిణామాలను దృష్టిలో పెట్టుకొని, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ నగర శాంతి భద్రతలను గవర్నర్‌కి అప్పగిస్తూ సెక్షన్-8 ని తక్షణమే అమలులోకి తేవాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. అట్లాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హక్కుల్ని హరించేలా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఈ విషయంలో ప్రభుత్వాన్ని నియంత్రించాలని, విభజన చట్టంలోని సెక్షన్ 8 ను అమలు చేయాలని ఏపి మంత్రులు గవర్నర్‌ను కలిసి వినతి పత్రం కూడా సమర్పించారు.

దీనితో రెండు రాష్ట్రాల మధ్య తాజాగా నెల కొన్న పరిణామాలు, సెక్షన్-8 అమలుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిమాండ్ నేపథ్యంలో గవర్నర్ నరసింహన్ తనంతట తానే నేరుగా దీనిపై భారత అటార్నీ జనరల్ అభిప్రాయం అడిగారు. అందుకు అటార్నీ జనరల్ స్పందించి గవర్నర్ నరసింహన్‌కు లేఖ రాశారు. అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ, మై డియర్ గవర్నర్ అని సంబోధిస్తూ...

"2015-జూన్-16 తేదీన మీరు వ్రాసిన లేఖతో పాటు జత చేసిన పత్రాలను పరిశీలించాను. ఉమ్మడి రాజధానిలో గవర్నర్‌కు అధికారాలపై సెక్షన్-8 లో కావల్సినంత స్పష్టత ఉంది. దానిని గవర్నర్ నేరుగా నిర్భయంగా అమలు చేయవచ్చు. మీరు జారీ చేయాలనుకుంటున్న నోటిఫికేషన్‌పై మీరు తొలుత తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గాన్ని సంప్రదించాలి. ముఖ్యమంత్రికి నోటిఫికేషన్ ముసాయిదాను పంపి దీనిపై వారి అభిప్రాయం కోరవచ్చు. కావాలంటే స్పందించడానికి మూడు రోజుల సమయం ఇవ్వొచ్చు. ఆ తరువాత మీ విచక్షణ మేరకు నోటిఫికేషన్ జారీ చెయ్యవచ్చు. కానీ దీనిపై తుది నిర్ణయం మాత్రం మీదే. నోటిఫికేషన్ మీ సంతకంతోనే జారీ చెయ్యాలి. ముసాయిదా నోటిఫికేషన్ మీసలహాదారులే రూపొందించాలి. నోటిఫికేషన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను మాత్రమే కాదు తెలంగాణ ప్రభుత్వాన్ని కూడా మీరు ఆదేశించడానికి వీలుంది. మీరు ఒకసారి ఉద్యోగులకు దిశానిర్దేశం చేశాక తెలంగాణ ప్రభుత్వం తన అధికారులకు మళ్ళీ ఆదేశాలు జారీ చెయ్యాల్సిన అవసరం ఉండదు. తెలంగాణ ప్రభుత్వం కానీ, ప్రభుత్వ యంత్రాంగం కానీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి గవర్నర్ ముందస్తు అనుమతి లేకుండా ఆయా అంశాలపై జోక్యం చేసుకోరాదని నిర్దేశించవచ్చు. తెలంగాణ ప్రభుత్వం, ఉద్యోగులు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లైతే వాటి దర్యాప్తు తన పర్యవేక్షణలోనే జరగాలంటూ గవర్నర్ ఆదేశించవచ్చు."

గవర్నర్ కోరిన మేరకే అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ తన అభిప్రాయం పంపారు. అయితే సెక్షన్-8 అమలును అంగీకరించేది లేదని, ఇది రాష్ట్రాల హక్కులను హరించడమేనని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. వాస్తవానికి సెక్షన్ 8ని విభజన చట్టంలో పొందుపరిచిందే, విభజన వల్ల తలెత్తే సమస్యలను పరిష్కరించడానికి. ఇప్పుడు ఈ సెక్షన్ మీదనే రగడ జరగడం విచిత్రం. అరవై ఏళ్లు కలిసి ఉన్న రెండు ప్రాంతాల నడుమ పెనవేసుకుపోయిన పాలనాపరమైన, ఆర్థికపరమైన, వ్యవస్థాగతమైన అనేక చిక్కుముడులని ఒక్కరోజులో విడదీయడం సాధ్యం కాదు. అదీగాక, విభజన జరిగిన తీరు వల్ల, పంపకాల వ్యవహారాలు, ఇతర అంశాల్లో రాజకీయ ప్రయోజనాలు చొరబడే అవకాశం ఉందనే గ్రహింపుతోనే ఆనాడు సెక్షన్ 8 ఆలోచన చేశారు. అయితే, దురదృష్టవశాత్తూ, ఈ అంశం మీద కేంద్రం వెంటనే చర్యలు చేపట్టకపోవడం వల్ల కొన్ని అనర్థాలు జరిగాయి. ఉమ్మడి రాజధానిగా ఉన్నంతకాలం మాత్రమే చెల్లుబాటులో ఉండే ఈ సెక్షన్ 8 మీద పొరుగు రాష్ట్రం ఇంత రాద్ధాంత చేయడం తగదు. ఇప్పటికీ, విభజన చట్టంలోని ఒక భాగాన్ని మాత్రం ఒప్పుకోం అని మొండిపట్టు పట్టడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు పెరగకుండా, చట్టప్రకారం వ్యవహరించేందుకు ఇప్పటికైనా పొరుగు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తుందని, తద్వారా ఇరు రాష్ట్రాలు అభివృద్ధి మీద దృష్టి పెట్టడానికి అవకాశం లభించాలని ఆశిద్దాం.



నీరుకొండ ప్రసాద్

ఏపీలో పారిశ్రామిక పరుగులు

ఇక 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' పై దృష్టి



ఆంధ్రప్రదేశ్‌లో శీఘ్రగతిన పారిశ్రామికాభివృద్ధి జరిగేందుకు అంతటా సానుకూల వాతావరణం కనిపిస్తోందని, దీన్ని అవకాశంగా మలుచుకుని రాబోయే 6 నెలల్లో 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' కోసం కృషిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు.

పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన కృషి ఫలిస్తోంది. ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, ఫార్మా, ఐటీ, ఫుడ్ పార్క్స్ వంటి రంగాలలో పరిశ్రమల స్థాపనకు బడా కంపెనీలు ముందుకు వస్తున్నాయి.

ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 'రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి' (ఎస్ఐపీబీ) సమీక్షా సమావేశంలో రూ 2,300 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో నెలకొల్పుతున్న 5 మెగా ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇచ్చారు. కృష్ణాజిల్లా భోగాపురంలో మోహన్ స్పిన్నింగ్స్ (స్పిన్నింగ్ మిల్), అనంతపురం జిల్లా హిందూపురంలో ఇండియన్ డిజైన్స్ (గార్మెంట్స్), తూర్పుగోదావరి జిల్లా ఒంటిమామిడి గ్రామంలో దివీస్ ల్యాబరేటరీస్ (ఫార్మా), చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎన్‌హెచ్‌కే స్ప్రింగ్స్ (ఆటో మొబైల్స్), కర్నూలు జిల్లా తంగడెంచలో జైన్ ఇరిగేషన్ (ఫుడ్ పార్క్), విశాఖ జిల్లాలో వేహాన్ కాఫీ (ఇన్‌స్టెంట్ కాఫీ) మొదలైన కంపెనీలకు పచ్చజెండా ఊపారు.

త్వరలో ఏర్పాటయ్యే ఈ పరిశ్రమల ద్వారా 35,700 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. కర్నూలు జిల్లా తంగడెంచలో అంబుజా, జైన్ వంటి కంపెనీలు ఫుడ్ పార్కులు ఏర్పాటు చేస్తున్నందున, ఈ రంగంలో యూనిట్లు పెట్టేందుకు ముందుకువచ్చే వారందరికీ ఇక్కడే స్థలాలు చూపించాలని సీయం సూచించారు. టామాటో, కోకోనట్, పొటాటో, ఆయిల్ పామ్, మామిడి, మిర్చి, అరటి, మొక్కజొన్న వంటి ప్రాసెసింగ్ యూనిట్లు అవి లభ్యమయ్యే ప్రాంతాలను బట్టి ఒకేచోట వుండేలా క్లష్టర్స్ ఏర్పాటుచేయాలన్నారు. ఇంకా, నాయుడుపేటలో గ్రీన్ టెక్ ఇండస్ట్రీ తన యూనిట్ పెట్టేందుకు ఆసక్తి చూపిస్తోందని సీయం చెప్పారు. అలాగే, ఖాయిలాపడ్డ శ్రీ చక్ర సిమెంట్స్‌ను పునరుద్ధరించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చిందన్నారు.

ఏప్రిల్ 29న ప్రారంభించిన సింగిల్ డెస్క్ విధానం అమలు జరుగుతున్న తీరును ఈ సమావేశంలో సమీక్షించారు. మొత్తం 16 శాఖలు ఈ డెస్క్‌కు అనుసంధానమై వున్నాయని అధికారులు చెప్పారు. పరిశ్రమలకు సత్వర అనుమతులు ఇవ్వడంలో సింగిల్ డెస్క్ సమర్ధంగా పనిచేస్తోందని అన్నారు. ఇప్పటివరకు 417 పరిశ్రమలు అనుమతులకోసం దరఖాస్తులు చేయగా, అందులో 217 దరఖాస్తులను క్లియర్ చేశారు. మిగిలినవి కూడా వెంటనే పూర్తిచేస్తామని తెలిపారు. అన్ని పరిశ్రమలకు 15,20 రోజులలోనే అనుమతులు అందిస్తున్నామని, గరిష్టంగా 21 రోజుల సమయం తీసుకుంటున్నామని పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ చెప్పారు. జిల్లాలలో కూడా కలెక్టర్లే క్లియరెన్స్ ఇచ్చేలా సింగిల్ డెస్క్ విధానం విస్తరింపచేయాలని ముఖ్యమంత్రి ఆయనకు సూచించారు. దరఖాస్తు చేసి 21 రోజులు దాటితే పెండింగ్‌లో వుంచిన సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోర్టు వివాదాల్లో వున్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు వీలుగా హైకోర్టులోనే కమర్షియల్ డెస్క్ ఏర్పాటుచేయాలని చెప్పారు. సింగిల్ డెస్క్ సిస్టమ్ యావత్తూ పకడ్బందీగా జరగాలన్నారు. 'ఈజీ ఆఫ్ దూయింగ్ బిజినెస్' లో కేంద్రం ఇచ్చిన 285 పాయింట్లలో 190 పాయింట్లతో 70 శాతానికి చేరుకోగలిగామని చెప్పారు.

ఏపీ గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సమ్మిట్

ఏపీ గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సమ్మిట్‌ను అక్టోబరు 12 నుంచి 14 తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. ఇండస్ట్రీస్ రంగంలో విశేషంగా కృషిచేసిన పరిశ్రమలకు ఇక భారీగా అవార్డులు ఇద్దామని సీయం చెప్పారు. ప్రతి నెలా 22 వ తేదీన పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం జరుగుతుంది. అలాగే, 18 నెలలలో కొత్త పరిశ్రమల ప్రారంభోత్సవాలు జరగాలన్నారు సీయం.

❖

ప్రజాపంపిణీలో ఇ-ప్రభంజనం

పౌరసరఫరాలో అతిపెద్ద సంస్కరణ ఇ-పోస్ అమలు



పౌరసరఫరాల శాఖ మంత్రి పరిటాల సునీత

ప్రజాపంపిణీలో అవినీతిని తొలగించి, నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలు లేకుండా చేయడం కోసం పౌరసరఫరాల శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి సత్ఫలితాలు సాధిస్తోంది. ఇన్నాళ్ళూ పౌరసరఫరాల శాఖలో వృధాను అరికట్టడం మూలంగా నిత్యావసర సరకుల పంపిణీలో మిగులు ఏర్పడి ప్రభుత్వానికి ఖర్చు తగ్గి ఆ మేరకు ఆదా అవుతోంది. ఇ-పోస్, ఇ-తూకం యంత్రాలను, జియోగ్రాఫికల్ పొజిషనింగ్ సిస్టమ్ వెహికిల్ ట్రాకింగ్ పద్ధతులను ప్రవేశపెట్టడంతోపాటు అన్ని ఎం.ఎల్.ఎస్. పాయింట్లను కంప్యూటరీకరణ చేపట్టి పౌరసరఫరాల శాఖ ఆధునికత వైపు అడుగులు వేస్తోంది.

తూర్పుగోదావరి జిల్లాలో 100 చౌకదుకాణాల్లో చేపట్టిన ఇ-పోస్ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం అవడంతో రాష్ట్రంలోని మిగిలిన చోట్ల కూడా ఈ విధానం అమలుకు సిద్ధమవుతున్నారు. ఈ తొలి ప్రాజెక్ట్ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 29,000 చౌకదుకాణాల్లో దశల వారీగా ఇ-పోస్ పరిజ్ఞానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశ ప్రారంభమైనప్పటి నుంచీ ఇప్పటివరకూ 7638 చౌక ధరల దుకాణాలలో ఇ-పోస్, ఇ-తూకం యంత్రాల నేర్పరిచారు. ఇ-పోస్, ఇ-తూకం యంత్రాల రెండవ దశలో మిగిలిన 21,362 చౌక ధరల దుకాణాలలో కూడా ఏర్పరచడం జరుగుతుంది.

రాష్ట్రంలో తొలిదశలో ఏర్పరచిన మొత్తం ఇ-పోస్ యంత్రాలు: 7,638

ఈ సంస్కరణల వలన కలిగే లాభాలు

- చౌక ధరల దుకాణాలలో ఇ-పోస్ యంత్రాల ఏర్పాటు వలన అసలైన లబ్ధిదారులు మాత్రమే సరుకులను పొందగలరు.
- లబ్ధిదారులకు సరైన తూకంతో సరుకుల పంపిణీ జరుగుతుంది.
- ఎప్పటికప్పుడు సరుకుల పంపిణీ వివరాలు ఆన్ లైన్‌లో నమోదు కావడం వలన పై స్థాయిలో పర్యవేక్షణ సులభతరమైనది.
- అన్ని చోట్ల కంప్యూటర్ల ఏర్పాటు వల్ల (ఎండ్-టు-ఎండ్ కంప్యూటరైజేషన్) ఆన్‌లైన్ లో పీడీఎస్ వెబ్‌సైట్ ద్వారా నిత్యావసర సరుకుల విడుదల వేగవంతం కావడమే కాక అనవసర అధికార్ల ప్రమేయం తగ్గించడమైనది.
- ఎం.ఎల్.ఎస్.పాయింట్ల నుంచి పీడీఎస్ సరుకులు దారి మళ్ళకుండా ఉండేలా జియోగ్రాఫికల్ పొజిషనింగ్ సిస్టమ్, వెహికిల్ ట్రాకింగ్ పద్ధతులు దోహదపడతాయి.

ఇ-పోస్ వ్యవస్థ ఏర్పాటు వలన పౌరసరఫరాలశాఖ బడ్జెట్‌లో మిగులు అంచనాలు

పీడీఎస్ సరుకుల అక్రమ రవాణా, నల్లబజారు నిరోధం, బోగస్ లబ్ధిదార్ల ఏరివేత జరిగి, తద్వారా సాధించిన మిగులుతో అర్హులందరికీ ఆహారభద్రతను కట్టుదిట్టంగా అమలు పరచడం వీలవుతుందని భావిస్తున్నారు.

జిల్లాల వారీగా షాపుల్లో ఇ-పోస్, ఇ-తూకం యంత్రాల వివరాలు

శ్రీకాకుళం	242
విజయనగరం	306
విశాఖపట్నం	686
తూర్పుగోదావరి	660
పశ్చిమగోదావరి	606
గుంటూరు	564
కృష్ణా	2152
కర్నూలు	458
ప్రకాశం	220
నెల్లూరు	323
కడప	496
అనంతపురం	504
చిత్తూరు	421

1808 చౌకధరల దుకాణాల్లో ఇ-పోస్ ఏర్పాటు వలన 1671 మెట్రిక్ టన్నుల బియ్యం, 16.6 మెట్రిక్ టన్నుల చక్కెర, 4.9 మెట్రిక్ టన్నుల గోధుమలు ఆదా అయినట్లు పౌరసరఫరాల శాఖ తేల్చింది. ఒక్క బియ్యంపైనే 1 కోటి రూపాయలపైగా ఆదా కన్పించిందని లెక్కగట్టింది. రాష్ట్రంలోని అన్ని చౌక దుకాణాలలో ఇ-పోస్ వ్యవస్థ అమల్లోకి వస్తే సంవత్సరానికి 1321 కోట్ల రూపాయలు ఆదా అవుతుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేస్తున్నది. కృష్ణా, అనంతపురం జిల్లాల్లో ప్రయోగాత్మకంగా రేషన్ షాపు పోర్టబిలిటీ అనగా, జిల్లాలో తనకు నచ్చిన చౌక ధరల షాపు నుంచి కార్డుదారుడు సరుకులను తీసుకునే వెసులుబాటు కల్పించడం జరిగింది. ఈ జిల్లాల అనుభవాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా దీనిని అమలులోకి తేవాలని ప్రభుత్వం సంకల్పించింది.



నెట్టెం ప్రతాప్
ఎం.ఎల్.ఒ., పౌరసరఫరాల శాఖ

దళిత విద్యార్థులకు ఉన్నత విద్య ద్వారానే పైకెదగడానికి అవకాశం ఉన్నదని నమ్మిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఎస్సీ ఎస్టీలకు సరికొత్త అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది.

దళిత, గిరిజన విద్యార్థుల్లో వెలుగు



సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రావెల కిషోర్ బాబు

నవ్యాంధ్రప్రదేశ్ పాలనా పగ్గాలు చేపట్టిన ఏడాదిలోనే అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇటు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి రావెల కిషోర్ బాబు దళిత, గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను సివిల్ సర్వీసెస్‌కి పంపేందుకు ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం, విదేశాల్లో చదువుకునేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం, హాస్టళ్లను దశల వారీగా రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్పు చేయడం, కుల ధ్రువీకరణ పత్రాల జారీని సరళతరం చేయడం..ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం

నిన్నమొన్నటి వరకు విదేశీ విద్య అంటే ఉన్నత వర్గాలకు, అధికాదాయ వర్గాల పిల్లలకే సొంతం. కానీ ప్రభుత్వం మారాక దళితులు, గిరిజనుల తలరాతలు మారుస్తోంది. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు జీవో ఎంఎస్ నెంబర్ 1ని ప్రభుత్వం తీసుకువచ్చింది. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, చైనా.. ఇలా మొత్తం 15 దేశాల్లో చదువుకునే అవకాశం కల్పించింది. మొదట 10 దేశాలకే పరిమితమైన ఈ పథకం చంద్రబాబు ఆదేశాల ప్రకారం, రావెల చొరవతో మరో 5 దేశాలు కలిపి మొత్తం 15 దేశాల్లో చదువుకునేలా పథకాన్ని విస్తరించారు. రూ.5 లక్షల వరకు జాతీయ బ్యాంకుల నుంచి విద్యారుణం అందేలా ప్రభుత్వం సాయం చేస్తుంది.

వార్షికాదాయం రూ.6 లక్షలకు పెంపు

మొన్నటివరకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి వార్షికాదాయం పరిమితి రెండు లక్షలు వుండేది. ఈ కారణంగా ఎంతో ఉపయోగపడే ఈ కార్యక్రమం అతి కొద్దిమందికే మాత్రమే పరిమితమైంది. దీనిపై రావెల కిషోర్ బాబు స్పందించి, వార్షికాదాయం పరిమితిని ఆరు లక్షలకు పెంచాలని కోరడంతో ముఖ్యమంత్రి అంగీకరించారు. ఈ నిర్ణయంతో రూ.6 లక్షల లోపు వార్షికాదాయం వున్న చిన్న రైతులు, చిరుద్యోగుల పిల్లలకు కూడా విదేశీ విద్య అభ్యసించే అవకాశం కలిగింది. గతేడాది ప్రభుత్వ ప్రోత్సాహంతో విదేశాల్లో ఉన్నత విద్యకోసం 32 మంది దరఖాస్తు చేసుకున్నారు. వార్షికాదాయం పరిమితి పెంపుతో విదేశాల్లో చదవాలనుకునే దళిత విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరగనుంది.

విదేశీ విద్య అర్హత పరీక్షలకు ఉచిత శిక్షణ

విదేశీ విద్యకు అర్హత పరీక్షలైన టోఫెల్, జీఆర్ఈ, ఐఈఎల్టీఎస్‌ల్లో రాణించేలా దళిత విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వనుంది. కడప, చిత్తూరు, తిరుపతి, వైజాగ్, విజయవాడ, హైదరాబాద్.. ఎంపిక చేసిన ఈ ఆరు కేంద్రాల్లో సుమారు 1500 మంది విద్యార్థులకు ఇందుకోసం ఉచిత శిక్షణ ఇస్తారు. అంతేకాకుండా విదేశాల్లో వైద్యవిద్య చదవాలనుకునే దళిత విద్యార్థులకు మార్కుల శాతం నిబంధనను 60 నుంచి 55 శాతానికి తగ్గించింది. విదేశాల్లో డిప్లమో కోర్సులకు ఈ పథకం వర్తిస్తుంది.

ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం

బాబు వస్తే జాబు వస్తుందన్న యువత నమ్మకం త్వరలో నిజం కానుంది. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ రాయాలనుకునే నిరుద్యోగులకు వరంగా ఎన్టీఆర్ విద్యోన్నతి పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలు సంయుక్తంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రతీ ఏటా 250 మంది ఎస్సీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్స్ కోసం దేశంలోని ప్రముఖ శిక్షణ సంస్థలలో కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించాయి. ఇందుకు రూ.5.07 కోట్లు ఖర్చు చేయనున్నాయి. రెండు లక్షల లోపు వార్షికాదాయం వుండి, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగా అర్హత పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో మెరిట్ సాధించిన 250 మందికి ప్రిలిమ్స్ లో శిక్షణ ఇప్పిస్తుంది. 250 సీట్లలో 33 శాతం మహిళలకు, 3 శాతం సీట్లు వికలాంగులకు రిజర్వ్ చేశారు. ప్రిలిమ్స్ లో అర్హత సాధించి, రెండు లక్షల లోపు ఆదాయం వున్న ప్రతీ ఒక్కరికీ మెయిన్స్ కోచింగ్‌కు పంపిస్తుంది. మెయిన్స్ లో కూడా క్వాలిఫై అయితే.. పర్సనాలిటీ టెస్ట్ కు నిపుణుల గైడెన్స్ అందేలా ప్రభుత్వం చూస్తుంది.



పి.విజయభాస్కర్
ఎం ఎల్ ఓ, సాంఘిక సంక్షేమ శాఖ

ప్రపంచ స్థాయి రహదా
రులకు ఒక నమూనాగా
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం
రూపొందాలన్నదే తన
అభిలాష అని
ముఖ్యమంత్రి చెప్పారు.

అంతర్జాతీయ స్థాయికి ఏపి రాదారుల పరుగు

మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని రహదారులను ప్రపంచశ్రేణి రహదారులుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో అన్ని సింగిల్ లేన్ రహదారులను ఏడాదిలోపు డబుల్ లేన్ రహదారులుగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి ఏదీ కూడా సింగిల్ లేన్ గా వుండకూడదన్నారు. కర్నూలు-అమరావతి రహదారిని మూడేళ్ల లోపు ఫోర్ లేన్ రహదారిగా ప్రథమ ప్రాధాన్యత నిచ్చి అభివృద్ధి చేయాలని అన్నారు. పెందుర్తి-అనకాపల్లి రహదారిని రెండేళ్ల లోపు, రాజమండ్రి-గుండవరం రోడ్డును 18 నెలలలోపు పూర్తి చేయాలన్నారు. పట్టణాల చుట్టూ వంకర టింకర రోడ్ల వల్ల అయోమయం నెలకొని ప్రమాదాలకు దారితీస్తున్నాయంటూ, సాధ్యమైనంత వరకూ స్ట్రెయిట్ రోడ్లు నిర్మించాలని కోరారు.



భోగాపురం (ఎయిర్ పోర్టు)-విజయనగరం 4 లేన్ రహదారిని వెంటనే నిర్మించాలన్నారు. విశాఖపట్నం-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ త్వరలోనే ఇండస్ట్రియల్ హబ్‌గా రూపొందుతున్నందున, విశాఖ-చెన్నయ్ రహదారిని 6 లేన్‌గా అభివృద్ధి చేయాల్సి వుందన్నారు. నెల్లూరు-విజయవాడ రోడ్డును కూడా 6 లేన్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. రాయలసీమ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో ఆ జిల్లాలలో రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఒక విమానాశ్రయం నుంచి మరో విమానాశ్రయానికి కనెక్టివిటీ పెంచాలని సూచించారు.

రహదారుల మ్యాపింగ్, వాటిపై కెమేరాల నిఘా వల్ల ట్రాఫిక్‌ను మరింత పకడ్బందీగా నియంత్రించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడవచ్చుని, ఎప్పటికప్పుడు రహదారుల మరమ్మతులపై దృష్టి పెట్టవచ్చుని చెప్పారు. ప్రజల సంతృప్తే మనకు ముఖ్యమంటూ, మార్పు తీసుకువస్తే ప్రజల నుంచి ప్రశంసలు వాటంతట అవే వస్తాయన్నారు. ప్రపంచ స్థాయి రహదారులకు ఒక నమూనాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూపొందాలన్నదే తన అభిలాష అని ముఖ్యమంత్రి చెప్పారు.

పుష్కరాల రోడ్లు

గోదావరి పుష్కరాలను దృష్టిలో వుంచుకుని రాజమండ్రికి దారితీసే అన్ని రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. అన్ని ప్రధాన రహదారుల అభివృద్ధి పనులను పిపిపి పద్ధతిలో, బిఓటి పద్ధతిలో ఏ విధంగా చేయాలనేదానిపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు.

ఎడిబి, ప్రపంచ బ్యాంకు, నాబార్డు సంస్థల సహకారంతో నిధులను సమీకరించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడవద్దని, నాసిరకంగా పనులు చేసే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. రోడ్ల మరమ్మతులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, బైపాస్ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులను 18 నెలల లోపు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

అన్ని పట్టణాలను సమీపంలోని జాతీయ రహదారితో అనుసంధానం చేసి కనెక్టివిటీని పెంచాలని కోరారు.

❖

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ముస్లింల అభివృద్ధికి ఏడాదిలోనే తొలి అడుగు పడింది. సమాజంలో వెనుకబడి ఉన్న ముస్లింల తల రాతలు మార్చాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించారు. వారి జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు పేదరికం నిర్మూలన పథకాలతో పాటు, ఉన్నత విద్యావకాశాల కోసం ప్రోత్సాహకాలను కూడా ప్రవేశపెట్టింది.

కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయలేదు. ముస్లింల జీవితాలలో వెలుగులు నింపాలన్నదే తెలుగుదేశం ప్రభుత్వ సంకల్పం.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట


2015-16 బడ్జెట్ లో 379 కోట్లు కేటాయించి ముస్లింల పట్ల తన చిత్త శుద్దిని నిరూపించుకుంది ప్రభుత్వం. ఉపాధి కల్పనకు రాయితీతో రుణాలను అందించేందుకు నిర్ణయించింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన రోషిణి, దుకాన్-మకాన్ వంటి పథకాలను పునరుద్ధరించారు. వాటిని అమలు చేసేందుకు ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయించింది. నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా బ్యాంకులతో సంబంధం లేకుండా రూ.50 వేల వరకు రుణాలు మంజూరు చేయనున్నారు.

ఆదరణ పథకం

ముస్లిం యువతుల పెళ్లి సమయంలో వారి పేరిట రూ.50 వేలు బ్యాంకులో జమ చేసేలా దుల్హన్ పేరుతో పథకం ప్రవేశపెట్టారు. చేతి వృత్తులు చేసుకునే మైనార్టీ వర్గాల వారికి 50 శాతం నుండి 70 శాతం సబ్సిడితో పనిముట్లు పంపిణీ చేసే ఆదరణ పథకం అమలు చేయనున్నారు.

తత్కాల్ పథకం

మైనార్టీ వర్గాల వితంతువులు, భర్త వదిలేసిన మహిళలు, అంగవైకల్యం కలిగిన వారికి 75 శాతం సబ్సిడితో 20 వేల రూపాయల వరకు తత్కాల్ ఋణ సదుపాయానికి పథకం అమలు చేస్తున్నారు. రాష్ట్ర హజ్ హౌస్‌ను విజయవాడలో ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకరించారు. విజయవాడ నుండి హజ్ యాత్రకు నేరుగా జెద్దా వెళ్లడానికి విమాన సదుపాయం కల్పించనున్నారు. అక్కడే వక్ఫ్ బోర్డు భూమిలో రూ 6 కోట్లతో షాజహూర్ ముసాఫిర్ పేరుతో భారీ షాదిఖానా వాణిజ్య సముదాయాన్ని నిర్మించాలని నిర్ణయించారు.



మైనారిటీ శాఖ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

దుకాన్-మకాన్ పథకం

ఈ పథకం కింద ముస్లిం పేదలకు ఇల్లు నిర్మించేందుకు, దాంతో పాటు వారి ఉపాధి కొరకు ఒక దుకాణాన్ని నిర్మించుకునేందుకు ఈ పథకం ద్వారా సాయమందిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ 70 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ 80 వేలు రుణం ఇవ్వనున్నారు. దుకాణం నిర్వహణకు పెట్టుబడిగా రూ 50 వేలు ఇస్తారు. ఇందులో రూ 25 వేలు రాయితీ కాగా, మిగిలిన రూ 25 వేలు రుణంగా ఇవ్వనున్నారు. 60 మంది లా చదివే మైనారిటీ విద్యార్థులకు 2015-16 లో ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇప్పటివరకు ఉన్న 6 మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లలో మూడు అబ్బాయిలవి, మూడు అమ్మాయిలవి. ఇవిగాక మరో రెండు స్కూళ్లను చిత్తూరు జిల్లాలో పీలేరులో ఒకటి, కలికిరిలో ఒకటి ప్రారంభించనున్నారు. దీని కోసం 1.5 కోట్లు నిధులు విడుదల చేశారు. మైనార్టీలకు ఇచ్చే రుణాలను గ్రామీణ ప్రాంతాల్లో లక్ష రూపాయల నుండి లక్షన్నర వరకు పెంచడం జరిగింది. అర్బన్ ఏరియాలో మైనార్టీలకు ఇచ్చే రుణాలను 2 లక్షల వరకు పెంచారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ

సచార్ కమిటీ నివేదిక సిఫార్సులకు అనుగుణంగా మైనారిటీల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉంది. వక్ఫ్ భూములను పరిరక్షించి ఆ భూములను మైనార్టీల అభివృద్ధి కోసం వినియోగించనున్నారు. వక్ఫ్ భూములను కమర్షియల్ పర్పస్ కోసం మార్కెట్ రేట్ల ఆధారంగా 30 ఏళ్లవరకు లీజ్‌కి ఇచ్చి మైనార్టీల సంక్షేమానికి వినియోగించనున్నారు. జెరుసలెం వెళ్ళే క్రిస్టియన్ మైనార్టీలకు ఆర్థిక సహాయం అందించేందుకు 2015-16 లో రూ 50 లక్షలు కేటాయించడం జరిగింది .

విద్యా వికాసం

మైనార్టీల ట్యూషన్ ఫీజు పథకం ద్వారా లక్షల మంది మైనార్టీ విద్యార్థులు ఫీజు రియింబర్స్‌మెంట్ పొందుతున్నారు. నిరుద్యోగ, మైనార్టీ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రూ. 50 వేలు వరకు రుణాలు ఇవ్వనున్నారు. 50% సబ్సిడీతో బ్యాంకుల సహకారంతో రూ.2 లక్షల వరకు రుణాలు మంజూరు చేయనున్నారు. ముస్లింల పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, ఉర్దు భాషా వికాసం, ఉర్దు టీచర్ల నియామకం, మస్జిద్ ఇమామ్, మౌజన్ లకు నెల వారి వేతనాల చెల్లింపు, ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు, మస్జిద్ , షాదీఖానల నిర్మాణం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, వాటి అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలు తెలుగుదేశం ప్రభుత్వం అనతికాలంలోనే అమలు చేయబోతున్నది. గత ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి 23 జిల్లాలకు కలిపి రూ 200 కోట్లు కేటాయిస్తే, రాష్ట్రం విడిపోయిన తరువాత 13 జిల్లాలలో ఉన్న ముస్లింల సంక్షేమానికి రూ 379 కోట్లు కేటాయించి ముస్లింల పట్ల తనకున్న చిత్తశుద్ధిని ఈ రాష్ట్ర ప్రభుత్వం నిరూపించుకున్నది .

ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ 1500 మంది మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా ఉద్యోగాలకు ట్రైనింగ్ ఇవ్వనుంది. 429 ఉర్దు మీడియం పాఠశాలలు ఉర్దు అకాడమీ కింద నడప బడుతున్నాయి. 36 ఉర్దు కంప్యూటర్ శిక్షణా కేంద్రాల ద్వారా దాదాపు 50 వేల మంది ముస్లింలు ఉర్దు అకాడమీ ద్వారా లబ్ది పొందుతున్నారు.

క్రిస్టియన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 17 కోట్ల కేటాయించడంతో పాటు గుంటూరులో 2 ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్లతో క్రైస్తవ భవనాన్ని నిర్మించబోతున్నారు. ఈ విధంగా నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ మత సామరస్యాన్ని పెంపొందించి, లౌకిక విధానాలకు కట్టుబడి వారి అభివృద్ధి ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం ధృఢ సంకల్పంతో పనిచేస్తుంది.

ప్రధాన ఆదాయ వనరుగా ఫిషరీస్
ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం



ఏపీలో మత్స్య పరిశ్రమను ప్రపంచంలోనే అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. మర పడవల వినియోగం, చేపలు పట్టడంలో ఆధునిక విధానాలు, శుద్ధి చేసి నిల్వ చేసే పద్ధతులు, మార్కెటింగ్ మెళకువలు, ఎగుమతులతో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాలని ప్రభుత్వం తలపెట్టింది. మత్స్య పరిశ్రమపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రంగ అభివృద్ధికి లక్ష్యాలు నిర్దేశించారు.


ఏపీలో సుదీర్ఘమైన కోస్తాతీరం మనకు వరంలాంటిదని, చేపలు, రొయ్యలు, ఇతర సముద్ర ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి అపారమైన అవకాశాలు వున్నాయని సీయం చెప్పారు. రాష్ట్రంలో జల వనరులకు లోటు లేదని, కుంటలు, చెరువులు, ప్రైవేట్ ఫిషింగ్ పాండ్స్‌లను అభివృద్ధి చేయడం ద్వారా గ్రోత్ ఇంజన్లలో దీన్ని ప్రధానమైన వనరుగా మార్చుకోవాలని సూచించారు. అంతుబట్టని వ్యాధులు చేపల చెరువులకు పెద్దముప్పుగా చెబుతూ, చీడ నివారణకు రూ.500 కోట్లు వరకు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా వున్నదని తెలిపారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ రాబడి సాధించే పరిశ్రమ ఇదేనన్నారు. ఒకనాడు కోస్తాతీరం రొయ్యల పరిశ్రమలో మీసాలు మెలేసిందని, మళ్లీ ఆ రోజులు రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఇప్పటికీ చేపలు, రొయ్యల ఉత్పత్తి, ఆర్జనలో ఏపీ ముందుందన్నారు. సముద్ర ఆహార ఉత్పత్తులలో దేశంలో నాలుగో స్థానంలో వుందన్నారు. 2015-16లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో లక్ష్యంగా పెట్టుకున్న రూ.35 వేల కోట్ల ఉత్పత్తుల విలువలో మత్స్య పరిశ్రమ ద్వారానే రూ.6,517 కోట్లు రావాలని సూచించారు. ఏపీ నుంచి మత్స్య పరిశ్రమ ఎగుమతుల విలువ గత ఏడాది రూ.1600 కోట్లుగా వుందని తెలిపారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.3,500 కోట్లకు పెంచాలని సూచించారు. గత ఏడాది 21.86 శాతంగా వున్న జి.వి.ఏ. ఈ సంవత్సరం 33 శాతానికి పెంచాలని అన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడటంలో చేపలకు మించిన ఆహారం లేనే లేదని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేసి చేపలు తినే వారి సంఖ్య బాగా పెంచాలని చెప్పారు. ప్రతి పట్టణంలో కూరగాయల మార్కెట్ వున్నట్టే చేపల మార్కెట్ కూడా వుండేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

నెల్లూరు జిల్లా కావలి ప్రాంతంలో ఆక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుచేస్తున్నట్టు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. మరో 8 నెలలలోగా దీన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఫిషరీస్ శాఖ ముఖ్య కార్యదర్శి మన్మోహన్ సింగ్‌ను ఆదేశించారు.

రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న ఫిషరీస్ యూనివర్శిటీ పేరును ఆక్వా యూనివర్శిటీగా మార్చాలని ఆదేశించారు. దానికి అనుబంధంగా ఈ విద్యా సంవత్సరం నుంచే ఫిషరీస్ కళాశాలలు, కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. త్వరలో 300 మంది మండల ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ల నియామకాల్ని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో చేపడుతున్నామని, వీరు ఒక్కొక్కరికీ 500 హెక్టార్ల చొప్పున బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు.

❖



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతర కృషీవలుడే కాదు. అభివృద్ధి ప్రణాళికలు రచించడంలో దార్శనికుడు. జూన్ మాసంలో వివిధ శాఖల సమీక్షల్లో ఆయన ముందుచూపుతో చేసిన దిశానిర్దేశం ఇక్కడ అక్షర రూపంలో.

ఈ ఏడాది మహారాష్ట్రను మించిపోనున్న ఏపీ కార్గో

పోర్టుల ద్వారా జరిగే సరుకు రవాణాలో మన రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారు. ముఖ్యంగా రానున్న నాలుగేళ్లలో గుజరాత్‌ను మించిపోయే అభివృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా మార్చవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. సుదీర్ఘమైన కోస్తా తీర ప్రాంతం మనకున్న అదనపు ఆకర్షణ అని, వనరుల్ని సక్రమంగా వినియోగించుకుంటే ఏపీ త్వరలోనే తూర్పుదేశాల ముఖద్వారంగా మారుతుందని అన్నారు.

పోర్టులున్న ప్రాంతాలను పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చేసుకోవడం వలన రెండువిధాలుగా లాభిస్తుందని అన్నారు. అదే సమయంలో మౌలిక సదు-పాయాలను అభివృద్ధి చేసి పోర్టులకు దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాలతో కనెక్టివిటీ పెంచుకోవడం వలన రాష్ట్రం శీఘ్రగతిన పురోగతి సాధిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ముఖ్యంగా అన్ని పోర్టులను సమీపంలోని జాతీయ రహదారులకు అనుసంధానం చేయాలన్నారు. ఇవి నాలుగు లేన్ల రహదార్లుగా వుండాలని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కార్యకలాపాలు సాగిస్తున్న ఓడరేవుల్లో సరుకు రవాణా 142 మిలియన్ మెట్రిక్ టన్నులు వున్నదని చెబుతూ, ఈ ఏడాది మహారాష్ట్ర (ప్రస్తుతం 150.5 ఎంఎంటీ)ను దాటిపోగలదన్న ఆశాభావాన్ని సీయం వ్యక్తంచేశారు. భావనపాడు, మచిలీపట్నం, నరసాపురం, కాకినాడ, వాన్‌పిక్ ఓడరేవుల్ని ప్రాధాన్యక్రమంలో అభివృద్ధి చేయాలని సూచించారు. భావనపాడు ఓడరేవును పీపీపీ మోడల్లో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం ఓడరేవును ఓపక్క, ఇండస్ట్రీస్‌ను మరోపక్క వుండేలా చూడాలని, ఆ రెండిటి మధ్యలో టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. మచిలీపట్నం పోర్టుకు ఎటువంటి భూ సేకరణ సమస్య లేదని, సర్వే కూడా పూర్తయ్యిందని అధికారులు చెప్పగా, రాష్ట్రంలో ఈ పోర్టును అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు అన్ని అవకాశాలు వున్నాయని సీయం తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. రాష్ట్రంలో డీప్ సీ డ్రిల్లింగ్ అంశంలో త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. వచ్చే క్యాబినెట్ సమావేశంలో పోర్టు పాలసీనీ తీసుకురానున్నట్టు తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం పోర్టులకు అనుసంధానంగా మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులను ఏర్పాటుచేసే అంశాన్ని అధికారులు సమావేశంలో ప్రస్తావించగా, ప్రపంచంలో వున్న ఉత్తమ లాజిస్టిక్ పార్కులపై అధ్యయనం చేసి దానికి తగినట్టుగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుందామని ముఖ్యమంత్రి చెప్పారు.

చిన్న ఎయిర్‌పోర్టులు

విమానాశ్రయాలపై మాట్లాడుతూ, నో ఫ్రిల్స్ ఎయిర్ పోర్టులు, చిన్న తరహా ఎయిర్ పోర్టులపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వీటిని ఏడాదిన్నర, రెండేళ్లలో పూర్తిచేసి కార్యకలాపాలు సాగించేలా చూడాలని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో 2018 డిసెంబర్ నాటికి పూర్తయ్యేలా చూడాలని ఇంధన, మౌలిక సదుపాయల కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌ను ఆదేశించారు. అలాగే, తిరుపతి ఎయిర్ పోర్టు ప్రయాణికులకు తిరుమల దర్శనం ప్యాకేజీని ప్రవేశపెట్టాలని టూరిజం శాఖను కోరారు.

తిరుపతి కొత్త టెర్మినల్

ఈ ఏడాది ఆగస్టు మాసానికల్లా తిరుపతి ఎయిర్ పోర్టు కొత్త టెర్మినల్ నిర్మాణాన్ని పూర్తిచేసి సిద్ధం చేస్తామని అధికారులు ఆయనకు వివరించారు. పుట్టపర్తి విమానాశ్రయాన్ని విక్రయిస్తామన్న సత్యసాయి ట్రస్టు ప్రకటన గురించి చెబుతూ, దీనిని విస్తరించి, ఎంఆర్‌వోతో కూడిన శాటిలైట్ హబ్‌గా మార్చే విషయంలో కేంద్ర విమానయాన శాఖను సంప్రదించి తగు నిర్ణయం తీసుకోవాల్సివుందని అన్నారు. దీన్ని అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తులో బెంగళూరు ఎయిర్ పోర్టుకు ప్రత్యామ్నాయంగా సేవలందించవచ్చునన్నారు.

జులైలో ఇ-ప్రగతి ప్రాజెక్టు ప్రారంభం

డిజిటల్ ఇండియా కార్యక్రమ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌ను శాస్త్ర సాంకేతికంగా దేశంలోనే అత్యున్నతంగా నిలిపేందుకు ఇ-ప్రగతి ప్రాజెక్టును జులై మొదటివారంలో ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కొత్త రాజధాని అమరావతిలో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రజలకు లభించే సేవల స్వరూపం పూర్తిగా మారిపోనుంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్చర్‌లో భాగంగా విప్రో సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు 600 రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. సర్టిఫికెట్ లెస్ గవర్నమెంట్ సిస్టమ్ (సీఎల్జీఎస్), డయల్ ఏపీ, మన రాష్ట్రం, టెలీహెల్త్, ఇ-ఎడ్యుకేషన్, హరిత, ఇ-మండీ, సిటిజెన్ ఇన్ బాక్స్, డిజిటల్ లిటరసీ, ఇ-ఎస్‌హెచ్‌జీ, స్మార్ట్ సిటీ, స్మార్ట్ గ్రిడ్ తదితర సేవలన్నీ ఇ-ప్రగతి ద్వారా రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. 72 సబ్ ప్రాజెక్టులతో కూడిన 'ఇ-ప్రగతి' ప్రాజెక్టు తొలిదశ 2016 అక్టోబరు నాటికి పూర్తి చేయనున్నారు. మొత్తం ప్రాజెక్టు 2017 అక్టోబరుకు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజల ఆరోగ్యం, పాఠశాలల్లో డ్రాపవుట్ రేటు తదితర ప్రామాణికాల నిర్ధారణకు ఇ-ప్రగతి ప్రాజెక్టు ఉపకరిస్తుంది. మీ సేవ, సీయం డ్యాష్ బోర్డు, మీ భూమి తదితర కామన్ అప్లికేషన్లతో పాటు వివిధ శాఖల సమగ్ర సమాచారాన్ని పొందేందుకు ఇది దోహదపడుతుందని ఐటీ అడ్వయిజర్ జె సత్యనారాయణ తెలిపారు. కేటగిరిలవారీగా, అన్ని వయసుల వారికి సమాచారం సమగ్రంగా అందించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత అని ఆయన వివరించారు. ఉదాహరణకు ప్రైమరీ సెక్టారు మిషన్‌లోని వ్యవసాయం, ఉద్యానవనాలు, మత్స్య పరిశ్రమ, పశు సంవర్ధకం తదితర అనుబంధ రంగాల సమాచారాన్ని ఇ-ప్రగతి ప్రాజెక్టు సేవల ద్వారా ఏ,బీ,సీ కేటగిరీల వారీగా పొందవచ్చునని చెప్పారు. పంటలు, భూములు, విత్తనాలు, బీమా, మార్కెటింగ్, ఇ-మండీ తదితర వివరాలన్నీ దీనిలో లభ్యమవుతాయి. 2015 ఆగస్టులోపు స్మార్ట్ పల్స్ సర్వే ద్వారా కోర్ డేటాను సేకరిస్తారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడికి సంబంధించిన వివరాలను 50 వేల మంది క్షేత్ర సహాయకుల ద్వారా సేకరించడం జరుగుతుంది. ప్రస్తుతం వున్న వివరాలను సరిచేయడంతో పాటు కొత్త వివరాలను కూడా ఈ సమాచారంలో పొందుపరుస్తారు. 24 గంటలూ సేవలు లభ్యమయ్యేలా ఈ ప్రాజెక్టుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు..

ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా కేబుల్ టీవీ

ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు మొదటి దశ అందుబాటులోకి వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇది దేశంలోనే తొలిసారిగా ఏర్పాటుచేస్తున్న కార్యక్రమమని గుర్తుచేశారు. రూ.330 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేస్తున్న ఏపీ ఏరియల్ ఫైబర్ గ్రిడ్ నిర్మాణంలో స్థానిక కేబుల్ ఆపరేటర్లను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్టు అధికారులు సీయంకు వివరించారు. రాష్ట్రంలోని 22 వేల కిలోమీటర్లకు విస్తరించనున్న ఈ ఫైబర్ గ్రిడ్ ద్వారా రాష్ట్రంలోని 85 శాతం ఇళ్లకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ ఇవ్వడమే కాకుండా, దీనికోసం ప్రత్యేకంగా తయారుచేసే బాక్స్ డివైస్ ద్వారా అటు టీవీ కేబుల్ కనెక్షన్ కూడా అందించవచ్చునన్నారు. 46 వేల పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులకు దీని ద్వారా నెట్ కనెక్టివిటీ ఏర్పడగలదన్నారు. విశాఖ కేంద్రంగా ఈ ఫైబర్ గ్రిడ్ మేజర్ నెట్ వర్కింగ్ సెంటర్ పనిచేస్తుందని చెప్పారు. మొత్తం ప్రాజెక్టు 2016 మార్చి 31 నాటికి పూర్తవుతుందని వివరించారు.

పర్యాటకుల స్వర్గధామంగా ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పర్యాటక స్వర్గధామంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నడుంకట్టారు. కొత్త రాజధాని అమరావతి పరిసరాలలో 5వేల ఎకరాల విస్తీర్ణంలో దీవులను, భవానీ ఐలాండ్ ను సింగపూర్ సంస్థల సహకారంతో సుందరంగా రూపొందిస్తే భారీఎత్తున పర్యాటకులను ఆకర్షించవచ్చని తెలిపారు. కాకినాడ-కోనసీమ ప్రాజెక్టును రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తే, పర్యాటక శాఖకు రూ.300 కోట్ల రాబడి వచ్చే అవకాశం ఉన్నట్లు చెప్పారు. విశాఖ నగరంలో 6 బీచ్‌లను విభిన్నరకాలుగా అభివృద్ధి చేస్తే పర్యాటకులను మరింతగా ఆకర్షించవచ్చన్నారు. గుండ్లవల్లిపాలెం, రుషికొండ, మధురవాడ ఆక్వాలను అభివృద్ధి చేయాలన్నారు. మధురవాడ వద్ద అమ్యూజ్ మెంట్ పార్క్ ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్టంలోని ప్రతి బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు 10 కంపెనీలు సిద్ధంగా వున్నట్లు అధికారులు వివరించారు. బీచ్ రిసార్టుల ఏర్పాటుకు 39 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక రోప్ వే ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కోటప్పకొండ, అన్నవరం, కొండపల్లి కోట, కైలాసగిరి వద్ద రోప్ వే ఏర్పాటు పురోగతిని వివరించారు. కాణిపాకం, శ్రీకాళహస్తి, పుట్టపర్తి, అన్నవరం, సింహాచలం తదితర పుణ్యక్షేత్రాల వద్ద సౌండ్ అండ్ లైట్ లేజర్ షోల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు.

ఎకో టూరిజం అభివృద్ధిలో అటవీశాఖ, పర్యాటకశాఖ సమన్వయంగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రతి జిల్లాలో 300 ఎకరాల విస్తీర్ణంలో రూ.30 కోట్ల వ్యయంతో ఎకో టూరిజం పార్క్ అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణ పనులలో నాణ్యతకు పెద్దపీట వేయాలన్నారు.అనుభవం ఉన్న ఆర్కిటెక్టులనే ఎంపిక చేయాలని ఆదేశించారు.

నెల్లూరులో హాస్పిటాలిటీ యూనివర్సిటీ ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాల గురించి అడిగి తెలుసుకున్నారు. కడప జిల్లాలో టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలున్నట్లు చెప్పారు.గండికోట వద్ద రెండు రిజర్వాయర్లు, పోర్టు, పరిసరాలను టూరిస్టు కేంద్రాలుగా రూపొందిస్తే, పర్యాటక రంగం అభివృద్ధితో పాటు కడప విమానాశ్రయానికి రద్దీ పెరిగి రెండువిధాలా రాబడి ఇనుమడిస్తుందన్నారు. గుంటూరు జిల్లాలో నాగార్జునసాగర్, నాగార్జునకొండ, అమరావతి బౌద్ధారామాలను మరింతగా అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. విశాఖ, తిరుపతిలోని జంతు ప్రదర్శనశాలల్లో సఫారీ అభివృద్ధి అవకాశాలపై దృష్టి పెట్టాలన్నారు. నెల్లూరు జిల్లాలో పులికాట్, నేలపట్టు ప్రాంతాలలో ఫ్లెమింగో ఫెస్టివల్స్ నిర్వహించాలని సూచించారు.

❖



ఫొటో: బాబులు



పుష్కర గోదారికి గొజ్జంగి పూదండ!

'బిందు బింద్వంతర సందీపిత సుకృత సందోహ విమల పాథో నిర్ఝర...' అని గౌతమిని సంబోధించారు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యన్నారాయణ.
ప్రతి బిందువులో పుణ్యాలు దీపించే ఆ స్వచ్ఛ సజల జీవవాహిని - గోదారమ్మకిది మహాపుష్కర వేళ.

త్ర్యంబక జటోద్భూతే గౌత మస్సాఘ నాశని
సప్తధాబ్ధింగతే గంగే గృహాణార్ఘ్యం నమోస్తుతే!
గోదావర్యైనమః ఇదమర్ఘ్యం సమర్పయామి

గోదావర్యైనమః

భరతఖండంలో పచ్చని కలలు పండించే నదీమతల్లి గోదావరి. ఇప్పుడు పుష్కరుడితో కలసి భారతీయుల కోసం పుణ్యాల పంటను పండించబోతోంది.

ఏడు నదులను ఇక్కడ పరమ పవిత్రమైనవిగా పూజిస్తాం– గంగ (హిమసానువులలో పుట్టి, బంగాళాఖాతంలో కలుస్తుంది), యమున (హిమాలయాలలో పుట్టి ప్రయాగ త్రివేణీ సంగమం వరకు ప్రయాణిస్తుంది), సరస్వతి (ప్రయాగ త్రివేణీ సంగమంలోని గంగ, యమునలలో మూడవది. అంతర్వాహిని), నర్మద (సాత్పురా పర్వతశ్రేణులలో పుట్టి అరేబియా సముద్రానికి వెళుతుంది), క్షిప్ర (వింధ్య పర్వతాలలో పుట్టి చంబల్‌నదితో ఏకమవుతుంది), గోదావరి (పశ్చిమ కనులలో పుట్టి బంగాళాఖాతంతో సంగమిస్తుంది), కావేరి (పశ్చిమ కనులలోనే పుట్టి బంగాళాఖాతానికి చేరుతుంది). భారతీయ ఆధ్యాత్మిక జీవనంలో గంగయమునల తరువాత గోదావరికి విశేష ప్రాధాన్యం కనిపిస్తుంది. ఏడు నదులను పరమ పుణ్యనదులుగా పేర్కొంటున్నప్పటికీ పన్నెండు నదులకు పుష్కరశోభ వస్తుంది. గంగ, గోదావరి వంటి నదుల పుష్కరాల రోజులను పర్వదినాలుగా ఆచరిస్తారు. వాటికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. వాటిని ఒక ప్రపంచ ప్రఖ్యాత ఉత్సవాలుగా నిర్వహించుకునేది అందుకే.

త్ర్యంబకంలో పుట్టి..

గోదావరి భారతదేశంలోని పొడవైన నదులలో రెండో స్థానంలో ఉంది. దక్షిణ గంగ అని కూడా పిలుస్తారు. గంగానది తరువాత స్థానం దక్షిణ గంగదే.

అరేబియా సముద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో పడమటి కనుమలలోని త్ర్యంబకంలో గోదావరి పుడుతుంది. త్ర్యంబకం మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఉంది. 1,465 కిలోమీటర్ల పరిధిలో ప్రవహిస్తూ, దక్కను పీఠభూమిని తాకుతూ, తూర్పు కనుమల గుండా కోనసీమ కొసన (తూర్పుగోదావరి) ఉన్న అంతర్వేదిలో బంగాళాఖాతంలో కలుస్తుందీ గోదావరి. మొత్తం పరీవాహక ప్రాంతమే 1,20,000 చదరపు మైళ్లు. రాజమండ్రి దగ్గర ఈ నది విశాల రూపంతో దర్శనమిస్తుంది. మహారాష్ట్రతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, పుదుచ్చేరి (అంటే యానాం, ఇది నిజానికి తూరుగోదావరి లోనే ఉంది) రాష్ట్రాలను పలకరిస్తూ సాగుతుంది. గోదావరికి ఎడమ వైపు నుంచి పూర్ణా, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, తాలిపేరు, వయన్గంగ, పెన్గంగ, వార్ధా, దుధన అనే ఉపనదులు; కుడి వైపు నుంచి ప్రవర, మంజీర, పెద్దవాగు, మానేరు, కిన్నెరసాని ఉపనదులు గోదావరిలో సంగమిస్తాయి. రాజమండ్రి దాటిన తరువాత గోదావరి రెండు పాయలవుతుంది. ఆ పాయల పేర్లే వృద్ధ గౌతమి, వశిష్ట గోదావరి. కొంతదూరం ప్రవహించిన తరువాత ఇంకొన్ని పాయలుగా కూడా చీలుతుంది. గోదావరి జనించే త్ర్యంబకం జ్యోతిర్లింగాలలో ఒకటి కాగా, సాగరంలో సంగమించే అంతర్వేదిలో పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉండడం విశేషం. నిజానికి నదీ తీరమంతా ఇలా శైవ, వైష్ణవ క్షేత్రాలు కనిపిస్తాయి. బాసర (జ్ఞాన సరస్వతి, ఆదిలాబాద్), ధర్మపురి (నరసింహస్వామి, కరీంనగర్), కాళేశ్వరం (శివుడు, కరీంనగర్), భద్రాచలం (శ్రీరాముడు, ఖమ్మం) కనిపిస్తాయి. పట్టిసాచలంలో (పశ్చిమ గోదావరి) వీరభద్రస్వామి, భద్రాకాళీ సమేతుడై కొలువున్నాడు. రాజమండ్రిలో కోటిలింగాల క్షేత్రం, మార్కండేయ క్షేత్రం ఎంతో ప్రసిద్ధిగాంచాయి. ఇవి కాక ఎన్నో చారిత్రక నగరాలు కూడా ఈ నది ఒడ్డునే విలసిల్లాయి. హాజుర్ సాహిబ్ నాందేడ్ సిక్కు గురుద్వారా కూడా గోదావరి ఒడ్డునే నిర్మించారు.

పుష్కరాలంటే...

ఒక నదిలో సర్వతీర్థములతో కూడిన పుష్కరుడు అంటే తీర్థరాజు (వరుణుడు) నివసించే కాలాన్ని పుష్కరం అంటారు. మేషంతో మొదలయ్యే పన్నెండు రాసులలోను బృహస్పతి సంచరించేవేళ పుష్కరుడు ఆయా నదులలో నివశిస్తాడని ప్రతీతి. దీనినే ఈ శ్లోకంలో నిక్షిప్తం చేశారు.

శ్లో: మేషే గంగా వృషే రేవా గతే యుగ్మే సరస్వతీ

యమునా కర్కటేచైవ గోదా సింహం గతేపిచ

కన్యాయాం కృష్ణవేణీచ కావేరీచ తులాగతే

వృశ్చికే స్యాద్భీమరథీ చాపే పుష్కరవాహినీ

మృగే తుంగా ఘటే సింధుః ప్రణీతా తటినీ ఝుషే

తిష్యన్నబ్దాత్సురగురుః క్రమాత్సర్వే మునీశ్వరాః

(దేవతల గురువు బృహస్పతి మేషరాశిలో ప్రవేశించినపుడు గంగానదీ పుష్కరం. వృషభ రాశిలో ప్రవేశిస్తే నర్మదకు పుష్కరం. మిథునంలో గురుడు ఉంటే సరస్వతీ పుష్కరం. కర్కట రాశిలో ఉంటే యమునా పుష్కరం. సింహరాశిలో ఉంటే గోదావరీ పుష్కరాలు. కన్యారాశిలో కృష్ణానదికి పుష్కరం. తులలో కావేరికీ, వృశ్చిక రాశిలో భీమరథీ నదికి పుష్కరాలు. ధనూరాశిలో పుష్కర నదికి, మకరంలో ఉంటే తుంగభద్రకు, కుంభరాశిలో ఉంటే సింధునదికీ, మీనరాశిలో ప్రణీతా నదికి పుష్కర శోభ వస్తుంది.)

బృహస్పతి ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క రాశిలో సంచరిస్తాడు. అప్పుడే ఆయా తీర్థాలలో మూడున్నర కోట్ల తీర్థాలతో కూడిన పుష్కరుడు, సకల మునిజనం నివాసం ఉంటారని ప్రతీతి. కాబట్టే పుష్కరం ప్రవేశించినది మొదటి రోజు నుంచి పన్నెండు రోజులు, సంవత్సరాంతంలో పన్నెండు రోజులు పుష్కరాల రోజులుగా గ్రహిస్తారు. అందుకే

ఈ రోజులలో చేసే క్షేత్రోపవాసాలు, తీర్థ, శ్రాద్ధ, స్నాన, దాన, వ్రత, జప, పూజాదికాలకి ఎంతో ఫలం ఉందని హిందువులు విశ్వసిస్తారు. పురాణాల ప్రకారం అరవై వేల సంవత్సరాల పాటు గంగాస్నానం చేస్తే వచ్చే ఫలితం పుష్కరాలలో ఒక్కరోజు గోదావరిలో చేసినా ప్రాప్తిస్తుంది. గురువు సింహరాశిలో ఉన్నపుడు బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు; సర్వదేవతలు, రుషులు గౌతమి నదిలో అంటే గోదావరిలో నివాసం ఉంటారు. కాబట్టి త్ర్యంబకం మొదలుకొని,

మృత్తికాం తే మయాదత్తా మహారార్థం ప్రకల్పయ

గోదావరికి వందనం

ఈ భూమిని తడిపి సస్యాలు పండించి, మనిషి నోటికి అందిస్తూ మాతృమూర్తి పాత్రను కూడా పోషిస్తున్న గోదావరికి నమస్కరిస్తారు– ఈ చక్కని, భావస్ఫోరకమైన శ్లోకంతో.

శ్లో గంగాగంగేతి యోబ్రూయా ద్యోజనానాం శతైరపి

ముచ్యతే సర్వ పాపేభ్యో విష్ణులోకం స

భైరవాయ నమస్తుభ్యం అనుజ్ఞాం దాతుమర్హసి

త్వం రాజా సర్వతీర్థానాం త్వమేవ జగతః పితా

యాచితం తీర్థం మేదేహి సర్వపాపా పనుత్తయే

యోసౌ సర్వగతో విష్ణుశ్చిత్స్వరూపో నిరంజనః

స ఏవ ద్రవరూపేణ గంగాంభో నాత్ర సంశయంః

నందినీ నలినీ సీతా మాలినీచ మహాపగా



బంగాళాఖాతం వరకు ఎక్కడ చేసినా పుష్కర స్నాన ఫలితం దక్కుతుంది. ఎక్కడ స్నానం చేయడమనే మీమాంసే అక్కరలేదంటారు పండితులు. కాని కొన్ని ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలలో స్నానం చేయడానికి భక్తులు ఇష్టపడతారు.

పుష్కర స్నానం

వేకువనే లేచి కాలకృత్యాలు తీర్చుకుని గోదావరికి వెళతారు. 'కృత్య' అనే శక్తి అనుగ్రహం పొందడానికి ఒక శ్లోకం చదివి, కొంచెం మట్టిని తీసి నదిలో వేస్తారు. కృత్య అంటే శివుని మూడో కంటి నుంచి ఆవిర్భవించిన శక్తి. ఇలా ఎందుకు చేస్తారంటే, కృత్య అనుగ్రహం పొందకుండా పుష్కర స్నానం చేస్తే, దాని ఫలితం ఆ శక్తికి పోతుందని విశ్వాసం.

శోపిప్పలాదాత్సముత్పన్నే కృత్యే లోక భయంకరి

గచ్ఛతి

(నూరు యోజనాల దూరంలో ఉండికూడా ఎవరు గంగా గంగా అని స్మరిస్తారో, అలాంటి వారు కూడా సర్వ పాపాల నుంచి విముక్తి పొందుతారు. విష్ణులోక ప్రాప్తి పొందుతారు)

తరువాత శ్లోకం కూడా చదువుతారు.

శ్లో అంబత్యద్దర్శనాన్ముక్తి ర్న జానే స్నానజం ఫలమ్

స్వర్గారోహణ సోపానే మహాపుణ్య తరంగిణి

(మాతా! నీ దర్శనం చేతనే ముక్తి కలుగుతుంది. మరి స్నానం చేస్తే ఎంత ఫలితం వస్తుందో కూడా నేను ఊహించలేను. నీవు మేం స్వర్గం అధిరోహించడానికి మెట్టువు అవుతున్నావు)

తరువాత ఈ ప్రార్థన చేస్తారు.

శ్లో వందే కాశీం గుహాం గంగాం భవానీం మణికర్ణికామ్

అతి తీక్ష్ణమహాకాయ కల్పాంత దహనోపమ

విష్ణు పాదాబ్జ సంభూతా గంగా త్రిపథగామినీ

భాగీరథీ భోగవతీ జాహ్నవీ త్రిదశేశ్వరీ

ద్వాదశైతాని నామాని యత్రయత్ర జలాశయే

స్నానకాలే పఠేన్నిత్యం మహాపాతక నాశనమ్

పుష్యార్కే జన్మ నక్షత్రే వ్యతీపాతే దినత్రయే

సకృద్గోదావరీ స్నానం కుటకోటి సముద్ధరేత్

రేవాతీరే తపః కుర్యాన్మరణం జాహ్నవీతటే

దానం దద్యాత్ కురక్షేత్రే గౌత మ్యాం త్రితయం వరమ్

అని నదీమతల్లికి నమస్కరించి ఒక ములుగు ములుగుతారు. తరువాత ఆచమనం చేసి దేశకాల సంకీర్తనం చేసి సంకల్పం చెబుతారు.

పుష్కరస్నానంలో సంకల్పం

అస్యాం మహానద్యాం సమస్త

పాపక్షయార్థం, సింహం గతే దేవగురౌ, సార్ధత్రికోటి తీర్థ సహిత తీర్థరాజ సమాగమాఖ్య మహా పర్వణి పుణ్యకాలే అఖండ గౌతమీ స్నాన మహం కరిష్యే.

ఆపై స్నానం చేస్తారు. తరువాత ఈ శ్లోకాలు వల్లించాలి లేదా వినాలి.

శ్లో భానో భాస్కర మార్తాండ చంద్రరశ్మి దివాకర

ఆరోగ్యమాయుర్విజయం శ్రీయం పుత్రాంశ్చదేహిమే

శ్లో దివాకర నమస్తుభ్యం పాపాజ్ఞాన

పితరులకు ప్రీతిని కలిగించడానికి ఇంకొకసారి స్నానం చేసి పెద్దలకు కూడా అర్ఘ్యం ఇవ్వాలి.

గౌతమీ పూజ

స్నానం తరువాత 'ఆచరిత వ్రత కల్పోక్త సకల ఫలావాప్త్యర్థం గౌతమీ పూజాం కరిష్యే' అని సంకల్పం చేసి, షోడశోపచారాలతో గోదావరిని పూజించాలి.

పుష్కరాలలో ఏం చేయాలి?

పుష్కరాల రోజులలో కొన్ని నియమాలు

హిందుధర్మం ప్రకృతిని తల్లిలా భావిస్తుంది. కానీ ఇలాంటివి జనం మరచిపోతున్నారు. గంగ వలెనే గోదావరి కూడా తీవ్రంగా కలుషితమవుతున్నది. ఇలాంటి సందర్భంలో అయినా మన జల వనరులను కలుషితం కానివ్వరాదని కూడా సంకల్పం చెప్పుకోవాలి. పితరులను స్మరించుకునే పుష్కరాల వేళ భవిష్యత్ తరాల క్షేమాన్ని కూడా గుర్తు చేసుకోవాలి. భవిష్యత్తులోనూ మన నదులన్నీ ఇలాంటి పుష్కర శోభతో విలసిల్లాలంటే, ప్రజలందరినీ ఒక సంకల్పంతో



ప్రణాశన

త్రయీమాయార్క విశ్వాత్మన్ గృహాణార్ఘ్యం నమోస్తుతే

దివాకరాయనమః ఇదమర్ఘ్యం సమ-ర్పయామి

శ్లో ఏహి సూర్య సహస్రాంశో తేజోరాశే జగత్పతే

అనుకంపయమాం భక్త్యా గృహాణార్ఘ్యం నమోస్తుతే

భాస్కరానమః ఇదమర్ఘ్యం సమర్పయామి

అని సూర్యభగవానునికి అర్ఘ్యం ఇచ్చి

పాటించాలంటుంది సంప్రదాయం. రోజు ఒక్కపూట భోజనం, నేలపై నిద్ర మంచిదని పెద్దలు చెబుతారు. రాత్రివేళలో గౌతమీ మహాత్మ్యం పారాయణం చేసే సంప్రదాయం కూడా ఉంది. అంటే ఒక దీక్షలో గడుపుతారన్నమాట.

ఒక నదిని ఒక సమాజం మొత్తం స్నానఘట్టంగా ఎంచుకుని, ఏకోపాసనతో, పవిత్ర భావనతో, మన మట్టి మీద, జలాల మీద భక్తితో మనసూ, శరీరం క్షాళనం కావాలని సంఘటితంగా ప్రార్థించడం ఒక అపురూప సన్నివేశం.

సంఘటితం చేసే అవకాశం మిగుల్చుకోవాలంటే ఇలాంటి స్పృహ కూడా అవసరం. మా నదులను, ప్రకృతిని అపవిత్రం చేయం, కలుషితం చేయం అని భారతీయులంతా పుష్కరాల వేళ ప్రతిజ్ఞ చేయాలి.

సప్తసాగరాలు

రాజమహేంద్రవరం తరువాత గోదావరి ఏడు పాయలుగా చీలిపోతుంది. వాటికే సప్తసాగరాలని పేరు. వాటిని ఒక్కొక్క ముని సాగరం దగ్గరకు తీసుకువెళ్లాడని పురాణాలు చెబుతున్నాయి. అది ఈ శ్లోకం



ద్వారా గ్రహించవచ్చు.

శ్లో తుల్యాత్రేయీ భరద్వాజీ

గౌతమీ వృద్ధ గౌతమీ

కౌశికీ వసిష్ఠాచ

సప్తభాగాః కృతా పురా.

తుల్య (భాగా)

జమదగ్ని మహర్షి ధవళేశ్వరం నుంచి చొల్లంగి తీసుకువెళ్లాడు.

ఆత్రేయి

అత్రి మహాముని కపిలేశ్వరపురం నుంచి కోటిపల్లి (కోటిఫలి) మీదుగా కోరంగి దగ్గరకు చేర్చాడు.

భరద్వాజ

దీనిని కూడా కపిలేశ్వరపురం నుంచే భరద్వాజుడు కోటిఫలి మీదుగా తీర్థాలమొండికి చేర్చాడు.

గౌతమి

గౌతముడు త్ర్యంబక గిరి నుంచి తీసుకువచ్చి బ్రహ్మసంవేద్యం (తీర్థాలమొండి అంటే ఇదే) దగ్గరకు చేర్చాడు. అక్కడే సముద్రంతో కలుస్తుంది.

వృద్ధ గౌతమి

వామదేవుడు (కశ్యపుడు, కాణ్య అనే పేరు కూడా ఇతడిదే) ముక్తేశ్వరం నుంచి ఈ పాయను తీసుకువెళ్లి తీర్థాలమొండి దగ్గరకు చేర్చాడు.

కౌశిక

విశ్వామిత్రుడు మందపల్లి నుంచి బెండమూర్లంక దగ్గర సాగరంతో కలిపాడు.

వశిష్ట

వశిష్ట మహర్షి విజ్జేశ్వరం నుంచి ఈ పాయను తీసుకువెళ్లి అంతర్వేది దగ్గర సాగరునితో సంగమింపచేశాడు.

పుష్కర కాలంలో చేసే దానాలు

12 రోజులు కొన్ని దానాలు చేయడం పూర్వం నుంచి వస్తున్నది

మొదటిరోజు

వెండి,బంగారం, భూమి, ధాన్యం. హిరణ్య శ్రాద్ధం కూడా చేస్తారు.

రెండో రోజు

గోవులు, ఉప్పు, మణులు, బట్టలు.

మూడోరోజు

అశ్వం, బెల్లం, పళ్లు, కూరగాయలు.

నాలుగో రోజు

నూనె, ఆజ్యం, పాలు, తేనె, పానకం.

ఐదో రోజు

నాగలి, ఎద్దు, దున్నపోతు.

ఆరో రోజు

ఘనసారం, కస్తూరి, చందనం, ఔషధం.

ఏడో రోజు

ఇల్లు, శయ్య, పీట, ఉయ్యాల.

ఎనిమిదో రోజు

శ్రీచందనం, కందమూలాలు, పువ్వులు.

తొమ్మిదోరోజు

దాసీదానం, కంబలం.

పదో రోజు

ముత్యాలహారం, పువ్వులు, వెండి.

పదకొండో రోజు

పుస్తకం, తాంబూలం, యజ్ఞోపవీతం.

పన్నెండో రోజు

షోడశ మహాదానాలు చేసి అనుశ్రాద్ధం చేస్తారు.

పుష్కరాలు –పురాణ కథ

భరతఖండంలోని నదులను మరింత పవిత్రంగా మలిచేందుకు పూర్వకాలంలో రుషులు వరుణుని ప్రార్థించారట. అన్ని తీర్థాలతో కలసి వచ్చి ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క నదిలో ఉండవలసిందని రుషులు చేసిన విన్నపాన్ని వరుణుడు అంగీకరించాడట. ఇంకొన్ని పురాణాలలో పుష్కరుడిని బ్రహ్మ సృష్టించాడని ఉంది. దేవదానవ యుద్ధం వల్ల మహేంద్రుడికి వచ్చిన బ్రహ్మహత్యా దోషాన్ని నివారించుకోవడానికి బ్రహ్మ ఈ పని చేశాడని ప్రతీతి. అలాగే పుష్కరం అనేది కూడా ఒక తీర్థమని, శివుడు సర్వతీర్థ సారంగా గంగను సృష్టించి బ్రహ్మ కమండలంలో ఉంచాడని మరొక కథనం. అహల్య ఉదంతం తరువాత గౌతముడు శాపం ఇచ్చిన శాపంతో వచ్చిన వికృత రూపాన్ని పోగొట్టుకోవడానికి ఇంద్రుడు బ్రహ్మ కోసం తపస్సు చేశాడనీ, బ్రహ్మ ప్రత్యక్షమై తన కమండలంలోని ఉదకాన్ని ఇంద్రునికి ఇచ్చాడని దీనితో అతనికి సహజ రూపం వచ్చిందని పురాణాలు చెబుతాయి. ఆ ఉదకం పేరే పుష్కరమని చెబుతారు.



– అనిపెద్ది వెంకట రమణారావు

సకలం సన్నద్ధం జూలై 14 నుంచి...

వైభవంగా ఆరంభంకానున్న గోదావరి మహా పుష్కరాలు

ఉత్తరాదిలోని కుంభమేళాకు ధీటుగా ఏర్పాట్లు
చంద్రబాబు స్వీయ పర్యవేక్షణలో సర్వం సిద్ధం

గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఈ పుష్కరాలను నిర్వహించాలని చంద్రబాబు సంకల్పించి, ఆ దిశగా నిర్వహణా ఏర్పాట్లలో అధికారులు, మంత్రులను పరుగులు పెట్టిస్తున్నారు. 2003లో గోదావరి పుష్కరాల నిర్వహణకు చంద్రబాబే సారధ్యం వహించగా. మళ్ళీ ఇపుడు కూడ చంద్రబాబే ముఖ్యమంత్రిగా ఉంటూ గోదావరి మహాపుష్కరాలు నిర్వహించడం విశేషం. పుష్కరాల నిర్వహణలో చంద్రబాబుకు అపారమైన అనుభవం ఉన్నది. ఆ అనుభవాన్ని రంగరించి, ఈ సారి జరిగే మహాపుష్కరాలను మరింత ప్రతిష్ఠాకరంగా నిర్వహించడంపట్ల ఆయన ప్రత్యేకదృష్టి పెట్టారు. ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన మంత్రిమండలి ఉపసంఘాన్ని నియమించారు. పుష్కరాల నిర్వహణపై ముందస్తు ప్రణాళికలతో తరచూ అధికారులు, మంత్రులు, సంబంధిత ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. గోదావరికి దక్షిణ గంగగా గుర్తింపు తేవాలని నిర్ణయించారు.

రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాలు సందర్భంగా మన కళారూపాలను, మన పద్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు వీలుగా ఏర్పాట్లు చకచకా చేపడుతోంది. గద్యాన్ని, నాటకాలను, నాట్యాలను, జానపదాలను, అంతరించిపోతున్న కళారూపాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. గోదావరి పుష్కరాలు కేవలం ఆధ్యాత్మిక, అలౌకిక ప్రక్రియగా భావించకుండా నీటికి, నాగరికతకు, ప్రకృతికి, మానవాళికి ఉన్న సంబంధ బాంధవ్యాలను మరింత చేరువ చేసేందుకు దోహదపడనున్నాయి. ఈ పుష్కరాలు ప్రకృతిని ఆరాధించే ప్రక్రియకు అంకురార్పణ చేయనున్నాయి. మన సంస్కృతి, కళలు, సంప్రదాయాలను విశ్వవ్యాప్తంగా చాటిచెప్పేందుకు గోదావరి మహా పుష్కరాలు ప్రతిబింబం కానున్నాయి.

తెలుగుప్రజల జీవనాడి గోదావరి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగురాష్ట్రాలలో కోట్లాది ఎకరాల భూములను సస్యశ్యామలం చేస్తున్న గోదావరి నది తెలుగుప్రజల జీవనాడి. దక్షిణ గంగలా, తల్లి గోదావరిలా...తెలుగు ప్రజల జీవితాలతో పెనవేసుకుపోయింది. ఆంధ్రప్రదేశ్‌ను కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో గోదావరి నదీజలాల పాత్ర అమోఘం. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతల పథకాలవల్ల గోదావరి మెట్టభూములన్నీ సస్యశ్యామలం కానున్నాయి.

నాసిక్‌లోని త్రయంబకేశ్వరాలయం, బాసర సరస్వతీ దేవాలయం, భద్రాచలం కోదండ రామాలయం, పట్టిసం, అంతర్వేది పుణ్య



ప్రభుత్వ యంత్రాంగమే మీ సేవాదళం



“మరో కుంభమేళాలా జరగబోతున్న మన గోదావరి మహాపుష్కరాల సందర్భంగా, వెల్లువెత్తనున్న కోట్లాది మంది భక్తులకు నేను ఒక విషయం మనవి చేయదలుచుకున్నాను: రేగిపండంత మట్టిముద్ద నదిలో వేసి, మునక వేస్తే చాలు, పుష్కర స్నాన ఫలం సొంతం దక్కుతుంది. కాబట్టి, దళారుల బారి పడవద్దు” అన్నారు మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్ యనమల రామకృష్ణుడు. సంస్కృతి పరిరక్షణ కూడా పాలనలో భాగమని భావించిన ప్రభుత్వం కావడం వల్లనే, గోదావరి పుష్కరాల్ని ఘనంగా నిర్వహించబోతున్నామని ఆయన అన్నారు. ఇంత భారీ ఎత్తున నిధులు విడుదల చేసింది అశేషమైన యాత్రికులకి ఎటువంటి ఇబ్బంది కలగకుండా సకల సౌకర్యాలు కల్పించడమే అసలు లక్ష్యమన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా గోదావరిలో మూడు స్థాయిలలో ఘాట్ల నిర్మాణం చేయడమే కాకుండా, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని. ఘాట్లు బురదమయం కాకుండా తగినంత ఇసుకని కూడా అందుబాట్లో ఉంచుతున్నామని చెప్పారు. వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. గోదావరి జిల్లాల్లోని అన్ని ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నామని, మందులు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

క్షేత్రాలన్నీ గోదవరి నదీ తీరంలోనే కొలువుదీరాయి. పాపికొండలు, పట్టిసీమ, కోనసీమలో ఇతర పర్యాటక క్షేత్రాల అందాలు సందర్శకులను కనువిందు చేస్తాయి. గోదావరి నది ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణగా అవతరించింది. ఉభయ గోదావరి జిల్లాలను భారత దేశంలోనే ధాన్యాగారాలుగా మార్చిన ధన్య గోదావరి రుణం మనం తీర్చుకోలేనిది. ఇంత ఆధ్యాత్మిక, పర్యాటక, వ్యవసాయక, సామాజిక ప్రాధాన్యత సంతరించుకున్న గోదావరి నది పుష్కరాలను ఈ ఏడాది ‘నభూతో నభవిష్యతి’ రీతిలో వైభవోపేతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

పుష్కర కాలంలో పుణ్యతీర్థాలకు అధిపతి అయిన పుష్కరుడు ఆయా నదులలో బృహస్పతి(గురుడు)తో నివశిస్తాడని ప్రతీతి. ముక్కోటి దేవతల సాన్నిధ్యంవల్ల నదీజలాలు అద్భుతమైన తేజస్సుతో, శక్తితో సుసంపన్నమవుతాయి. సింహరాశిలో గురుడు ప్రవేశించే సమయంలో గోదావరి పుష్కరాలు ప్రారంభమవుతాయి.

‘కృష్ణా, గోదావరి’ అనుసంధానానికి పుష్కరాలు వేదిక

ప్రకృతి ఆరాధనే పుష్కర పరమార్థం. ఆంధ్రప్రదేశ్ ప్రజలతో గోదావరి నదికి అవినాభావ సంబంధం ఉన్నది. గోదావరిని పూజిస్తే తమ కష్టాలు తీరతాయని రాష్ట్ర ప్రజల నమ్మకం. ఈ పుష్కరాలను పురస్కరించుకుని ప్రజలలో గోదావరి నది విశిష్టత, నీటి ప్రాధాన్యత, చెట్ల పెంపకంపై అవగాహన పెంచడానికి ప్రభుత్వం చొరవ చూపుతూ ప్రజలను చైతన్యం చేస్తున్నది. గోదావరిని కృష్ణా నదితో అనుసంధానంచేసి, కృష్ణా జలాలను రాయలసీమకు తరలించి రాష్ట్రాన్ని కరవు రహిత రాష్ట్రంగా మార్చటమే ప్రభుత్వ ధ్యేయం. ఈ లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రజలను భాగస్వాములను చేసేందుకు గోదావరి పుష్కరాలను కూడ ప్రభుత్వం ఒక వేదికగా చేసుకున్నది. ’నీరు...చెట్టు’ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు పవిత్ర గోదావరి పుష్కరోత్సవాలనే ఈ చారిత్రక కార్యక్రమానికి నాందీవాచకంగా చేద్దాం.

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ప్రతి గ్రామంలో పుష్కరాల కమిటీని ప్రభుత్వం నియమించింది. కావిళ్లలో గోదావరి జలాలను తీసుకువెళ్లి తమ గ్రామంలోని చెరువులలో కలపటం, ఆలయాలలో అభిషేకాలు జరపటం ద్వారా కావడి మేళా నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఒక దండులా గోదావరి పుష్కర శోభాయాత్రను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నదీ పరీవాహక ప్రాంతంలో దేవాలయాల పునరుద్ధరణ, మరమ్మతు పనులు, రంగులు వేయటం, అలంకరణ పనులు త్వరితగతిన సమర్ధవంతంగా సాగుతున్నాయి. పుష్కర స్నానాల ఘాట్ల నిర్మాణం, రహదారుల నిర్మాణం, భక్తులకు ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ తదితర పనులన్నీ మంత్రులు, ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

268 పుష్కర ఘాట్ల నిర్మాణం

గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలను ఆనుకున్న గ్రామాల వద్ద 268 స్నానపు ఘాట్లను నిర్మిస్తున్నారు. రాజమండ్రిలోని సరస్వతి ఘాట్, గామన్‌వంతెన, రాజమండ్రి నగర సుందరీకరణ, నరసాపురం ఘాట్, కొవ్వూరు ఘాట్ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. జూలై మొదటివారానికి సర్వసన్నద్ధం కాబోతున్నాయి.

గంటకు 2లక్షల పుణ్యస్నానాలు

గోదావరి పుష్కర ఘాట్‌లలో గంటకు రెండు లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా రాజమండ్రి, కోటి లింగాల రేవు నుంచి 4 ఘాట్లను కలుపుతూ ఒకే స్నాన ఘట్టం నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. వీటికోసం రూ. 8 కోట్లు వ్యయం చేస్తున్నారు. మరో పదికోట్లతో సరస్వతీ ఘాట్ అభివృద్ధి చేస్తున్నారు.

రాజమండ్రి విమానాశ్రయం (మధురపూడి) వద్ద నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టారు. భీమడోలు–ద్వారకా తిరుమల రోడ్డుపై ఆక్రమణలను తొలగించి నిర్మాణ పనులను త్వరిత గతిలో పూర్తి చేస్తున్నారు.

1500 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తుల కోసం ఎపిఎస్ ఆర్టీసీ సంస్థ 1500 బస్సులను అదనంగా నడపడానికి ప్రణాళిక రూపొందించింది. కాగా పుష్కరాలకు తరలి వచ్చే లక్షలాది మంది యాత్రీకుల రవాణా కోసం విజయవాడ జోన్ పరిధిలో 350 ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. యాత్రీకులు వచ్చీపోవడానికి ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. పుష్కర



"ఉత్తరాది ప్రజలకు గంగానది ఎంత పవిత్రమైనదో దక్షిణ భారత ప్రజలకు గోదావరి నది అంత ప్రశస్తమైనది. గోదావరి మహా పుష్కరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశ విదేశాల నుంచి తరలి వచ్చే భక్తులకు అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. పుష్కరాల సందర్భంగా వివిధ కార్యక్రమాల నిర్వహణలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ శతకోటి వందనాలు. అద్భుతమైన శక్తితో, సుసంపన్నమైన గోదావరి జలాలలో పుష్కరస్నానం చేసి తరిద్దాం. మహాపుష్కరాలకు తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రతి ఒక్కరం భాగస్వాములు అవుదాం"

– డాక్టర్ పరకాల ప్రభాకర్,పుష్కరాల నిర్వహణ కమిటి చైర్మన్

యాత్రికుల కోసం రూ.70కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. యాత్రికులకు అంటురోగాలేవీ సోకకుండా పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి వంద మీటర్లకు ఒక ప్రత్యేక పర్యవేక్షణ, నిఘా టవర్ ఏర్పాటు చేయాలని, ప్రతి 50 మీటర్లకు తాగునీటి సదుపాయం కల్పించాలని నిర్ణయించారు. గోదావరి నదిలోని ఐలెండ్స్‌ను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి బోటు షికార్లు ఏర్పాటు చేస్తున్నారు. అన్నవరం, సింహాచలం దేవస్థానాల పాలకమండళ్లు కూడ పుష్కర ఏర్పాట్లలో భాగస్వాములయ్యాయి. పుష్కరాలను వైభవంగా, జయప్రదంగా నిర్వహించేందుకు పోలీస్, మున్సిపల్, ఎండోమెంట్, పర్యాటక, సాంస్కృతిక శాఖల సమన్వయంతో పనిచేస్తున్నాయి.


1460 కోట్లతో పుష్కరాల పనులు

గోదావరి మహాపుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు రూ.1460 కోట్ల వ్యయంతో యాత్రికులకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నారు. ఈ పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. 2003లో 3.25 కోట్ల మంది భక్తులు తరలిరాగా, 2015లో జరిగే పుష్కరాలకు మూడున్నర నుంచి నాలుగు కోట్ల మంది తరలి వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. సమైక్యాంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాలలో గతంలో 136 స్నాన ఘాట్లు నిర్మించగా, ఇపుడు నవ్యాంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఈ పుష్కరాలలో కేవలం రెండు జిల్లాలలోనే 234 ఘాట్లు నిర్మిస్తున్నారు. 2003లో ఏడు జిల్లాలలో పుష్కర పనులకు రూ.172.90 కోట్లు కేటాయించగా, ప్రస్తుత పుష్కరాలలో రెండు జిల్లాలలోనే రూ.1460 కోట్లు కేటాయించారు. కేంద్రం అప్పట్లో పుష్కరాలకు రూ.50 కోట్లు మంజూరు చేయగా, ప్రస్తుతం రూ.100 కోట్లు కేటాయించింది. ఐదు పట్టణాలలో పనులు చేపట్టేందుకు 13వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.336 కోట్లు మంజూరైంది. పాలకొల్లు మునిసిపాలిటీ పరిధిలో 3 పనులు చేపట్టేందుకు రూ.3 కోట్లు కేటాయించారు.

రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 536పనులు చేపట్టేందుకు రూ.240 కోట్లు కేటాయించగా ఇప్పటికే రూ.120 కోట్లు విడుదల చేసింది. నరసాపురం మునిసిపాలిటీ పరిధిలో 15 పనులకోసం రూ.41.75 కోట్లు కేటాయించారు. నిడదవోలు మున్సిపాలిటీలో 15 రకాల పుష్కర పనులకోసం రూ.1.35 కోట్లు కేటాయించారు. కొవ్వూరు మున్సిపాలిటీలో 138 పనుల కోసం రూ.44.60 కోట్లు, పాలకొల్లులో18 పనుకోసం రూ.11.49 కోట్లు కేటాయించారు. స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా 3247 వ్యక్తిగత మరుగుదొడ్లు, 18 సామూహిక మరుగుదొడ్లను పుష్కర పట్టణాలలో నిర్మించారు.

పొరుగు రాష్ట్రాల నుంచి 3.5 కోట్ల మంది

గోదావరి పుష్కరాలకు నవ్యాంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిషా, కేరళతోపాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి దాదాపు మూడున్నర కోట్ల మంది యాత్రికులు రావొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. వారికోసం అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ సమకూర్చుతున్నది. తాగునీరు, వసతి, ఆహార ఏర్పాట్లన్నీ





చేస్తున్నారు. గోదావరి జిల్లాలలో ప్రసిద్ధి గాంచిన పిండి వంటకాలతో ఆహార పండగలను నిర్వహించబోతున్నారు.

పుణ్యక్షేత్రాలపై డాక్యుమెంటరీ

గోదావరి నదీ తీరంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాల వైభవంపై ఒక ప్రత్యేక డాక్యుమెంటరీని రూపొందిస్తున్నారు. థీమ్ సాంగ్ ఇప్పటికే రూపొందించారు. ప్రారంభ వేడుకలలో వేయి మంది కూచిపూడి కళాకారులచే నాట్య బృందం ప్రదర్శన ఇవ్వనున్నది.

సాంస్కృతిక ప్రదర్శనకు పెద్దపీట

జూలై 14 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలలో ప్రధానంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలకు పెద్దపీట వేయనున్నారు. సుప్రసిద్ధ నర్తకి స్వప్న సుందరి బృందం ప్రారంభ వేడుకలలో రాజమండ్రి కళావేదికపై ప్రదర్శన ఇవ్వనున్నారు. రాజమండ్రి, నరసాపురం, కొవ్వూరు తదితర ప్రధాన కేంద్రాలలో ఒక చోట ప్రదర్శన ఇచ్చిన కళాకారులు ఆ మర్నాడు మరో ప్రదేశంలో ప్రదర్శన ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. పర్యాటక శాఖ గాలి పతంగుల పోటీ, ఆర్ట్ ఫెస్టివల్, అంతర్వేదిలో ప్రభల తీర్థం, కొవ్వూరులో క్రాకర్స్ ఫెస్టివల్, ధవళేశ్వరంలో వాటర్ స్పోర్ట్స్, కడియంలో ఫ్లవర్‌షో వేడుకగా నిర్వహించనున్నారు. గోదావరి పుష్కరాల వేడుకలను సోషల్ మీడియా ద్వారా బహుళ ప్రాచుర్యం కల్పిస్తున్నారు.

పుష్కరాలకోసం ప్రత్యేకంగా ఫేస్‌బుక్ ప్రారంభించారు. ఇన్‌స్టా గ్రామ్‌తో ఇంటిగ్రేట్ చేసి ఫోటోలను పోస్టు చేసే కార్యక్రమం కూడ చేపట్టనున్నారు. గోదావరి నది, ప్రాశస్త్యం, పుష్కరాల ప్రాధాన్యం, నదీజలాల ప్రయోజనాలపై ప్రముఖ పండితుల ప్రవచనాలతో 20 నిమిషాల నిడివితో ఒక డాక్యుమెంటరీని రూపొందిస్తున్నారు.

రాష్ట్రపతి, ప్రధానులకు ఆహ్వానం

ఈ ఉత్సవాలకు భారత రాష్ట్రపతిని, ప్రధాన మంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే మౌఖికంగా ఆహ్వానించారు. అంతేగాక జూన్ రెండో వారంలో న్యూఢిల్లీ వెళ్లి వారిని స్వయంగా ఆహ్వానించారు. కేంద్రమంత్రులను, పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, ఇతర ప్రముఖులను రాష్ట్ర ప్రజాప్రతినిధులు వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానిస్తున్నారు. ప్రముఖ పీఠాధిపతులను, స్వామీజీలను దేవాదాయశాఖ అధికారులు స్వయంగా కలిసి ఆహ్వానిస్తున్నారు. 14 నాటికి ప్రధాని జపాన్ పర్యటనలో ఉన్నందువల్ల రాలేకపోతున్నారు.

పనుల పురోగతిపై ఆన్‌లైన్‌లో సిఎం సమీక్ష

ప్రతిష్టాకరంగా నిర్వహిస్తున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనుల పురోగతిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆన్‌లైన్‌లో సమీక్షించాలని నిర్ణయించారు. ఇందుకోసం జియో ట్యాగింగ్ పరిజ్ఞానాన్ని వినియోగించుకోనున్నారు. జూన్ 30 నాటికి మొత్తం పనులన్నీ పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

సినీ కళాకారులతో ప్రదర్శనలు

పుష్కరాలలో సినీ కళాకారులచే ప్రదర్శనలు నిర్వహించాలని సిఎం నిర్ణయించారు. జానపద, సంప్రదాయ కళా రూపాలచే ప్రదర్శనలు ఇవ్వాలని, ప్రముఖ కళాకారులు హరిప్రసాద్ చౌరాసియా, శివమణిలచే ప్రదర్శనలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు.

ఆర్టీసీ నామమాత్రం ఛార్జీలు

పుష్కరాలకు తరలి వచ్చే యాత్రీకులకోసం నామమాత్రపు ఛార్జీలను వసూళ్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

గోదావరి పుష్కరాలు ఉదయం 6.45 గంటలకు ఆరంభం కానున్నాయి. అయితే తొలి పుణ్య స్నానం ఒక పీఠాధిపతి ఆచరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పీఠాధిపతులందరినీ ఆహ్వానించారు. 12 రోజుల పాటు గోదావరికి అఖండ హారతి ఇవ్వాలని, మిగతా రోజుల్లో నిత్య హారతి ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. యాత్రీకులకు గోదావరి పుణ్యజలాలను చిన్న చిన్న సీసాలలో పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఐదు రోజులపాటు 21 మండలాలలో 300 కిలోమీటర్ల పరిధిలో పుష్కరజ్యోతి మారథాన్ నిర్వహించాలని, ఇందులో ప్రముఖ క్రీడా కారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, 60 వేల మంది విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు.

తొలిరోజు 50 వేల ఆకాశ దీపాలు

పుష్కరాలు సందర్భంగా తొలిరోజు 50వేల ఆకాశ దీపాలు వెలిగించాలని నిర్ణయించారు. గోదావరి నదిపై లేజర్ షో, సౌండ్ అండ్ లైట్ షో, 11 ప్రాంతాలలో పురాణ ప్రవచనాలు నిర్వహిస్తారు..



డబ్బీరు రామకృష్ణ పట్నాయక్

చల్లని గోదారికి వెన్నెల హారతి..!

రాజమండ్రిలో 'బుద్ధవరపు' భక్తికేతనం

ఎక్కడి గోకర్ణికా క్షేత్రం. మరెక్కడి బంగాళాఖాతం. వెయ్యిమైళ్లదూరం. సన్నటి నీటిధారగా మొదలై.. ఒకచోట తడబడే నడకలతో, మరొకచోట పిడుగుల అడుగులతో, వేరొకచోట అలజడిగా, ఇంకొకచోట రసధునిగా పరవళ్లు తొక్కే గోదారమ్మను చూస్తే చాలు. జనసాంతర బంధమేదో పెనవేసినట్టుంటుంది. ఆ నదీజలాన్ని నెత్తిన జల్లుకుంటే చాలు. ఆత్మస్నానం చేసినట్టుంటుంది. గోదారమ్మ తాకగానే ఎండిన బీళ్లు ఏమంటాయ్! సుక్షేత్రాలై పరవశిస్తానంటాయి. గోదారమ్మ పలకరించగానే నేలతల్లి ఏమవుతుంది. చిలకపచ్చ చేనవుతుంది. పైరుపచ్చ పొలం అవుతుంది. పశ్చిమ కనుమల నుంచి పరుగులమీద వచ్చే గోదారి మన బోదెల్లో నీరవుతుంది. మన పాదుల నిండా శాకమవుతుంది. మన గాదెల్లో ధాన్యమవుతుంది. మీకు గుర్తుండే ఉంటుంది. చిన్నప్పుడు రాజమండ్రి మీదుగా రైల్లో వెళ్లేప్పుడు పిఠాపురం దాటకుండానే అమ్మానాన్నలు మన చిన్ని చేతుల్లో నయాపైసలు కుక్కేవారు. ఎప్పుడడిగినా లేవులేవనే నాన్నారు కూడా జేబులోంచి పావలాకాసో, పదిపైసలో పైకితీసిచ్చేవారు. గోదావరి బ్రిడ్జిమీంచి రైలు వెళుతుండగా కిటికీల్లోంచి ఆ డబ్బుల్ని నదిలో వదిలేయించి మనచేత నమస్కారాలు చేయించేవారు. అంతగా మన జీవితాల్లో ఇంకిపోయింది గోదారి. అంతగా మన బతుకుల్లో ఉప్పొంగిపోయింది గోదావరి. మరాఠాసీమలోని నాసికాత్రయంబకం నుంచి ప్రస్థానాన్ని ఆరంభించే గోదారమ్మ దాదాపుగా పదిహేనువందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంది. అలా వచ్చివచ్చి భద్రాచలంలో సీతారాములవారి పాదాలు కడుగుతుంది. పంచవటిని తాకి జానకమ్మ వనవాస క్లేశానికి కన్నీరుపెట్టుకుంటుంది. పాపికొండలను ముద్దాడి నేత్రాలు తుడుచుకుంటుంది. ఆనక, మహారాజులా రాజమహేంద్రవరానికి విచ్చేసి నన్నయ్య ఎవరో కనుక్కుంటుంది. ఆదికవివరేణ్యునికి వందనాలు చెల్లించి, తూర్పుపశ్చిమ గోదావరి జిల్లాల్లో పచ్చదనం నింపి, తెలుగురాష్ట్రాలు రెంటినీ ఆనందసాగరంలో ముంచి సాగరంలో కలిసిపోతుంది. ఆంధ్రప్రదేశాన్ని అన్నపూర్ణగా చేస్తుంది. మన కంచాల్లో అన్నం ముద్దగా మారి మనసత్వంగా, మనతత్వంగా మారిపోతుంది.

అంతటి మహాతల్లిని మనం ఎలా పూజించాలి. ఎలా గౌరవించాలి. భక్తులంతా ఎవరికి తోచిన రీతిలో వారు పూజాదికాలు నిర్వహిస్తూనే ఉన్నారు. పసుపుకుంకాలు నదిలో వదిలిపెడు తున్నారు. పుష్పరాశులను గోదారమ్మకు అర్పిస్తున్నారు. నైవేద్యాలు సమర్పిస్తు న్నారు. ఇంకా ఏదో చేయాలని వారి కుంది. అర్చన, సమర్చన, అర్పణ, సమర్పణ.. ఇలా ఏవేవో ఆలోచనలు భక్తికోటి మదిలో మెదులుతున్నాయి. సరిగ్గా అలాంటి అవగాహనలోనుంచి ప్రభవించినదే 'గోదావరి హారతి'. వారణాసి వెళ్లినవారికి గుర్తుంటుంది. సాయం సంధ్యవేళ అక్కడి దశాశ్వమేథ్ ఘాట్‌లో గంగాదేవికి అర్పించే పుణ్యనీరాజనం. అర్చకస్వాములు అత్యంత భక్తిశ్రద్ధలతో చెల్లించే హారతి ఇది. అచ్చమైన ఆ స్ఫూర్తితోనే తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరు కేంద్రంగా పనిచేసే బుద్ధవరపు చారిటబుల్‌ట్రస్టు 'గోదావరి హారతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పదేళ్లకిందట పొలమూరులో దత్తాత్రేయుని ఆలయనిర్మాణం చేపట్టిన ట్రస్టు ప్రతినిధులు తదాదిగా సామాజిక సేవాకార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఉచిత కంప్యూటర్ విద్యాబోధన, వైద్యశిబిరాల నిర్వహణ, వేలమంది పిల్లలకు మధ్యాహ్నభోజనపథకం అమలు, జాతీయ సమగ్రతకు దోహదపడే కార్యక్రమాల నిర్వహణ తదితరాలను చేపడుతున్నారు. వీటన్నింటిలోనూ ముఖ్యమైనదిగా గోదావరి నదీమతల్లికి 'గోదావరి హారతి' పేరిట వీరిస్తున్న గౌరవమర్యాదలు ఎనలేనివి. "గౌతమీ మాతకు నీరాజనాలు చెల్లిస్తే.. కన్నతల్లికి పాదాభివందనాలు చేసినట్టు" ఇదే బుద్ధవరపు చారిటబుల్‌ట్రస్టు ప్రతినిధుల నిశ్చితాభిప్రాయం. 2010 సంవత్సరంలో కార్తీపౌర్ణమి నాడు వారంతా ఈ హారతిని ప్రారంభించారు. నాటినుంచీ ప్రతీ పున్నమి వెన్నెల వెలుగుల్లోనూ దీనిని సభక్తికంగా జరిపిస్తున్నారు. మూడుగంటల అద్భుత భక్తిచైతన్యదాయకంగా ఈ హారతి సభ వెలిగిపోతుంటుంది. రాజమండ్రిలోని గోదావరి గట్టుకు నలభై ఏభై అడుగుల దూరంలో విశాలమైన పంట్‌ని నది నీళ్లలో నిలిపి హారతికి వేదికను తయారుచేస్తారు. ఈ వేదిక ఎంత పెద్దదంటే వందమంది నృత్యకళాకారులు నాట్యప్రదర్శన ఇవ్వగల భారీ రంగస్థలం వంటిది. లెక్కకు మిక్కిలిగా వేదపండితులు స్వస్తివాచకం పలికేటంతటి పుణ్యతీర్థమై అలరారు తుంటుంది. విద్యుద్దీపాల అలంకరణతో ధగద్ధగాయమానంగా అగుపిస్తుంది. వెన్నెలమ్మకు కొత్తకాంతులను సమకూరు–స్తున్నట్టుగా ఉంటుంది. నిండుపౌర్ణమి సిగలో సింగారమై నిలుస్తుంది. గోదావరి నదికి, ఆమె ఒడిలోనే నిలిచి చెల్లించే భక్తి నీరాజనంగా దీనిని అభివర్ణించవచ్చు. దివ్యగోదారికి బుద్ధవరపు చారిటబుల్‌ట్రస్టు పట్టినదే తొలిహారతి కావడం చరిత్రలో సువర్ణ అధ్యాయం. ఈ హారతి, ట్రస్టుతోనే ప్రారంభమైందని చెప్పాలి. అపురూపమైన ఈ హారతి అర్పణను దర్శించి తరించేందుకు జనం తండోపతండాలుగా తరలివస్తుంటారు. ఆ రోజు సాయంవేళ రాజమండ్రి గోదావరి తీరం జనంతో కిటకిటలాడిపోతుంది. హారతి సందర్భంగా విశేషకార్యక్రమాలు ఏర్పాటుచేస్తారు.

నదిలోపల నిర్మితమైన వేదికమీద గోదావరి ఆవిర్భావానికి, ప్రవాహానికి సంబంధించిన నృత్యనాటికను అద్భుతంగా ప్రదర్శిస్తారు. అలాగే తెలుగు భాష, సాహిత్యం, పత్రికారచన సహా సమాజంలోని వివిధరంగాల ఉన్నతికి తమవంతు సేవలందిస్తున్న మహోన్నతులకు పురస్కారాలు అందజేస్తారు. ఇంతవరకూ పీవీఆర్‌కే ప్రసాద్, సునీతాకృష్ణన్, మల్లేపల్లి రకరకాల హారతులు నివేదన చేస్తారు. ధూపహారతి, దీపహారతి, కర్పూరహారతి చెల్లిస్తారు. వేదమంత్రోచ్చాటనల నడుమ, నృత్యనాట్య కళావిలాసాల మధ్య ఇదంతా జరుగుతుంది. కన్నులపండువ చేస్తుంది. పౌర్ణమి వచ్చిందంటే, రాజమండ్రికి పర్వదినోత్సవం వచ్చినట్టే. పుష్కరాల సందర్భంగా ఆగస్టు ఒకటోతేదీ వరకూ ప్రతీరోజూ గోదావరి హారతి కార్యక్రమం రూపకల్పనచేస్తోంది. అన్నంపెట్టే గోదావరికి హారతి పట్టడమంటే కృతజ్ఞతలు సమర్పించుకోవడమే. గౌతమీమాతకు శిరస్సువంచి పాదాభివందనాలు చెల్లించడమే. ఆమెను భూమికి దించిన గౌతమునికి నమోవాకాలు తెలియజేసుకోవడమే. ఈ దారిలో బుద్ధవరపు చారిటబుల్‌ట్రస్టు మరింతగా ముందుకుసాగాలని కోరుకుందాం.



లక్ష్మయ్య తదితరులు ఈ అవార్డులు స్వీకరించినవారిలో ఉన్నారు. అన్నింటికీ మించి మూడుగంటల కార్యక్రమంలో మూడోవంతుభాగంగా జరిగే గోదావరి హారతి అత్యంత విశిష్టమైనది. ఇరవైమంది వరకూ అర్చకస్వాములు పెద్దపెద్ద దీపపుసెమ్మెలతో గోదావరికి చేపట్టాలని బుద్ధవరపు చారిటబుల్ ట్రస్టు సన్నాహాలు చేస్తోంది. దీంతోపాటుగా స్వచ్ఛగోదావరి నినాదంతో ఈ నదిని శుభ్రంగా ఉంచేందుకుగాను అవగాహన కార్యక్రమాలను రూపొందిస్తోంది. ఈ విషయమై జనబాహుళ్యంలో చైతన్యం ప్రోదిచేసేలా పలు పథకాలకు



డా చింతకింది శ్రీనివాసరావు

తీర్చలేని రుణం! ఎస్ఎన్. కుమార్ బుద్ధవరపు. బుద్ధవరపు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి

పవిత్రగోదావరికి ఏమిచ్చినా రుణం తీరదు. ఈ నది ప్రాణికోటికి జీవాధారం. ఆ ఉద్దేశ్యంతోనే గోదావరి నదీమతల్లి ప్రాముఖ్యతను పదుగురికీ వివరించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. గౌతమి విశిష్టతను, ఆవిర్భావాన్నీ తెలియజేయాలన్న తపనతో 'గోదావరి హారతి' కార్యక్రమాన్ని అయిదేళ్ల కిందట ప్రారంభించాం. దీనిని ఒక కార్యక్రమంగా కాక కర్తవ్యంగా భావిస్తున్నాం. అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నాం. కార్యక్రమంలో భాగస్వాములయ్యే అందరికీ నమస్సులు చెల్లించుకుంటున్నాం.

మానవతామూర్తి వీరేశలింగం

ఆంధ్రప్రదేశ్ అప్పటి పేజీల్లోంచి

దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వపు సొగసుకు దీటైన వచన రచనా వైభవం ఈ వ్యాసం. ఆంధ్రప్రదేశ్ పత్రిక పరంగా ఇదొక పురానవ జ్ఞాపకం; పులకింతల తలపోత. దానికి కారణం– ఇది 1971 జూలై నాటి ఆంధ్రప్రదేశ్ పత్రిక వీరేశలింగం సంస్మరణ సంచికలో ప్రచురించబడ్డ వ్యాసం కావడమే. దేవులపల్లి వారు వీరేశలింగం వారికీ, తమ గురుదేవులు బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు గారికి ఉన్న సామ్యాలు, తారతమ్యాలు ఒక ఉదాత్తమైన ఉద్వేగ కోణం నుంచి దర్శించి ప్రదర్శించిన అపురూపమైన అక్షరవిన్యాసం – ఈ వ్యాసం. గోదావరి పుష్కరాల సందర్భంగా ఆ తీరంలోని మహానుభావుల్ని తలుచుకుంటున్న సందర్భంలో ఇద్దరు తేజోమూర్తుల్ని స్మరిస్తూ, అదే ప్రాంతపు ఓ మహాకవి చేసిన రచనని నాలుగున్నర దశాబ్దాల నాటి మా సంచికల నుంచి పునర్ముద్రించడం సందర్భం, కనుక మాకు సంతోషం.



వీరేశలింగమూ, నా గురుదేవుడు వేంకట రత్నమూ నా మనస్సులో నిలిచినప్పుడు ఎంతో చెప్పాలని ఉంటుంది. ఎంతెంతో!

బ్రతికున్నప్పుడు మహాపురుషులను గొప్పవారు అని స్వీకరించడానికి మనస్సు ససేమిరా ఒప్పుకోదు. వారిలో కూడా మనలో లాగే సమానంగా ప్రతి దినమూ, ప్రతి నిమిషమూ రోగాలూ రొష్టులూ, రాగాలూ ద్వేషాలూ అన్నీ కనబడి, మనకన్న వారు అధికులని అనాలని అనిపించదు.

ఇక గతించిన మహాపురుషులను కూడా ఖచ్చితంగా, సరిగ్గా విలువ కట్టలేము.

వారిని దేవపదవి కయినా ఎత్తుతాము. లేదా “ఔనూ, కాదు” అన్నట్లు వారికి ఒక చిన్న సర్టిఫికెట్టు అయినా యిచ్చి తోసేస్తాము ? “గోప్ప సంఘ సంస్కర్త” అనో, మరేదో అనో!

రామమోహన రాయలు అంటే “విలియం బెంటింక్ సాయంతో సహగమనమును మాన్పించెను” అంటాం. దిక్కుమాలిన textbook లో అంతే ఉంది. అది అప్పగించేస్తాం. ఆయన సమగ్ర భారతాభ్యున్నతికి ఏ విధంగా మూలపురుషుడో, ఆయన ఏలాగున నవ–యుగానికి ప్రవక్తో, తొలి విశ్వమానవుడో (universal man), ఆయన చూపించిన గమ్యస్థానాన్ని ఇంకా స్పష్టంగా దర్శించలేక, లోకం యావత్తూ అటు కదిలి నడవడానికి గిల గిల లాడుతూ, కిందా మీదా పడుతూ, ఎలాగ ప్రయత్నం చేస్తూందో తెలుసుకోలేము.


అలాగే, వీరేశలింగం అనగానే, “ఆయన విధవా విహహాములు చేయించెను. అనేక గ్రంథములు వ్రాసెను. తెలుగులో మొదటి నవల రచించెను. ఆంధ్ర కవుల చరిత్ర వ్రాసెను. ఆయన ధైర్యశాలి. సంఘాన్ని ఎదిరించెను” అంటూ ఒకటే పాట పాడి ఊరుకుంటాం.

అంతే గాని ?

అభిన వాంధ్ర శుభోదయ ప్రాప్తి కెల్ల
మూల పురుషుం డొకండె, విశాల
దృష్టి
ఆ మహర్షి నాటిన మహోద్యమ లతికలె
సూన పల్లవతతి మోసె...............

అని గ్రహించము.

సాహిత్య క్షేతంలో, సంస్కరణ మార్గంలో, సేవా వీథిలో, రాజకీయ రంగంలో, కృష్ణా గౌతమీ తుంగభద్రా ఘట్టాల్లో, సాగర తీరాల్లో, పనుల్లో, గనుల్లో, కేదారాలలో, కార్ఖానాలలో ప్రబుద్ధమైన చైతన్యంతో



వ్యక్తికి కులం ఉంది. ప్రజకు లేదు. వ్యక్తికి ఒక మతం ఉంది. జనానికి లేదు. వ్యక్తికి వయస్సు ఉంది, మందికి లేదు. మందికి జనన మరణాలు లేవు. ఉద్యమాలన్నీ కలిసి ప్రజవి.

దాదాపు నాలుగు కోట్ల ఆంధ్రప్రజ నేడు అవిశ్రాంత కార్యోత్సవంలో మునిగి ఉన్నదంటే, ఆ దుర్వార కర్మధారకు జన్మస్థానం యుగకర్త, ప్రవక్త అయిన వీరేశలింగం.

వీరేశలింగం నాసికాత్ర్యంబకం. నవ్యాంధ్ర జీవితం అఖండ గౌతమి. నూరేళ్ల ఈ మధ్య ఉన్న తెలుగువారందరూ, వారికి తెలియకుండానో, తెలిసో వీరేశలింగంలో ఉన్నారు? అందరూ, అందరూను!

వీరేశలింగం విధవా వివాహోద్యమం, మరో ఉద్యమం లేవదీసి నడిపించాడంటే, దాని అర్థం అంతేనా ?

అంతే అయితే, అందరూ ఈ ఉద్యమాన్ని హర్షించే ఈ రోజులలో ఇంకా ఎందుకు ఆముదం లాగున ఆమాటే అనడం ?

ఆయన పని ఏనాడో అయిపోయిందన్న మాట !

ఊహూ –అది కాదండి! ఆ ఉద్యమం నడిపిస్తూ ఆయన ఆంధ్రజనాన్ని ఈ విధంగా హెచ్చరించారన్న మాట:

"ఇదిగో, ఇది మన జాతి. ఇది ప్రస్తుతం తెగ కుళ్ళి ఉంది. దీనిలో మౌఢ్యం, అంధకారం, కల్మషం, కౌటిల్యం, దాస్యం చిక్కగా మూగిపోయి ఉన్నాయి. ఉదాహరణకు చూడండి ? ఈ బాల విధవల దుస్థితి, ఈ హరిజనుల దుర్దశ, ఈ కళావంతుల హేయపద్ధతి! వీటినన్నిటినీ, ఇంకా ఇట్టివాటిని ఎన్నిటినో మనం తొలగించి పారెయ్యక పోతే ఎలాగ? దాస్యాలన్నిటిలోనూ మనోదాస్యం మరీ చెడ్డది. అది వదిలించుకోకపోతే ఎలాగ? ముందు నీ మనస్సును కట్టి పెట్టిన సంకెల తెంచేస్తాను. కొన్ని సంస్థలూ, ఆచారాలూ మనకు ప్రియతమమై పోయాయి. అవి మనకు సంకెళ్లని అసలే తెలియదు. నీకు భయం లేదు. వానిని బద్దలు కొట్టేయ్! భయ మెందుకు ? సత్యానికి భయమేమిటి ? ధర్మం, న్యాయం, కరుణ వీటికి బెదురేమిటి ? ఇదుగో నా వైపు చూడండి! ఇలాగ, ఇదుగో, ముందు ఈ సంకెల బద్దలు కొట్టి చూపిస్తున్నా నిర్భయంగా! చూసేరా? ఇలాగే ముందు ముందు సంకెళ్లనన్నిటినీ మీరు తెంచి పారేయాలి!

"బూజు, దుమ్ము, ధూళి
మూసెను తిమిరాళి!
మాసె నీ హవేలీ!
పురాణ మీ దివాణం, చెడి
బూజు పట్టకుండా ?
తెరవండీ తలుపులు!"

అంటూ కర్కశమైనా కరుణార్ద్రమైన హస్తంతో, కోట్ల జనాన్ని ఫెళ్ళు మని కొట్టి, లేపి, నిలబెట్టాడన్న మాట !

కనుక వీరేశలింగం విద్యాసాగర్ లాగ వట్టి సంస్కర్త మాత్రమే కాదు.

రామమోహన రాయలు లాగ ప్రవక్త, యుగకర్త.

ఒక గొప్ప విద్వాంసుడూ, విజ్ఞుడూ ఆయన్ని బసవేశ్వరునితోనే పోలుస్తాడు.

వీరేశలింగాన్ని కీర్తిస్తూ, "ఆయన ఒక మహావ్యక్తి మాత్రమే కాదు – ఆయన ఒక గొప్ప సంస్థ" అనీ, ఒక "మహోద్యమం" అనీ కొందరు అంటూంటారు. అబ్బే! సంస్థలన్నీ ఆయనే! ఉద్యమాలన్నీ ఆయనే ! జనం అంతా కలిసిన జనశక్తి ఆయనే కనుక.

వీరేశలింగం ప్రజ!
వీరేశలింగం మంది, కోట్లమంది.

వ్యక్తికి కులం ఉంది. ప్రజకు లేదు. వ్యక్తికి ఒక మతం ఉంది. జనానికి లేదు. వ్యక్తికి వయస్సు ఉంది, మందికి లేదు. మందికి జనన మరణాలు లేవు. ఉద్యమాలన్నీ కలిసి ప్రజవి.

అది జీవద్వాహిని, అది భాద్రపదంలో గోదావరి. నిత్యమూ జీవనము నింపుకుంటూ సాగిపోవడమే!

వీరేశలింగం కేవలమూ ప్రజ కూడా కాదు.
వీరేశలింగం మానవత.

అప్రతిహతమైన ఆయన బలమంతా ఆ మానవతలోనే ఉంది. ప్రబుద్ధమైన నవయుగ ప్రజాశక్తి అణువు వంటి ఆ అర్భక మూర్తిలో ఇమిడి ఉండి, క్రుద్ధ గౌతమి లాగ, రుద్ర ప్రభంజనం లాగ ఆటంకాలన్నిటినీ తుడిచి పెట్టి సాగిపోయింది.

ఎందరో తెలియక అంటారూ – "వీరేశలింగం ఒక్కడూ నూరేళ్ల క్రితం సంఘ తిరస్కృతికీ, మృతికి కూడా భయపడకుండా, ఒక్కడూ, ఒక్కడే, ఎలాగ నిలిచి జయించాడండీ? అసలు సంఘానికంతకీ అడుగున ఉన్నవాడు స్కూలు మేస్టరు. వాళ్లలో అట్టడుగున ఉన్నవాడు తెలుగు పండితుడు. వీరేశలింగం అట్టి తెలుగు పండితుడు. అంత కలవాడు కాదు. వట్టి అర్భకుడు. ధనికుల్ని, అధికారుల్ని, బలశాలుల్నీ, పండితుల్నీ, అందరినీ, సంఘాన్నంతనీ ఒక్కడూ ఎదిరించి ఎలాగ జయించాడండీ?" అని.

ఒక విధంగా చూస్తే అది నిజం కాదు.

ఆయన్ని చుట్టిముట్టి పీడించిన వాళ్లకే బలమూ తక్కువ,

సంఖ్యాబలమూ తక్కువ అంటాను.

కన్నూ, నోరూలేని ప్రజ తెలిసో తెలియకో వీరేశలింగం పక్షమే! ప్రజది ఎప్పుడూ భవిష్యత్కాలం. వీరేశలింగంది రాబోయే కాలం ! ఆయన ప్రతికక్షులది, పాపం, పోయేకాలం! వాళ్ళది శైథిల్యం, ఆయనది చైతన్యం.

చిదికి, బీటలువారి, కూలిపోతున్న మందిరాన్ని వాళ్లు "వదలము" అన్నారు. ఆయన వాళ్లను కూడా పట్టుకుని కొత్త మందిరంలోనికి తీసుకుపోయి తీరతానన్నాడు. కనుక వాళ్ల పక్షమే బలహీనమైనది.

ఇక్కడ ఒక్క మాట:

ఆయనకు అలవి కాని కోపం ఉండేదనిపించేది అందరికీ. రాజు అవనీ, రెడ్డి అవనీ, ఎంత మేటి అయినా, ఆయన ఎదుట కుంచుకుపోయి, వెనక్కి తగ్గి నిలబడేవాడు – సత్యం సమక్షాన అసత్యపు నీడలాగ, చీకటి మసక లాగా, ఎక్కడో ఏ కొంచెమో మాలిన్యం ఉన్న వ్యక్తిలాగ!

అయితే అది కోపం కాదంటాను నేను. ఆయన చేత అంత పనిచేయించిందే కరుణ ఆయేను!

అది తొందర –impatience!

ఎంతో పని చేయవలసి ఉంది ! ఏమో ఎన్నేళ్లు జీవిస్తాడో! ఎటు చూసిన సమాజం కుళ్లి ఉంది. Aegean Stables లాగు. అంతులేని మాలిన్యం – త్వరగా త్వరగా, త్వరత్వరగా తాను ఎంతో పని చేసి మరీ వెళ్లిపోవాలి. ప్రతీ విషయమూ ప్రతీ ఒక్కనికీ, వాద ప్రతివాదాలు చేస్తూ నచ్చచెప్పుతూ పోతానంటే ఎప్పటికి తేలదం? ఏం చేయడం? "చేయ్! " అంతే! "ఊ!నడు!" అంతే! తొందర ! తొందర! తొందర !

భయంకరమైన, తీవ్రాతి తీవ్రమైన ఆ కార్యోత్సవంలో ఆయనకు మరణించడానికి తీరిక లేకపోయింది.

లేకపోతే ఆ దుర్బల శరీరం చిన్నతనంలోనే రాలిపోయి ఉండేది.

ఆయన జీవితానికి స్తిమితం లేదు. ఎప్పుడూ నడకే ! వట్టి కదలిక కాదు? అది మనది.

వట్టి నడకకు గమ్యస్థానమూ ఉండదు; తీర్చి దిద్దిన మార్గమూ ఉండదు.

మన మందరమూ సాధారణంగా చూపు ఒక వైపు, నడక మరియొక వైపు ఉన్నట్టు ఉంటాం. కొందరం శరీరం గదిలోనూ, తల కీటికిలో నుంచి ముందుకు చాపినట్టూ ఉంటాం.

ఆ ద్రష్టకు, ఆ మహర్షికి లక్ష్యం, గమ్యస్థానం సుస్పష్టం. కనుక ఏ చేయో, కాలో, ముక్కో ముందుకు చాపి ఆ కాస్తా, ప్రగతి అనుకోక, మనిషి ముందుకు నడవాలన్నాడు; సమాజం కూడా అలాగ నడవాలన్నాడు.

ఒక్కొక్కప్పుడు మాకు అనిపించేది? ఆ ప్రచండునిలో ఎక్కడయినా చల్లదనమూ, తీయదనమూ ఉన్నాయా అని !

అలాగ అనుకోవడం మా దృష్టి లోపం.

ఆయనలో తండ్రితనమూ, తల్లితనమూ రెండూ కూడా ఉండేవి.

అనాథనూ, అభాగినినీ రక్షించింది ఆ రెండో గుణమే!

ఆ రెండో గుణం రాజ్యలక్ష్మమ్మ – ఆయన భార్య, ఆమెకు ఆయనమీద అమోఘమైన ప్రభావ ముండేది. ఆమె కరస్పర్శ, మృదుభాషణ ఆయనకు ఎంతగా సాంత్వన పరిచేవో ఆయన చరిత్ర ఎరుగున్న వాళ్లకు తెలుస్తుంది !

ఆమె చనిపోయాక మరీని ! ఆయన అంతరంగంలోనే ఆమె నివాస మేర్పరచుకుంది. అప్పుడు స్త్రీ పురుష ప్రకృతులు రెండూ ఆయనలో

భయంకరమైన, తీవ్రాతి తీవ్రమైన ఆ కార్యోత్సవంలో ఆయనకు మరణించడానికి తీరిక లేకపోయింది. లేకపోతే ఆ దుర్బల శరీరం చిన్నతనంలోనే రాలిపోయి ఉండేది.

కలిసిపోయి నిండిపోయాయి. భార్య పోయిన తర్వాత రవీంద్రుడు ఒక గేయంలో అదే అంటాడు.

తుది దినాల్లో ద్విజేంద్రలాల్ రాయ్ వ్రాసిన చంద్రగుప్త నాటకంలోని చాణక్యునివలె వీరేశలింగం కనిపిస్తాడు. ఎన్నడో పరమపదించిన భార్యను పదే పదే ఆహ్వానిస్తూ "నీవే మంటావు? ఈ పని చెయ్యనా?" అని అడుగుతూ అడుగడుగూ వేస్తూన్నట్లు!

ఇక్కడ ఒక్క మాట!

వీరేశలింగంగారిని గురించి స్మరించినప్పుడల్లా మా గురు దేవులు శ్రీ వేంకటరత్నం నాయుడుగార్ని గురించి కూడా చెప్పుకోకుండా ఉండలేను.

దాదాపు అరవై అయిదు సంవత్సరాల క్రితం ఒక ప్రముఖ ఉత్తర భారత పత్రిక వీరిద్దరినీ కీర్తిస్తూ, "దక్షిణ భారతాకాశాన్ని నేడు రెండు జ్యోతిర్మండలాలు ప్రకాశింపజేస్తూ ఏలుతున్నాయి. వీరుడైన వీరేశలింగం పంతులు, రుషి అయిన వేంకట రత్నం నాయుడు" అని వ్రాసింది.

వీరేశలింగం వేంకటరత్నం కంటే ఎక్కువ నవ్యుడని అనిపిస్తుంది. వీరేశలింగమే ప్రబుద్ధ ప్రజ.

భవిష్యత్తు ఆయన !

వీరేశలింగ యుగం ఆయన చనిపోయాక ఇప్పుడిపుడే ప్రారంభమయినట్లు తోస్తుంది.

వేంకటరత్నం దూర భవిష్యత్తులోనికి దృష్టి సారించినా, తన శిష్యులకు అంత వరకూ మార్గాన్ని పరచి చూపించినా, తాను మాత్రం యుగ ప్రాంగణాన నిలబడ్డ ఉపదేశకుడిలాగ దర్శనమిస్తాడు.

వీరేశలింగం పంచభూతాలకూ ప్రజలాగే సన్నిహితుడు. కోపాలూ, తాపాలూ, తిక్కలూ, అనురాగాలూ, ద్వేషాలూ – వీటితో జనం లాగే నేలపైనా, ధూళిలోనూ నిలిచి, ఒక్క నిమిషం విశ్రాంతి లేక, ఒక్క కనురెప్ప పాటు విశ్రాంతి నియ్యక, పదిమందిని తిడుతూ కొడుతూ, తాను పది పడుతూ, ఆందోళన పరుస్తూ యుద్ధం చేస్తూ పోతూన్నట్టుంటాడు.

వేంకటరత్నం ఉదాత్తుడులాగ, అంటే aristocract లాగ దర్శనమిస్తాడు. ఎప్పుడూ సైనాయ్ పర్వత శిఖరం నుంచి, ఒక విశిష్ట సంస్కార అధిత్యక మీద నుంచి దిగనట్టుంటాడు.

వీరేశలింగం పీడిత మానవ జగత్తులో నిలబడి, దానికి జరిగే అన్యాయాన్ని కోసి పారేసి, ఎదిరించిన వారిని తుడిచి పారేస్తానంటాడు.

వేంకటరత్నం అనాథల కోసం, అభాగినుల కోసం తల్లిలాగ తండ్రిలాగ ఆప్యాయంగా చేతులు చాపుతూ, ఓదారుస్తూ వంగుతున్నట్టుంటాడు.

వీరేశలింగం "ఛీ! ఇది అన్యాయం! జరగడానికి వీల్లేదు చూస్తానెవరు వస్తారో ! దీన్ని ఖండించి పారేస్తాను " అంటాడు.

వేంకటరత్నం "అబ్బా! పాపం ఈ దిక్కుమాలిన వాళ్లు ఎలా ఉన్నారో!" అనే ప్రేమమూర్తిలాగు ఉంటాడు!

వీరేశలింగం నడిపిన ఉద్యమాలలో ప్రధానమైనది విధవా పునర్వివాహం. లోకంలో తీవ్రమైన యుద్ధాలకు కారణ అయిందది.

వేంకటరత్నం తలపెట్టిన ఉద్యమాలలో, సంస్థలలో ముఖ్యమైనవి కళావంతుల సముద్ధరణం, అనాథ శరణాలయమూను.

ఇవి వద్దని ఎవరు పోరాడగలరు?

ఒక్కొక్కప్పుడు వీరేశలింగం యొక్క దైవం దండధారీ, సమవర్తీ అయిన లోక శాసకుడనిపిస్తుంది.

వేంకటరత్నం యొక్క దైవం తరిమి తరిమి రక్షించే వాత్సల్యమూర్తి పతిత పావనుడూ అనిపిస్తాడు.

అయితే వీరేశలింగంలో ప్రేమభక్తులు లేవని కాదు; వేంకటరత్నంలో కార్యతత్పరత లేదని కాదు.

కాని వీరేశలింగం జీవిత చరిత్ర అవిశ్రాంత కార్యోత్సవం లాగ ఉంటుంది, భారతంలో ఒక వీర మానవుని కథలాగ సామాన్య హృదయాలను ఆవేశపరచే తీవ్ర సంఘటనలతో నిండీ!

వేంకటరత్నం జీవిత చరిత్ర భాగవతంలోని భక్తుని గాథలా ఉంటుంది – స్థూలంగా కనబడని, పట్టుకు దొరకని లక్ష్యాలూ, అనేక ఆవేశాలూ, వేదనలూ – అలాటి వాటితో నిండీ!

వీరేశలింగం కథ నాటక రచనకూ, చలనచిత్ర నిర్మాణానికి ఇట్టే లొంగుతుంది.


వేంకటరత్నం కథ అలా లొంగదు; అది భావకావ్యం, కీర్తన!

మొదటిది ఎక్కువ జనరంజకం – ముఖ్యంగా ఈ నేటి కాలంలో. వీరేశలింగం నవ మానవుడు. రాగల కాలంలో మానవుడు బుద్ధీ, హృదయమూ రెంటినీ బాగా ఉపయోగించుకోవాలి. ఇది విజ్ఞానయుగం. మానవుడు పశువుకాదు. ఏ విషయాన్నైనా స్వంతంగా తన మెదడును ఉపయోగించి పరిశీలించి, తూచి సత్యం తేల్చుకోవాలి. మరి కవి అన్నట్టు, ప్రాక్పశ్చిమాలు రెండూ ఒకే ఒక హృదయం యొక్క రెండు స్పందాలయిపోయినప్పుడు మానవులందరూ ఒకే ఒక ప్రేమ పాశంతో కట్టబడి, ఒకే ఒక విశ్వ విశాల సంసారంలో ఇమిడి శాంతంగా సుఖంగా బ్రతకాలి ! భగవంతుడికి రెండు కళ్లున్నాయి అంటాయి పురాణాలు ? సూర్యుడూ, చంద్రుడూ, మానవునకూ ఉన్నవాడికి, రెండు కళ్లే – బుద్ధీ, హృదయం (reason, love). ఈ రెంటిలో దేనికి లోపం వచ్చినా నవ మానవుడు ఈ జగత్తులో మనలేడన్నది వీరేశలింగం సందేశం. ఆయనది మానవతా ధర్మం !

మెథోడిస్ట్ (Methodist) మత ప్రచారకుడైన John Wesley ని గూర్చి ఒక కథ ఉంది. ఆయనకు ఒకసారి ఒక vision –ఒక సాక్షాత్కారం కలిగింది Wesley స్వర్గద్వారం దగ్గర ప్రవేశం కోసం నిలబడ్డాడు. "నీవెవరవు?" అని ద్వారపాలకుడు ప్రశ్నించాడు." "I am a Wesleyan – నేను వెస్లీ ధర్మ సంప్రదాయానికి చెందిన వాణ్ణి" అని జవాబిచ్చాడు.

"మేము వాళ్లెవారో వినలేదు" అన్నాడు ద్వారపాలకుడు. "పోని ఇక్కడ ప్రొటెస్టేంట్ మతం వాళ్లు ఉన్నారా?" అని ప్రశ్నించాడు వెస్లీ. మళ్లీ "ఊహు" అన్నాడు ద్వారపాలకుడు "క్రైస్తవులు?" "ఒక్కరూ లేరు!" "మరెవ్వరున్నారు?" విశ్వాసులు –believers" అన్నాడు ద్వారపాలకుడు.

స్వర్గద్వారం అంటూ ఉంటే అక్కడ ఓ ద్వార పాలకుడంటూ ఉంటే, మొదట నే "మానవుణ్ణి" అని చెప్పి వీరేశలింగం నమ్మకంగా లోపలికి వెళ్లిపోయి ఉంటాడు.



"భారతేర్ మహామానవేర్ సాగర తీరే" అంటాడు, కవిరాజరాజు రవీంద్రుడు. మానవ మహాసాగరం అంటాడు: ఎంత నిజం ఈమాట!....

సుఖాలూ, దుఃఖాలు, మహాకల్లోలాలూ, ఆందోళనలూ, ఆలింగనాలూ, అలజడులూ, ప్రళయ యుద్ధాలూ,మారణ హోమాలూ, పండుగలూ, పబ్బాలూ, వేడుకలూ, ఆశలూ, ఆనందాలూ– వీటితో ఈ మానవ మహాసాగర మధ్యాన నవయుగారంభ వేళ నిలబడిన నవమానవుడు Universal Man తెలుగునాట వీరేశలింగం.

అలాగ నిలబడి ఇలాగ అన్నట్లు నాకు తోస్తుంది:

"ఓ మానవుడా! నవ మానవుడా! నీది –అంటే నీ బదులు, నాది ధర్మసమరం సుమా! నీవు సాధించే విజయం సామాన్యమైంది కాదు. నిన్ను నీచపరచేది కాదు ఈవిజయం. దాని వల్ల లభించే ప్రభావం నీ హస్తాల్లోనే గుప్తపరుచుకోలేవు. నీది ధర్మ సమరమయితే నీ అస్త్రాలు కూడా ధర్మ యోధునికి ఉచిమైనవే! నీకు ఆగ్రహం పనికిరాదు. ద్వేషం పనికిరాదు. నైచ్యం, అల్పత్వం, అసత్యం, పిరికితనం నీ దగ్గరకు రానివ్వకూడదు. ఉషస్సులో తొంగిచూసే ఆశ నీది. ప్రభాతంలో భాసించే విశ్వాసం నీది.

కనుక, ముందు ముందు ఆశకు కూడా అతీతమైన కష్టాలను పడడం, రాతిరికన్నా, మృత్యువు కన్నా నల్లనైన అవమానాలను క్షమించడం, ఎదిరించడానికి కూడా వీలు లేనట్లు కనబడే శక్తుల్నీ తృణీకరించడం, ప్రేమించడం, ఓర్మితో సహించడం, శైథిల్యం నుండీ, జరనుండీ నవ జీవనాన్ని సృజించుకోవడం చలించకపోవడం నీమార్గం నుండి తప్పుకొనకపోవడం, నీరస పశ్చాత్తాపంతో క్రుంగకపోవడం.

ఇవన్నీ, అన్నీ నాలాగే నీవూ జ్ఞాపకం ఉంచుకోవాలి సుమా!" అని వీరేశలింగాన్ని "దేవత" అన్నాడు రామలింగారెడ్డి.

ఆ మహా మానవసాగర తీరాన నేను ఒకసారి నిలబడి ఆ "దేవత"కూ, నరదేవతల కందరకూ నమస్కరిస్తున్నాను.

(1971 జూలై – 'ఆంధ్రప్రదేశ్' – వీరేశలింగం జన్మదిన సంస్మరణ సంచిక నుంచి)

❖

ఆరు పుష్కరాల నా అనుభవాలు



నా వయస్సిప్పుడు 79 సంవత్సరాలు. నేనింత వరకు 6 పుష్కరాలు చూసాను. 72 పుష్కర దినాల్లో పవిత్ర స్నానాలు చేశాను. అదొక దివ్యానుభూతి. 4 పుష్కరాలలో కమిటీల్లో సభ్యునిగా ఉన్నాను. రాజమహేంద్రిలో గోదావరి నదీ తీరంలోనే మా ఇల్లు ఉండడం వల్ల పుష్కర ప్రభావం నా మీద ఎక్కువగా ఉంది. రాజమహేంద్రిలో అత్యంత ప్రాచీనమైన కుటుంబం మాది. 1703 నుండి మా యాతగిరి కుటుంబం ఇదే స్థలంలో ఉన్నది. నాది ఎనిమిదో తరం.

భారతదేశంలో అతి ప్రాచీ–నమైన నది గోదావరి. ఈ విషయం, హిందూ ప్రాచీన వాఙ్మయంలో కనబడుతుందని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఇరిగేషన్ ఇంజనీరు డా!! కె.ఎల్ రావు తమ స్వీయ చరిత్రలో పేర్కొన్నారు. అందువల్లనే గంగాజలాన్ని తీసుకోని వచ్చి గోదావరిలో కలుపుతారు. దాని పేరు గంగ పూజ. గంగానదికి గోదావరి అక్క గారు కదా! నేను రెండు పర్యాయాలు గంగపూజను చేసాను. ఆ సమయంలో – అక్కా చెల్లెళ్ళ సమాగమంలో నీరు ఉప్పొంగుతుంది. కొన్ని వేల సంవత్సరాల నుండి గోదావరి తీరంలో రాజమహేంద్రి పట్టణం ఉంది. క్రీ.పూ 2 వ శతాబ్దం నాటి బౌద్ధ స్థూపం తాలూకు చిన్న గోడ

గోదావరి తీరంలో 1979 లో జరిపిన పురావస్తు తవ్వకాలలో బయట పడింది. నదీ తీరంలోనే నాగరికత పరిఢవిల్లుతుందిగా. మహారాష్ట్రంలో జన్మించిన గోదావరి ఆంధ్రలోనే పేరు తెచ్చుకుంది. గోదావరి జన్మస్థానమైన నాసికాత్రయంబకం నుండి ప్రతిష్ఠానపురం, బాసర, స్వర్ణపురి, ధర్మపురి, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించాను. గోదావరిలో ప్రాణహిత, కిన్నెరసాని, శబరి వంటి 7 ఉపనదులు వివిధ స్థలాల్లో కలిసాయి. తీర్థరాజము, క్షేత్రరాజం అయినా రాజమహేంద్రిలో అఖండ గోదావరి అయింది. కొవ్వూరు - రాజమహేంద్రి మధ్య సుమారు 5 కిలోమీటర్ల మేర నది వ్యాపించి ఉంది. ధవళేశ్వరం దిగువలో 7 పాయలను సప్తర్షులు సముద్రంలో వివిధ స్థలాల్లో కలిపారు. అదే సప్తసాగర యాత్ర. ఆ యాత్రను నేను చేసాను.

1979 పుష్కరాలలో 14 మంది జర్మను శాస్త్రవేత్తలు ఇక్కడకు వచ్చి, గోదావరి నీటిని వివిధ స్థలాలలో సేకరించి, పరీక్షలు జరిపారు. పుష్కరాల ముందు రోజున మొదటి రోజున ఆఖరి రోజున, ఆ సంవత్సరం మధ్యలోను, చివరలో వచ్చే అంత్య పుష్కరాల్లోను, పుష్కరాల అనంతరం కూడా శ్యాంపిల్స్ తీసుకున్నారు. పుష్కర కమిటీ సభ్యునిగా ఆ బోటులో నేను కూడా ఉన్నాను. వారు తేల్చిన అంశమేమంటే, పుష్కర సమయంలో గోదావరి నదికి జీవశక్తి హెచ్చుగా ఉంటుందని ఆ సమయంలో మనం నదిలో స్నానం చేస్తే మనకు కూడా జీవశక్తి ఒనగూరుతుంది. నాస్తికవాదైనా హేతువాదైనా, ఆస్తిక వాదైనా ఈ అదనపు శక్తిని కోరుకుంటాడు గదా! కనుక మానవులందరూ పుష్కరాలలో గోదావరి స్నానం చేయటం ఆరోగ్య లక్షణం, ఆ 12 రోజులూ నదిలో స్నానం చేయడం మంచిది.

కనీసం 12 సంవత్సరాలకొక పర్యాయమైనా పెద్దలను స్మరించుకోవాలనే గొప్ప కృతజ్ఞతా లక్షణాన్ని మనకి పెద్దలు నేర్పారు. దివంగతులైన మాతాపితరులను, బంధువర్గాన్ని, గురువర్గాన్ని, స్నేహితులను పిండ ప్రదానం చేయడం పుష్కర కాలంలో జరుగుతూంటుంది. ఇలా చేసే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం ప్రజలలో భక్తి భావం పెరుగుతోంది. ప్రింటు మీడియా, విజువల్ మీడియా, ప్రభావం ఎక్కువగా ఉంది, రవాణా సౌకర్యాలు విశేషంగా పెరిగాయి.



యాతగిరి శ్రీరామ నరసింహారావు

2003 పుష్కరాల్లో 2 కోట్ల మంది భక్తులు వచ్చారంటే, ఈ పుష్కరాలకు కనీసం 3 కోట్ల మందైనా వచ్చే అవకాశాలు హెచ్చుగా ఉన్నాయి.

నేను చూసిన మొదటి పుష్కరం 1944 మేలో. అప్పుడు నా వయస్సు 8 సంవత్సరాలు. ఆ 12 రోజుల్లోనూ ఇల్లంతా బంధువులతో కళకళలాడుతుండేది. పుష్కరానికోసారి మాత్రమే ఎక్కువమంది వచ్చేవారు. గోదావరి స్నానం మా లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకోవడం, భోజనానంతరం ఎగ్జిబిషన్ చూడడం ఇది నిత్యకృత్యం. ప్రతీదీ ఆశ్చర్యకరంగానే ఉండేది. అంత ఎక్కువ మంది ఒకేసారి గోదావరిలో స్నానం చేస్తుంటే చాల సంతోషంగా ఉండేది. నదీ తీరవాసులకు ఈ సంతోషం చెప్పనలవికాదు. 1956 మేలో వచ్చిన పుష్కరాల సమయానికి నేను కళాశాల విద్యార్థిని. సహజంగా అవగాహన హెచ్చుగానే ఉంటుందిగా, అప్పుడే నాగులచెర్వును పూడ్చించి, స్టేడియమును ఏర్పాటు చేయించారు నాటి మున్సిపల్ చైర్మన్ శ్రీ పోతుల వీరభద్రరావు. అక్కడే పుష్కరాల ఎగ్జిబిషన్ ఏర్పాటయింది. ప్రజలు తొలిసారి టెలివిజన్ ను చూసారు. ఆ వింతను చూడడానికి జనం తండోపతండాలుగా వచ్చేవారు. మా కుటుంబ సభ్యులంతా ఆ 12 రోజులూ టి.వి ని చూసాం. ఆ సంవత్సరమే నా బొంబాయి మేనల్లుడు నీలాద్రిరావు పుట్టాడు. 1967 పుష్కరాల సంవత్సరంలో నా రెండో కుమార్తె జన్మించింది. పుష్కరాలను కొండగుర్తుగా పెట్టుకునేవారు. ఈ అలవాటు చుట్టుప్రక్కల గ్రామాల్లో ఎక్కువగా ఉండేది.

నాకు లభించిన సమాచారంలో 1937 జూన్‌లో వచ్చిన గోదావరి పుష్కరాలలో శ్రీ వెన్నలకంటి సుబ్బారావు రాజమహేంద్రి దర్శనం. ఆంగ్లంలో స్వీయ చరిత్ర రాసిన తొలి ఆంధ్రుడు. ఆయన ఈస్టిండియా కంపెనీ పరిపాలనలో కోర్టులో ట్రాన్సిలేటరు. 1848 పుష్కరాల సంవత్సరంలో సంఘసంస్కర్త శ్రీ కందుల వీరేశలింగం పంతులు గారు జన్మించిరి. చిన్నతనంలో ప్రతీరోజూ గోదావరిలో అర్థగంట సేపు జపం చేసుకుని వేణుగోపాల స్వామి, మార్కండేయేశ్వరస్వామి ఆలయాలను సందర్శించే వాడనని తమ స్వీయ చరిత్రలో రాసుకున్నారు. గోదావరి తీరంలోనే నివసించిన పంతులు గారు ఏనాడూ పుష్కరాస్నానం చేసినట్లు తమ స్వీయా చరిత్రలో రాసుకోలేదు. అలాగే శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు ఏ పుష్కరాలలోనూ గోదావరిలో పుష్కరస్నానం చేయలేదని, తీర్థ విధులు నిర్వర్తించలేదని తమ స్వీయ చరిత్రలో రాసుకున్నారు. "1908వ సంవత్సరమున కీలక సంవత్సరము గోదావరి పుష్కరము. నానా దేశముల నుండి యాత్రీకులు వచ్చిరి. గవర్నమెంటు వారు వచ్చిన ప్రజల సౌకర్యార్థము కోటి లింగాల వద్ద పాకలు వేయించిరి, శ్రీ కంచుమర్తి రామచంద్ర రావు గారును, మున్సిపల్ సంఘాధ్యక్షుడైన గంటి వేంకట రామయ్యగారును ప్రజల కొరకై పాటుబడిరి. గంటి వేంకట రామయ్యగారికి దొరతనము వారు రావు సాహెబ్ బిరుదనిచ్చిరి" అని రాసుకున్నారు చిలకమర్తి వారు. "1884వ సంవత్సరము గోదావరి పుష్కరము ఉత్కల (ఒడిస్సా) దేశం నుండియూ నిజాము రాజ్యము నుండియూ వేనవేలు యాత్రీకులు వచ్చిరి" అని కూడా రాసుకున్నారు. అంత్య పుష్కరాలలో జయపురం మహరాజు విక్రమ దేవ వర్మగారు రాజమహేంద్రి వచ్చిన వెంటనే ఆ రాత్రే సందులో నున్న చిలకమర్తి వారిని దర్శించుట ఎంత సంస్కారము.

– యాతగిరి శ్రీరామ నరసింహారావు

ఇచట పుట్టిన చివురు కొమ్మైన చేవ...

గోదావరి మండల సారతర సాహిత్య సంస్కృతి



జల ప్రాధాన్యాన్ని వేదం ఎంతగానో చెప్పింది. నాగరికత దేహధర్మమనీ, సంస్కృతి మానవుని ఆత్మధర్మమనీ వేత్తలు చెప్పారు. నాగరికత బాహ్యజీవితానికి చెందినదనీ, సంస్కృతి ఆంతరంగిక జీవితానికి చెందనదనీ చెప్పారు. వస్తు సంబంధం వుంటూన్నా సాహిత్యం మేధకు, హృదయానికీ సంబంధించై వివిధ ప్రక్రియల పాత్రల్ని వహించింది. జానపద సాహిత్యం సెలయేరులై మిన్నేరులై మున్నీరులై ప్రవహించింది. మార్గ సాహిత్య దేశికుడు ఆదికార్యకార్య నన్నయ్య. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నన్నయ జన్మస్థానమంటారు. "నన్నయ పుట్టినాడు యజనంబొనరించిన యట్టి జమ్మి చెట్టున్నది తణ్కు నందు" పద్యం కూడా వుంది.

నన్నయభట్టారకులు ఆంధ్ర మహాభారతంలో ఆదిసభాపర్వాల్ని అరణ్య పర్వంలో 144వ పద్యం వరకు పద్య సౌందర్యం, కథా కలితార్థ యుక్తి ఉట్టిపడేలా వ్రాశారు. కొన్ని శతాబ్దాలు దాటినా నన్నయ్యలా పద్య కవిత్వాన్ని నడిపించలేమన్న భావం ఏర్పడిందంటేనే ఆయన వన్నెచెడని కవి అనేది తెలిసింది. కమ్మని లతాంతమ్ముకున్ మొనసి వచ్చు మధుపమ్ముల...కిసలయమ్ముల – ఇలా ఇలా పాటలా సాగే శాబ్దిక, ఉక్తి మాధుర్యాల శక్తి నన్నయకుందని, అనువాదాన్ని ఆంధ్రసా హిత్యాత్మను ప్రతిబింబిస్తూ వ్రాయడం గొప్ప అంశం.

నారాయణభట్టు భారత రచనా సముద్రం ఈదడంలో నన్నయ్యకు సహాయక శక్తి పండితుడు.

తిరుపతి వేంకటేశ్వరకవులు అవధాన విద్యా దురంధరులై నానారాజ సందర్శనాలు చేశారు. చలనాత్మక పాత్ర పోషించారు. ఆంధ్ర కవితా కళైక నాళావలంబి ఫలయుగంబైన తిర్పతీశ్వరుల నుండి కదలి పొంగిన అవధాన కవనమధువు అష్టధాశతధా ప్రవాహముగ మారె(మధునా పంతుల) వారి అష్టావధాన శతావధాన సాహిత్య యాత్రలు సమాజంలో సామాన్యులలో సైతం సాహిత్యాభిమానం పెంచింది.

పావులూరి మల్లన ఆది శాస్త్రీయ కవి అంటే మొదటి సైన్సు కవి. గణిత శాస్త్రాన్ని పద్యాల్లో వెలయించినవాడు "ఖర్జూరఫలములు గణికుండు కొని తెచ్చి "వంటి పద్యాలు ఆమధ్య దాకా పెద్దల నోళ్ళల్లో ఉండినవే.

వేములవాడ భీమకవి శాపాలు పెట్టగలిగిన కవి. సూటిమాటల ప్రవాహ పద్యాలు చెప్పిన నిరంకుశ కవి.

చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆనాడే లక్ష ప్రతులమ్ముడైన నాటకం గయోపాఖ్యాన కర్త. మరెన్నో నాటకాలు రాశారు. సంగ్రహ రామాయణాన్ని వ్రాశారు. కృపాంభోనిధి శతకకర్త.

శ్రీనాథమహాకవి చూసినవన్నీ పద్యాల్లో నిబంధించడం వల్ల చరిత్యాంశాలకు చాలా దోహదం చేసిన మహాకవి. శృంగార నైషధం, భీమేశ్వరపురాణం, మరుత్తరాట్చరిత్ర వంటి ఎన్నో గ్రంథాలకు కర్త. కనకాభిషేకం పొందిన కవీ, జీవితంలో నిమ్నోన్నతాల్ని అన్నింటినీ చూచిన కవి. కవి సార్వభౌమ బిరుదాంకితుడు.

రామకృష్ణకవులు గీరతం వంటి గ్రంథాలు వ్రాశారు. అవధానాలు శ్లాఘనీయంగా చేశారు.

వేంకటపార్వతీశ్వర కవులు 'కావ్య కుసుమావళి' గుబాళింపులు వారివే! అనువాదగ్రంథాల్ని వ్రాసి ఆశ్చర్యపరిచారు. సహజసిద్ధ కవితా ప్రసిద్ధులు.

కందుకూరి వీరేశలింగం నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త. కొన్ని ఆది రచనలచే ఆరాధ్యుడు, ఆంధ్ర కవుల చరిత్ర రచనీదీక్షుతుడు. మూఢాచార వ్యతిరేక సమరోద్యమశీలి.

వావిలాలవాసుదేవశాస్త్రి ప్రథమ పద్య నాటకం 'నందకరాజ్యం' వ్రాసిన కవి. తేటగీతిలో ఒక పాదంగా ఈయన పేరు కుదురుతుంది. ఎక్కడ ఏ పుస్తకం కొని ఏ గ్రంథాలయానికిచ్చినా దాని అట్టపై ఎక్కడో అక్కడ ఆ విషయాన్ని గీత పద్యంలో వ్రాసే అలవాటున్నకవి.

భమిడిపాటి కామేశ్వరరావు హాస్యబ్రహ్మ, మేజువాణి, ?, తగాదా, బాగు బాగు, ఎప్పుడూ ఇంతే పుస్తకాలు ఆయన హాస్యకీర్తిపతాకలు. సీరియస్ ముఖంతో అందర్నీ కడుపుబ్బ నవ్వించిన లెక్కల మాస్టారు. కవి జయంతుల కార్యకర్త.

కొక్కొండ వేంకటరత్నం గ్రాంథిక వాది, వీరేశలింగ సమకాలికులు, అంతర్జాతీయంగా – తెలుగుకు దేశవ్యాప్త పోటీలో నెగ్గుకొచ్చిన రచన చేసినవాడు. బహుగ్రంథకర్త.

వద్దాది సుబ్బారాయుడు 'భక్త చింతామణి' శతకకర్త. ఈయన కాలంలో ఏసాహిత్య సభ జరిపినా ప్రార్థనగా ఈయన శతకంలో పద్యాన్నాయినా పాడేవారని చెబుతూండేవారు.

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి మదరాసు ప్రభుత్వ ఆంధ్రాస్థాన కవి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి అయితే ఆంధ్ర ప్రదేశ్ ప్రథమ ఆస్థాన కవి వీరు. సంఖ్యానేక పద్యాలు తెలుగులో ఈయన వ్రాసినన్ని మరేకవీ వ్రాయలేదు.

పానుగంటి లక్ష్మీనరసింహారావు గ్రాంధిక భాషలో, జీవద్గ్రాంధిక భాషలో 'సాక్షి' సంపుటాలను అనితరసాధ్య వ్యంగ్యరచనా ప్రదర్శనంతో సమాజానికి కళ్ళు తెరిపించే అంశాలతో అందించిన మహారచయిత.

శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి తెలుగు ప్రజల ఆత్మగౌరవపతాక అనతగ్గవ్యక్తి. కలాభివర్ధనీపరిషత్ స్థాపకులు. ప్రబుద్ధాంధ్రపత్రికా సంపాదకులు. అసలుసిసలు తెలుగులో ప్రపంచ వాఙ్మయంలో చేర్చతగిన తెలుగు కథల సృష్టికర్త. వాడుకభాషా ప్రచారకుడు.

దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి భావకవిత్వ యుగకవి. 'కృష్ణపక్షం' వంటి ఖండ కావ్యాలకర్త. కవులకు ఆహార్యం విషయంలో సైతం మార్గదర్శి.

భమిడిపాటి రాధాకృష్ణ భమిడిపాటి కామేశ్వరరావు కుమారుడు. సినిమా రచయిత.

వేదుల సత్యనారాయణ శాస్త్రి భావకవి దీపావళి వీరి అగ్రగణ్యకవిత్వ గ్రంథం.

నేదునూరి గంగాధరం ఆంధ్రదేశంలోని ముఖ్య జానపద వాఙ్మయోద్ధారకులలో ముఖ్యులు. మానవల్లి కవి శిష్యుడు. సెలయేరు, మిన్నేరు, మున్నీరు, జానపదగేయ వాఙ్మయ వ్యాసావళి, పసిడిపలుకుల వంటి గ్రంథాలకు కర్త.

మల్లంపల్లి శరభయ్యశర్మ కాటూరి వేంకటేశ్వరరావు శిష్యులు. సర్వ రామాయణ కల్పవృక్ష కావ్యం హృదయస్థంగా గల వ్యక్తి.

పురాణపండ రామమూర్తి ఆధ్యాత్మిక ఉపన్యాసాలతో దేశాన్ని ఊర్రూతలూగించిన వ్యక్తి! ఆధ్యాత్మక ప్రచారక సంఘం' సంస్థాపకులు. ఉషశ్రీ తండ్రి.

నాళం కృష్ణరావు మాగడతరకలు, పాపాయివంటి బాల సాహిత్య మనోహర పద్యఖండకల గ్రంథాలకు కర్త. గౌతమి













గ్రంథాలయము స్థాపకాలు.

కొత్తపల్లి సుందరయ్య లక్కవర ఆస్థాన కవి. 'గరుడ గర్వభంగం' 'రామదాసు వంటి గ్రంథాలు వ్రాసారు.

వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి శంకరవిజయం కావ్యకర్త. విద్వత్కవి. మను చరిత్ర వంటి గ్రంథాలకు ముందుమాట వ్రాసిన వ్యక్తి

పదాల రామారావు ఆంధ్ర శ్రీ గ్రంథమాల ద్వారా అల్లూరి సీతారామరాజు తెలుగు వారికి ఎక్కువ ప్రచారం చేసినవారు. అల్లూరిపై వారి ఆంధ్ర శ్రీ, 1857, వంటి వెన్నో గ్రంథాలు ప్రసిద్ధి తెచ్చిపెట్టాయి. గడపగడపకు పదాల రచనలు వెళ్ళిన ఓ కాలం ఉంది.

మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 'ఆంధ్ర రచయితలు' పేరుతో రచయితల చరిత్రను ఆంతరంగక విశ్లేషణ విమర్శలతో అపూర్వంగా వ్రాసిన కవి చరిత్రకారుడు. కంకాళముల వంటి చారిత్రకాంశములకు కమనీయరూపంగా 'ఆంధ్రపురాణం' చారిత్రక మహాకావ్యాన్ని సర్వాంధ్ర ప్రాంత ప్రధాన చారిత్రక ఘట్టాలతో వ్రాసి జన్మను చరితార్థం చేసుకున్న మహనీయుడు.

కొవ్వలి లక్ష్మీ నరసింహారావు ప్రతి ఇంటికీ చేరిన ప్రజావాఙ్మయం రచయితల్లో కొవ్వలి అగ్రగణ్యులు. సునాయాసంగా వెయ్యి నవలలు వ్రాసి అధిక సంఖ్యలో రచనలు చేసి అందించారు.

మధిర సుబ్బన్న దీక్షితులు వేలకొలదీ ప్రజలచే ఆరాధింపబడిన 'కాశీమజిలీల 'గ్రంథకర్త. 'కాశీమజిలీలు అనే పేరుతో ఓ భవనమే రాజమండ్రిలో వుండేది. పుర సాంస్కృతిక పరులు రక్షించుకోలేకపోయారు.

పెండ్యాల వెంకట సుబ్రమణ్య శాస్త్రి మహాభారత రహస్య విమర్శనం వంటి నిశిత పరిశీలనా గ్రంథాలు వ్రాసినవారు. పండిత పండితుడు, విమర్శక విమర్శకుడు.

బొమ్మకంటి వెంకట సుబ్రమణ్య శాస్త్రీ కథ, వ్యాసం, నాటిక, నాటకం, బుర్రకథ, పౌరణిక రచనలు, వచన కవిత్వం, పద్యకవిత్వం వంటి అన్ని ప్రక్రియల్లో రచనలు చేసిన వ్యక్తి.

పురాణ పండ సూర్య ప్రకాశ దీక్షతులు ఇది రేడియో ఉషశ్రీ గారి అసలుపేరు. ఆర్ష గ్రంధ్రాలు వ్రాసి ఆయాఘట్టాలను కళ్ళకు కట్టునట్లు రాసిన ప్రతిభా పాండిత్య రచయిత.

ఆవంత్స సోమసుందర్ కళాకేళీనికేతన్

స్థాపకులు. "కళాకేళీ" అనే ఆధునిక సాహిత్య పత్రికను ప్రయోజనకరంగా నడిపిన పత్రికా సంపాదకులు. వజ్రాయుధం వీరి విశిష్ట కావ్యం.

యరసూరి మల్లికార్జునరావు కళాపూర్ణోదయాన్ని సంస్కృతీకరించిన పండిత రచయిత.

ఇస్మాయిల్ చిలుకలు వాలిన చెట్టు వంటి వచన కవితా సంపుటులు వెలయించారు. వచనా కవిత్వంలో ఆధునిక భావప్రకటన చేయడం, ఎంతవరకూ చెప్పాలో అంతవరకే చెప్పడం వీరి ప్రత్యేకత. 'చెట్టు ఇస్మాయిల్' గా ప్రసిద్ధులు.

బులుసు వెంకటరమణ మూర్తి విశ్వనాథ, గుంటూరు శేషేంద్ర శర్మల వంటి వారిచే మెచ్చుకోబడిన అష్టావధాని, 'శబరి" వంటి కావ్యాలకు కర్త.

'స్మైల్' 'ఖాళీసీసాలు' రచయిత. పొదుపుగా రచనలు చేసిన వ్యక్తి, కవి సాహితీ వేత్తలతో జీవితాన్ని పండించుకున్న వ్యక్తి. సాహితి వేత్తలకు ఒక ఆత్మీయ ఆరాధ్య కేంద్రం.

పురాణపండ రాధాకృష్ణమూర్తి 'మహారధికర్ణ', 'భీష్మ పితామహ' వంటి వీరి గ్రంథలకు మంచి ప్రాచుర్యం వచ్చింది.

మల్లవరపు విశ్వేశ్వరరావు శ్రీశ్రీ స్నేహితుడు. ఉగాదులూ ఉత్సవాలు వంటివి వ్రాశారు.

కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ వెలుతురు పిట్టల కవిగా ప్రఖ్యాతులు. అక్షరంలో అంతరిక్షం, వామనవిశ్వం వంటి విశిష్ట వచన కవిత సంపుటుల కర్త.

చల్లా రాధాకృష్ణమూర్తి 'లిల్లీస్ ఇన్ ది లేక్' వంటి ఆంగ్ల కవిత సంపుటి వ్రాశారు. కె.ఆర్ శ్రీనివాస అయ్యంగార్ వంటి వారిచే ప్రశంస పొందారు.

వాజపేయాజుల రామ సుబ్బారాయుడు కొవ్వూరుకు చెందిన వీరు 'ప్రసన్న భారతం' కర్త. పాళీభాష తెలిసిన వారు.


దేవరకొండ బాలగంగాధర తిలక్ నన్నయ్యగారి తణుకు నుండి ఉద్భవించిన గొప్ప ఆధునిక కవి. 'అమృతం కురిసిన రాత్రి' చదివి తలూపని రసజ్ఞులు ఉండరు. కథారచయిత, కవిత్వజీవి.


చిలుకూరి రామభద్ర శాస్త్రి 'రాజమహేంద్రవరం'నవలా రచయిత అష్టావధాని. 'వంచనాఫలం' అని సంస్కృతంలో ప్రహసనం వ్రాసిన విజ్ఞానగోష్ఠి సంస్థ స్థాపకులు.

చాగంటి గోపాలకృష్ణ మూర్తి 'హేమమాల' కావ్యం. మనుచరిత్ర స్థాయి లో రసవంతంగా వ్రాసిన కవి.













చెరుకుపల్లి జమదగ్నిశర్మ భారతి వంటి పత్రికల్లో మంచి కథలు వ్రాసిన వ్యక్తి, 'మహ్హృదయం' పేరు ఒక మనోహర కావ్యం వ్రాసి విశ్వనాథ వారికి అంకితమిచ్చారు.

సంపత్ రాఘవాచారి తెలుగు సామెతల్ని సహజ సిద్ధంగా పద్య బద్దంచేసిన వీరి 'విశ్వనాథ నాయకుడు' గొప్ప కావ్యం.

క్రొవ్విడి లింగరాజు ప్రముఖ స్వాతంత్ర్యయోధుడే కాక వేదిక పత్రిక సంపాదకుడు. 'అమ్మ' నవలను తెలిగించి రష్యా ప్రభుత్వ పురస్కారాన్ని పొందారు.

తులసి గంగాధర రామారావు దేశభక్తుడు మద్దూరి అన్నపూర్ణయ్య శిష్యులు. 'స్వాతంత్ర్య సమిధలు' గ్రంథకర్త.

మొక్కపాటి నరసింహశాస్త్రి 'బారిస్టర్ పార్వతీశం' రచన ఆహ్లాదకర హాస్యరచన, సుప్రసిద్ధ గ్రంథమై జనసీవాఙ్మయంలోకి చేరింది. ఒక సామన్యుడు విదేశం వెళ్లి పడిన అగచాట్లను అతని అలవాట్లను ఈ పుస్తకం ప్రతిబింబించింది.

అద్దేపల్లి రామ్మోమోహన్ రావు ప్రసిద్ధకవి, విమ–ర్శకులు, యువకవి లోకాన్ని జాగృతం చేసే ఉత్తమ కవిత్వ ప్రచారకులు. శ్రీశ్రీ పై వీరి పరిశోధన గ్రంథం రాష్ట్ర మంతటా ప్రఖ్యాతి పొందింది.

దశిక సూర్య ప్రకాశరావు 'గాంధీయుగంలో పూచిన అడవిమల్లెలు' అనే ధారావాహిక ద్వారా 'ఆంధ్రప్రభ'లో మరుగున పడిన మహా స్వాతంత్ర్యయోధుల గురించి వ్రాశారు.

తాండాల దిబ్బరాజు మంచి పద్య కవి. ముఖ్యంగా 'సి.పి బ్రౌను జీవితం' పుస్తకం సరళ భాషలో శ్రమపడి వ్రాశారు.

సారవంతమైన పంటలు పండించే తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎందరో వివిధ ప్రక్రియల్లో ఎన్నో గ్రంథాలు వ్రాసి వుంటారు. వారందరిలో గణనీయులైన కొంతమందిని ఈ వ్యాసంలో పేర్కొనడం విశ్లేషించడం జరిగింది. వ్రాయబడని వారుంటే వ్యాస విస్తృతి అజ్ఞత వంటివి కారణాలుగా భావించగోరుతున్నాను. గోదావరీ మండలాల్లో సారతర సాహిత్య సంస్కృతిని తమ తమ రచనా సేద్యాలతో పండించిన కృషివలుల్ని స్మరించడం పవిత్ర పుష్కర సందర్భ సంస్కార కార్యం కదా!



సన్నిధానం నరసింహశర్మ

గోదావరి
మహా పుష్కరం 2015

జయ గాయక వైతాళిక గళవిశాల పథవిహరణ!



గోదావరి నది మీద ధవళేశ్వరం బ్రిడ్జి వృతాసురుడిలా ఒక కంటికి అనిపిస్తే, అడ్డంగా పడిఉన్న మురళిలా కనిపించింది ఓ కళాహృదయానికి. గొప్ప రచయిత చింతా దీక్షితుల గారిది మరో రకం అనుభవం– అక్కడే... గోదారి గట్టునే– ఆదికవి నన్నయ్యని చూసి, తాకి, మాట్లాడానంటారు చింతా దీక్షితులు గారు. అది అబద్ధమనడానికి లేదు. ఆ గోదారి తీరం ఎందరు మహామహులకి తల్లి అయ్యిందో, వారందరి స్ఫూర్తి ఒక చిరంతన సౌరభమై ఆ తీరాన్నే తారాడుతుంటుంది. పావన గౌతమి స్పర్శ సోకినంత మేర ఒక్కొక్క ప్రాంతం ఒక్కో విశిష్టతతో వెలిగిపోయింది. అమలాపురాన్ని కదిలిస్తే శాస్త్ర విద్యా పారీణత, కాకినాడలో దివ్యగాన పరితోషణం, పిఠాపురం పాండిత్య ప్రకర్ష, రాజమహేంద్రి ఆది కవితా వైదుష్యం! ఈ తల్లి ఒడిలో సేదతీరిన కొందరు దిగ్గంతులను మహాపుష్కరాల సందర్భంగా సంస్మరించడం సముచితం.

వేదపండితులు

ఉభయ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు వేదమయమై ఉంటాయి ఇప్పటికీ. ఆ పొలిమేరల్లో కూడా వేదఘోష మంద్రంగా మార్మోగుతుంటుంది. వేదాన్ని సాంస్కృతిక వారసత్వం చేసిన కొందరు ప్రముఖ వేదపండితులున్నారు. వారిలో వేదార్థ ప్రవచనము చేసిన బులుసు పాపయ్య శాస్త్రి , ఉప్పులూరి గణపతి శాస్త్రులు ముఖ్యులు. 'విసన్న చెప్పింది వేదం' అనే మాట ఇంద్రగంటి విశ్వనాథశాస్త్రి గారివల్ల ప్రచారంలోకొచ్చింది. బులుసు అచ్చయ్య, వెంకప్ప సోమయాజులు గారలు కూడా ప్రఖ్యాత వేదపండితులు.

శాస్త్రపండితులు

శాస్త్ర పండితులు ఉభయగోదావరిజిల్లాల్లో పలువురున్నారు. వారిలో శ్రీ యుతులు పండిత జగన్నాథరాయలు, చిలుకూరి పండిత చతుష్టయము, బొమ్మకంటి షల్కుము , శొంఠి భద్రాద్రి రామశాస్త్రి, పురాణపండ మల్లయ్య శాస్త్రి, జయంతి భగీరథ శాస్త్రి, కానుకుర్తి భుజంగ రావు, మధునాపంతుల సూరయ్య, ప్రతివాది భయంకర రాఘవాచార్యులు, పుల్య దక్షిణామూర్తి శాస్త్రి, చర్ల బ్రహ్మయ్య శాస్త్రి, కల్లూరి వెంకట రామశాస్త్రి, మల్లాది సూర్యనారాయణశాస్త్రి, ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రి, మండవీక వెంకట శాస్త్రి, ఆకొండి వేంకట శాస్త్రి, వేదుల రామశాస్త్రి, చర్ల నారాయణశాస్త్రి, జటావల్లభుల పురుషోత్తము, దువ్వూరి వెంకటరమణశాస్త్రి, మహేంద్రవాడ సుబ్బరాయశాస్త్రి, కె.వి. ఎస్. అప్పారావు, వారణాసి సుబ్రమణ్యాశాస్త్రి మొదలైన వారు ఎందరికో గోదావరి స్వస్థలం.

గాన కళాకోవిదులు

దేశ విదేశాలలో అఖండ ఖ్యాతి నార్జించిన గాన కళా కోవిదులు గోదావరి జిల్లాలలో జన్మించడం విశేషం. అందులో ముఖ్యంగా త్యాగరాజ స్వామి వారి శిష్యపరంపరలో అయిదో తరం గానకళానిధి మంగళంపల్లి బాల మురళీకృష్ణ తూర్పుగోదావరి జిల్లాలోని శంకరగుప్తంలో పుట్టారు. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు శ్రీ పారుపల్లి శ్రీరామకృష్ణయ్య గారి వద్ద సంగీతం అభ్యసించారు. బాలమురళీ కృష్ణగారు ఆరు సంవత్సరాల పసివయసులో సంగీత కచేరి చేశారు. వీరు వాగ్గేయకారులు, నూతనమైన రాగాల్ని సృష్టించి స్వయం ప్రతిభను చాటుకున్నారు. వేల కొలదీ సంగీత కచేరీలు నిర్వహించారు. మరొకరు ప్రఖ్యాత సంగీత విద్వాంసులలో తమురాడ సంగమేశ్వరశాస్త్రి గారొకరు. వీరు పిఠాపురం ఆస్థాన విద్వాంసులు. అనేకమంది యువకులను సంగీతంలో ప్రవీణులను చేశారు. వీణావాదనలో అఖండ ఖ్యాతి నార్జించిన విద్వాంసులు. దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా సభలు జరిపి శ్రోతలను రసాంబుధిలో ఓలలాడించారు. గాత్రంలో ప్రఖ్యాతి పొందిన గాయకులు శ్రీ మహేంద్ర బాపన్న శాస్త్రి గారు. వయోలిన్‌లో పేరుపొందిన విద్వాంసులు శ్రీ మహేంద్ర వాడ కామేశ్వరరావుగారు. ఎం. ఎస్ బాలసుబ్రమణ్యశర్మగారొక ప్రఖ్యాత సంగీత విద్వాంసులు. కాకినాడ వాస్తవ్యులు మునుగంటి వెంకటేశ్వరరావుగారు ప్రఖ్యాత సంగీత విద్వాంసులు వారి కుమారులు శ్రీమునుగంటి రామమూర్తి గారు 50 సంవత్సరములనుండి "గానకళ" అను పత్రిక సంగీతాన్ని గురించి నడిపినారు. వారి మరణానంతరం వారి కుమారులు శ్రీమునుగంటి వెంకటేశ్వరరావు గారు నేడు ఆ పత్రిక నిర్వహిస్తున్నారు. మృదంగములో మేటి విద్వాంసులు శ్రీ పోలంక వెంకటరాజుగారు. మృదంగములోను, మోర్సింగ్ లోనూ ఖ్యాతినార్జించిన విద్వాంసులు. నందివాడ మల్లిఖార్జునరావుగారు సంగీత కార్యక్రమాలు నిర్వహించడానికి ఈ రెండు జిల్లాల్లోనూ పలుచోట్ల త్యాగరాయ గాన సభా మందిరాలు, సరస్వతి గాన సభా మందిరాలు వెలశాయి. రాజమహేంద్రవరంలో 50 సవంత్సరాలు పైబడి సంగీత కార్యక్రమాలు నిర్వహించిన మహామనిషి శ్రీ బుగ్గన పాపయ్య శాస్త్రి గారు నేడు ఆంధ్రప్రదేశ్‌లోని వందలకొలదీ సంగీత విద్వాంసులను విశేషంగా ధనాన్ని వెచ్చించి సన్మానించారనడంలో ఏ విధమయిన అతిశయోక్తి లేదు. భారతదేశంలోని కొంతమంది సంగీత విద్వాంసులను కూడా సన్మానించడం విశేషం. చివరిగా, గాన కళను ప్రోత్సహించిన రాజమండ్రి ప్రముఖులలో నార్ని కేదారేశ్వరుని గారిని , గ్రంది సుబ్రమణ్యం గారిని విధిగా పేర్కొనాలి.



రాపాక ఏకాంబరాచార్యులు



కల్పవృక్ష గోదావరి

నదులు, కొండలు ఉన్నంత వరకు రామాయణం నిలిచి ఉంటుంది. అటువంటి 'రామాయణం'లో అనేక నదుల ప్రస్తావన ఉంది. గోదావరి గురించి అరణ్యకాండములో ఉంది.

సీతారామలక్ష్మణులు వనవాస సమయాన పంచవటీ తీరంలో ఉన్నపుడు నిత్యం గోదావరీ స్నానం చేసేవారు. ఈ సందర్భాన, వాల్మీకి రామాయణములో గోదావరీ ప్రశంస చేయబడింది. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన 'రామాయణ కల్పవృక్షము'లో గోదావరి మరింతగా వర్ణింపబడింది.

గోదావరీ తీరాన వసించవల్సిందిగా అగస్త్యమహర్షి, రాముని నిర్దేశిస్తారు. 'పుణ్యో రమ్యస్తథైవ చ' అంటారు. పుణ్యము, రమ్యము అయిన గోదావరిని, 'కల్పవృక్షము'లో విశ్వనాథ వారు విస్తృతంగా వర్ణించారు.

సీ అడుగున గులకరాలై వారి సీలమండల లోతుగా జలజల స్రవించు

నొకచోట, నొకచోట నుజ్జ్వలాగాధవారి తరంగ భీకర శ్రీవహించు

వైడూర్యకాంతి ప్రవాహ శోభారమ్య సికతాస్థలంబులు చెన్నుమిగులు

నొకచోట, నొకచోట నాగిఁ దెల్ల చమరిలేళ్ళుల తోఁకలట్టి తెల్లుపువ్వు లొప్పు

గీ నెచ్చటెచట మీ యిష్టము వచ్చినన్ని

గిరి నికట భూములును సదా భరితశోభ

లద్ది గోదావరీ తీర మచటఁ బంచ

వటి యనంగనునొక్క శుభస్థలంబు

(రామాయణ కల్పవృక్షము – అరణ్య – దశవర్ష – 393)

'ఒక చోట సన్నని ప్రవాహం, ఒక చోట ఉద్ధతి కలిగిన ప్రవాహం, వైడూర్యముల కాంతి వంటి శోభతో తెల్లని తీరాల తెల్లుపూలతో ఉన్నటువంటి అందమైన గోదావరీ తీరం' అని అగస్త్యుని వాక్కుగా గోదావరి వర్ణించబడింది.

రామాయణములో ఇతర నదులకంటే గోదావరి ఒక ప్రత్యేక పాత్ర వహించింది. రావణుడి సీతాపహరణకి గోదారి ఒక ప్రత్యక్ష సాక్షి. 'వందే గోదావరీం నదీమ్' అని సీతాదేవి గోదావరికి నమస్కరిస్తుంది. 'క్షిప్రం రామాయ శంస త్వం, సీతాం హరతి రావణః' – 'రావణుడు సీతను అపహరించి పోతున్నాడని రామునికి చెప్పు'మని సీత, గోదావరిని ప్రార్థిస్తుంది.

ఈ సందర్భంలో 'కల్పవృక్షము', గోదావరిని ఒక గొప్ప ఉపమానంతో చూపిస్తుంది (వచనం)–

'అంతఁదన బిడ్డను దన్నికొని మింటఁబోవు గృధ్రమ్ము గుర్తుపెట్టికొని నేలమీఁద బర–ువెత్తు మహాభుజంగి వోలె గనిపించు గోదావరీనదిం గాంచి జానకి'

ఒక పిల్ల పామును తన్నుకొని గద్ద ఆకాశములో పోతుంటే దానిని అందుకోలేక పోయినా, నేలమీద తల్లిపాము పరుగెడుతూ ఉంటుంది. అలాంటి మహాభుజంగంలా ఉన్నదట గోదావరి!

ఆకాశం నుంచి చూస్తే నది కనబడే తీరు ఇక్కడ వర్ణించబడింది. ఇక్కడ కోపంతో శోకంతో భయంతో ఉంది గోదావరి. నది, భూ సంబంధమైనది. సీతాదేవి, భూమిపుత్రి కనుక, నదికి సీతయందు పుత్రికా భావం. అందుకని ఆకాశమార్గాన పోతున్న సీతను చూస్తూ నేలమీద ప్రవహిస్తుంది గోదావరి.

పుణ్యగోదావరికి ఇటువంటి స్థితిని కలుగజేసి, రావణుడు మరింతగా పాపాన్ని పొంది నశిస్తాడని అర్థం.

సీతాదేవి, గోదావరిని ఇలా స్తుతిస్తుంది (షట్పది)

బిందు బింద్వంతర

సందీపిత సుకృత

సందోహ విమల పాథో నిర్ఝర !

వందారు జనతాఘ

బృందని కృంతన

చ్ఛందోవతారాంబు గోదావరి

(అరణ్య – జటాయు – 107)

'ప్రతి బిందువులో పుణ్యములు దీపించు స్వచ్ఛ ప్రవాహము కలిగి, తనకు నమస్కరించు జనుల పాపములను పోగొట్టు నది, వేదమూర్తి గోదావరి!' అని భావం.

తరువాత, సీతాదేవి, గోదావరిని ఈ విధంగా ప్రార్థిస్తుంది. – (వచనం)

'రేపు ప్రొద్దున నన్నదమ్ములు స్నానార్థమ్ము వత్తురు. గుర్తుపట్టలేవేమో! అన్న కన్నులలో జలముండును. తమ్ముని కన్నులలో నగ్నియుండును. నా పోయినయది దక్షిణదిశయని చెప్పుము'

రాముడు దు:ఖంతో ఉంటాడు కనుక అతని కళ్లలో నీరు. లక్ష్మణుడు కోపాగ్నితో తన వదినగారిని అపహరించిన వానిపై మండిపడుతుంటాడు కనుక అతని కళ్లలో అగ్ని ఉంటాయి. రావణుడు, తనను దక్షిణదిశగా తీసికొని పోతున్నాడని వారికి చెప్పుమమ్మా అని సీతాదేవి, గోదావరిని వేడుకుంటుంది.

తరువాత జటాయువుకు, రాముడు, గోదావరి జలాలతో అంత్యక్రియలు చేస్తాడు. రామాయణంలో రాముడు కేవల మానుషమూర్తి. ఈ ఒక్క సందర్భంలో రాముడు నారాయణుడిగా గోచరిస్తాడు. 'పోవయ్యా! నేనై యనుజ్ఞ యిచ్చితిని దీప్తములకునుత్తమ నుత లోకములకు'– 'నీవు ఉత్తమ లోకాలకు పొమ్ము, నేను అనుజ్ఞ ఇచ్చాను' అని జటాయువుకు అంత్యక్రియలు చేస్తూ రాముడు చెప్తాడు. రాముడు ఈ విధంగా, జటాయువుకు గోదారీ జలాలతో తర్పణ విడుస్తాడు. నారాయణ స్పృహతో ఉన్న రాముడు స్పృశించిన పుణ్యోదకాలు – గోదావరీ జలాలు!



– పేరి రవికుమార్
సాహితీవేత్త, విశాఖపట్నం

దయామేఘ మల్హారి



"అప్పట్లో (19వ శతాబ్దం) గోదావరి మండలంలో, వశిష్ట, వైనతేయ, గోదావరి నదీపాయల మధ్య, లంకల గన్నవరం కుగ్రామం. గ్రామం నడిబొడ్డున రాజగోపాలస్వామి దేవాలయం. ఆలయానికి పక్కనే డొక్కావారి మండువా లోగిళ్ళు. అందులోనే డొక్కా జోగన్న గారిల్లు. జోగన్న వేద పండితుడే కాక మోతుబరి రైతు కూడా. సంపన్నకుటుంబం. సీతమ్మ జోగన్న గారి ధర్మపత్ని.

గన్నవరం అక్విడెక్టు అప్పట్లో లేదు. గోదావరి దాటడానికి పడవ ఒకటే ప్రయాణ సాధనం. మండుటెండలో గాని, గోదావరి పోటెత్తినప్పుడు గానీ, లంకల గన్నవరం కీలక మార్గంలో ఉన్నందున, మార్గస్థులు అక్కడే విడిది చేసే వారు. మార్గాయాసంలో ఉన్నవారికి, ఆ తోవన, ఏ వేళనైనా, రాత్రి, పగలనక సీతమ్మ అతిథ్యమిచ్చేది. ఆమెకు అన్నార్తులు ప్రత్యక్ష దేవుళ్ళు"

ఆచార్య వకుళాభరణం రామకృష్ణ తమ రచన 'వాఙ్మయి' లో 'చరిత్రలో ఉపశ్రేణులు – డొక్కా సీతమ్మ (1841–1909)' అన్న వ్యాసంలో సీతమ్మ గురించి రాసిన పరిచయమది. ఆమె సేవానిరతి తెలుసుకున్న బ్రిటిష్ చక్రవర్తి ఎడ్వర్డ్ జార్జి ఆమెని ఇంగ్లాండ్ ఆహ్వానిస్తే, అన్నార్తులు ఆకలి తీర్చే వారు లేరని ఆమె రాలేనని చెప్పారట. జిల్లా కలెక్టర్ ద్వారా ఆమె ఫొటో తెప్పించి, ఆమెకి కేటాయించిన కుర్చీలో ఆ ఫొటోని ఉంచి గౌరవించారట. ఆ అపర అన్నపూర్ణ మీద కవి ఎమ్మెస్ (ఎమ్మెస్ సూర్యనారాయణ) రచించిన 'దయామేఘ మల్హరి' దీర్ఘకవితలోంచి కొన్ని భాగాలు ప్రచురిస్తున్నాం, మహా పుష్కరాల సందర్భంగా.

మూడు వంతుల జీవితం
ఒక వంతు మట్టీ
ఒక్కళ్ళ రహస్యం
ఒకళ్ళు తెలుసుకున్నాక...
చిరుమొలక
అమృతనానికి
ఎరుకగా మిగిలాక...
బహుశ,
మట్టి పొత్తిలిని
ఒక నాగలి స్పృశించినప్పుడు
ఖణేల్మని...
నువ్వు పుట్టి ఉండాలి!
సీతమ్మా
ఆ క్షణం
నీకు అగ్నిపథమై ఉండాలి.

♦ ♦

'సీతమ్మ తల్లి!'
కార్మోయిళ్ళ కాళరాత్రి
కటిక ఆకటి చీకటి
కమ్మిన కరకు రాత్రి
కూకటి వేళ్ళతో
మనిషిచెట్టు కూలుతున్న
చప్పుడు విన్నావు...
పేగుల వేర్లు
మెలితిరిగినప్పుడు
అన్నవాహికలోంచి ఎగిసిన
మంటలు కన్నావు
తల్లివికదూ!
తల్లడిల్లావు.
రెండు చెకుముకి రాళ్ళ
ఆదిమజ్వాలా రహస్యం
తెలుసునీకు
ఆకలి శబ్దతరంగాల
సంచలనం తెలుసు
దూరాన ఒక కేక...
అవతలి గట్టున
అనలసందేశం!
సీతమ్మా
ఏమిటి చేసావు నువ్వు?
అర్థరాత్రి
అల్లకల్లోలంలో
పంచమస్వరాన్ని విన్నావు!
నడిరాత్రి
నల్లత్రాచులు మసలే దారిన
ఏమిటి చేశావు?
చేత్తో అన్నపుమూట
జోగన్నతో చిన్నమాట!
తోడుగా లాంతరు,
ఉప్పొంగే నదికావల
కొడిగట్టే ప్రాణదీపానికి
నీ అరిచేతుల కాపలా!
ఆవలిగట్టున
ఎవరిది సీతమ్మా!
ఎవరైతేనేం!
అర్థరాత్రి
పేగుకాలిన వాసన పసికట్టి
ఆకలి గుట్టు కనిపెట్టి
అవతలి గట్టుకు
నీ కరుణా ప్రయాణం!
చీకటి నదిని చీలుస్తూ...
జీవనదిలో ఒదిలిన దీపంలా
లాంతరుతో పడవ
ప్రయాణం!
మహత్తర మానవత్వకాంక్షతో
వాయుగుండాల గుండా
అగాధాల కావల
కడతేరే మనిషి కేసి...
నీది – అమృత పాదయాత్ర
అన్నపు మెతుకు పాత్ర!
జీవితయాత్రలో
నువ్వొక
అద్భుత అక్షయాత్ర!
సీతమ్మా!
సతతహరిత సదనానివి
మానవీయ కథనానివి

♦ ♦

దేవుడు–
ఆకలితో
నీ వాకిలి చేరుతాడు...
అవును,
భగవంతుడు...బాటసారి!
విసిగి వేసారి
ప్రతిసారీ
నీ గడప చేరి
సేదతీరి వెడతాడు!
మరి,
బ్రహ్మరాక్షసుడు
ఎంత తెలివైన వాడూ!
నీ హవిస్సునీ,
నీ తపస్సునీ
ఆరగించి
విముక్తుడౌతాడు...!
నీ వాకిలి ముంగిట
ఎన్నెన్ని జీవన పాత్రికలూ!
చోరులు...
పిపాసులు...
యాత్రికులు
శిశువులు
పశువులు
బాలెంతలు
నిగమశర్మలు
అగమ్యులు
అభాగ్యులు
రాజులు
జమిందారులు...
అన్ని దారులూ
అన్నవాహికకే!
దూరానయినా
దాపునయినా
ఒక కేకే!
ఇందరకూ
ఇల్లు నీ హృదయమే...
నీ గుండె
అన్నపు గుండిగ!
అన్నార్తుల
అనుదిన పండుగ!

♦ ♦

దయామణీ
'తర' వాణీ!
నాతరమా
నీ'చల్ల'ని
దోయిలి
కురిపించిన
కరుణామృత
వర్షవర్షన!
నీది
అనంత జాగరణ!
నీ కళ్ళ వాకిళ్ళలోన
వేళ్ళాడిన
పాలకుండా
చద్దికుండా
ఆకలి పేగులుగుండా
దొర్లిన
అమృత కలశాలు కదూ?
ఊరగాయా ఊరమిరపా
నంజుకున్న నడిరాతిరి
ఆకలి కరి
మింగిన వెలగపండు!
చీకటి ఆకటి ఘీంకారానికి
నీ అన్నపు మెతుకే
అంకుశం!––



ఎమ్మెస్

జోరు సెయ్ బారు సెయ్...

కోరంగి రేవుకీ... కోటిపల్లి రేవుకీ

గోదారిని చూస్తే తెంపులేని కవితాధారలా తోచడం, కవిత్వాన్ని చదువుతుంటే ఎడతెగని పరవళ్ల గోదారి గుర్తుకు రావడం అత్యంత సహజమైన అనుభవం. ఇక గోదావరే కవితా వస్తువైతే, ఇంకెన్ని కవిసమయాలో. '? వార్ధులేడింటికిన్ వలపువనిత' అని ఇక్కడ మట్టిలో పుట్టిన శ్రీనాథ మహాకవి గోదారిని ఏ కంటితో చూశాడోగానీ, సాగర సంగమానికి ముందు ఆ వలపుల వయ్యారి గోదారమ్మ తొందరల తొణికిసలాడుతున్నట్టే ఉంటుంది. ఎక్కడో బ్రహ్మగిరి, త్రియంబకేశ్వరంలో పుట్టి చిన్న వాగులాగ మొదలై, కాల్వలా పరువులెట్టి, మహానదై, దక్షిణ గంగ అని పేరుబడి 1500 కిలోమీటర్లు ప్రయాణం చేసిందంటే నమ్మబుద్ధి కాదు, ఏ కోటిలింగాల గట్టున నిలబడి చూస్తుంటే; అఖండ గోదావరికి ఆదిమధ్యాంతాలన్నీ ఇక్కడే అనిపిస్తుంది. 'దక్షిణ గంగ నావద్దయు నొప్పిన..' అని ఆవాహన చేసిన ఆదికవి నన్నయ్య స్ఫూర్తిగా, కొందరు ఆధునిక కవుల రూపసారాల్లో ప్రవహించిన రస గోదారి – ఈ కవనగోదారి, గోదావరి మహాపుష్కర సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రియ పాఠకులకోసం –

ధనియాల తిప్ప

(ముమ్మిడివరం తాలూకా)


అంతా ఒక తెల్ల కాగితం.

అందులో ఒక మూలగా
ఒక అడ్డ గీతా
ఒక నిలువు గీతా –
తెరచాప ఎత్తిన పడవ.

కిందిది నదీ
పైది ఆకాశమూ
కావొచ్చు.

– ఇస్మాయిల్
3. 10. 1983

(రాత్రి వచ్చిన రహస్యపు వాన నుంచి)



రాజమండ్రి పాటలు

రాత్రివేళ రాజమండ్రి వెళుతుంటే
రమ్య గౌతమీ జలాలలో
కొన్నివేల విద్యుద్దీపాలు ప్రతిఫలిస్తాయి
ఎవరీవిడ ధమ్మిల్లంలో యిన్నికాంతి లతాంతాల్ని తురిమారు ?
ఎవరీవిడ గుండెల్లో యిన్ని కాంక్షాకీలల్ని వెలిగించారు ?
అని విస్తుపోతాను
అయితే అప్పుడు గౌతమి ఎంత అందంగా వుంటుంది
నాట్యం చేసి అలసిన వేలుపు సానిలాగ !
అర్ధశయాన మూర్తి అయిన రాణిలాగ !



– దేవరకొండ బాలగంగాధర తిలక్
(అమృతం కురిసిన రాత్రి – కవిత్వ సంపుటం నుంచి)

వరద గోదావరి

ఉప్పొంగిపోయింది గోదావరి తాను
తెప్పున్న ఎగిసింది గోదావరి
కొండల్లొ ఉరికింది కోనల్లు నిండింది
ఆకాశ గంగతో హస్తాలు కలిపింది
ఉప్పొంగిపోయింది గోదావరి తాను
తెప్పున్న ఎగిసింది గోదావరి
శంఖాలు పూరించి కిన్నెర్లు మీటించి
శంకరాభరణ రాగాలాప కంఠియై
ఉప్పొంగిపోయింది గోదావరి తాను
తెప్పున్న ఎగిసింది గోదావరి



– అడివి బాపిరాజు (1895 –1952)

నేనూ, గోదావరి

గోదావరి నా సహోదరి.
నేకార్చిన కన్నీరు
కడుపులో దాచుకుని
అలలుగా స్పందించి
సాయం సమీరాల నిట్టూర్పులతో
నన్నోదారుస్తుంది.
మా బ్రతుకులొక్కటే!
గట్లొరసుకుంటూ
గిరుల గుండెలు చీలుస్తూ
యౌవన సంరంభంలో
ఆమె ఆనందామృతవాహిని.



– పతంజలిశాస్త్రి
(గుండె గోదారి – 1990 – కవిత్వ సంపుటం నుంచి)

వెన్నెల్లో గోదారి

ఇవాళ పొద్దున్న
చందమామను పట్టుకొని
ఏ పేపర్‌మిల్లులో పారేసారో ఏమిటో
ఇక్కడికొచ్చి చూస్తే
గోదావరే పెద్ద తెల్లకాగితం
దాని మీద కవిత్వం రాయడానికి
ఆ సూర్యుడే దిగిరానక్కర్లేదు
నేనిక్కడ నిలబడి
చిన్నరాయి పడేస్తే చాలు



– వసీరా
1984
(లోహనది – కవిత్వ సంపుటం నుంచి)

ఉప్పొంగే పున్నమి

వెన్నెలలో గోదావరి వింతహ్వాయలు
చూపుతుంది
ఎన్నెన్నో వయస్సులను ఇట్టిట్టే
గడుపుతుంది
రసహృదయం కలది గనుక నవరసాలు
వహిస్తుంది
రక్తి భుక్తి ముక్తి త్రయీ మార్గవేది
గోదావరి
గోదావరి గోదావరి గోదావరి పాట
గుండె నుంచి ఉప్పొంగే పున్నమి
సెలఊట
పరుగెత్తే తరగ చూడు పావురాయి రెక్క
తరగెత్తిన నురగనవ్వు ఆడును సయ్యాట



– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
(సమగ్ర సంకలనం నుంచి)



నదీ సంగం

ఒక అశ్రుజల వర్ణచిత్రంలా
ప్రవాహ ప్రదర్శనకి నిలిచేను

ఇటువేపు కన్నెత్తి చూడక
ఏ పూటకా పూట తప్పించుకొన్నావు

ఇవాళ పుష్కర పుణ్యమార్థం
నువ్వు నిలువెల్లా మునిగి తేలిన నదిని నేను



– నామాడి శ్రీధర్

బౌద్ధమత వృక్షమ్ము పల్లవించిన చోట..

ఉభయ గోదావరి జిల్లాల్లో బౌద్ధక్షేత్రాలు



గుంటుపల్లిలో కొండల్లో చెక్కిన బౌద్ధ విహారం

ఆదిమానవుని అడుగుజాడలను ఒడిసిపట్టుకున్న గోదావరి తీరం చారిత్రక తొలియుగంలో బౌద్ధాన్ని ఆహ్వానించి, మానవతా విలువలకు ప్రాణం పోసింది. బుద్ధుని కాలంలోనే అస్మక జనపదంలో భాగమైన నేటి నిజామాబాద్ – కరీంనగర్ ప్రాంతాలకు బావరి అనే ఒక ఆచార్యుని శిష్యుల ద్వారా బౌద్ధ ధర్మం తెలుగునేలకు చేరింది. అటు తరువాత, అశోకుని ప్రోద్బలంతో బౌద్ధం వేళ్లూనుకొని కోస్తా తీరమంతా తిసరణాలతో మారుమోగింది. క్రీ.పూ.3వ శతాబ్దిలో భట్టిప్రోలు, ధాన్యకటకం (అమరావతి) లాంటి ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాల సరసన గోదావరి తీరాననున్న గుంటుపల్లి గృహలు, పాండవుల మెట్ట కూడా చేరుతాయి. పశ్చిమ తూర్పు గోదావరి జిల్లాల్లో క్రీ.పూ 3 నుంచి క్రీ.శ 9 – 10 శతాబ్దాల దాకా ధమ్మ ఘోష నినదించి, బుద్ధవచనాన్ని ప్రసరింపజేసిన ఆధారాలు చాలా దొరికాయి. అంతేకాదు ఈ రెండు జిల్లాల్లో థేరవాద మహాయాన, వజ్రయాన బౌద్ధ దశల క్రమ పరిణామాన్ని కూడా చూడవచ్చు. దిఙ్నాగుడులాంటి బౌద్ధ తార్కికుని అందించింది కూడా గోదావరి జిల్లాలే. ఈ రెండు జిల్లాల్లో గుంటుపల్లి, కంఠంనేని వారిగూడెం, పెదవేగి, కాపవరం, పాండవులమెట్ట, తిమ్మిపురం, కొడవర్తి, ఆదుర్రు, మోర్తలాంటి ప్రసిద్ధ బౌద్ధక్షేత్రాలు ఇటుక, రాతికట్టడాలతో పాటు, గృహాలయాలను, బుద్ధ ప్రతిమలను, ధాతు పేటికలను, పాకృత శాసనాలనందించి బౌద్ధ సంస్కృతి వెల్లివిరిసింది.

గుంటుపల్లి

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు 45 కి.మీల దూరంలో జీలకర్ర గూడెం గ్రామానికి దగ్గరున్న గుంటుపల్లి కొండలపైన విశాలమైన బౌద్ధారామంతో పాటు, కొండను తొలచి, మలచిన గుహాలయాలు, స్థూపం, విహారాలు, వాటికి ఎదురుగా మెట్లు, ఆ మెట్లు దాటంగనే బుద్ధచైత్యం, ఉద్దేశిక స్థూపాలు శిలా మండపం ఉన్నాయి. ఇక్కడి బౌద్ధ గుహాలయాలు బీహారులోని లోమాషిరుషి గుహను, అజంతా గుహలను పోలి ఉండటాన, ఇవి, క్రీ.పూ 3వ శతాబ్దంలో తొలిచారని పురాతత్వ వేత్తలు భావిస్తున్నారు. అటు తరువాత ఇక్కడ జరిపిన తవ్వకాలు క్రీ.పూ 1, క్రీ.శ 2 శతాబ్దాలకు చెందిన మట్టి పాత్రలు, బ్రాహ్మి శాసన శకలాలు, మహ మేఘ శాతన వంశానికి చెందిన సిరిసదుని శాసనం, కలింగఖారవేలుని శాసనం, శాలంకాయన రెండో నంది వర్మ (క్రీ.శ 5వ శతాబ్ది), ఇంకా అవలోకితేశ్వర కంచుబొమ్మపై క్రీ.శ 9వ శతాబ్ది నాటి 'ఏ ధమ్మ హేతుప్రభవా' అన్న శ్లోకము, క్రీ.శ.2–3 శతాబ్దాలకు చెందిన బుద్ధుని ప్రతిమలు, బుద్ధ ధాతు పేటికలు లభించాయి. ఇక్కడే దొరికిన ఒక బ్రాహ్మి శాసనంలో ఈ ప్రదేశాన్ని మహా నాగ పర్వతమని పేర్కొనటాన, బౌద్ధ తార్కికుడు దిఙ్నాగుడు ఇక్కడే నివసించాడని తెలియజేశాడు ఐ.కె శర్మ. గుంటుపల్లె గుహాలయాలు కూడా అజంతా గుహల వలె గుర్రపు నాడా ఆకారంలో ఉన్నాయి. ఇక్కడి ప్రధాన గుహాలయం వ్యాసం 18 అడుగులు, ఎత్తు 14 అడుగుల మధ్యలో రాతితో తొలిచిన చైత్యం (వ్యాసం 11'–8", ఎత్తు 3'–9" అండం వ్యాసం 9'–3", ఎత్తు 4'–9") చుట్టూ 3'–0" వెడల్పుతో ప్రదక్షణా పథముంది. అండం పైభాగాన ఛత్రం (గొడుగు) అమర్చటానికి రంధ్రం కూడా చెక్కబడింది. చైత్యాలయం పైకప్పు వంగిన కర్ర కమ్ములతో, కోళ్ళ గూడు ఆకారంతో రాతితో తీర్చిదిద్దటం గమనించాల్సిన విషయం.

ఈ చైత్యాలయానికి ఈశాన్యంలో విహారాన్ని తొలిచారు. మొత్తం మూడు విభాగాలుగా ఉండి ఒక్కో దాంట్లో 4 గదులు చొప్పున మొత్తం 12 గదులున్నాయి. అంటే 12 మంది బౌద్ధభిక్షువులు వస్సావాసాన్ని గడిపేవారు. బయట ద్వారాలు, కిటికీలు, రాతి బెంచి, నీరు బయటికెళ్ళేగాడి అన్నీ రాతితోనే చెక్కారు. ఈ గుహలకు దూరంగా, వాయువ్యంగా మరికొన్ని అసంపూర్ణంగా చెక్కిన గుహలున్నాయి.

కొంచెం ఎగువన, ఇటుకలతో నిర్మించిన

స్థానికంగా ధనందిబ్బగా పిలువబడుతోన్న ప్రాంతంలో గల ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో క్రీ.శ 4 శతాబ్దికి చెందిన అంటే శాలంకాయన రాజుల పాలనా కాలానికి చెందిన బౌద్ధ స్థూప అవశేషాలు బయల్పడ్డాయి.


పెదవేగిలో బౌద్ధ స్థూపం

శాతవాహన, ఇక్ష్వాకుల కాలపు చైత్యం, బుద్ధుని బొమ్మ ఉన్న స్థూప చైత్యం, వెనుక వైపున 35 ఉద్దేశిక స్థూపాలున్నాయి. వీటికి పశ్చిమాన శిలామండపం, ఒక స్థూపంతో బుద్ధధాతు కరండాలు బయల్పడినాయి. ఆధారాలను బట్టి గుంటుపల్లి వద్ద క్రీ.పూ, 3 క్రీ.శ 9 శతాబ్దాల మధ్య థేరవాద, మహాయాన, వజ్రయాన బౌద్ధ శాఖలు ఉన్నట్లు తెలుస్తుంది.

పెదవేగి

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు 20కి.మి దూరంగల పెదవేగి ఒక బౌద్ధక్షేత్రం. స్థానికంగా ధనందిబ్బగా పిలువబడుతోన్న ప్రాంతంలో గల ప్రాంతంలో జరిపిన తవ్వకాలు క్రీ.శ 4 శతాబ్దికి చెందిన అంటే శాలంకాయన రాజుల పాలనా కాలానికి చెందిన బౌద్ధ స్థూప అవశేషాలు, ఇంకా శాతవాహన కాలపు, శాలంకాయన కాలపు శాసనాలు కూడా బయల్పడినాయి. ఒక ఎత్తైన అరుగులపై మధ్యలో మహాస్తూపం, నాలుగు దిక్కుల్లో నాలుగు చిన్న స్థూపాలు బయల్పడినాయి. 1888లో రాబర్ట్ సివెల్ ఇక్కడ శాతావాహన కాలపు అవశేషాలుతో పాటు బౌద్ధ అనవాళ్లకు కూడా కనుగొన్నాడు. ఇక్కడ దొరికిన 4 ప్రాకృత శాసనాలు, కంటకసిలి, రాగోకాకిచిక, మహానాగపవతా, అనే పదాలున్నాయి.

కంఠమనేని వారి గూడెం

గుంటుపల్లికి 2కి.మీ దూరంలో నున్న కంఠమనేనివారిగూడెంలో కేంద్ర పురావస్తుశాఖ జరిపిన తవ్వకాల్లో స్థూపాలు, చైత్యాలు, శిలామండప స్థంభాలు, మట్టి పెంకులు, శిల్పశకలాలు లభించాయి. చైత్యాల్లో స్థూపచైత్యం, బుద్ధ చైత్యం ఉన్నాయి. బుద్ధ చైత్యంలో బుద్ధుని ప్రతిమ ఉంది. ఇంకా కొద్ది దూరంలో ఒక చిన్న సైజు ఉద్దేశిక స్తూపం కూడా వెలుగుచూచింది. పురావస్తు ఆధారాల రీత్యా ఈ బౌద్ధ స్థావరం క్రీ.పూ 2 క్రీ.శ 1వ శతాబ్దాల మధ్య కాలానికి చెందినవి.

పాండవుల మెట్ట (కాపవరం)

తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి 20 కి.మీ, కోరుకొండకు 3 కి.మీ ల దూరంలో గల కాపవరం గ్రామంలో నున్న కోరుకొండపై గల బౌద్ధారామాన్ని స్థానికులు పాండవుల కొండ, పాండవుల మెట్టగా పిలుస్తారు. పదెకరాల విస్తీర్ణంలో గల ఈ బౌద్ధారామంలో మహాస్థూపం, ఉద్దేశికస్థూపాలు, చైత్య గృహాలు, విహారాలు ఉన్నాయి. కొండపైకి చేరుకోవటానికి రాతిని తొలిచిన మెట్లున్నాయి. కొండ సగభాగంలో తొమ్మిది రాతిగుహలున్నాయి. వాటిలో నీటి తొట్టి కూడా ఉంది. గుహద్వారాలు, కిటికీలకు కొయ్య తలుపుల్ని అమర్చిన ఆధారాలున్నాయి. ఈ గుహలు బౌద్ధ భిక్షువులు, భిక్షుణీల వస్వావాసంగా ఉపయోగపడినాయి. మహాస్తూపం 100 అడుగుల వ్యాసంలో ఉంది. తవ్వకాల్లో ఇక్కడ, బుద్ధ ధాతువులనుంచిన రాతి పేటిక లభించింది. ఈ స్థూపం, విహారాల నిర్మాణానికి 22x12x4 అంగుళాల ఇటుకలను వాడారు. తవ్వకాల్లో శాతవాహనుల నాణాలు, మట్టి పాత్రలు, బౌద్ధ శిలాఫలక శకలాలు, రాతిని తొలచిమలచిన తొట్టి, చంద్రశిలలు, నగిషీగా చెక్కిన శిలామండప స్థంభ భాగాలు లభించటం చేత ఈ బౌద్ధారామం క్రీ.పూ 2 క్రీ.శ 2 శతాబ్దాల మధ్య కాలానికి చెందిందిగా భావించవచ్చు.

రంపఎర్రంపాలెం


రాజమండ్రికి ఉత్తరంగా 25 కి.మీ దూరంలో నున్న రంపఎర్రంపాలెం గ్రామంలో గల కొండపైన ఐదు రాతిని తొలచి మలచిన స్థూపాలు, రాతిని తొలచి మలచిన ఐదు గుహాలయాలున్నాయి. ఇక్కడి బౌద్ధారామం దొరికిన పురావస్తు ఆధారాల రీత్యా క్రీ.పూ 2వ శతాబ్దికి చెందినవిగా గుర్తించారు. స్థూపాలు చుట్టూ ప్రదక్షిణా పథం, పైన చత్రాన్నుంచటానికి గుంట, గుహాలయాల దగ్గర పిట్టగోడకు దీపాలను వెలిగించటానికి గుంటలను చెక్కుకొన్నారు. ఈ బౌద్ధరామం థేరవాద బౌద్ధ శాఖకు చెందింది.

తిమ్మాపురం

పిఠాపురం పక్కనేగల తిమ్మాపురం గ్రామంలో 1948లో ఒక స్థానిక దిబ్బపై తవ్వకాలు జరుపుతుండగా ఇటుకల రాతి శిథిలాల నుంచి బుద్ధధాతుపేటికలు బయల్పడినాయి. పిఠాపురం జమిందారు రాజా వెంకట సూర్యారావు వీటిని సర్ వాల్టర్ ఇలియాట్ అనే పురావస్తు అధికారికి ఇవ్వగా, అవి ప్రస్తుతం చైన్నై మ్యూజియంలో ఉన్నాయి. తవ్వకాల్లో మరో నాలుగు ఉద్దేశిక స్థూపాల పునాదులు బయల్పడినాయి. ఇటుకరాతి పరిమాణం, స్థూపాన్ని పోలిన రాతి ధాతుపేటిక, దానిలోపల మట్టిపాత్ర, దానిలోపల స్పటికపు భరణెను ఉంచిన తీరు, ఇంకా దొరికిన నలుపు, ఎరుపురంగు మట్టి పెంకుల ఆధారంగా ఈ బౌద్ధ క్షేత్రం క్రీ.పూ2, క్రీ.శ 2 శతాబ్దాల మధ్య (శాతవాహన) కాలానికి చెందిందిగా చెప్పవచ్చు.

పాండవుల మెట్ట – పెద్దాపురం

సామర్లకోటకు సమీపంలో నున్న పెద్దాపురంలో గల చిన్నపాటి గుట్టను పాండవుల మెట్టగా పిలుస్తారు. అక్కడ రాతిని తొలచి మలచిన రెండు


గుంటుపల్లిలో ధర్మలింగ గుహ

గుహలుమెట్ల వరుసలున్నాయి. ఇంకా ఇక్కడ రాతిని తొలచిమలచిన తొట్లు, ఇటుకలతో నిర్మించిన విహారపు పునాదులు, మట్టి పెంకులు బయల్పడినాయి. క్రీ.పూ 2వ శతాబ్దికి చెందిన ఈ గుహలు బౌద్ధ భిక్షువుల వస్సావాస కేంద్రాలుగా ఉండేవే తప్ప పాండవులకు, ఈ గుహలకు సంబంధమేలేదు.

ఆదుర్రు

తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి 20 కి.మీ దూరంలో గల ఆదుర్రులో వైనతేయ నది ఒడ్డున విశాలమైన బౌద్ధారామముంది. క్రీ.పూ 2, క్రీ.శ 3 శతాబ్దాల మధ్య కాలానికి చెందిన ఈ బౌద్ధారామంలో చక్రాకారంలో నిర్మించిన మహాస్థూపం, చైత్యాలు, ఉద్దేశిక స్థూపాలు, శిలామండప శకలాలు ఉన్నాయి. ప్రకృతి ఒడిలో ఉన్న ఈ బౌద్ధారామం శాంతిధామంగా భాసిల్లుతుంది. 1945 లో ఊబరాజు దిబ్బగా పిలువబడిన ఈ ప్రదేశంలో బౌద్ధ అవశేషాలను కనుగొని 1986 లో తవ్వకాలు జరిపి కట్టడాల అనవాళ్లను వెలికి తీశారు. ఇంకా మట్టి పాత్రలు ఇతర బౌద్ధ వస్తువులు కూడా బయల్పడినాయి. 66 అడుగుల చుట్టుకొలత, 50 అడుగుల ఎత్తున్న చక్రాకార స్థూపం మధ్యలో మొదటి వరుసలో 22, రెండో వరసలో 16 ఆకులతో, చుట్టూ గోడతో కింద ప్రదక్షణ పథంతో ఇటుకలతో నిర్మించబడింది. ఈ స్థూపానికి ఇరువైపులా రెండు స్థూప చైత్యాలు, చిన్న స్థూపాల పునాదులున్నాయి.

కొడవలి

కాకినాడకు 40, రాజమండ్రికి 50, పిఠాపురానికి 30 కి.మీల దూరంలో గల కొడవలిలో గల ధనం దిబ్బపైన 150 అడుగుల వ్యాసంలో నున్న ఇటుకరాతి స్థూపముంది. స్థూపానికి అటూ ఇటూ ఇటుకరాతి దిమ్మలున్నాయి. దక్షిణ వైపున రాతితో తొలచి మలచిన గదుల్లాంటి గుహలున్నాయి. ఇవి నీటిని నిల్వ చేసుకునే తొట్లు తవ్వకాల్లో శాతావాహన కాలపు వస్తు సామగ్రితో పాటు, స్థూపం దగ్గర వాసిష్టపుత్ర సామిసిరి, చంధసతి అనే శాతవాహన రాజుల ప్రస్తావన గల క్రీ.శ 2వ శతాబ్ది పాకృత శాసనం లభించింది.

మోర్త

నిడదవోలుకు దక్షిణంగా 6 కి.మీల దూరంలో నున్న మోర్త అన్న ఊళ్లో రాష్ట్ర పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో ఇటుకరాతి స్థూపాలు, విహారపు పునాదులు, మట్టి పెంకులు, దొరికాయి. స్థూపం, విహారం చుట్టూ, ఒక ఇటుకరాతి ప్రాకారం కూడా ఉంది. లభించిన పురావస్తువులు, ఇటుకరాతి పరిమాణాన్ని బట్టి ఈ బౌద్ధక్షేత్రం శాతవాహనుల కాలంలో రూపుదిద్దుకొని, విష్ణుకుండినుల కాల వరకూ (అంటే క్రీ.పూ 1– క్రీశ 4 శతాబ్దాల మధ్య కాలం) విలసిల్లిందని చెప్పవచ్చు

పరిశీలించి చూస్తే, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో క్రీ.పూ 3వ శతాబ్దంలోనే బౌద్ధం వేళ్లూనుకొని, శాతవాహనకాలంలో ఊపందుకుని, ఇక్ష్వాకుల కాలంలో నిలదొక్కుకుని, శాలంకాయన, విష్ణుకుండినుల కాలంలో ఆదరణ సన్నగిల్లి క్రీ.శ 9వ శతాబ్దం తరువాత పూర్తిగా తెరమరుగైందని చెప్పవచ్చు.



డా ఈమని శివనాగిరెడ్డి – స్థపతి

గోదావరి
మహా పుష్కరం 2015

గోపుర శోభల పావన గోదారి



గోదావరి పుష్కరాల సందర్భంగా కోట్లాది మంది భక్తుల గొంతులతో శ్రుతి కలిపి చేసే క్షేత్ర నామస్మరణ ఇది.

నది, గుడి పర్యాయపదాలేమో అనిపిస్తాయి, ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్ని చెరోదరిని పొదువుకొని ప్రవహించే గోదారితల్లిని, గోపురాల్ని చూస్తుంటే. జాతి సాంస్కృతిక చైతన్యమై నది ప్రవహిస్తే, అచంచల ధార్మిక ఔన్నత్యమై గుడి నిలుస్తుంది. అలలతో ముకుళించి గుడికి నది కైమోడ్చితే, నదికి గోపురంతో దీవించి గుడి స్వస్తి పలుకుతుంది. ఈ ద్వైతాద్వైతాన్ని అర్థం చేసుకోవాలంటే పావన గౌతమీ తీరం వెంట రాజమహేంద్రి నుంచి అంతర్వేది వరకూ ఉన్న సనాతన, చారిత్రాత్మక దేవాలయాల్ని చూసి తీరవలసిందే. గోదావరి పుష్కరాల సందర్భంగా కోట్లాది మంది భక్తుల గొంతులతో శ్రుతి కలిపి చేసే క్షేత్ర నామస్మరణ ఇది:

రాజమహేంద్రి వరం

అఖండ గోదావరి గౌతమీ తీరంలోని ప్రాచీన పట్టణం రాజమహేంద్రి. ఇది పవిత్రక్షేత్రం. ఈ తీరంలో ఎన్నో ఆలయాలు కొలువుదీరి ఉన్నాయి. ఇక్కణ్ణించే గోదావరి సప్త గోదావరిగా



అంతర్వేది ఉత్సవాలకు దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులు తరలి వస్తుంటారు. అప్పుడు అంతర్వేది సముద్రంలో భక్త సముద్రం సంగమిస్తుంది. ఆ సందర్భాన్ని ఒక మహా సంబరంగా భావిస్తారు.

ఖ్యాతికెక్కింది. శ్రీఉమాకోటి లింగేశ్వర స్వామి ఆలయం అతి ప్రాచీనమైంది. శ్రీ విద్యారణ్యస్వామి ప్రతిష్ఠించిన శ్రీచక్ర సహిత రాజరాజేశ్వరీ సహిత పీఠ భువనేశ్వరీ దేవాలయం కూడ ఉన్నది. ఈ నగరానికి ముఖ్యమైన స్థానంలో ఉన్న ఆలయమే అత్యంత ప్రఖ్యాతిగాంచిన ఉమామార్కండేయస్వామి వారి దేవాలయం.

ఇది ప్రసిద్ధి ఆలయంగా పేరుగాంచింది. దీని సమీపంలోగల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం కూడా ప్రసిద్ధి చెందింది. 11వ శతాబ్దికి చెందిన ఈ ఆలయానికి విశిష్టమైన చరిత్ర ఉన్నది.

కోటి వరాల కోటిలింగేశ్వరుడు

గోదావరి నదీ తీరంలో అనేక శైవక్షేత్రాలు కొలవుదీరి ఉన్నాయి. గోదావరి తీరంలో అన్ని మతాలు, విశ్వాసాలు వ్యాప్తి చెందుతున్నాయి. ముఖ్యంగా ఎన్నో పుణ్యక్షేత్రాలు భక్తులని పునీతులను చేస్తున్నాయి. ఈ తీరంలో శైవం ఎక్కువ ఆదరణకు నోచుకున్నది. ఇందుకు ఈ ప్రాంతంలో వెలిసిన శైవక్షేత్రాలే ప్రబల నిదర్శనం. మనదేశంలో ఉన్న 108 శైవక్షేత్రాలలో రాజమహేంద్రికి విశేషస్థానం లభించింది. ఈ తీరం వెంబడి ఉన్న శ్రీ ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవాలయం, శ్రీఉమా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాలు భక్తకోటికి ముక్తినిచ్చే ఆపురూప ఆలయాలు.

కోటి వరాలనిచ్చే శ్రీఉమా మార్కండేశ్వరుడు

గోదావరి తీరంలో ఉన్న అతి ప్రాచీన శివాలయాలలో కోటిలింగాల క్షేత్రం ఒకటి. కాశీక్షేత్రాన్ని దర్శించి వచ్చిన భక్తులు కాశీ నుంచి తెచ్చిన గంగాజలాన్ని ఈ గోదావరి జలంతో కలిపి, కోటిలింగేశ్వరస్వామిని పూజిస్తే కోటిలింగాలను పూజించిన ఫలితం సిద్ధిస్తుంది. కోటిలింగాలపై నుంచి గోదావరి ప్రవహిస్తున్న అనుభూతిని భక్తులు పొందుతారని ప్రతీతి. కోటిలింగ ఘట్టంలో స్నానం అమోఘ పుణ్యఫలం. 'దర్శనత్ స్పర్శనాత్ స్నానాత్' అని గోదావరి మాతపై శ్లోకం ఉన్నది. పవిత్ర గోదావరి జలంలో స్నానమాచరించినా, తాకినా హృదయంలోని మలినాలు మటు మాయమౌతాయని ఈ శ్లోకం సారాంశం. గోదావరి పుష్కర మహత్తర కాలంలో కోటిలింగ ఘట్టంలో స్నానమాచరించి కోటిలింగేశ్వరుని అర్చించి కోటివరాలు పొందే మహాద్భాగ్యం భక్తుల పరం.

రత్నగిరి వాసుడు సత్యదేవుడు

అన్నవరం రత్నగిరి కొండపై హరిహర హిరణ్యగర్భ త్రిమూర్త్యాత్మక స్వరూపకునిగా అనంతలక్ష్మీ సత్యవతీదేవితో కలిసి శ్రీ సత్యదేవుడు వెలిసినట్లు చరిత్ర చెబుతున్నది. ఖర నామ సంవత్సరం శ్రావణ శుద్ధ విదియనాడు స్వామి రత్నగిరిపై అంకుడి చెట్టుకింద దర్శనమిచ్చారు. ఆనాటి నుంచి నేటి దాకా సత్యదేవుని సన్నిధికి వచ్చిన భక్తులంతా క్షేత్రపాలకులైన శ్రీ సీతారాముల వారిని దర్శించిన అనంతరం శ్రీ సత్యదేవుని దర్శనం చేసుకుంటారు.ఎంతో సంప్రదాయబద్ధంగా నిర్మితమైన ఈ ఆలయం పైభాగంలో శ్రీ సత్యదేవుడు, ఎడమ భాగంలో అనంతలక్ష్మి సత్యవతిదేవి, కుడి భాగంలో ఈశ్వరునితో కలిసి భక్తులకు దర్శనమిస్తుంటాడు. బీజాక్షరాలతో, మహా మంత్రాలతో మహిమాన్వితమై ప్రతిష్ఠించబడినందువల్ల సత్యనారాయణ స్వామి భక్తుల వరప్రసాదమై ఉన్నాడు.

సత్యదేవుని మహిమలన్నీ సత్యనారాయణుని వ్రత కథలుగా జగత్ ప్రసిద్ధాలు. భక్తులకు అవి జీవిత పాఠాలు....జన్మ సాఫల్యాలు.

సత్యదేవుని సన్నిధిలో ప్రసాదానికి అద్భుత మహాత్యం ఉన్నది. ఆవునెయ్యి, గోధుమ నూక, పాలు, పంచదార, సుగంధి ద్రవ్యాలు కలిసిన సత్యదేవుని ప్రసాదం కనులకద్దుకుని స్వీకరించి తరించవలసిందేతప్ప వివరించకూడదు.

పంపానదీ తీరంలో...

పచ్చటి తివాసీలు పరిచినట్టుగా పంటపొలాలు ఒక్కపక్క, ఎత్తయిన కొండలు, జలాశయాల మధ్యన ప్రకృతి అందాలు చూడాలంటేబృందావనాలు, ఊటీలు వెళ్ళవలసిన అవసరమే లేదు. రత్నగిరిని దర్శిస్తేచాలు... సత్యదేవుని స్మరిస్తేచాలు...స్పృశిస్తే చాలు... అన్నవరం కొండపై కొలువుదీరి వున్న శ్రీశ్రీశ్రీ సత్యనారాయణస్వామి సన్నిధానం సాక్షాత్ వైకుంఠమే.

కుక్కుటేశ్వరాలయం...కాశీకి సమానం

సాక్షాత్ కాశీవిశ్వేశ్వరుడే కుక్కుటేశ్వరునిగా పవిత్ర కాశీగంగ పదగయగా, కాశీ అన్నపూర్ణ రాజరాజేశ్వరిగా ప్రభవించిన ప్రత్యేకత తూర్పుగోదావరిజిల్లా లోని

పిఠాపురంలో గల కుక్కుటేశ్వరుని దేవాలయానికి ఉన్నది. కాశీతో సమానంగా పాదగయతో పునీతమైన శ్రీ రాజరాజేశ్వరి సమేత కుక్కుటేశ్వరుడు కారుణ్యమూర్తి. అష్టాదశ పీఠాలలో ఒకటైన పీఠపురాన్ని పురుహూతుడు ప్రతిష్ఠించాడని ఇతిహాసం. ప్రాచీన శాసనాలలో పిఠాపురాన్ని పిస్తాపురం అని పిలిచేవారు. తదనంతరం పీఠికాపురంగాను, ప్రస్తుతం పిఠాపురంగా రూపొందరం చెందింది.

ఆలయాలకు కొలువైన గొల్లల మామిడాడ

తూర్పుగోదావరి జిల్లాలో గొల్లలమామిడాడ గ్రామం ఆలయాలకు కొలువైంది. బొమ్మల కొలువులు పండగరోజుల్లో కనువిందు చేస్తాయి.అక్కడ ఆలయాలు కొలువుతీరడం తిలకించాలంటే కచ్చితంగా గొల్లలమామిడాడ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవలసిందే.

గొల్లలమామిడాడలో ఆకాశాన్ని తాకే గోపురాలు, గుడులు వెలసిన దైవక్షేత్రంగా భాసిల్లుతోంది. ఆ గ్రామంలో తూర్పు, పశ్చిమ దిక్కున ఉన్న శ్రీ కోదండ రామచంద్రమూర్తివారి గోపురాలు గ్రామానికి పెట్టిన కిరీటాల్లా, అపూర్వ ఆభరణాల్లా దర్శనమిస్తాయి. 160 అడుగుల ఎత్తున ఒక గోపురం ఉంటుంది. 11 అంతస్తులతో సుమారు 200 అడుగుల ఎత్తున పశ్చిమగోపురం ఆకాశ హర్మ్యంలా దర్శనమిస్తూ అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ రెండు ఉన్నత గోపురాలపై రామాయణ, మహాభారత భాగవత కథాశిల్పాలు ఆహ్లాదం కలిగిస్తాయి.

ప్రఖ్యాతి గాంచిన అరసవిల్లి సూర్యనారాయణస్వామి దేవాలయం తర్వాత గొల్లలమామిడాడలో మాత్రమే సూర్యనారాయణస్వామి దేవాలయం ఉన్నది. 1902లో ఇక్కడ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ దేవాలయానికి నాలుగు వైపులా నాలుగు గోపురాలు ఉన్నాయి. ఇదే గ్రామంలో కీ.శ.1790లో పెద్దాపురం సంస్థానాధీశులు రాజా శ్రీవత్ససాయి తిమ్మరాయ జగపతి మహారాజు స్వయం వ్యక్తంగా ఏర్పడిన శివలింగానికి ఆలయాన్ని నిర్మించారు.

భక్తజనులకు అండ కోరుకొండ

తూర్పుగోదావరిజిల్లాలోని కోరుకొండపై వెలసిన శ్రీలక్ష్మీనంసింహుని ఆలయానికి సుదీర్ఘ చరిత్ర, పౌరాణిక ప్రసిద్ధి ఉన్నది. కృతయుగంలో వశిష్ఠుని మనుమడు పరాశరుడు తన తాత వద్ద నేర్చిన నరసింహ యంత్రం సిద్ధించడానికి ఈ ఎత్తయిన కోరుకొండ కొండపై తపస్సు చేసినట్లు ప్రతీతి. అప్పుడు స్వామి సాక్షాత్కరించి పరాశరుని కోరిక మేరకు కోరుకొండపై పుణ్యక్షేత్రం వెలసినట్లు చరిత్రకారులు చెబుతుంటారు.

విలక్షణవల్లిగా వాడపల్లి

తూర్పుగోదావరి జిల్లాలోని వాడపల్లి విలక్షణవల్లిగా పేరుగాంచింది. ఈ గ్రామంలో స్వయంభువై రక్త చందన కొయ్యతో మూర్తీభవించిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శిస్తే హృదయం ఉప్పొంగుతుంది. విలక్షణంగా కొయ్యతో మూర్తీభవించిన శ్రీ వేంకటేశ్వరుని కర్ర విగ్రహం భారతదేశంలో మరెక్కడా లేదు. పూర్వం వాడపల్లి దండకారణ్య ప్రదేశంగా, రుషుల నిలయంగా ఉండేది. 300 సంవత్సరాల క్రితం శ్రీవేంకటేశ్వరుని కొయ్య విగ్రహం పవిత్ర గోదావరి నదీతీరంలోని ఇసుకలో ప్రత్యక్షమైంది. వాడపల్లి స్వాతంత్ర్య సమరయోధుల శౌర్యం వింటే మహోద్వేగం కలుగుతుంది.

దాక్షిణ్య స్వరూపుడు ద్రాక్షారామ భీమేశ్వరుడు

దాక్షిణ్య స్వరూపుడుగా, స్వయం భువుడుగా భాసిల్లిన భీమేశ్వరసస్వామి కొలువుదీరిందే ద్రాక్షారామం భీమేశ్వరుని ఆలయం. ప్రసిద్ధి పంచారామాక్షేత్రాలు అమరావతి, పాలకొల్లు, భీమవరం, సామర్లకోట, ద్రాక్షారామాలు, పవిత్ర పంచారామాల్లో ఒకటిగాను, త్రిలింగక్షేత్రాలుగా విఖ్యాతమైన శ్రీకాళహస్తి, శ్రీశైలం, ద్రాక్షారామాల్లో ఒకటిగాను, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ధాకిన్యం భీమశకరంగానూ ద్రాక్షారామం ఒక విలక్షణ వైశిష్ట్యాన్ని పొందింది. ఈ పవిత్రమైన దేవాలయం తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రాపురం మండలంలోని ద్రాక్షారామం స్వయం భూలింగంగా అవతరించిన శ్రీ భీమేశ్వర స్వామివారు శుద్ధ స్ఫటిక లింగాకారంలో 2.5 మీటర్లు ఎత్తున, రెండు అంతస్తులతో ఎత్తయిన ప్రహరీ గోడల మధ్య, నాలుగు రాజగోపురాలతో సువిశాలమైన ఆవరణలో పంచప్రాకారాలతో అలరారుతున్నారు.

భక్తులకు ముక్తినిచ్చే ముక్తేశ్వరం

అమలాపురానికి దగ్గరలో అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ముక్తినిచ్చే ముక్తేస్వరుడు కొలువుదీరడంతో

ఎంతో సంప్రదాయబద్ధంగా నిర్మితమైన ఈ ఆలయం పైభాగంలో శ్రీ సత్యదేవుడు, ఎడమ భాగంలో అనంతలక్ష్మి సత్యవతిదేవి, కుడి భాగంలో ఈశ్వరునితో కలిసి భక్తులకు దర్శనమిస్తుంటాడు.





ద్రాక్షారామం స్వయం భూలింగంగా అవతరించిన శ్రీ భీమేశ్వర స్వామివారు శుద్ధ స్ఫటిక లింగాకారంలో 2.5 మీటర్లు ఎత్తున, రెండు అంతస్తులతో ఎత్తయిన ప్రహరీ గోడల మధ్య, నాలుగు రాజగోపురాలతో సువిశాలమైన ఆవరణలో పంచప్రాకారాలతో అలరారుతున్నారు.

ఆ గ్రామానికి ముక్తేశ్వరం అనే నామకరణం వచ్చింది. ఈ గ్రామాన్ని క్షణముక్తేశ్వరం అని కూడ పిలుస్తారు.

సుప్రసిద్ధ అయినవిల్లి వినాయకుడు

అయినవిల్లిలో వేంచేసి ఉన్న వినాయకుడు తొలి పూజ అందుకనే సిద్ధి వినాయకునిగా కొలుస్తారు. వృద్ధగౌతమి నదీ తీరంలో వెలిసిన వినాయకస్వామి అయినవిల్లి గ్రామాన్ని అజరామరం చేస్తూ భక్తుల కల్పవృక్షంలా విలసిల్లుతున్నాడు. సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు సమస్త జనులనూ కాస్తూ వరసిద్ధి వినాయకునిగా వర్ధిల్లుతున్నాడు. దేశం నలుమూలల నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తుంటారు.

దక్షిణకాశీగా అంతర్వేది

వశిష్ట సాగర సంగమం చేసే విశిష్టమైన ప్రదేశమే అంతర్వేది. ఇక్కడ వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామితో అంతర్వేది ఆధ్యాత్మిక వేదికగా భాసిల్లుతోంది. అంతేగాక ఇది సాక్షాత్తూ దక్షిణ కాశి. బ్రహ్మపురాణంలోని గౌతమీ మహత్యంలో అంతర్వేది లక్ష్మీనరసింహుని దివ్య కథ వివరించబడి ఉన్నది. కలియుగం ప్రవేశానికి ముందే వశిష్ఠుడు అంతర్వేదిని వదిలి వెళ్లటంతో అర్చనాదులు లేక ఆలయం శిథిలమైందని చరిత్రకారులు చెబుతున్నారు. కలియుగంలో కేశవదాసు అనే మానవుడు స్వామివారిపై పెరిగిన పుట్టలను తొలగించి, విగ్రహాన్ని శుద్ధి చేసి అక్కడే కర్రతో ఒక ఆలయాన్ని నిర్మించి స్వామిని ప్రతిష్ఠించి నిత్య పూజలు జరుపుతున్నారు. అయితే కేశవదాసు ఆలయం మళ్ళీ కొన్నాళ్ళకు శిథిలమైంది. తదనంతరం రాజాబహద్దూర్ కాంద్రేగుల జోగి జగన్నాథరావు దంపతులు ఆలయాన్ని పునర్నిర్మించారు. స్వామి వారికి శ్రీ వత్ససాయి జగపతిమహారాజు వంశపారంపర్యంగా స్వామివారి కళ్యాణ సమయంలో కట్న కానుకలు చదివించే ఆనవాయితీ ఉంది. బెండమూర్లంక వాస్తవ్యులు కొపనాతి ఆదినారాయణ ఈ ఆలయాన్ని, బేడా మండపాలను కీ.శ. 1822 ప్రాంతంలోపునర్నిర్మించారు.

అంతర్వేది ప్రతి ఏటా మాఘశుద్ధ దశమినాటి రాత్రి స్వామి వారి కళ్యాణాన్ని, ఆ మరుచటిరోజు అంటే భీష్మ ఏకాదశి రోజున రథయాత్రని నిర్వహిస్తారు. అంతర్వేది ఉత్సవాలకు దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులు తరలి వస్తుంటారు. అప్పుడు అంతర్వేది సముద్రంలో భక్త సముద్రం సంగమిస్తుంది. ఆ సందర్భాన్ని ఒక మహా సంబరంగా భావిస్తారు. మాఘ పౌర్ణమి రోజున భక్తులు అంతర్వేది సాగరంలో ఆచరించే చక్ర స్నానం... ఒక అపూర్వ దివ్యావనుభం. వెండి వెన్నెలలో మెరిసే భక్త సందోహం అలలై ఉత్సాహంతో ఉప్పొంగే సముద్రం... ఒక సౌందర్య బీభత్సం...భక్త జనోత్సనం.

బాలయోగుల తపోవనం ముమ్మిడివరం

కోనసీమ వేద పండితుల సీమగా భాసిల్లుతోంది. ఈ సీమలో మునీశ్వరులకు నిలయం 'మునివరం' సర్వమతాల వారూ సమైక్యంగా కొలిచే యోగీశ్వరుల తప:స్థలంగా ప్రసిద్ధి చెందిన మునివరమే నేటి ముమ్మిడివరం. ముమ్మిడివరం దక్షిణంవైపున ఒక దళితవాడ ఉంది. ఆ వాడలో కటిదల కుటుంబానికి చెందిన వారు వ్యవసాయం చేస్తూ ఉండేవారు. వారి వంశంలో గంగయ్య, రామమ్మ దంపతులు 1930 అక్టోబరు 23వ తేదీన ఒక బాలునికి జన్మనిచ్చారు. అతనికి సుబ్బారావు అని నామకరణం చేశారు. బాల్యంలోనే సుబ్బారావు తల్లిని కోల్పోగా మేనత్త సుబ్బాయమ్మ అతన్ని పెంచింది. ఆ బాలుడే పెరిగి పెద బాలయోగిగా ప్రసిద్ధమైనట్లు చరిత్రకారులు చెబుతున్నారు. గంగయ్య మూడవ భార్య వెంకమ్మకు 1943నవంబర్ 3వ, తేదీన భూషణం అనే బాలుడు జన్మించాడు. అతనే చినబాలయోగిగా అవతరించారు. ముమ్మిడి వరంలో ప్రతి ఏటా జ్యేష్ఠమాసంలో గ్రామదేవత లంకతల్లెమ్మ తీర్థం జరుగుతుంది.

1946 జూన్ 22 నుంచి అతనే పెద్దబాలయోగిగా ప్రాచుర్యం పొందారు. ఆ తర్వాత నాలుగేళ్ళకు చినబాలయోగి తపోనిష్ఠలో కూర్చున్నారు. అక్కడ బాలయోగీశ్వరులు పద్మాసనం వేసి, తపస్సుగావించారు.

ఆ బాలయోగీశ్వరులను తిలకించేందుకు ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు తరలిరావడం మొదలు పెట్టారు. 1949 ఫిబ్రవరి 6న తన దర్శనార్థం వచ్చిన స్వరాజుతో బాలయోగి మాట్లాడి తన మందిరం తలుపులుకు తాళాలు వేయాలని కోరారు. తన జన్మపరంపరలో ప్రస్తుత జన్మ చిట్టచివరిదని తాను కఠోరదీక్షలో ఉన్నానని, తనకు దీక్షాభంగం కలిగించవద్దని ఆ యోగి కోరినట్లు చెబుతుంటారు. కాగా 1949 ఫిబ్రవరి 26 నుంచి జనం కోరికపై శివరాత్రి మరునాటి నుంచి బాలయోగీశ్వరులు భక్తులకు దర్శనమిస్తూ ఉండేవారు. ఈ యోగీశ్వరులను దర్శించుకునేందుకు ఆంధ్ర, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చేవారు..

❖

గోదావరణీయం

'నది పయనాన్ని పక్షి నేత్రంతో చూసి దాని గమనాన్ని అర్థం చేసుకొని, దాని మలుపులకి పలుకులు దిద్దుకోవడంతోనే మనం సరైన గమ్యాన్ని చేరుకోగలం' – అని సర్ ఆర్థర్ కాటన్ ఎప్పుడో చెప్పారు. అభివృద్ధి క్రమంలో నదీ జలాల్ని ఎక్కువగా సముద్రనీ పాలు చేయకుండా సమర్ధవంతంగా వినియోగించుకోవాలన్న తాపత్రయం వుందే తప్ప, నదిని శుభ్రంగా, పవిత్రంగా, నది చుట్టూ అల్లుకున్న నదీ యానాన్ని సంరక్షించు కోవాలన్న వాంఛ కొంచం కూడా లేకుండా పోతోంది.

భూమి, నీరు, సమస్త జీవరాసుల్ని సుస్థిర పద్ధతుల్లో సంరక్షణ చేయాలని జీవవైవిధ్య సంరక్షణ విధానం చెపుతుంది. జల రాసుల సంరక్షణలో నీరు, జీవవైవిధ్యం, పర్యావరణ రక్షణ అన్నిటిని ఒకదానితో మరొకటిని కలిపి ఏక సూత్రంగా గమనించాలని ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమ సూత్రం పేర్కొంటుంది. ఇది నది చుట్టూ అల్లుకున్న జీవనోపాదులు, ఆర్థిక వ్యవస్థ, నీటి సదు–పాయాలు, భూగర్భ జలాల పునారావృతికి, కోతను అరికట్టడం, నీటి పరిశుభ్రత గురించి వెలువర్చే నదీ జల సంరక్షణ సూత్రం. ఈ ఎకో సిస్టం విధానాన్ని 2005 మిలీనియం ప్రకృతి అంచనా సూత్రం బలపర్చింది. వీటిని విస్మరించి చేపడుతున్న నదీ ప్రక్షాళన కార్యక్రమాలు బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయి.



సవ్వడి కోల్పోతున్న గల గల గోదారి

దురదృష్టం కొద్దీ నదుల్ని జలాలు ఇచ్చే అక్షయ పాత్రలుగాను, మురుగునీ, చెత్తనీ, కాలుష్యాన్ని మోసుకెళ్ళే వాహికలుగాను జమకట్టడం పరిపాటయ్యింది. అభివృద్ధిలో, నది అభివృద్ధి కార్యక్రమాల్లో నదీ పర్యావరణాన్ని, పరివాహక ప్రాంతం, మధ్య ప్రాంతం, వరద ప్రాంతం, తీరస్థ ప్రాంతాల అభివృదిగా పరిగణించక పోవడం విచారకరం. జాతీయ నీటి ప్రణాళికలో పర్యావరణానికి నాల్గవ ప్రాముఖ్య స్థాయి గుర్తించి పేర్కొన్న అంశం, 'నీరు అన్నది పర్యావరణంలో కీలక అంశం, మంచి నీరు ప్రాముఖ్యం, కొరతని గుర్తించడం చాల అవసరం, జీవన మనుగడకి ఇది ప్రముఖమైనదని గుర్తించాలి.' 1884 ఆంధ్ర ప్రదేశ్ (ఆంధ్రా ప్రాంతం) నదీ కన్జర్వేన్సి చట్టంలో నదీ సంరక్షణ గురించి చాలా వివరంగా పేర్కొంది. నది చుట్టూ కట్టడాలు, మొక్కలు నాటడం, వ్యవసాయం గురించి సర్వేలు, నదీ సంరక్షణ అధికారుల నియామకం వంటివి. నదీ సంరక్షణ అంశాల గురించి ప్రజలకి అందుబాటుగా కచేరీలలో ప్రస్తావించాలని వివరించింది. ఈ విషయాల్ని పొరపాటున కూడా పాటించలేదు. అందుకే నేడు నదులకి ఈ దుస్థితి పట్టింది. మన దేశంలోని మూడవ నది అయిన గోదావరికీ ఈ అవస్థ తప్పలేదు. దేశంలో 10% భౌగోళిక ప్రాంతంలో ప్రవహించే ఈ నది అస్తిత్వాన్ని కోల్పోతోంది.

పశ్చిమ కనుమల్లో ఉద్భవించి, డెక్కన్ ప్లాటో ద్వారా ప్రవహించి తూర్పు కనుమల్లో గుండా వెళుతూ సముద్రంలో కలిసే గోదావరి అస్తిత్వం మారిపోడానికి ముఖ్య కారణం ఈ

కనుమల రూపు రేఖలు మారిపోవడం. కొండల ప్రాంతం సురక్షితంగా వుంటేనే పల్లపు ప్రాంతాలు సౌభాగ్యంగా వుంటాయి. కానీ గనులు, గ్రానైట్ క్వారీలు, ఇసుక తవ్వకాలు, విస్తృతంగా ఏర్పడిన పరిశ్రమలు, నగరీకరణం ఈ కనుమల్ని అభివృద్ధికి ముడి సరుకులు అందించే ప్రాంతాలుగా మార్చేసింది. ఈ ప్రాంతాలలోని పర్యావరణ మార్పుల వల్ల వాతావరణ మార్పులు ఏర్పడుతున్నాయి. నేడు జాతీయ పర్యావరణ మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలనుండి వాతావరణ ప్రణాళికల్ని కోరుతోంది. 2008లో ప్రస్తావించిన జాతీయ కార్యాచరణ ప్రణాళిక 2014 వరకు ఆచరణలోకి రాలేదు. దీనికి ఆర్థిక కారణం ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. వాతావరణ మార్పులు విపత్తులుగా మారకుండా తగు జాగ్రత్తలు పాటించాలంటే సుస్థిర భూవినియోగ పద్ధతులు, గనులకు సంబంధించిన, అడవుల అభివృద్ధి , పారిశ్రామిక ప్రణాళిక, నదీజలాల సంరక్షణ, నగరీకరణ వంటి పలు చట్టాలలో ఒక సమన్వయం ఏర్పడాలి. పర్యావరణాన్ని, ప్రకృతిలోని వనరుల్ని కేవలం ఒక రాష్ట్ర భౌగోళిక సరుకులులా కాక ప్రకృతిలోని జీవ వైవిధ్య వ్యవస్థగా అర్థంచేసుకోవాలి.

పర్యావరణాన్ని ఒక జీవ వ్యవస్థ గుర్తించి కేవలం పశ్చిమ కనుమల విషయంలో కస్తూరి రంగన్ నివేదిక ఆధారంగా ప్రజల అభిప్రాయాల్ని పరిగణలోకి తీసుకుని 6 రాష్ట్రాలు పశ్చిమ కనుమల సంరక్షణకి సంబంధించి నివేదికలు సమర్పించాలని కేంద్రం కోరింది.

పశ్చిమ కనుమలకి మాత్రమే వున్న ఈ ప్రతిపత్తిని తూర్పు కనుమలకి వర్తించేటట్టు చేయాలి. అప్పుడు గోదావరి గుండె సవ్వడి వినపడుతుంది. లేకపోతే గోదావరి జలాలు కేవలం ఆనకట్టలు నిర్మించుకునే వనరులుగానే కనబడతాయి. స్వాతంత్ర్యానికి పూర్వం గోదావరి పైన కట్టిన ముఖ్య ఆనకట్టల్లో ధవళేశ్వరం, నిజాంసాగర్, కదన డ్యాం, ప్రవర ప్రముఖమైనవి. తర్వాత వచ్చిన వాటిల్లో మల్టీ పర్పస్, ఇరిగేషన్ ప్రాజెక్టులు జైక్వాడి, శ్రీరాం సాగర్, కదం, ఎగువ ఇంద్రావతి, సింగూర్, గోదావరి బ్యారేజి. అన్నిటికంటే నేడు తలపెట్టిన పోలవరం ప్రాజెక్టు అతి కీలకమైనది. దీనికోసం నిర్వాసితులైన గిరిజనుల్ని ప్రాజెక్టు బాధితులుగా కాక ప్రాజెక్టు కోసం తమ ఉనికిని త్యాగం చేసిన వారిగా గుర్తించాలి.

1960 నుండి కేంద్ర జల కమిషన్ గోదావరి బేసిన్‌లో జల అధ్యయనం చేస్తోంది. అందుకోసం ఇప్పటివరకు 48 కేంద్రాల్ని స్థాపించింది. కాలక్రమేణా నదీజలాల కాలుష్యం పెరిగిపోతూంది. రాజమండ్రిలో, చుట్టుపక్కల గోదావరి జలాల మీద ఆధారపడిన పరిశ్రమలు క్రమేణా పెరుగుతున్నాయి. గోదావరి ప్రాంతంలోని తూర్పు గోదావరి జిల్లాలో పంటభూముల వినియోగం, స్వరూపంలో చాల మార్పులు సంభవించాయి. కోనసీమ ప్రాంతంలో వరద, తుఫాన్ల విపత్తుతో పాటు గ్యాస్ విస్ఫోటనల విపత్తులు మొదలైయాయి. ఇటువంటి విపత్తుల నుండి నష్టం వాటిల్లకుండా, ప్రమాదాన్ని అరికట్టి దాన్ని జాతీయ స్థాయిలో వాన్ కాల్ సిస్టం- టోల్ ఫ్రీ అలెర్ట్ సర్వీస్ ప్రవేశ పెట్టాలని అమెరికా నిపుణులు ప్రస్తావించారు. ఇక పంట విధానాలని చూస్తే ప్రకృతి వైపరీత్యాలనుండి నష్టాల్ని తట్టుకునే పంట విధానాలు ప్రవేశ పెట్టాలి.


ఒకప్పటి గోదావరి, ఆ నది అందాలు ఇప్పుడు లేవు. నగరరీకరణం ఆ నదిని దోచేస్తోంది. ఆర్థిక మంత్రి చైర్మెన్ గా వున్న క్యాబినెట్ సబ్ కమిటి అంచనాల ప్రకారం గత 10 సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్రం ఇసుక మాఫియాల వల్ల 10,000 కోట్లు నష్టం జరిగిందని తాజా అంచనాలు. మరి ఇందులో గోదావరమ్మ వాటా నష్టం ఎంతో! మైనింగ్ కొత్త చట్టంలో మైనింగ్ జరుగుతున్న (షెడ్యుల్ ప్రాంతంలో) మైనింగ్ వల్ల వస్తున్న లాభాల్లో 25% వాటా స్థానిక ప్రజల అభివృద్ధికి కేటాయించాలి. మరి అటువంటప్పుడు పంచాయతీల ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సహకారంతో చేపడుతున్న ఇసుక వేలంలో వచ్చే ఆదాయంలో, నదీ సంరక్షణకి, అభివృద్ధికి ఇవాల్సిన వాటా కూడా కల్పించి అది సక్రమంగా వినియోగపడేలా చూడాలి. అంతే కాని దోచుకునే నగర పోకడలు గ్రామాలకి సోకనీయ రాదు, అది సోకితే నగరంలో నది ఎలా కలుషితం అవుతుందో, అదే రూపంలో వూర్లోని నదీ తీరం నీరింకని పొడి నేలవుతుంది. అప్పుడు గోదావరి బాపు బొమ్మగా, పాపికొండల గాలి సవ్వడి పాటగా అగుపించదు, వినిపించదు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు కరువు ప్రాంతాలుగా పరిగణలోకి వచ్చాయి. నదులు వున్నా లేకున్నా. ఇలానే కొనసాగితే జలంని ఇముద్చుకోలేని బీడు భూమిగా ముందు తరాలకి ఈ ఆవరణాన్ని అందిస్తాం, మరణభూమిలోని చరమ గీతంలా...

నదీసంరక్షణ ఒక ప్రకృతి ధ్యానం

నదుల సంరక్షణలో ప్రజా ప్రమేయంతో చేపట్టిన రెండు కార్యక్రమాలు చాల క్రియాశీలక పాత్ర వహించాయి, అవి నీటి యాజమాన్య సంఘాలు, వన సంరక్షణ సమితులు. వీటిలో ఎక్కువ శాతం ప్రత్యక్ష పాత్ర వహిచింది నీటి యాజమాన్య సంఘాలు, పరోక్ష పాత్ర వహించింది వన సంరక్షణ సమితులు. ఈ రెండూ ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో నడిచినవే. సుమారు రెండు దశాబ్దాలకు పైగా ఉధృతంగా కొనసాగి ఇప్పుడు సొమ్మగిల్లిన పరిస్థితుల్లో వున్నాయి. వన సంరక్షణ సమితులకు చట్టరీత్యా హక్కులు లభించక, ఉత్తర్వుల అనుసారం వచ్చినవి వాస్తవ రూపం దాల్చక నీరు గారి పోయాయి. ఇక నీటి యాజమాన్య సంఘాల ప్రస్తావనకి వస్తే ముఖ్యంగా రాజకీయ అధికారం కోసం ఎదిగే మెట్లుగా మారి పోయాయి.

అలానే నీరు భూమితో ఇమిడివున్న వ్యవస్థలైన నీటి సంఘాలు , రైతు సంఘాలతోపాటు, నగరాలలో సి.ఎస్.ఆర్ (కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి) వ్యవస్థలకి నదీ జలాల సంరక్షణలో సముచిత పాత్ర కల్పించాలి.మరి ఇప్పుడు కొత్తగా వచ్చిన నీరు – చెట్టు (గతంలో నీరు- భూమి) చెట్లు నాటడం అన్న నినాదంగా మారకుండా ముందుకు కొనసాగాలంటే ఈ సంఘాల్ని వాటితో కలిపి చేసే భాగస్వామ్య వ్యవస్థగా ప్రయోగాలు చేయాలి.

ఇప్పుడు జరుగుతున్న ప్రక్రియలో కొన్ని చేసిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ, కొనసాగే ప్రయోగాల్లో మరి కొన్ని వినూత్న ప్రయోగాలుండాలి. ఏ ప్రయోగాలైనప్పటికి గోదారిని ముందు తరాలకి గోదావరణీయంగా అందిస్తే పుష్కర స్నానం వల్ల నదీ జలాల పవిత్రత మనలో ఇముదుతుందన్న ఆశ.



జి. సత్య శ్రీనివాస్

గోదావరి
మహా పుష్కరం 2015

చైతన్య గోదారి

తరాల తరగలెత్తి సాగే
సంస్కరణోద్యమ ప్రవంతి

ఈ మట్టిలో పుట్టి, ఈ గాలుల్ని పీల్చి, ఈ చైతన్య గోదారి ఒడిలో ఒదిగి ఎదిగాను. కొమ్మల చేతులు సాచి ఎంత విస్తరించినా, కుదుళ్లు మాత్రం పుట్టిన పురిటిగడ్డని ఆశ్రయించుకొని ఉండే చెట్టు నా ఆదర్శం; తల్లి గోదారి సీమే నా తరగని స్ఫూర్తి. చైతన్యం నిత్య స్రోతస్విని గోదావరై ప్రవహించే ఉభయగోదావరి జిల్లాలు ఎన్నో సంస్కరణోద్యమాలకి పుట్టినిళ్లు. గోదావరి ఉద్యమాలను, ఇతర ప్రాంతాల ఉద్యమాలనీ తరిచి చూసినప్పుడు, చెదరని ధృఢత్వానికీ, కరుడుగట్టిన కాఠిన్యానికి తేడా తెలిసి వస్తుంది. విద్వేషాంశ మచ్చుకైనా లేని నా ప్రాంతపు సంస్కరణోద్యమాల సంక్షిప్త పరామర్శ ఇది.

ఇంగ్లీషు చదువులు– కొత్త చైతన్యం

ఆధునిక భారతదేశంలో లానే ఆంధ్రదేశంలో ఇంగ్లీషు విద్యా విధానం గొప్ప చైతన్యానికి దారి తీసింది. మద్రాసు విశ్వవిద్యాలయం స్థాపించబడడంతో ఇంగ్లీషు విద్యతో పాటు సంస్కరణ వాదం భావాలు సత్వరం విస్తరించాయి. ఇందులో భాగంగా హేతువాదం, మానవతా వాదం మరియు సంస్కరణ వాదం వంటి వాదాలు బయిల్దేరాయి. ఫలితంగా సమాజంలో మొట్టమొదటిసారిగా చైతన్యవంతమైన మధ్య తరగతి మేధావి వర్గం ఆవిర్భవించింది.

19వ శతాబ్దంలో వచ్చిన రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిణామాల నేపథ్యంలో అదే శతాబ్దంలోని ఉత్తరార్థంలో తలెత్తిన సాంఘిక సంస్కరణోద్యమాలకు గోదావరి తీరం నెలవయ్యింది. సమకాలీన భరతంలో బెంగాల్, మహారాష్ట్ర పంజాబ్ లాంటి ప్రాంతాలలో ఇలాటి ఉద్యమాలు ఎన్నో వచ్చాయి. వాటిలో భాగంగానే గోదావరి ఉద్యమాల్ని కూడా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

భారతదేశంలో సామాజిక చైతన్యానికి నాంది పలికిన బ్రహ్మసమాజం శాఖ 1857లో రాజమండ్రిలో స్థాపించబడింది. ఆంధ్రలో బ్రహ్మ సమాజానికి కాకినాడ మరో ప్రధాన కేంద్రమైంది. కాకినాడ ప్రార్థనా మందిరం బ్రహ్మసమాజం యొక్క శాఖగా 1888లో స్థాపించబడింది. బ్రహ్మ సమాజం కులమతాలతో ప్రమేయం లేని నిర్గుణోపాసనను ప్రచారం చేసింది. స్త్రీ విద్యను ప్రోత్సాహించడం, స్త్రీ వితంతు వివాహాలను ప్రోత్సాహించడం, సాంఘీక దురాచారాలైన వేశ్యవృత్తి ప్రదర్శనను బహిష్కరించడం సమాజం యొక్క ఇతర ఉద్దేశ్యాలైనాయి.

బ్రహ్మసమాజ ప్రభావానికి గురైన ఆత్మూరి లక్ష్మినరసింహం వితంతు పునర్వివాహ సంఘం స్థాపించారు. వీరేశలింగంలో బ్రహ్మసమాజ భావనల్ని పాదుకొల్పిన తొలి తరం సంస్కర్త లక్ష్మినరసింహం. ఈ విధంగా ఆయన కృషి వల్ల సంస్కరణ వాదం బలపడి వీరేశలింగం కాలం నాటికి అది పరిపక్వతకు చేరుకుంది.

కందుకూరి వీరేశలింగం

ఎందుచూచిన అంధకారపు
బంధురంబగు ఆంధ్ర జాతిని
మేలుకొల్పిన మేటి శూరుడు
కందుకూరికి వందనాలు.

ఇది నా చిన్నతనంలో నేను కందుకూరి వారికి ఇచ్చిన అక్షర నివాళి. 1878లో వీరేశలింగం ప్రార్థనా సమాజం అనే పేరుతో బ్రహ్మసమాజ శాఖను రాజమండ్రిలో స్థాపించారు. సత్య సంవర్థిని అను పత్రిక ద్వారా వీరేశలింగం బ్రహ్మసమాజ భావాల వ్యాప్తికై కృషి చేశారు. దేశిరాజు పెదబాపయ్య యొక్క చొరవతో వీరేశలింగం 1905 పిఠాపురం మహరాజ ఇచ్చిన విరాళంతో హరిజనుల కోసం పాఠశాలను స్థాపించారు. హితకారిణి సమాజం ద్వారా ఆయన బ్రహ్మసమాజ భావాలకు అనుగుణంగా తన సంస్కరణ వాదాన్ని కొనసాగించారు. నవయుగ వైతాళికుడిగా వీరేశలింగం సంస్కరణ వాదానికి కేంద్ర బిందువయ్యారు. ఆయనతో సంస్కరణోద్యమం ఆంధ్రలో నలుమూలల వ్యాపించింది. ఆంధ్ర దేశపు రామ్మోహన్‌రాయ్ గాను, వితంతు పునర్వివాహ పితామహుడిగాను , దక్షిణ భారతదేశ ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌గాను ఆయన ప్రసిద్ధులయ్యారు. అయితే, కందుకూరి వారి గొప్ప కాంట్రిబ్యూషన్ మరొకటి ఉంది. తన సమకాలీన సంఘాన్ని, తర్వాత తరాలను మాత్రమే కాదు, నివాళి కవితతో స్మరించుకున్న నా సహధ్యాయుల తరాన్ని కూడా ప్రభావితం చేయడమే కందుకూరి వారి స్ఫూర్తిదాయక ఉద్యమానికి ఫలశ్రుతి.

బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడు వీరేశలింగం యొక్క సమకాలీకుడిగా ఆంధ్రలో సంస్కరణ వాదిగా బ్రహ్మర్షి మరో కేంద్రమయ్యారు. వీరేశలింగం, దేశిరాజు పెదబాపయ్యలతో పాటు బ్రహ్మ సమాజ త్రయంలో ఒకరిగా పేరొందారు. విద్యార్థి దశలోనే రవీంద్రనాథ్ ఠాగూర్ మరియు కేశవ్ చంద్రసేన్ రచనలతో ప్రభావితులై బ్రహ్మసమాజం పట్ల ఆకర్షితులయ్యారు. బహుభాషావేత్తగా పర్షియన్, అరబిక్, ఉర్దూ భాషలను అధ్యయనం చేసి ఇస్లాం మతం యొక్క సారాన్ని గ్రహించారు. మానవతివాదిగా సమాజ సేవ భగవంతుడి సేవగా భావించి, మద్రాసులో మున్నవ బుజ్జయ్య పంతులు యొక్క ప్రభావంచేత బ్రహ్మ సమాజంలో చేరారు. గొప్ప సాహితివేత్తగాను తన ఘనతను చాటుకున్నారు. మద్రాసు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా పనిచేసిన మొట్టమొదటి ఆంధ్రుడైనారు. సర్వ మానవ సమానత్వాన్ని చాటినందుకుగాను బ్రహ్మర్షి అనే బిరుదును పొందారు.

దేశిరాజు పెదబాపయ్య

బ్రహ్మసమాజ త్రయంలో ఒకరిగా వీరేశలింగం మరియు రఘుపతి వెంకటరత్నంలకు మార్గదర్శకుడైన వారు దేశిరాజు పెదబాపయ్య. సాంప్రదాయాలను వ్యతిరేకించిన అభ్యుదయ వాది.

కందుకూరి వారి శకం

వీరేశలింగం అనంతర యుగంలో ఆయన సంస్కరణ వాదం, అభ్యుదయ వాదాలను చిలకమర్తి లక్ష్మి నరసింహం, ఉన్నవ లక్ష్మినారాయణ మరియు బసవరాజు అప్పారావు కొనసాగించారు. చిలకమర్తి వారు అంటరానితనం నిర్మూలనకి, హరిజనోద్ధరణకి పాటుపడ్డారు.


కందుకూరి వీరేశలింగం తర్వాత, ఆయన ఒక కాలిక చైతన్యంగా ఆయన నేతృత్వంలో ఉవ్వెతున ఎగసిన సంస్కరణోద్యమాల వల్ల ఆంధ్రదేశ చరిత్రలొ ఆధునిక యుగం ఏర్పడింది. ఆ యుగారంభానికి ఆ ఉద్యమాలు దోహదం చేయడమే కాకుండా, తరువాత విజృంభించిన రాజకీయ ఉద్యమాలకు పూర్వ రంగాన్ని సిద్ధం చేశాయి.



– మేడిశెట్టి తిరుమల కుమార్
ఐఆర్ఎస్

గోదావరి కితకితలు


పుష్కరాలకు జనాలు రాక పోవటం కాదు.
నువ్వు మునిగింది గోదావరి లోన కాదు.
కృష్ణలోన!!


మాంగల్య బలం అంటే ఇదే నండీ,
పోయిన పుష్కరాలకు తప్పిపోయాం
మళ్ళీ ఇలా... !


ఆన్‌లైన్లో బుక్ చేసుకుంటే
గోదావరి నీళ్ళు డోర్ డెలివరి ఇస్తారట
బుక్ చేసేయమంటారా ?
Raju


వర్షాల కోసం తీవ్రంగా తపస్సు
చేసింది తామరేనా ?



షడ్రుచుల దరిని రసన గోదారి

గోదావరి జిల్లాలంటే పచ్చదనాల సిరి మాత్రమే కాదు, వడ్డించిన విస్తరి కూడా. సంస్కృతికి గోదావరివాసుల భోజనప్రియత్వం తనదైన ముఖాన్ని జతచేసింది. పాకశాస్త్రాన్ని ఒక కళగా మార్చి, గోదావరికే సొంతమైన రుచులకి ఖండాంతర ఖ్యాతి సముపార్జించి పెట్టింది కూడా ఆ భోజన ప్రియత్వమే. ఆతిథ్యానికి కూడా పెట్టింది పేరైన ఉభయ గోదావరి జిల్లాల్లో తయారు చేసే పిండి వంటలు తలుచుకుంటే చాలు నోరూరిపోతుంది.

పాలకొల్లు నేతి అరిసెలు

తింటే పాలకొల్లు నేతి అరిసెలే తినాలి అంటారు మన వాళ్ళు. బియ్యం పిండి, బెల్లం, నెయ్యితో తయారు చేసే అరిసెలు రుచి వర్ణించ లేనిది. నేతితో తయారుచేసిన అరిసెలు వాసన వస్తేనే జిహ్వ జివజివలాడిపోతుంది. ఎన్నితిన్నా మొహంమొత్తని మహత్తరమైన రుచే పాలకొల్లు నేతి అరిసె.

నత్తా రామేశ్వరం కాజ

పశ్చిమ గోదావరి జిల్లాలో పెనుమంట్ర మండలంలోని నత్తా రామేశ్వరం గ్రామంలో తయారుచేసే కాజా ఖ్యాతి ఎప్పుడో ఖండాంతరాలు దాటిపోయింది. తెంపులేని కులాసా కబుర్ల కాలక్షేపానికి ఈ కాజాతోనే బోణీ కొట్టాలి. పెళ్లి పందిళ్లకి కోనసీమ కొబ్బరాకు ఎంత ముఖ్యమో, పెళ్లి విందుకి ఈ నత్తా రామేశ్వరం కాజా కూడా అంతే ముఖ్యం.

అత్తిలి పూతరేకులు

ఉలిపిరి మడతల పల్చని పంచదార పొరల్లో చెయ్యెత్తు మనుషుల్ని కట్టిపడేసే పూతరేకులు చూస్తుంటే, గడ్డిపోచలతో ఏనుగుని కట్టేసినట్టు విన్న కథలు వింతేమీ అనిపించదు. పూతరేకుల విషయంలో గోదారికి ఆ దరిని ఆత్రేయపురం, ఈ దరిని అత్తిలి అమెరికా దాకా చుట్టేశాయి. తెలుగు రాష్ట్రాల మూలమూలలకీ పాకి, ముందు ఇంట గెలిచి, ఆపైన, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రధాన నగరాలకు, అమెరికా, ఇంగ్లాండ్ వంటి ఇతర దేశాలకు ఎగుమతి అవుతూ రచ్చ కూడా గెలిచేశాయీ పూతరేకులు. వీటిని పంచదార, బెల్లం, నెయ్యి, జీడిపప్పు వంటి మిశ్రమంతో అత్యంత తియ్యదనంతో తయారు చేస్తారు. తినటం వరకూ కాదు, వీటిని చూస్తే చాలు ప్రతి ఒక్కరికీ నోరూరుతుంటుంది.

బూరుగుపల్లి బెల్లం

బూరుగుపల్లి బెల్లానికి మంచి గుర్తింపు ఉంది. గోదావరి తీర ప్రాంత రైతులు పండించే ఈ బెల్లం అమృతం అంటుంటారు. అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ శాస్త్ర వేత్తల ప్రశంసలు అందుకున్న బూరుగుపల్లి బెల్లం ఆయుర్వేద మందుల్లోనూ ఉపయోగిస్తారు. అందుకే బూరుగుపల్లి పేరు చెప్పగానే అత్యంత రుచికరమైన బెల్లం గుర్తుకు వస్తుంది ప్రతి ఒక్కరికి.

చించినాడ కాజా పలావ్

హైదరాబాద్‌లో దమ్ బిర్యానీ ఎటువంటి రుచిని ఇస్తుందో చించినాడ కాజా పలావ్ కూడా అదే తరహా రుచిగా వుంటుంది. దీనిని పలావ్ రుచి అందరికీ తెలుసు కానీ చించినాడ కాజా పలావ్ మాత్రం కొందరికే తెలుసు. దీనిని ఒక్కసారి తింటే మళ్ళీ,మళ్ళీ తినాలనిపిస్తుంది అంటారు. వారంలో మూడు రోజులు మాత్రమే దీనిని తయారు చేస్తారు. ఇది కావాలనుకునేవారు ముందుగా ఆర్డర్ ఇచ్చిన వారికి మాత్రమే దొరుకుతుందట. ఈ పలావ్ కోసం అనేక దూర ప్రాంతాల నుంచి పలావ్ ప్రియులు వస్తుంటారు. ఇది చించినాడ బైపాస్ రోడ్ కాజా లో ఓ దుకాణంలో తయారయ్యే ఈ పలావ్‌ని కాజా పలావ్‌గా పేరు సంతరించుకుంది.

పాలకొల్లు సోంపాపిడి

పాలకొల్లులోతయారయ్యే సోంపాపడి అత్యంత తియ్యదనంతో రుచిగా ఉ ఒడటంతో పాటు నాలుక మీద పెట్టగానే కరిగిపోతుంది. పాలకొల్లు గుర్తురాగానే సోంపాపడి గుర్తుకు వస్తుంది. దీనిని పీచుగాను, బిళ్ళలగాను తయారు చేస్తుంటారు. ఈ పిండి వంటకం రాష్ట్ర నలుమూలల విశిష్టత సంతరించుకున్నది.

ఇలా చెప్పుకుంటే పోతే, తాపేశ్వరం కాజా, ఆత్రేయపురం పూతరేకులు, పెరుమాళ్లపురం పాకం గారె, అంబాజీపేట పొట్టిక్క, గొల్లల మామిడాడ ఇమిర్తి, పులస పులుసు, మామిడి తాండ్ర, గంగరాజు పాలకోవ... ఈ జాబితా చాంతాడంత. ఇక స్థానికంగా చేసుకునే చిరుతిళ్లకి అంతే లేదు: తరవాణి కుండ అన్నం, కొత్తెక్క బుట్టలు, విశ్వేశ్వరాయపురం వాసినపోలె, గరాజు, మొక్కగుడ్లు!

రెండు జిల్లాలలోని ప్రతి ప్రాంతం ఏదో ఒక చవులూరించేవంటకానికి పెట్టింది పేరుగా చెప్పుకుంటారు. సరిపాళ్ల షడ్రుచుల కిటుకు తెలిసిన రసన గోదారిలో వాడవాడలా నలభీములే, ఆ దరి... ఈ దరి!



పెరుమాళ్ళ నాగరాజు
మీడియా లైజనింగ్ అధికారి

గల గల పారుతున్న గోదారిలా...

తెలుగు సినిమా పాటల్లో ప్రవహించిన గోదావరి



కవిత్వపు ఊటకి, గోదావరి ఏటికి సముద్రమంత సంబంధం అన్నారు సినీ గీత రచయిత చంద్రబోస్ ఒకానొక సందర్భంలో ... తెలుగు సినీ కవులు తమ పాటల్లో గోదావరిని ఉపయోగించుకున్న తీరు, రకాలుగా ఆ గోదావరి వారి ఊహల్లో ప్రవహించిన తెన్ను – గమనించి చూస్తే పై కవిత అక్షర సత్యంగా అనిపిస్తుంది.

అలా కనుచూపు సాగినంత మేరకు ఓ సారి పరికిస్తే మొట్టమొదట స్మరించదగ్గ, నమస్కరించ దగ్గ గీతం – వేదం లా ఘోషించే గోదావరి (ఆంధ్ర కేసరి). ఆది కవి నన్నయ కావ్యరచన, శ్రీనాథ కవి ముచ్చట్లు, గజపతులు ఏలిన తీరుతో సుందర నగరమైన రాజమహేంద్రవరం (నేటి రాజమండ్రి)కి గల శతాబ్దాల చరిత్ర – వీటిని గౌతమి హోరుతో అత్యంత రమణీయంగా అందమైన అన్వయింపుతో ముడిపెట్టింది ఆరుద్ర కలం .

ఇక తర్వాత చెప్పుకోదగ్గ పాట – ఉప్పొంగెలే గోదావరి ఊగిందిలే చేలో వరి (గోదావరి). ఇది ఇప్పటి గోదావరి తీరాన్ని, ఆ తీరాన్ని ఆశ్రయించుకుని ఉన్నవారి జీవన విధానాన్ని – అందంగానే కాకుండా కళ్ళకు కట్టినట్టుగా 'బ్రతుకు తెరువు ఎదురీతేగా' అంటూవర్ణించిన పాట. మధ్యలో 'ఏం తగ్గింది మా రామయ్య భోగం ఇక్కడా' అంటూ వేటూరి తనలోని మరో కోణమైన ఆధ్యాత్మిక ప్రత్యేకతని చాటుకుంటూ 'నది ఊరేగింపులో పడవ లాగ' అనే వాక్యంతో కవితాత్మకంగా నిలబెట్టిన పద్ధతి ప్రశంసనీయం.

గోదావరి నది, ఆ పరిసర ప్రాంతాలు, వాటి అందచందాలు అనగానే తెలుగు

వారికి గుర్తొచ్చేది బాపు-రమణ. సినిమా ఏదైనా సరే మాటలు రాసుకోవాలంటే ఆ నది మీదే ఒక లాంచ్‌ని బుక్ చేసుకుని రాసుకునే వారు రమణ గారు. ఇక కథ, పాత్రలు అన్నీ అ నదిని కొద్దో గొప్పో, ఒక్కోసారి పూర్తి స్థాయిలోనో స్పృశిస్తూ ఉంటాయి. అక్కినేని నాగేశ్వరరావు వంటి అగ్ర కథానాయకుని తో గోదావరి నది మీద మొత్తం ఒక సినిమానే తీసిన ఘనత వారిదే. ఆ సినిమాలో 'కురిసే వెన్నెల్లో మెరిసే గోదారిలా – మెరిసే గోదారిలో ఎగసి పడే నురగలా' అంటూ డాక్టర్ సి నారాయణ రెడ్డి గారు రాసిన పాట గోదావరిపై వచ్చిన పాటల్లో చెప్పుకోదగ్గది. గోదావరి నది ఒక్కోసారి ఒక్కోలా వుంటుంది. ఆ మార్పులన్నిటినీ – బాల గోదారి, వరద గోదారి, శాంత గోదారి అంటూ వర్గీకరణ చేసి ఆయా సమయాల్లో గోదావరి ఎలా వుంటుందో రసాత్మకంగా వర్ణించి చెప్పిన సినారె కవితాత్మను 'అరెరే సినారె – ఎంత చక్కగా రాసేసినారె' అని అభినందించకుండా వుండలేం.

గోదావరి నది అంద చందాలు, అక్కడ బ్రతికే అందమైన జీవితాలు ఒక ఎత్తయితే – అదే గోదావరి పై తమ జీవనం కోసం ప్రాణాలకు తెగించి పోరాడే మత్స్యకారుల గురించి చంద్రబోస్ "గుండెల్లో గోదారి' సినిమాలో రాసిన 'గుండెల్లో గోదారీ పొంగి పొరలుతోందీ – గోదారే రాదారై నన్ను నడుపుతోందీ' పాట – గోదావరి నదిపై వచ్చిన పాటల వరుసలో మరొక ప్రత్యేక ఆసనం వేసి కూర్చోబెట్టదగ్గ పాట.

ఇందులో – అడుగడుగునా అలజడులు సుడులు తిరుగు ఒడిలో – అలసట, వెను తిరుగుట వినబడని వరద బడిలో – పౌరుషం పడవలా సాగు వేళలో, సాహసాలలో – అలలు గురువులు తెలపని పాఠాలు నేర్పుతాయని, వరములకు దొరకని భాగ్యాలు వలలు వెతుకుతాయని చెబుతూ – జీవితం అనే ఎగుడు దిగుడు కథలో పొలస చేపలా ఎదురీదాలని అప్పుడు గాలివాటుకి ఏర్పడిన నీటి కోటకి రాజువి నువ్వు అవుతావని చెప్పారు చంద్రబోస్. గాలివాటు జీవితం అస్థిరత్వానికి ప్రతీక. నీటి కోట అనేది ఒక అందమైన ఊహ. నీటి బుడగలో ఇంద్ర ధనుస్సు రంగులు చూసినట్టుగా అస్థిరత్వానికి అందమైన ఊహతో జత కలిపి ఆత్మ విశ్వాసాన్ని ప్రేరేపించారు చంద్రబోస్. అంతేకాదు, గోదావరి నది వరదల్లో కొట్టుకొచ్చే పొలస చేపతో పాటు బురద కొయ్య, మట్ట గిడస, ఇలస, సందువ వంటి చేపల్లోని రకాల్ని కూడా పేర్కొనడం జరిగింది. గోదావరి నదిపై బ్రతికే మత్స్య కారులని మోటివేట్ చేసే పాట ఇది తప్ప మరొకటి లేదంటే అతిశయోక్తి కాదేమో !?

రామాయణంలో పిడకల వేటలా ఈ సందర్భంగా ఓ జోక్‌ని చెప్పుకోవాలి. అక్కినేని నాగేశ్వరరావు గారికి పొలస చేపల కూరంటే ఇష్టం. బాపు– రమణల సినిమాలన్నిటికీ రమణ గారే ప్రొడక్షన్ వ్యవహారాలు కూడా చూసుకుంటారు. 'అందాల రాముడు' సినిమా షూటింగ్ టైమ్ లో పొలస చేపల కూర వుంటే బావుంటుందని ముచ్చట పడ్డారు అక్కినేని. 'అవి వరదలొచ్చినప్పుడు వస్తాయ'ని చెప్పారు రమణ గారు. 'అయితే వరదల్ని రప్పించే ఏర్పాటు కూడా చూడండి' అని హీరోగా డిమాండ్ చేశారాయన సరదాగా (అందుకేనేమో పుస్తెలమ్మి అయినా పొలస చేపల కూర తినాలన్న సామెత గోదావరి నది ప్రాంతంలో ఎక్కువగా వింటుంటాం).

గోదావరికి, తెలుగు వారి ఆరాధ్య దైవమైన రాముడికి గల సంబంధం అవినాభావం. అందుకే భద్రాచలంలో ఉన్న ఆ రాముడిని చూడాలంటే – 'మా తల్లి గోదారి చూపంగ దారీ ... పడవెక్కి భద్రాద్రి పోదామా ... భద్రాద్రి రాముణ్ణి చూద్దామా – అంటూ' సాకీలా ఎత్తుకున్నారు ఆరుద్ర 'అందాల రాముడు' లోని హరికథలో. అదే ఈ తరానికొచ్చేసరికి ఆ రాముడికి గుడి కట్టడానికి కంచెర్ల గోపన్న (రామదాసు) సతీ సమేతంగా వస్తుంటే – మన సీతారామస్వామికి మంచి ఘడియ రాబోతున్నట్టు – అంటూ మొట్టమొదటి వైబ్రేషన్స్ (తొలి శుభ శకునాలు) గోదావరి లోనే మొదలయినట్టుగా 'ఏటయ్యిందె గోదారమ్మ ఎందుకింత ఉలికిపాటు గగురుపాటు' (శ్రీ రామదాసు) అని రాశారు సుద్దాల అశోక్ తేజ.

ఇప్పటి వరకూ పేర్కొన్న పాటల్లో గోదావరి నది ఒక ప్రస్థానంలా సాగింది. ఇక కేవలం ఒక ప్రస్తావన లా మాత్రమే ఉదహరించబడ్డ పాటలైతే చాలానే వున్నాయి.

'గోదారీ గట్టుందీ' (మూగమనసులు) పాటలో మొదలు మాత్రమే గోదావరి. తర్వాత అంతా గట్టు మీద ఉన్న పిట్ట (జమున పాత్ర) గురించే. జమున పాత్రకి ఆ పాట ఇంట్రడక్షన్ సాంగ్ కాబట్టి, ఉన్న పరిమితులు అంతే కాబట్టి అంతే రాయదలిచారు దాశరథి.

'మూగమనసులు'లో ఏ గౌరి (పాత్ర) ఆయనకు పరిమితులు విధించిందో అదే గౌరి (సినిమా) 'గల గల పారుతున్న గోదారిలా – రెప రెపలాడుతున్న తెరచాపలా' అంటూ ఆయనకి రాయడానికి మరింత వెసులుబాటు కల్పించింది. ఈ పాట ఇచ్చిన హిట్‌ని నేటి రచయిత కందికొండ అందుకుని అదే పల్లవితో 'పోకిరి' లో మరో హిట్ సాంగ్ రాశారు. ఆ హిట్ కందికొండని వదల్లేదు. మస్కా చిత్రంలో 'గుండె గోదారిలా' అనే పాటని రాయించింది.

తర్వాత ఇక్కడ మళ్ళీ 'మూగమనసులు' లో కొస్తే 'ముక్కు మీద కోపం' పాటలో "తల్లీ గోదారికీ ఎల్లువొస్తె– ఎల్లువంటి పిల్లోడికి పిల్ల గౌరి బందం' అంటూ మరికొంత ముందుకి పోయారు ఆత్రేయ. అలాగే 'ఈ నాటి ఈ బంధమేనాటిదో' పాటలో 'ఎవరు పిలిచారనో – ఏమి చూడాలనో – ఉప్పొంగి ఉరికింది గోదావరీ' అని కొత్త పెళ్ళి కూతురుతో అడిగించి, 'చెలికాని సరసలో – సరికొత్త వధువులో – తొలి నాటి భావాలు తెలుసుకోవాలని – ఉప్పొంగి ఉరికింది గోదావరి' అని ఆ ఉరకలకు సున్నితమైన శృంగారాన్ని జోడిస్తూ వరుని సమాధానంగా పలికించారు ఆత్రేయ.

గోదావరిని శృంగారపరంగా ఆత్రేయ వాడుకున్న పాటొకటి వుంది. సాధారణంగా శృంగారానికి శ్రీనాథుణ్ణి చెప్పుకుంటారు. 'వరబింబాధరమున్, పయోధరములున్' అంటూ మొదలుపెట్టి రాసిన ఓ చాటు పద్యంలో 'గంగకద్దరి మేలు ఇద్దరి కీడు కలదే' అనే వాక్యం చివరి పాదంలో వస్తుంది. గంగానదిలో ఏ ఒడ్డున స్నానం చేసినా పుణ్యం ఒక్కటే అని దానర్థం. ఈ చాటు పద్యం స్ఫూర్తిగా నేటివిటీ కోసం మన గోదావరిని ఉపయోగించుకుంటూ 'గోదారికి ఏ ఒడ్డయినా నీరు ఒక్కటే – ఈ పిల్లదానికి ఏ వైపయినా అందమొక్కటే' అని రాశారు ఆత్రేయ 'మన ఊరి కథ' సినిమాలో.

గోదావరిని ఉపయోగించుకున్న నేటి తరం



రచయితల్లో రామజోగయ్య శాస్త్రి – ' గో గో రయ్ రయ్ గోదావరి పై హ్యాపీ అలవై' అనే పాటని, 'బాల గోదారి ఉలికి పడుతోంది ఎందుకో' అంటూ ఇంకో పాటని 'గోపి గోపిక గోదావరి' లో రాశారు.

'గుండెల్లో గోదారి పొంగి పొరలుతోంది' అంటూ మత్స్యకారుల పై ఓ మంచి మనోవికాస గీతాన్ని రాసిన చంద్రబోస్ అంతకు చాలా సంవత్సరాల ముందు 'గోదారి గట్టు పైన చిన్నారి చిలుక వుంది' అనే పాటను రాశారు 'రాజకుమారుడు' సినిమాలో. మరో రచయిత కులశేఖర్ 'గోదారల్లే పొంగే నాలో సంతోషం' పాటని 'వసంతం' సినిమాలోను, 'నిండు గోదారి కదా మన ప్రేమ' పాటని 'నువ్వు లేక నేను లేను' సినిమాలోను రాశారు.

దివంగత సంగీత దర్శకుడు చక్రికి 'గోపి గోపిక గోదావరి' సినిమాకి ముందు తనకు గోదావరి పై ఒక్క పాట కూడా ట్యూన్ చేసే అవకాశం రాలేదని వెలితిగా ఫీల్ అయ్యేవాడు. అతని ఆప్త మిత్రుల్లో ఒకరైన భాస్కరభట్ల రవికుమార్ అది గమనించి 'కబడ్డీ కబడ్డీ' సినిమాలో ' గోరువంక గోదారి వంక ఈతకెళదాం వస్తావా' అనే పాటను రాసి – గోదావరి పై పాటను రాసిన సినీ గీత రచయితల్లో నమోదు అయిపోయారు.

మరొకసారి నాటి తరం రచయితల వైపు చూసుకుంటే 'పారే గోదావరిలా పరుగులు తీసే వయసు' అంటూ రాశారు సినారె 'రాధమ్మ పెళ్ళి' సినిమాలో. ఇక గోదావరి పై వచ్చిన సినీ గీతాలను ఇంకో కోణంలో లెక్కించదలిస్తే 'నా మనసే గోదారి నీ వయసే కావేరీ బోల్ రాధా బోల్ రెండూ కుదిరేనా లేదా' ప్యారడీ హాస్య గీతంగా 'అదృష్టవంతులు' సినిమాలో ఆరుద్ర రాస్తే – 'అటు అమలాపురం ఇటు పెద్దాపురం మధ్య గోదావరీ' అంటూ ఓ ఐటెమ్ సాంగ్ గా రాశారు భువనచంద్ర.

కొన్ని వివరాల ప్రకారం చూసుకుంటే – గోదావరి మీద సినీ గీతాలను ఎక్కువగా రాసింది వేటూరేననిపిస్తుంది. 'సిరి సిరి మువ్వ' లోని 'ఒదిగున్న మనసు' పాటలో 'గోదారల్లే వెన్నెల్లో గోదారల్లే', 'సితార' సినిమాలో 'వెన్నెల్లో గోదారి అందం నది కన్నుల్లో కన్నీటి దీపం', 'రాజహంస' లో 'గుండెల్లోనె పొంగిందమ్మా గోదావరి', 'దేవత' లో 'ఎల్లువొచ్చి గోదారమ్మ ఎల్లాకిల్లా పడ్డాదమ్మా', 'ప్రేమించు – పెళ్ళాడు' సినిమాలో 'వయ్యారి గోదారమ్మ ఒళ్ళంత ఎందుకమ్మ కలవరం' లాంటివి మచ్చుకి కొన్ని.

ఈ తరం వారికి అసలు తెలియని, పాత తరం వారి జ్ఞాపకాలలో మరుగున పడిపోయిన ఒక విషయాన్ని చెప్పాలి ఈ సందర్భంగా. సుమారు 60 ఏళ్ళ క్రితం 'దొడ్డమ్మ' అనే పేరుతో ప్రైవేట్ రికార్డులొచ్చేవి. ఆ పాటలను పాడిన గాయకుడి అసలు పేరేంటో తెలియదు గాని అందరూ అతన్ని 'దొడ్డమ్మా' అనే పిలిచే వారు. ఎందుకంటే ఆయన పాడిన ప్రతి పాటా 'దొడ్డమ్మా' అనే మకుటంతోనే వుండేది. ఆయన ఆ రోజుల్లో పాడిన ' దొడ్డమ్మా గోదావరి పుష్కరాల వింతలు' పాటని పాడుకొనని వారు లేరనే చెప్పాలి. పుష్కరాలలో ఎటువంటివి జరుగుతాయో వ్యంగ్యంగా ఆయన తన పాటలో ఎత్తి చూపిన అంశాలను వింటే ఇప్పుడు మరిన్ని జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉండొచ్చనిపిస్తోంది. ఆ రికార్డులు కూడా ఎవ్వరి దగ్గరా వున్నట్టు సమాచారం లేదిప్పటి దాకా.

గోదావరి పుష్కరాల సందర్భంగా – ఆ నది పై వచ్చిన సినీ గీతాలను పేర్కొంటూ విశ్లేషించడం అంటే మొత్తం గోదావరిని ఈదటం లాంటిదే. ఈ చిన్ని ప్రయత్నం ఆ పవిత్ర నదిలో ఒక ఆచమనం మాత్రమే.



రాజా
(మ్యూజికాలజిస్ట్)

సెల్యులాయిడ్ గోదావరి



"గోదావరి పుష్కరాల వింతలు దొడ్డమ్మా" అని నా చిన్నతనంలో గ్రామఫోను పాట చాలా ప్రసిద్ధి. అప్పట్లో వచ్చిన పుష్కరాలు తర్వాత, అక్కడ జరిగిన సంఘటనలు గురించి వ్యంగ్యంగా పాట రాసి, రికార్డు ఇచ్చారు, విజయనగరానికి చెందిన దొడ్డమ్మదాసు. ఆయన హరికథకుడు, ఆదిభట్లవారి శిష్యుడు. ఐతే,అప్పట్లో ఇప్పటిలాగా ప్రభుత్వం వారు కల్పించుకోని ఏర్పాట్లు చేసేవారు కాదు. పోలీసులు మాత్రం వుండేవారట. దొంగతనాలు, దోపిడీలు ఎక్కువట. వెళ్ళిన వాళ్ళు గోదావరిలో ఓ మునుగు మునిగి వాచ్చేసేవారట. ఇవి – మా పెద్దలు చెప్పిన నాటి విశేషాలు. ఎవరో సినిమావాళ్ళు వచ్చి, అప్పుడు ఆ పుష్కరాల్ని కెమెరాలతో షూట్ చేశారట కూడా. ఐతే, ఎందుకోసమో, ఎందులో వాడారో తెలీదు.

ఆనాటి పుష్కరాల నుండి గోదావరితో సినిమా ఫిలిమ్‌కి సంబంధం వుందన్నమాట. అవును ఉంది! గోదావరి నదితో సినిమాకి – మన తెలుగు సినిమాకి – చాలా సంబంధం ఉంది.

తొలిసారిగా గోదావరి ఒడ్డున – 1935లో దుర్గాసినీటోన్ పేరుతో నిడమర్తి సూరయ్యగారు, పాకలు, తడికెలతో చిన్న స్టూడియో కట్టి "సంపూర్ణరామాయణం" తీశారు. 1936 లో విడుదలైంది. ఇందులో కనిపించే దండకారణ్యం అడవులు ఉన్న గోదావరి ఒడ్డున తీసినవే. అప్పట్లోనే గోదావరి– సినిమాలో వేషం వేసింది. అంటే తను కాకుండా, ఇంకో రూపంతో. రామలక్ష్మణులను తీసుకుని విశ్వామిత్రుడు మిథిలానగరానికి బయల్దేరినప్పుడు మధ్యలో సరయునది దాటాలి. ఆ సరయు నది – గోదావరే! రామలక్ష్మణులు సరయునదిలో స్నానం చేస్తారు కదా, అదీ గోదావరిలోనే, ఏనది ఏదో తెలుస్తుంది గనకనా?... మామూలు అడవునే సినిమాల్లో దండకారాణ్యాలు, నైమిశారాణ్యాలూ అన్నీనూ. అయితే, గోదావరి నది మీద ఉన్న రైలు వంతెన కూడా 'సంపూర్ణ రామాయణం'లో నటించింది! సీతాదేవిని రావణుడు అపహరించుకుపోయిన తర్వాత, రామలక్ష్మణులు సీతను వెతుక్కుంటూ గోదావరి ఒడ్డున నడుస్తూ ఉంటే దూరంగా వున్న రైలు వంతెన మీద నుంచి రైలు వెళ్లడం సినిమాలో కనిపిస్తుంది! ఆ రోజుల్లో ఇప్పటిలాగా మానిటర్ సౌకర్యాలా ఏమన్నానా? కెమెరా లోంచి చూడడంలో పొరపాటయి వుంటుంది. ఎంత వరకు దృశ్యం కెమెరాలో వచ్చిందో తెలుసుకోలేని రోజులు. ప్రింట్ చేసుకుని చూడడం కూడా కష్టమే. మద్రాసులోను, కలకత్తాలో మాత్రమే లేబరేటరీలున్నాయి. అంచేత అలాగే వదిలేశారు. సినిమాలో వుండిపోయింది. ఆ విధంగా గోదావరి నది సినిమాల్లో కనిపించింది.

తర్వాత బాపుగారు తీసిన "సంపూర్ణ రామాయణం" కూడా గోదావరి ఒడ్డునే తీశారు. నదికి కొంత దూరంలో పర్ణశాల సెట్టు కట్టారు. అదే దండకారణ్యం. దండకారణ్యం అనగానే ఒక విషయం గుర్తొచ్చింది. 1934లో ఈస్ట్ ఇండియా వారు కలకత్తాలో లవకుశ తీశారు. అందులో రథాలు వెళ్లడం అవుట్‌డోర్‌లో అడవుల్లో తీయాలి. ఆ సినిమాకి కళాదర్శకుడు టి.వి.ఎస్ శర్మ గారు. ఆయన దండకారణ్యం అవుట్‌డోర్ లో లోకేషన్ చూడటానికి వెళ్ళి పనికిరాదన్నారు. ఏమిటంటే అక్కడ



ఎక్కువగా తాటిచెట్లు ఉన్నాయట.. “దండకారణ్యంలో తాటిచెట్లు ఉండవు అంచేత వేరే చోటకైనా వెళ్లాలి; లేదా ఉన్న తాటి చెట్లయినా కొట్టియాలి” అన్నారు శర్మగారు. దండకారణ్యంలో తాటిచెట్లు ఉండవు అన్న విషయం ఎంతమందికి తెలుసు అన్న వాదోపవాదాలు జరిగినా, శర్మగారు వేరే స్థలం వెతికి అక్కడే రథాలు పరిగెత్తించారట. ఈ విషయం నేను ‘నర్తనశాల’ సినిమాకి పనిచేస్తున్నప్పుడు శర్మగారే చెప్పారు.

దండకారణ్యం గోదావరి ఒడ్డున కొంత మేర కనిపిస్తుంది. సినిమా వాళ్లకి నది, అడవులు, దీవులు వంటివి కావాలంటే గోదావరి ఒడ్డుకే వెళతారు. అన్ని కలిసి వస్తాయి. రాజమండ్రిలో వసతులు ఏర్పాటు చేసుకుని గోదావరి చుట్టుపట్ల తీసినవి ఎన్నో సినిమాలు.

‘మూగమనసులు’కి గోదావరి ఒడ్డునే మేడ సెట్టు వేసి షూట్ చేశారు. మేడ మీద తీసిన షాట్స్‌లో వెనకల గోదావరి నది కనిపిస్తూనే వుంటుంది. ‘మూగమనసులు’ గోదావరిని బాగా వాడుకుంది. పడవలు, నదిలో వెళ్లడం, పాటల చిత్రీకరణ గోదావరి మీదనే. మరి, గోదావరి నది గంగానది రూపం కూడా దాల్చింది. ఆదుర్తిగారు ‘మూగమనసులు’ని ‘మిలన్’ పేరిట హిందీలో తీసినప్పుడు గంగ పేరున్నా– అదంతా గోదావరి మీదనే తీశారు.

బాపుగారు, విశ్వనాథ్ గారు, వంశీగారు గోదావరిని బాగా వాడుకున్నారు. ‘అందాలరాముడు’ సగం సినిమా అంతా గోదావరి నదిమీదనే నడుస్తుంది. గోదావరి ఒడ్డునే ఉన్న దేవీపట్నం దగ్గర కుటీరాల్లాంటి గదులు నిర్మించి నటినటుల్ని, టెక్నిషియన్లనీ అక్కడే ఉంచారు. రోజు గోదావరి నుంచి పెద్ద పైపులతో నీరువస్తే ఆ నీటితోనే అందరూ స్నానాలు (అదేదో ఒక సినిమాకి గోదావరి ఒడ్డుకి వెళ్ళి ఆ బృందం బస చేసిందట. అప్పుడు గోదావరికి వరదలు రావడం వల్ల నీరు బురద రంగులో వుంది. ఆ నీరు పట్టి అందులో ఇందువ గంథం కలిపితే బురద కిందకి దిగిపోతుంది. అలాగే అందరూ స్నానాలు చేశారు గాని, అందులో నటిస్తున్న శ్రీవిద్య మాత్రం చెయ్యలేదట. “ఆ నీరు నాకొద్దు. దాంతో స్నానం చేయను” అంటే – ఏం చెయాలని నిర్మాత ఆలోచిస్తూంటే– “త్రాగటానికి బిసిలెరి నీరు (అప్పుడే మార్కెట్లోకి వచ్చింది.అప్పుడు సీసా ఆరు రూపాయిలు; ఇప్పుడు ఇరవై రూపాయిలు) తెప్పించారుగా, ఆ సీసాలు తెప్పించి, బకెట్లో పోయించండి స్నానం చేస్తాను” అంటే మరి ఎన్ని సీసాలు కావాల్సి వచ్చాయో, రెండు బకెట్లు బిసిలెరి నీటిలో గాని ఆ నటి స్నానం చేయలేదట)!

అక్కినేని గారు అందాల రాముడులో పిల్లవాడు గోదావరిలో పడిపోతే పంట్‌పై నుంచి నదిలో దూకి వాడిని రక్షించే సన్నివేశంలో నిజంగానే దూకారు, ఈదారు. ఒక చేత్తో పదేళ్లవాడిని పైకి ఎత్తుపట్టుకుని, ఇంకోచేత్తో ఈదుకుంటూ రావడంలో, అక్కినేని వారికి ఆయాసం వచ్చింది. పడవ చేరుకోగానే వాంతి అయింది. ఆ రాత్రి ఆయన్ని చూచిన డాక్టరు – రక్తనాళాలు గుండెకి సరిగా రక్తం అందించడం లేదన్న విషయం చెప్పారు. అప్పటి నుంచే ఆయన ఆహారంలో మార్పులు వచ్చాయి. ఉదయం వేళలో వ్యాయమం అవసరమైంది. అదే అలా అలా – రెండు సార్లు బైపాస్ సర్జరీకి దారితీసింది. అలా – నాగేశ్వరరావులో వున్న వ్యాధిని గోదావరి కనిపెట్ట గలిగిందన్నమాట.

గోదావరి ఒడ్డున తమిళ చిత్రాలు కూడా షూటింగ్ జరుపుకున్నాయి. 1990 ప్రాంతంలో రజినీకాంత్ సినిమాకి రాజమండ్రిలో సినిమా షూటింగ్ జరిగింది. గోదావరికి వరదలు వచ్చే కాలంలో ఎవరూ షూటింగ్ జరపరు. సాధారణంగా జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరుపుతారు. అప్పుడు నది ప్రశాంతంగాను, నిండుగానూ ఉంటుంది. ‘మేఘసందేశం’ కూడా గోదావరిని బాగా వాడుకుంటుంది. కనువిందైన దృశ్యాలు ఎన్నో కనిపిస్తాయి. ఎన్నెన్నో సినిమాలు గోదావరితోను, ఒడ్డుతోనూ, సంబంధం పెట్టుకున్నాయి. అప్పట్లోనే అని కాకుండా, ఈ మధ్య కూడా శేఖర్ కమ్ముల తన చిత్రాన్ని గోదావరి మీదనే తీశారు. కొన్ని సినిమాల పేర్లలో గోదావరి కలిసింది.

చివరగా ఓ మాట – గోదావరి ఇచ్చిన స్ఫూర్తి

ముళ్లపూడి వెంకటరమణ గారు, తను రాయవలసిన కొన్ని సినిమా స్క్రిప్టుల్ని గోదావరిలో ప్రయాణిస్తూ రాశారు. ఒక చిన్న పంట్ పైన ఆయన కూర్చోని రాసుకునేవారు. పంట్ నిదానంగా ప్రయాణిస్తూ ఉంటుంది. కింద కాఫీలు, భోజనం, తినుబండారాలూ తయారవుతుంటాయి. పొద్దున్నే బయల్దేరిన జలయాత్ర సాయంకాలానికి ముగిసేది. మూడు రోజుల ప్రయాణంలో స్క్రిప్టు ముగిసేది.



రావి కొండలరావు

గోదారి తీర ధీరలలిత కెరటాలు

చరిత్రలో దాచేస్తే దాగి, మూసేస్తే నిశ్శబ్దమైపోయిన స్వరం మహిళదే అంటారు. ఆకాశంలో సగమని మాటవరసకి అనడమే గానీ, స్త్రీ పట్ల ఆ సమాన దృష్టి ఎక్కడా కనబడదని కూడా అంటారు. అయితే, ఎటువంటి గుర్తింపులు, మెరమెచ్చులు ఆశించని అమ్మ లానే కర్తవ్యం తప్ప మరో ప్రతిఫలాపేక్ష ఉండకపోవడమే మహిళా ఉద్యమకారిణుల ప్రత్యేకత. తాము పాలుపంచుకున్న పోరాటాల్లో అటువంటి నిష్కామమైన అమ్మతనాన్ని చూపిన స్త్రీమూర్తులు ఉభయ గోదావరీ జిల్లా ఉద్యమాల్లో ఎందరో. చరిత్రను ఉద్దీపింప చేసిన ఆనాటి ధీర మహిళా మూర్తులలో కొందరు...



తూర్పు గోదావరి జిల్లా

కందుకూరి రాజ్యలక్ష్మి

రాజమండ్రి సమీపంలోని కాతేరులో 1851లో పుట్టిన కందుకూరి రాజ్యలక్ష్మి స్వయంగా కవయిత్రి. కందుకూరి వీరేశలింగం ధర్మపత్ని. సంస్కరణోద్యమంలో భర్తతో కలిసి విశేషంగా శ్రమించిన ఈమె 1881లో తొలి వితంతు పునర్వివాహం జరిపారు. దేశస్వాతంత్రోద్యమంలో పాల్గొనడమే కాకుండా మహిళాభ్యుదయానికి, బాలికలు, వితంతువుల సంక్షేమం కోసం, దేవదాసీ వ్యవస్థ, వేశ్యావృత్తి నిర్మూలనకు విశేషంగా కృషి చేసిన రాజ్యలక్ష్మి 1910లో కన్ను మూశారు.

మద్దూరి వెంకట రమణమ్మ

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, జీవిత కాలంలో పది సంవత్సరాలు కారాగార జీవితం గడిపిన మద్దూరి అన్నపూర్ణయ్య సతీమణి మద్దూరి వెంకట రమణమ్మ 1906లో పుట్టారు. భర్త దీర్ఘకాలం జైలులో ఉండగా ఆయన ఆశయాలకు అనుగుణంగా రమణమ్మ క్రియాశీలక జాతీయోద్యమ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొని మహిళా లోకానికి ఆదర్శప్రాయంగా నిలిచారు.

బత్తుల కామాక్షమ్మ

విద్యాధికురాలు, ఉభయభాషా ప్రవీణురాలైన శ్రీమతి బత్తుల కామాక్షమ్మ 1920లో రాజమండ్రిలో జన్మించారు.

దుర్గాబాయి

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో 1909లో పుట్టిన దుర్గాబాయి 12వ ఏటనే గాంధీగారిని దర్శించి ఆయన ప్రభోదాలకు ఉత్తేజితురాలయ్యారు. నాటి నుంచి ఖాదీ వస్త్రధారణ, ఖద్దరు ప్రచారం ప్రారంభించారు. కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, చీరాల, నెల్లూరుల్లో గాంధీజీ పర్యటన సందర్భంలో మహిళా ఉద్యమానికి దుర్గాబాయి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

పాలకోడేటి శ్యామలాంబ

రాజమండ్రిలో సుప్రసిద్ధ దేశ భక్తులు సూర్యప్రకాశరావు సతీమణి శ్యామలాంబ (జూన్ 12, 1902 – జూన్ 18, 1953) దేశ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

పెద్దాడ కామేశ్వరమ్మ

పెద్దాడ కామేశ్వరమ్మ విద్యాధికురాలు. గాంధీజీ పిలుపును వేదవాక్కుగా భావించిన ఈమె ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఆరు మాసాలు కారాగార శిక్షలను అనుభవించారు.

గోదావరి
మహా పుష్కరం 2015

గుజ్జు నాగరత్నమ్మ

రాజమండ్రి వాస్తవ్యురాలైన గుజ్జు నాగరత్నమ్మ 1932లో విదేశీ వస్త్ర బహిష్కరణ, పికెటింగ్‌లో పాల్గొన్నందుకు 15 రోజులు జైలు శిక్ష అనుభవించారు.

మానాప్రగడ రామ సుందరమ్మ

రాజమండ్రిలో 1917లో జన్మించిన రామసుందరమ్మ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న సాహస మహిళలందరిలో పిన్న వయస్కురాలు. దేశసేవలో ప్రాణత్యాగమెనరించిన ఈమె 18 ఏళ్ళ వయస్సులోనే క్షయ వ్యాధితో మృతి చెందారు.

చెన్నూరి కృష్ణవేణమ్మ

కాకినాడ వాస్తవ్యురాలైన శ్రీమతి చెన్నూరి కృష్ణవేణమ్మ 1896లో జన్మించారు. 1930,31 ల్లో ఉప్పు సత్యాగ్రహం, స్వదేశీ ఉద్యమాలలో కృష్ణవేణమ్మ చురుకుగా పాల్గొన్నారు. కన్ననూరు, వేలూరు జైళ్లలో ఆరు నెలలు శిక్షలను అనుభవించారు.

కాశీభట్ల వెంకట రమణమ్మ

తూర్పుగోదావరి జిల్లాలో జాతీయోద్యమంలో పాల్గొన్న మహిళల్లో వెంకట రమణమ్మ ఒకరు. ఈమె భర్త లక్ష్మీనరసింహారావు కూడా గొప్ప దేశభక్తులు.

పశ్చిమ గోదావరి జిల్లా

కోటమర్తి కనకమ్మ

భీమవరం గునుపూడి గ్రామ వాస్తవ్యురాలు కోటమర్తు కనకమ్మ. 1930,1932,1940 లలో జాతీయోద్యమాలలో రెండున్నర సంవత్సరాల కఠిన కారాగార శిక్షను అనుభవించారు.

కలగర పిచ్చమ్మ

ఏలూరుకు చెందిన మాగంటి రామనీడు పుత్రిక, బెజవాడ కలగర రామస్వామి సతీమణి అయిన పిచ్చమ్మ 1921 నుంచి స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొని... జైలు శిక్ష అనుభవించారు. మాగంటి అన్నపూర్ణాదేవి ఈమె కుమార్తె.

ఝాన్సీలక్ష్మీబాయి

ఏలూరులో 1927లో పుట్టిన మాగంటి ఝాన్సీలక్ష్మీబాయి మాగంటి బాపినీడు కుమార్తె. మూడేళ్ళప్రాయంలోనే అమ్మమ్మ కలగర పిచ్చమ్మతో కలిసి మూడు మాసాలు ఖైదు అనుభవించారు.

వేగేశన సుభద్రాదేవి

భీమవరంలో జన్మించిన శ్రీమతి వేగేశన సుభద్రాదేవి 1943లో గాంధీజీ జైలులో ఉపవాసం చేసినపుడు పికెటింగు చేసి మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు.

గద్దె నాగశిరోమణి

చింతలపూడి నివాసి, స్వాతంత్ర్యోద్యమకారుడు గద్దె విష్ణుమూర్తి భార్య గద్దె నాగశిరోమణి. 1942లో హిందీ భాషోద్యమంలోనూ, సంస్కరణోద్యమంలోనూ గొప్ప కృషి చేశారు.

గోకరాజు వెంకాయమ్మ

సంస్కరణోద్యమంలోనూ, జాతీయోద్యమంలో పాల్గొని కారాగార శిక్షలు అనుభవించిన భీమవరం తాలూకా జువ్వలపాలెంకు చెందిన సూర్యనారాయణరాజు సతీమణి వెంకాయమ్మ.

డాక్టర్ ముదుంబ లక్ష్మీదేవి

కొవ్వూరులో 1913లో జన్మించిన లక్ష్మీదేవి విదేశీ వస్త్ర విక్రయశాల వద్ద పికెటింగ్ చేసి, ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. జైలు శిక్షలు అనుభవించారు.

కొటికలపూడి సరస్వతీదేవి

శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని 1932, 1940లలో అనేక పర్యాయాలు నిర్బంధానికి గురైన వ్యక్తి సరస్వతీదేవి. 1917లో పూళ్లలో జన్మించారు.

ముల్పూరి చుక్కమ్మ

ఏలూరు తాలూకా పెదపాడు గ్రామానికి చెందిన ముల్పూరి చుక్కమ్మ సత్యాగ్రహంలో, శాసనోల్లంఘన, వ్యక్తి సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొని జైలుకెళ్ళారు.

గంధం అమ్మన్నరాజా

బందరులో జన్మించిన అమ్మన్నరాజా విద్యాధికురాలు. చాలా పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేశారు.

అల్లూరి అన్నపూర్ణాదేవి

పెన్మత్సవెంకటరామరాజు పుత్రిక, ప్రముఖ స్వాతంత్ర్యోద్యమ నాయకులు అల్లూరి సత్యనారాయణ ధర్మపత్ని అన్నపూర్ణాదేవి. 1937 కొత్తపట్నంలో 104 సెక్షను ధిక్కారానికి నిషేధోద్యమం, అస్పృశ్యతా నివారణోద్యమాల ప్రచారానికి మహిళా సంక్షేమానికి విశేషంగా కృషి చేశారు. రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ సంఘాలలో సభ్యురాలిగా పని చేశారు.

పైన పేర్కొన్న వారేకాక దీర్ఘకాలం సాగిన జాతీయోద్యమంలోను, దేశ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వికాసం కోసం, అవిరళంగా కృషి చేసిన గోదావరి తీర ప్రాంత మహిళలు– సత్తిరాజు ముగమ్మ, శృంగార కవి లక్ష్మీనరసమ్మ, దారా దమయంతీదేవి, రామరాజు లక్ష్మమ్మ, కంది నాగరత్నమ్మ, చుండూరి రత్నమ్మ (ఏలూరునుండి), తల్లప్రగడ సుబ్బలక్ష్మీదేవి, దాట్ల నరసమ్మ, శ్రీమతి సూరమ్మ, మంతెన లక్ష్మీ నరసమ్మ తణుకు వారు...మరెందరో వున్నారు.



యర్రమిల్లి విజయలక్ష్మి

ఉద్యమమూర్తుల పురిటిగడ్డ

స్వాతంత్ర్యోద్యమానికి 12 మంది మహిళా యోధుల్ని అందించిన నగరం దేశంలో ఏదైన ఉందంటే అది ఆనాటి కళల కాణాచి, ఆంధ్ర దేశపు సాంస్కృతిక రాజధాని అయిన రాజమండ్రి మాత్రమే. చరిత్ర సృష్టించిన ఆ పన్నెండు మంది – కాశీభట్ల వెంకట రమణమ్మ, మద్దూరి వెంకట రమణమ్మ, దుర్గాబాయి దేశ్ ముఖ్ , దువ్వూరి సుబ్బమ్మ, బారు అలివేలమ్మ, గూడూరి నాగరత్నం, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, గుజ్జు నాగరత్నం, శివరాజు సుబ్బమ్మ, పాలకొడేటి శ్యామలాంబ, చెబ్బియం సోదెమ్మ, పెద్దాడ కామేశ్వరమ్మ– ఉద్యమకారిణుల స్మృతి చిహ్నంగా రాజమండ్రి పాల్ చౌక్ లో ఫ్రీడం పార్క్ ఏర్పాటయ్యింది. టంగుటూరి ప్రకాశం పంతులు గారి స్ఫూర్తితో ఆయన ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన 1946 ఏప్రియల్ 30న ఆవిర్భవించిన ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో ఫ్రీడం పార్క్ ఏర్పాటయ్యింది. ఆ పార్కులో 12 మంది మహిళా మూర్తుల విగ్రహాల్ని సమితి నెలకొల్పింది.

పప్పు..! పప్పు..!



భద్రాచలం మీదుగా సీలేరు వేపు పోతుంటే దారిలో చింతూరు తగిలింది. చింతూరు చుట్టుపక్కల కోయలు ఎక్కువ. ఆ ఊరి పక్కనుంచే శబరినది కూనవరం వేపు పరుగులు పెడతాది గోదారి గంగమ్మను ఉబ్బించి ఊసులాడుకోడానికి! నేను జీపును ఓ చెట్టుకింద వదిలేసి, శబరి చెంతకు నడక సాగించాను. దారి పొడవునా ఆకుపచ్చని వరిపొలాలు పొట్టపోసుకుని బరువుగా ఉన్నాయి. వాటితో పోటీ పడుతూ– పొలాలకు ఆనుకుని ఉన్న పంట కాలువల్లో కూడా వేరే జాతి వరిమొక్కలు– ఏ రైతు ఆలనా పాలనా లేకపోయినా కలుపులా పెరిగేస్తున్నాయి! అవి ఆకుపచ్చగా కాకుండా కనకాంబరం రంగు పూసుకున్నట్లున్నాయి. కంకులు వంగిపోకుండా 'ఖడేరావు'గా (నిటారుగా) ఉన్నాయి. ప్రతి గింజకూ రెండు–మూడు అంగుళాల పొడవైన సూదిలాంటి మొన ఉన్నాది. ఆ రకం వరిని మన గిరిజనులు ఏమని పిలుస్తారో తెలుసుకుందామని అక్కడున్న ఓ భూమిపుత్రున్ని పిలిచి అడిగాను– దాని పేరేమిటని. 'దొరా! దాన్ని నెవరి ధాన్యమంటారు. బాగా తయారయిన గింజ తొందరగా రాలిపోతాది. మామూలి వరిలా కంకికి అంటిపెట్టుకుని ఉండిపోదు' అన్నాడు . కోయవాని నోటినుండి 'నెవరి ధాన్యము' అన్న మాట వినగానే నా మనసు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యింది. కారణాలు రెండు. మొదటిది– ఆ వరి మొక్కకు ఇంతవరకు ఎవరూ ప్రాంతీయంగా పిలిచే పేరు చెప్పలేదు. రెండవది– ఎస్. ఎస్. ఎల్. సి. చదివే రోజుల్లో తెలుగు పాఠ్య పుస్తకంలోని ఒక పాఠంలో– వారణాసిలో అన్నపూర్ణా దేవి వ్యాస మహర్షిని శపిస్తూ– 'నీవార ముష్టింపచా!' అని సంబోధిస్తుంది. అప్పుడు మా తెలుగు ఉపాధ్యాయుడు దానికి అర్థం – 'నెవ్వరి ధాన్యాన్ని అడుక్కు తినేవాడా!' అన్నారు. నెవ్వరి ధాన్యం అంటే ఏమిటండీ? అని అడిగిన ప్రశ్నకు ఆయన– కోతకు వచ్చిన వరిని కోసి, పొలం గట్లమీద చిన్న మోపులు(పనలు)గా సర్ది, కొన్నాళ్ళు అలా ఎండనిచ్చి, అటుపై వాటిని మోసుకెళ్ళి, వరికుప్పలుగా పేరుస్తారు. ఆ సమయంలో గట్టుమీద మోపుల్ని తీసేటప్పుడు ఒకటి అరా వరికంకులు అక్కడే ఉండిపోవడమో, పొలంలో జారిపోవడమో జరుగుతుంది. అలాంటి కంకుల్ని పాలికాపులూ, కుప్పనూర్చడానికి వచ్చిన పనివారు, లేక మరెవరైనా ఏరుకుని తమతో అప్పణంగా తీసుకుపోవచ్చు. అలా సేకరించిన ధాన్యాన్ని నెవ్వరి ధాన్యమంటారు– అని విడమరిచి చెప్పారు. ఇంతకూ ఇప్పుడు ఈ నెవ్వరి ధాన్యం 'వ్యుత్పత్తి, తాత్పర్యం' విషయంలో మనం ఎవరిని నమ్మాలి? భూమి పుత్రుడినా? పండిత పుత్రుడినా?

నేను అల్లంత దూరంలో శబరినది గట్టుకి ఆనుకుని ఉన్న కోయగూడెం వేపు నడుస్తుంటే ఒక ముసలాయన ఏదో వేరు తవ్వుతూ కనబడ్డాడు. తాతా! ఏమిటి తవ్వుతున్నావు? అని అడిగాను. తేంగలు అన్నాడు.

మోదుగు చెట్టు తవ్వితే తేగలు ఎలా వస్తాయి? నేను తవ్వతా ఉన్నది మోద్గ తేంగల్ని. తాంటి తేంగల్ని కాద్దొరా. రొండూ మూండేళ్ళ మోద్గ మొలకని తవ్వితే తేంగలాటి వేరు ఉంటది. దాన్ని అగ్గితో తంపటపెట్టి తినాల. నా పసితనంల ఏ తిండీ చిక్కకపోతే ఈ తేంగలు తినే గూడెమోళ్ళమంతా పొద్దుపుచ్చుకునోళ్ళం! – తెలుసా? అన్నట్లు నావంక చూసాడు. మోదుగు తేగలు తిని కుటుంబాలకు కుటుంబాలే ప్రాణాలను కాపాడుకుంటే– వీటికి పోషక విలువలు దండిగానే ఉండి ఉండొచ్చు! అటెన్షన్! సైంటిస్ట్స్ ఆఫ్ నేషనల్ న్యూట్రిషన్ ఇన్స్టిట్యూట్!

నేను కోయగూడెం చేరుకున్నాను. అక్కడొక గుడిసె దగ్గర చిన్న గుంపు కనబడితే వారి దగ్గరకు వెళ్ళాను. ఓ పాతికేళ్ళ తల్లీ, ఆమె చంకలో జ్వరంతో రెండేళ్ళ చంటిదీ, చేతిలో మెడికల్ కిట్తో ఒక ఆర్. ఎం. పీ. డాక్టర్, తదితరులూ ఆ గుంపులో ఉన్నారు. డాక్టరుగారు ఆ చంటిపాప నోట్లో హోమియో గుళికలు వెయ్యడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. పాప యేడుస్తూ అటుపక్కకీ ఇటుపక్కకీ తలను తిప్పేస్తూ ముప్పుతిప్పలు పెడుతోంది.

ఇక ఓపిక నశించిన కోయత– డాక్టరు దగ్గరనుండి ఆ గోళీలను తన చేతిలోకి తీసుకుని, చంటిదాని నోటిదగ్గర పెట్టి 'పప్పు.. పప్పు..' అని అనగానే బిడ్డ ఏడుపు ఆపి నోరు తెరిచింది! డాక్టరుగారు ఎంత గింజుకున్నా నోరు తెరవని పాప 'పప్పు' అనగానే ఎందుకు తెరిచింది? ఆ పాపకు తెలిసిన అమ్మనుడి ప్రకారం 'పప్పు' అంటే తియ్యగానో కమ్మగానో ఉండే తినుబండారం అని అర్థం కాబట్టి!

పిల్లల డాక్టర్లూ! ఉపయోగించుకోండయ్యా కోయతల్లి చతురాలు!



కొప్పుల హేమాద్రి

అవార్డులు - రివార్డులు

- ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సరఫరా సంస్థ (ఏపీ ట్రాన్స్ కో) కు ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారం లభించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో అత్యుత్తమ సామర్థ్యాన్ని కనబరిచినందుకు గుర్తింపుగా కేంద్ర విద్యుత్ శాఖ ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.
- మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయికి 'ఫ్రెండ్స్ ఆఫ్ బంగ్లాదేశ్ లిబరేషన్ వార్ అవార్డు'ను జూన్ 1న ప్రకటించారు. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయేందుకు జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో అందించిన సేవలకు గుర్తింపుగా బంగ్లాదేశ్ ఈ అవార్డు ప్రకటించింది.
- ఆసియా అథ్లెటిక్ సంఘం అత్యున్నత పురస్కారం ప్రెసిడెంట్స్ అవార్డును సురేష్ కల్మాడీకి ప్రకటించారు. ఆసియా అథ్లెటిక్స్ అభివృద్ధికి చేసిన కృషికిగాను ఈ అవార్డు ప్రకటించారు.
- 2014 సంవత్సరానికిగాను నాటక అకాడమి ఫెలోషిప్ లు, పురస్కారాలను జూన్ 10న ప్రకటించారు. ఫెలోషిప్ లు పొందిన వారిలో ఎస్.ఆర్.జానకిరామన్, విజయ్ కిచ్లూ, తులసీదాస్ బాత్కర్, చిత్ర దర్శకుడు ఎం.ఎస్. సత్యూ ఉన్నారు. అలాగే మన రాష్ట్రానికి చెందిన కూచిపూడి నాట్య కళాకారుడు వేదాంతం రాధేశ్యామ్, వయొలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గా ప్రసాద్ కూడా పురస్కారాలు పొందిన వారిలో ఉన్నారు.
- శాసన సభ డిప్యూటి స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ కు 'తెలుగు రత్న' పురష్కారం లభించింది. తెలుగు బాషా పరిరక్షణ సమితి ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేసింది.
- ప్రఖ్యాత శాస్త్రవేత్త భారత రత్న సి.ఎన్ రావుకు జపాన్ అత్యున్నత పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ రైజింగ్ సన్' , 'గోల్డ్ అండ్ సిల్వర్ స్టార్' ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. రెండు దేశాల మధ్య విద్యా మార్పిడిని వృద్ధి చేయడం, విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానంలో పరస్పర అవగాహన పెంపొందించడం కోసం రావు చేసిన కృషికి గాను ఈ పురస్కారాలను అందించింది.

నియామకాలు

- ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఏర్పాటైన జాతీయ భద్రతా దళం నూతన డెరెక్టర్ జనరల్ గా ఆర్.సి తాయల్ (జూన్ 8న) నియమితులయ్యారు.
- కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ (సి.ఐ.సి)గా విజయ్ శర్మను ప్రభుత్వం నియమించింది. జూన్ 8న ప్రభుత్వం ఈ మేరకు ప్రభుత్వం ఉ త్తర్వులిచ్చింది.
- గతంలో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు అధిపతిగా పనిచేసిన కె.వి చౌదరి కేంద్ర విజిలెన్స్ కమిషనర్ గా నియమితులయ్యారు.
- ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా విశ్రాంత ఆచార్యులు పి. నరసింహారావు (జూన్ 11న) బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఈ పదవిలో మూడేళ్ళు కొనసాగుతారు.
- ఎన్టీఆర్ వైద్య సేవ(ఆరోగ్య శ్రీ) సీఈఓగా ఐపిఎస్ అధికారి డా.ఎ. రవిశంకర్ జూన్ 18 న నియమితులయ్యారు.
- అంతర్జాతీయ హక్కుల సంస్థ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా కొత్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పాత్రికేయుడు , రచయిత ఆకార్ పటేల్ నియమితులయ్యారు.

> గవర్నర్ కోటాలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా నామినేట్ అయిన సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, తొండెపు దశరథ జనార్ధనరావు, బీద రవిచంద్రయాదవ్, జి. శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సంస్థల కోటా నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, టిడిపి తరపున ముద్దుకృష్ణమ నాయుడు, పయ్యావుల కేశవ్, అన్నం సతీష్ ప్రభాకర్, ఎంవివిఎస్ మూర్తి, పప్పల చలపతిరావు, మాగుంట శ్రీనివాసుల రెడ్డి బుద్ధ వెంకన్న, వై బి రాజేంద్రప్రసాద్, ద్వారంపూడి జగదీష్ రెడ్డి, రెడ్డి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- రాష్ట్ర న్యాయ శాఖా కార్యదర్శిగా సీ.ఎస్.ఎస్.వి దుర్గ ప్రసాద్ నియమితులయ్యారు.
- భారత గణాంకాల సంస్థ డైరెక్టర్ గా సంఘ మిత్ర బంధోపాధ్యాయ బాధ్యతలు చేపడతారు. కాగా ఇంతకు ముందు ఈ పదవిలో కొనసాగిన బిమల్ రాయ్ ను ఆర్థిక అవకతవకల ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే.
- ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగం డిజిజి గా సీ.ఎస్.ఆర్ కె ఎల్.ఎన్. రాజును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

రాష్ట్రీయం

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రైతు సాధికార సంస్థ పాలన మండలి ఏర్పాటైంది. వ్యవసాయ మంత్రి వైస్ ఛైర్మన్ గా వ్యవహరించే ఈ పాలక మండలిలో సహకార శాఖ మంత్రితో పాటు ఉన్నతాధికారులు, వివిధ రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ నిపుణులు సభ్యులుగా ఉంటారు.
- తూర్పుగోదావరి జిల్లాలో విలీనం అయిన తెలంగాణాకు చెందిన పోలవరం ముంపు మండలాల్లో ప్రత్యేక పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటయింది. చింతూర్ కేంద్రంగా దీనిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జూన్ 18 న ఉత్తర్వులు జారీ చేసింది.
- నెల్లూరు పట్టణానికి మంచినీటి వసతి కల్పించేందుకు ఉద్దేశించిన పథకానికి రూ. 529.24 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- జపాన్ ఇంటర్నేషనల్ కోపరేషన్ సంస్థ (జైకా) రుణ సహకారం రూ.3,600 కోట్లతో విజయవాడలో మెట్రో రైలును పట్టాలెక్కించేందుకు ఆంధ్రపదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం రూ. 6823 కోట్ల అంచనతో 2019 నాటికి మెట్రో రైలు ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యం విధించుకుంది.
- విశాఖ మాజీ పార్లమెంట్ సభ్యుడు కొమ్మూరు అప్పలస్వామి (సంజీవరావు) (85) కన్నుమూశారు.
- రాష్ట్రంలోని వివిధ శాఖల్లో వికలాంగుల కోటలో ఉన్న బ్లాక్ లాగ్ పోస్టుల భర్తీకి గడువు తేదీని 31.3.2016 వరకు పొడిగించారు.
- భూముల సమగ్ర వివరాలకు సంబంధించిన 'మీ భూమి' వెబ్ పోర్టల్ ను, అండ్రాయిడ్ అప్లికేషన్ (యాప్) ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 12న ప్రారంభించారు.
- కృష్ణా జలాల వినియోగం పై తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ల మధ్య ఓ అంగీకారం కుదిరింది. కేంద్ర మధ్యవర్తిత్వంతో 2015 - 2016 స సంవత్సరంలో నీటి వినియోగానికి సంబంధించిన విధివిధానాలు ఖరారయ్యాయి. బచావత్ ట్రైబ్యూనల్ తీర్పు ప్రకారం ఆయా రాష్ట్రాలు తమకు ఉన్న కేటాయింపుల మేరకు ఎక్కడయినా నీటిని వినియోగించుకునేలా కీలక నిర్ణయం జరిగింది. అయితే ఈ వినియోగం కేటాయింపులు ఉన్న ప్రాజెక్టులపై ప్రభావం చూపరాదు.
- విజయవాడను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భారతీయ పరిశ్రమ సమాఖ్య (సీ.ఐ.ఐ) ఒప్పందం కుదుర్చుకుంది.
- పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్రంలోని మసీదుల మరమ్మతులు, సుందరీకరణ పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. జూన్ 19 నుంచి రంజాన్ ఉపవాస దీక్ష ప్రారంభమయ్యింది. ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలకు సరైన వసతి కల్పించటం కోసం ఈ నిధులను వినియోగించారు.

- జాతీయ రహదారులు రాష్ట్ర రహదారులు ఉన్న ప్రాంతాల్లో రోడ్డుకు 100 మీటర్ల దూరం తర్వాతే మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

జాతీయం

- నిర్ధారిత ప్రమాణాలకంటే ఎక్కువగా సీసమ్ ఉండటంతో నెస్లే సంస్థకు చెందిన మ్యాగీ నూడిల్స్ ఉత్పత్తులను కేంద్రం నిషేధించింది. తెలుగు ఉభయ రాష్ట్రాలతోపాటు ఢిల్లీ, గుజరాత్, జమ్ము-కాశ్మీర్, ఉత్తరాఖండ్, తమిళనాడు, బీహార్ రాష్ట్రాలలో ఈ ఉత్పత్తులను తాత్కాలికంగా నిషేధించారు.
- గుజరాత్ లో వచ్చే అక్టోబరులో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో 'తప్పనిసరి' ఓటు నిబంధలను ప్రవేశపెట్టాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- వాతావరణంలో భారీ వర్షాలు వంటి తీవ్రమైన మార్పులు సంబంధించినప్పుడు అందుకు సంబంధించిన సమాచారాన్ని 'ఎస్ ఎం ఎస్' రూపంలో రైతులకు అందించే సేవలను కేంద్ర ప్రభుత్వం జూన్ 18న ప్రారంభించింది.
- ఆరోగ్యశ్రీ ట్రస్టును విభజన చట్టంలోని పదో షెడ్యూల్ లో చేర్చుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయంతో ఆరోగ్యశ్రీ ట్రస్టుకు సంబంధించిన రాష్ట్ర పరిధిలోని ఆస్తులన్నీ తెలంగాణకే చెందుతాయి. దాంతోపాటు హైదరాబాద్ లోని ఎం.ఎన్.జె. కేన్సర్ ఆస్పత్రి, యోగాధ్యయన పరిషత్ లు కూడా పదో షెడ్యూల్ లో చేర్చారు.
- దేశ వ్యాప్తంగా తప్పిపోయిన పిల్లల కోసం కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ జూన్ 2న 'ఖోయా-పాయా' అనే వెబ్ సైటును ప్రారంభించింది.
- అత్యయిక పరిస్థితి (ఎమర్జన్సీ) 40వ వార్షికోత్సవం సందర్భంగా, నాటి నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశాన్ని ఐక్యం చేసిన జయప్రకాష్ నారాయణ్ స్మృతిచిహ్నాన్ని నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. బీహార్ లోని ఆయన జన్మస్థలం లాలాకాతోలా లో చిహ్నాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- బంగ్లాదేశ్ లో వ్యాపార నిర్వహణకు భారతీయ జీవిత భీమా సంస్థ (ఎల్.ఐ.సి.) కు అనుమతించింది. తద్వారా బంగ్లాదేశ్ లో భీమా వ్యాపారానికి అనుమతి పొందిన రెండో విదేశీ సంస్థగా ఆవిర్భవించింది.
- రూ.1500 కోట్లతో అణు ప్రమాద భీమా నిధిని ఏర్పాటు చేసినట్లు కేంద్రం జూన్ 13న ప్రకటించింది. అణువిద్యుత్ కేంద్రాల్లో ప్రమాదం సంభవిస్తే ఈ ప్రమాద భీమా నిధి నుంచి నష్ట పరిహారం చెల్లిస్తారు.
- భారీ ఉపగ్రహ ప్రయోగాలకు తోడ్పడే ఎస్-200 స్ట్రాపాన్ బూస్టర్ కు శ్రీహరికోట లోని రాకెట్ ప్రయోగ కేంద్రంలో జూన్-14న జరిపిన పరీక్ష విజయవంతమైంది.

వార్తలు -విశేషాలు

- సంస్కృత ఆచార్యులు పద్మశ్రీ పుల్లెల రామచంద్రుడు హైదరాబాద్ లో కన్నుమూశారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని ఇందుపల్లి గ్రామానికి చెందిన రామచంద్రుడు తెలుగు, సంస్కృతంలో దాదాపు 175కి పైగా పుస్తకాలు రచించారు. ఆయన సంస్కృత రామాయణాన్ని వాల్మీకి రామాయణం పేరుతో తెలుగులోకి అనువదించారు.

జులై నెలలో ముఖ్యమైన రోజులు

వైద్యుల దినోత్సవం - 1
ప్రపంచ క్రీడా జర్నలిస్టుల దినోత్సవం - 2
అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం - 4
స్వామి వివేకానంద వర్ధంతి - 4
వరల్డ్ జునిసిస్ డే - 6
ప్రపంచ జనాభా దినోత్సవం - 11
నాబార్డు స్థాపక దినోత్సవం - 12
తల్లిదండ్రుల దినోత్సవం - 24
కార్గిల్ విజయోత్సవం - 26
ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం - 28
ఓ.ఆర్.ఎస్. దినోత్సవం - 29


- ప్రముఖ రచయిత దాశరథి రంగాచార్య (86) అనారోగ్యంతో హైదరాబాద్ లో జూన్ 8న మరణించారు. సాహిత్యవేత్తగా, తెలంగాణా పోరాట యోధునిగా పేర్గాంచిన ఆయనకు చిల్లరదేవుళ్ళు నవలకుగాను 1969లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది.
- గోదావరి పుష్కరాలకు వచ్చే యాత్రీకులపై రైల్వే శాఖ అదనపు భారం మోపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో పుష్కరాలకు రైళ్ళలో వచ్చే యాత్రీకులపై సర్‌ఛార్జి విధించింది. ఏపీలో రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు, తెలంగాణాలో భద్రాచలంరోడ్డు, మంచిర్యాల, బాసర, రామగుండం, రైల్వే స్టేషన్లకు జూలై 14 నుంచి 25 వరకూ రైళ్లలో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే యాత్రీకులకు ఈ సర్ చార్జీ విధిస్తారు. ఈక్రమంలో స్లీపర్, సాధారణ తరగతుల్లో ఒక్కో టిక్కెట్ పై 5 రూపాయలు, ఏసీ చైర్ కార్ , త్రిటైర్ ఈసీకి రూ. 10, సెకండ్ ఈసీకి రూ. 5, మొదటి తరగతి ఈసీకి రూ. 20 అదనంగా వసూలు చేస్తారు.
- ప్రముఖ సినీనటి ఆర్తి అగర్వాల్ అమెరికాలో కన్నుమూశారు. దాదాపు అగ్ర హీరోలందరితోనూ ఆర్తి నటించారు. ఆర్త్ చివరి చిత్రం ఆపరేషన్ గ్రీన్ హంట్ .
- కేంద్ర మాజీమంత్రి షీలాకౌల్(100) ఘజియాబాద్ లో జూన్ 13న మరణించారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ గా పని చేసిన ఆమె 1992-95 మధ్య కాలంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పని చేశారు.
- ఆధ్యాత్మికవేత్త, బోధకులు సద్గురు శ్రీ శివానందమూర్తి (87) వరంగల్ లో జూన్ 10న కన్నుమూశారు.

క్రీడలు

- 21వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 15 స్వర్ణాలతో చైనా మొదటి స్థానాన్ని, 7 స్వర్ణాలతో కతార్ రెండో స్థానాన్ని గెలుచుకోగా మనదేశం 4 స్వర్ణాలు సాధించింది. చైనాలోని వుహాన్ లో ఈ పోటీలు జరిగాయి.
- ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ ను వావ్రింకా (స్విట్జర్లాండ్) గెలుచుకున్నాడు. అలాగే మహిళల సింగిల్స్ టైటిల్ ను సెరెనా విలియమ్స్ (అమెరికా) సాధించింది. ఇదిలావుంటే పురుషుల డబుల్స్ టైటిల్ ఉ ఇవాండోడిగ్ (క్రొయేషియా), మార్సెలోమెలో (బ్రెజిల్) జంట, మహిళల డబుల్స్ టైటిల్ ను లోసీసఫరోవా (చెక్ రిపబ్లిక్) బేధాని మాటెక్ (అమెరికా) జంట సాధించింది.
- దక్షిణాసియా టేబుల్ టెన్నీస్ చాంపియన్ షిప్ లో భారత్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ అమ్మాయి వారిని జైస్వాల్ టీమ్ విభాగంలో స్వర్ణ పతాకాన్ని సాధించింది.
- న్యూజిలాండ్ తో మహిళల వాన్ డే సిరీస్ కు కెప్టెన్ గా హైదరాబాద్ అమ్మాయి మిదాలీరాజ్ వ్యవహరించనుంది. అలాగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కు చెందిన వికెట్ కీపర్ కల్పనకు ప్రాబబుల్స్ లో చోటు దక్కింది.
- దక్షిణాసియా టేబుల్ టెన్నీస్ చాంపియన్ షిప్ లో భారత్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదారాబాద్ అమ్మాయి ఆకుల శ్రీజ టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది.



దాసరి దుర్గాప్రసాద్



మీరా

the last frame

In facing death at any moment could be called living.



మన్నం సింధుమాధురి

మీలో ఎవరికయినా "చెకొస్లొవాకియా" స్పెల్లింగ్ సరిగ్గా తెలిత్తే ఈ కథ చదవండి. లేకపోతే వద్దు. ఆపండి. నిఘంటువు తెచ్చుకుని స్పెల్లింగ్ నేర్చుకోండి. అంత క్లిష్టంగా, అందంగా పెదాలు కదిలిత్తా, గాలిని బయటకి పంపిస్తా పలికే పదం ఇదేనేమో.

ఇదెందుకు నేర్చుకోవాలంటే నటాల్కా మాన్కోది అదే దేశం కదా. చిన్నప్పుడు తన బాల్యం అంతా అక్కడే గడిచింది. బలవంతపు ప్రయాణంలా నడిచింది. చెక్ మరియు స్లోవాక్ దేశాలు కలిసి చెకొస్లొవాకియాగా మారినయ్యి.

❖ ❖ ❖ ❖

పచ్చని పొలాలు, అరటి తోటలని గాలుల నించీ కాపాడే కొబ్బరి చెట్లు, వరి పండిచ్చే చేలు. ఇంగ్లీషు, కన్నడ, తెలుగులో దారి పొడుగునా బోర్డులు, ఆటి పయిన, పాస్తా, బనానా, ఫిటిల్స్, డంప్లిన్స్, కౌస్‌బే, లెమన్, జింజిర్ మిల్క్ లాంటియ్యి దొరుకుతాయని వివరాలు. కింద హనుమన హళ్ళి గ్రామం పేరు. దాని అర్థం హనుమంతుని పల్లె అని. రోడ్డు పక్కగా బండరాళ్ళ మీద గుంపులుగా కోతులు. అది దాటితే పెద్ద కొండ. ఆ కొండ మీద పెద్ద బండరాళ్ళు. అయ్యి దూరంగా ఉండేవాళ్ళకి కూడా కనపడేటట్టుగా రబ్బీసు మట్టి, సున్నంతో నిలువు గీతలు. ఆటి పక్క నుండి నలుచదరపు నేల మీదకి ఎవరు రాళ్ళు మోసి కట్టారో ఒక హనుమంతుడి దేవాలయం. దాన్ని ఇంగ్లీషోళ్లు ముద్దుగా పిలుచుకునే పేరు మంకీ గాడ్ హిల్. లోపల రాతి మీద హనుమంతుడి విగ్రహం. దానికి మొత్తం పూసిన కొబ్బరి నూని సింధూరం. అక్కడ గుట్ట మీద నిలువు నామాలు ధరించి తిరిగే సాధువులు. మొలలకి మాసిన ఎర్రటి తుండుగుడ్డలు చుట్టి, అట్టలు కట్టిన జుట్టుని ముడేసి, మెడలో తులసి మాలలతో తిరుగుతా ఉంటారు. కొందరు పక్కగా ఉన్న ధుని(హొూమం) దగ్గిర మోకాళ్ళ మీద కూర్చుని మట్టి చిలుముల్ని పెద్ద శబ్దంతో ఊది, దులిపి, పొగాకు, గంజాయిలని బాగా నలిపి, గింజలు తీసి, కడ్డీలు ఏరి, ఈనెలు లాగి, బాగా ముద్దకొచ్చేలాగా నలిపి, చిలుంలో కూరి, కూరి నింపి, తడిగుడ్డ అడ్డం పెట్టుకుని పీలుత్తా వచ్చే పోయే వాళ్ళని సీత్తారాం(సీతారాం) అని ఉత్తరాది హిందీ యాసలో పలకరిత్తా ఉండారు. అంతా ఆయాసపడతా పైకి ఎక్కి వచ్చిన వాళ్ళకి మాంచి మసాలా టీ అందిచ్చే పనిలో ఇంకో సాధువు. అదుగో సరిగ్గా అక్కడ కొబ్బరి చిప్పలో మసాలా ఛాయ్ తాగుతా పరిచయం అయ్యింది మీరా. తనో సన్యాసిని.

ఒకసారి ఏమీ తొయ్యక సిరాగ్గా ఉండి పొడుగాటి చెమటలు పట్టే నడక కోసం కొండెక్కితే కొండ మీదుంది తను. పయిన పెద్ద పెద్ద పెట్టెలు పేర్చి, చిన్న, మధ్యస్తంగా, పెద్ద ఆకారాలల్లో ఆ పెట్టెల్లో రకరకాల కోతులు, ఆటికి అరటి, బెల్లం, కొబ్బరి, క్యారెట్ ముక్కలు తినిపిత్తా మంచినీళ్ళు పోత్తా గోలగోలగా మాట్టాడతంది.

ఎనక్కి తిరిగి నన్ను చూసి 'నమస్తే' అని 'ఏంటి రెస్టారెంటు పార్లరుకి సెలవా?' అని అడిగింది. 'ఇవ్వాళ పనిచెయ్య బుద్ధి కాలా. మూసేశా. రోజంతా నడవాలనిపిచ్చి తిరుగుతున్నా' అని చెప్పా.

'నువ్వా కోతులకు ముక్కలు పెడతావా?'

'భయం'

'మనల్ని చూసి ఈ మనిషి మంద ఎక్కడ ముప్పు తెత్తయ్యో అని అయ్యి ముందే బెదిరిపోతయ్యి'.

'సరే ఇవ్వు' అని సాయపడుతున్నా.

అవ్వంగానే బాబా మంచి ఛాయ్ ఇచ్చాడు. తాగుతా చేతులు ధునికి ఆనిచ్చి ఎచ్చ చేసుకుంటున్నా.

నొసలు ఎగరేసి దించి, 'రోజూ చూత్తాను. పలకరిద్దాం అంటే వీలు కావట్లా. పనిలో తీరిక లేదు. అయినా నీ మీద కోపం. మొన్న శ్యాంతో కలిసి గన్ తీసుకుని పచ్చని కొండల్లో పిట్టల్ని కాలుత్తున్నావ్. చాలా కోపం వచ్చింది. ఇక్కడి దానివని అరుపులతో ముగిచ్చా. లేకపోతే నిన్ను వదిలేదాన్ని కాదు. తుపాకీ పట్టుకోటానికి అంత ధైర్యం ఎక్కడినుంచీ వచ్చింది. పిట్టలు, మనుషులు, ప్రకృతీ స్వేచ్ఛగా ఉండాలి. దేనికీ భయపడకూడదు'.

'ఆ రోజు నుంచీ గన్ పట్టటల్లేదు. ఇంక పట్టను. వదిలెయ్. ఈ కోతులేంటి మీరా?'.

'ఈటికి చాలా కథుంది. నీ సహాయం కూడా కావాలి'.

'నీకా? కోతులకా'.

'అంతా చెబుతా. నేనే నిన్ను కలుద్దాం అనుకున్నా. ఈ లోగా అదృష్టం లాగా కొండమీద నువ్వు తగిలావు'.

'మొన్న ఆ బుద్దిష్ట్ బేబీ మాంక్(బాల భిక్షువు)ని పంపావు. మేకప్ కోసం ఎట్టా ఉంది. ఆళ్ళకి నచ్చిందా. గుండు గీసేటప్పుడు ఆ పిల్లాడు కదిలాడు. పాపం గుండు మీద గాట్లు, చర్మం గీరుకుని రక్తం'.

'ఆ మేకప్ చూసి నిన్ను మళ్లీ కలుద్దాం అని అనుకున్నా. అది హీరో సైకిళ్ళ ప్రకటన కోసం నటించే కుర్రాడు. బాగుంది. కాని కోతుల చాకిరీ వలన తీరిక లేకుండాఉంది'.

తనని తేరిపార చూశా. ఇట్టా కూడా బట్టలు కట్టుకుంటారా, పొడుగు చేతుల నల్లటి లాల్చీ, కింద అంట కుట్టిన పంచె లాంటి గుడ్డ. మెడలో తులసి పూసలు, రుద్రాక్షలు, పగడాలు, గవ్వలు, పైసలు, దండలు, ఈటన్నిటికన్నా పెద్ద చంద్ర కాపు స్ఫటిక మాల. ఒక తాడుకి సన్న చెక్క పూసలు, మజ్జలో ఇత్తడి గెంటలు, చివరన మంచి రామేశ్వరం ఇసక రంగు గోధుమ శంఖం. చేతులకు కొమ్ము, రాగి, పచ్చ రాతి గాజులు, చెవులకు రొండు రుద్రాక్షలు. మజ్జలో గవ్వలతో జూకాలు. కాళ్ళకీ చేతులకీ సత్తు కడియాలు. మొకం మొత్తం పసుపు స్నానం చేసి పెట్టిన ఆకుపచ్చ రాతి కుంకం, కింద ఈభూతి, కళ్ళ చుట్టూ ఇరిగిన పెసర గింజ ఎడల్పుతో దిద్దిన కాటిక, చేతిలో త్రిశూలం, దానికి జానెడు కింద కట్టిన డమరుకం. త్రిశూలం మూడు చివర్లా చిరు గెంటలు. మొత్తం తన అవతారం చూత్తే ధ్వని ప్రసూనాంబా, శబ్ద పురీశ్వరుల కలయిక అయిన ఆధునిక దేవత(మూవింగ్ ఏంజిల్)లా ఉంది.

'ఈ త్రిశూలం ఎట్టా మోత్తావు?'

'అది నా వస్త్రధారణలో ఒక భాగం'

'ఈ బట్టల్లో, అలంకారంలో బాగుండావు. మనిద్దరం నడుత్తా గానీ, ఎక్కడన్నా ఆగి గానీ మాట్టాడుకుందాం'

'ఈ కోతులకి గిన్నెల్లో నీళ్ళు పోసి ఎలదాం. ఒక వారం తరువాత ఈ కోతులు నీక్కూడా అలవాటవుతయ్యి'

'ఎట్టాగబ్బా'

'పద,' అని త్రిశూలం చేతికి తీసుకుని చెకచెకా చేతిలో త్రిశూలాన్ని ఎనక్కీ, ముందుకీ ఊపితా కదిలింది.

'నీకెన్నేళ్ళుంటయ్యి?'

'అందరూ నీ పేరేంటి, నువ్వేం చేత్తావు. నీ ఏశం ఏంటి? నీ కెవరూ లేరా, పెళ్ళవ లేదా అని మొదలు పెడతారు. నువ్వు ఎదురుమతం లాగా వయసడిగావు. అయినా చెబుతాను. నాకు 64 ఏళ్ళు'

'అట్టా లేవు. 50 లాగా ఉండావు. కోతుల గోలేంటి?'

'సాయంత్రం నా గుహకు రా. అక్కడ మాట్లాడుకుందాం. తిండి కూడా అక్కడే. ఎదురుచూత్తా ఉంటాను,' అని గతాగతా అడుగులతో జుట్టు గాలికి ఊగుతుండగా త్రిశూలం నేలలో పోటేశుకుంటా ఎల్లిపోయింది.

❖ ❖ ❖ ❖

హాయ్ నేను నటాల్కా మాన్కోని. 1933-34 మధ్యలో పుట్టాను. ఇంటో ఐదో పిల్లని. చాలా ముద్దుగా, గారాంగా ఉన్ని రగ్గులు, దూది పరుపుల మజ్జల్లో పెంచారు. చాలా భోజన పదార్థాలు, డబ్బు, పనివాళ్ళు, పింగాణీ పాత్రలు, వ్యాపారాలతో మా నాన్నల అన్నదమ్ములందరూ ఉన్న ఉమ్మడి కుటుంబంలో పెరిగాను. 1933 నించీ 1945 మజ్జలో నాజీలు హిట్లర్ నాయకుడిగా జర్మనీని శ్మశానంగా చేసి ఏలారు. పోలెండ్ మా దేశం. రాజధాని (warsaw)కి చాలా దూరంగా ఉండే సోనోవిక్ (Sosnowiec) మా పట్టణం. మా నాన్నా, బాబాయి కొట్టో కూచ్చున్నపుడు కొందరు అధికారులు మాట్లాడుకోటం ఇన్నారు. అది మా అక్క నాకు చెప్పింది. నేను మీకు చెప్పి ఆ తరవాత నా అనుభవం పంచుకుంటా.

హిట్లర్ సైనికాధికారులు (ఒక రకమయిన పోలీస్) 'గెస్టపోలు' మా ఊరికి వచ్చి జూయిష్ (jews) వాళ్ళంతా ఒక చోట సమావేశం కావాలని, ప్రతి వాళ్ళూ తప్పకుండా 'స్టార్ ఆఫ్ డేవిడ్' ధరిచ్చి రావాలని ఆజ్ఞ. ఆ ఆజ్ఞలో ఏదో కీడు తోచి మా వాళ్ళు సామాను సర్దుకున్నారు. మా అమ్మ మాత్రం బంగారం, వజ్రాలు, కొంత డబ్బూ గాజు జాడీలో పెట్టి గుంట తీసి నేలలో పాతేసింది. అందరం పారిపోయాం. ముందుగా కొండలోయలో దాక్కున్నారంట. ఒక రోజు తిండి తేవడానికి బయటకెళ్ళిన మా బాబాయి, పెద్దన్నయ్యలని నాజీ సైనికులు కాల్చేశారు. ఇంటిని సోదా చేసి తాతయ్య, నానమ్మల ప్రాణాలు కూడా తీశారు. చంపేసిన వాళ్ళ వంటి చర్మం చిన్న చిన్న ముక్కలు తీసి వెనిగర్‌లో కానీ, స్పిరిట్‌లో కానీ గుర్తుగా దాచేవాళ్ళు. ఇయ్యి మా అక్క అనుభవాలు. ఇక నాయి చెబుతా – అని నా వంక చూసింది.

ఒక స్త్రీగా తన అనుభవాలు రాసే ఓపికే కాదు. ఇనే శక్తి కూడా నాకు లేదనిపిచ్చింది. నీరసంగా అనిపిచ్చి పక్కనే సీసాలో ఉండ తేనెని గరిటెతో తినడం మొదలు పెట్టాను, ఓపిక కోసం.

కొంచెం తిన్నాక 'నీ అనుభవాలు...' అని అనగలిగా...

'చెబుతా.. అలసిపోయా, పడుకోనియ్యి' అంది నటాల్కా మాన్కో.

❖ ❖ ❖ ❖

సాయంకాలం ఐదయ్యింది. అందరూ కొండ ఎక్కి విరూపాక్షేశ్వరుడి గోపురం మీదగా కుంగే హంపీ సూర్యుణ్ణి చూస్తున్నారు. నేను కొండ దిగి వచ్చినవాళ్ళకి తిండి అందిస్తా నా రెస్టారెంట్ కమ్ పార్లర్‌లో బిజీగా ఉండా. మెల్లిగా రాత్తిరి ఎనిమిదయ్యింది. మీరా గుహకి ఎల్లాలి అనే విషయం గుర్తుకొచ్చింది. అంతే ఆఖరి విదేశీయుడికి భోజనం పెట్టి ఆనంద్‌కి విషయం చెప్పా.

'మీరాకి లవర్ ఉన్నాడు. అతను ఇవాళ ఊరికెల్లాడు. అందుకే నిన్ను రాత్రికి భోజనానికి పిలిచింది,' అన్నాడు.

'అవునా.. ఎవరతను? ఏంచేస్తాడు?'

'మన శేషగిరి నాన్న(ఆనంద్ నా హొటల్ పార్టనర్, శేషగిరి సహాయకుడు)'

లియాన్ యురిస్ రాసిన ఆధునిక కావ్యం ఎక్సోడస్ – హిట్లర్ బారిన పడిన యూదులు తమ నేలని వెదుక్కుంటూ చేసే మహా ప్రయాణం. ప్రపంచంలోని అనేక భాషల్లోకి అనువాదమై, ప్రసిద్ధమైన 'డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్ ' గ్రంథం – అన్నే ఫ్రాంక్ అనే పదిహేనేళ్ల చిన్నారి మరణవాఙ్మూలం. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో 'హోలోకాస్ట్' పేరిట నాజీలు జరిపిన లక్షలాది యూదుల ఊచకోత, యూదులు పడ్డ నరక యాతన మీద వచ్చిన సాహిత్యం ప్రపంచంలో అపారం. పడమటి దరిని ఎక్కడో ఉన్న ఆ సాహిత్యానికి ఇక్కడ భద్రమైన తూరుపు తీరాల కొస నుంచి ఒక కొత్త చేర్పు– ఈ కథ 'మీరా'. 'భయంకర బాధల పాటల పల్లవి' వంటి ఈ కథతో భూగోళం చెరోకొసనా ఉన్న భిన్న ప్రపంచాల్ని ఏకం చేసిన కలం– మన్నం సింధు మాధురి.

ఒక్కొక్కటిగా జారి పారిపోతున్న ప్రతిక్షణంలోనూ కాలస్వభావాన్ని, ఒక్క ఇసుక రేణువులో భూమండలం పడే పురిటినొప్పుల్ని చూడగలగడమే అల్ప– అనల్పాల ద్వంద్వాన్ని అర్థం చేసుకోవడం. విస్తృతమైన తన కథల కాన్వాసుతో ఆ ద్వంద్వాన్ని దర్శించి, ప్రదర్శించే విశిష్టమైన కలంగా సింధు మాధురిని ఇప్పటికే గుర్తించింది తెలుగు పాఠకలోకం. క్యాంపు అనబడే ఆ చిన్న కుగ్రామం కథల్ని 'ఉళైనూరు క్యాంపు కథలు'గా రాసిన ఆ కలంతోనే మీరా వంటి అంతర్జాతీయ స్థాయి కథల్ని కూడా రాయడం ఆ గుర్తింపుకు ఒక ఉదాహరణ.

జీవితంతో తలపడి చేసే యాత్రలాంటిదే మాధురి రచనావ్యాసంగం. అయితే ఈ యానం లోపలికి, లోలోపలికి, సంక్లిష్ట మానవాంతరంగాల్లోకి! రచయితగా మాధురి చేసే ఈ మహాయానం వల్ల ఎదురైన అనేకానేక అనుభవాలు జ్ఞాపకాలుగా నిన్నలలో నిలిచిపోలేదు. ఆమె చుట్టూ మోహరించి, ప్రేరేపించి, ఆవహించి, అన్ని రూపాలు ఆమెగా ఒదిగి, ఆమె అన్ని పాత్రలుగా విస్తరించి, రౌద్ర బీభత్స భయానక శృంగార వీర సాహస విషాదాంత గాథలయ్యాయి, అవుతున్నాయి, ఆమెను రుణవిముక్తం చేస్తున్నాయి ఒక్కొక్కటిగా.

'కానీ అతనికి గంపెడు పిల్లలు, పెళ్లాం ఉండారుగా'

'అవును. అతనేం చెయ్యడు. మీరా డబ్బుల మీదే పిల్లల చదువులు, ఇల్లు గడుపుకుంటాడు. చాలా ఆనందంగా ఆడికి డబ్బులిచ్చుద్ది. మనాడు మీరా కో పేరు పెట్టాడు'

'ఏంటది?'

'అఖండ చుడీదార్'

'అదేంటి?'

'పయినించీ కిందకి ఒక గౌను లాంటి అంగీ, కాళ్ళకి జీరాడతా పెద్ద కుచ్చుల, కుచ్చుల జైపూర్ లంగా లాంటి పైజమా.. అందుకే అట్టా'.

'ఇదేంటిరా ఆడు పగలు చూత్తే రేత్తిరి కల్లోకొచ్చి దడ పుట్టిత్తాడు. ఈమెకి ఎట్టా స్నేహితుడు'

'అబ్బో ఆళ్ళిద్దరిది పెద్ద కథ. నా ఈశ్వరుడు అని చెప్పుద్ది. ఇవాళ నీకు కథలే కథలు'

'సరే అందరు మనుషులం ఏదో ఒక రోజుకి కథలాగే మారతాం. కానీ నాకు కావలసింది అదే'

ఒక పెద్ద హత్తం(హస్తం) అరటిపళ్ళు, ఒక చెంబుడు ఆవు పాలు, రొండు మూరల విరజాజులు అరటాకులో చుట్టుకుని టార్చిలైటు, ఆనంద్‌తో కలిసి నడిచా. నది దాటి ఓ చిన్నకొండ ఎక్కితే సీతారాం బాబా గుహ. అక్కడ నించీ మలుపు తిరిగి కొద్దిగా పైకెక్కితే మీరా గుహ. అలవాటయిన దారయినా రాతిరి అవటం వల్ల ఇరవై నిమిషాల్లో మీరా గుహలో ఉండాం. బయట కట్టెల మంట పక్కనే తెల్లటి ఛాయ్ కెటిల్ నించీ వచ్చే పొగ. నుప్పుల పయిన కాలతన్న రేకు. రేకు పయిన వెనిగర్, ఉప్పు, ఆలివ్ నూనెలో మగ్గుతున్న వంకాయలు, పనీర్ ముక్కలు, చెక్కు తీసి మగ్గిన క్యారెట్‌లు. అడుగుల చప్పుడు, బ్యాటరీ వెలుగుకి బయటకొచ్చింది. దుస్తులు మారినయ్యి. తెల్లబట్టలు, విరబోసుకున్న జుట్టు. ఏ అలంకారాలూ లేకుండా ప్రశాంతంగా పారే తుంగభద్రలా ఉంది.

'నమస్తే'

'పార్వతీ పరమేశ్వర్... కూచ్చో' అని తుంగ చాప పరిచింది.

గదిలో ఒక మూల మట్టి ప్రమిదలో నూనె పోసి ఎలిగిచ్చింది. గుహ రొండు భాగాలుగా ఉంది. అడుగున్నర ఎత్తులో ఒక భాగం, నాలుగు మెట్లు దిగితే కింద రెండో భాగం. దాంటోనే పొయ్యి. అంటే మూడు రాళ్ళే. పయిన నాలుగైదు మట్టి సట్లు, పిడతలు, ఒక సంచిలో కొద్దిగా పిండి, కూరగాయలు, పంచదార, టీపొడి, నీళ్ళకి మట్టి కడవ, నాలుగైదు కొబ్బరి చిప్పలు, ఏవన్నా తాగడానికి, తినడానికి అరిటాకుల చుట్ట. గదిలో పక్కగా శంఖాలు, రుద్రాక్షలు, సాలిగ్రామాలూ పట్టుబట్ట పయిన పెట్టి, విభూతి, కుంకం రాసి కొండ పసుపు పూలు పెట్టి ఉండయ్యి. ఒక మూటలో మడత పెట్టిన గుడ్డలు. ఇవే మీరా సామాను, ఆస్తి.

వేడి వేడి ఛాయ్ ఇచ్చింది. ఇంతలో సీతారామ్ బాబా గుహలో శంఖం మోగింది. నిశ్శబ్దంలో ఏదో చిన్న అలజడి. ఆనంద్ గంటలో వత్తానని బాబా దగ్గరకి ఎల్లాడు.

'సమయం ఎంతో'.

'ఇక్కడ గడియారం, అద్దం రెంటితో పనిలేదు.'

'మరి బొట్టు'..

'తుంగభద్రలో స్నానం అయినాక, బొటన వేలుకి చూపుడు వేలుకి మజ్జ వచ్చినంత తీసుకుని నీటి నీడలో పెట్టుకుంటా. కాటిక కూడా అంతే'

'సరే ఈ కోతుల గోలేంటి? నన్నెందుకు కలవాలన్నావు?'

'కోతులని నీకు నేస్తాలని చేద్దామని. నువ్వు వాటిని పెంచుకుంటావని' అని కాసేపాగి, 'ఒక ఫ్రెంచి వాళ్ళు నీ సహకారం కావాలన్నారు. వంట అయినాక చెబుతా' అని రొట్టె కాల్చడంలో పడింది.

❖ ❖ ❖ ❖

అప్పుడప్పుడే ఊహ తెలుస్తోంది. కొద్దిగా పెద్దదాన్నయ్యాను. అందరూ నటాల్కా అని పిలుస్తున్నారు. మా భాష హెబ్రూని నేర్చుకుంటున్నా. గెస్టపోల అత్యాచారాలకి అంతు లేకుండా పోతోంది. కథలు చెప్పి ఒళ్ళో పొడుకేసుకునే మా అక్కని కూడా చంపేశారు. నేను చాలా కాలం ఒక ఇంటి రేకుల షెడ్డుని అనుకుని ఉండ చెట్టు తొర్రలో కూచ్చుని ఉండిపోయాను. ఇంటి వాళ్ళు

పాత సామాను తొర్రకి అడ్డం పెట్టే వాళ్ళు. ఒక రకంగా చస్తూ బతకటం. రోజుకో, రెండు రోజులకో ఒకసారి కొద్దిగా బ్రెడ్డు, బంగాళాదుంపలు దొరికేయి. అదీ బతకటానికి కూడా సరిపోదు. మల, మూత్రాలు బలవంతంగా ఆపుకుని రొండు,మూడు రోజులకి ఒకసారి ఎల్లాల్సి వచ్చేది. లేదా ఒక బేసిన్‌లో ఎల్లి, జనం అందరూ నిద్దరపోయిన తరవాత పారపొయ్యాల్సి వచ్చేది.

ఒకసారి ఆడుకోవాలని, తిరగాలని అనిపిచ్చి బయటకి వచ్చాను. ఆ ఇంటాయన 'గెస్తపోలు నిన్ను కూడా పట్టుకుపోతారు. చంపిన తరవాత నీ చర్మం కూడా కోసి చిన్న ముక్క గుర్తుకి ఆలీవ్ అయిల్‌లో దాచుకుంటారు' అన్నాడు. కాళ్ళు కొంగర్లు పోయి, నరాలు మెలిపెట్టి నడవటానికి కూడా వచ్చేయి కాదు. కొన్ని ఏళ్ళ పాటు బయట ఊరు, రోడ్లు ఎట్టా ఉంటయ్యో కూడా తెలీదు. మా వాళ్ళందరి దగ్గరా నగలు, వజ్రాలు, ఉన్ని, ఫర్ కోట్లు, చివరకి మిగిలిన వంట పాత్రలు అడక్కుండానే లాక్కునే వాళ్ళు. 'స్టార్ ఆఫ్ డేవిడ్' ఉన్న వాళ్ళందరినీ కుప్పలు, కుప్పలుగా ట్రక్కుల్లో కుక్కుకుపోయి తీసుకెల్లి వేలు, లక్షల మందిని గ్యాస్‌తో ఊపిరాడకుండా, తుపాకులతోనూ కాల్చి చంపేవాళ్ళు.

ప్రశాంతంగా గడిత్తే జీవితం ఎట్టా అవుతుంది. ఒక రోజు నన్నూ, మా అన్ననీ పట్టుకున్నారు. మా అదృష్టం ఏంటంటే ఇద్దరినీ ఒకే ట్రక్కులో ఎక్కిచ్చారు. మా అమ్మ, నాన్నని దక్షిణంగా డెత్ క్యాంపుకి తీసుకెల్లారు. ట్రక్కులో ఏమీ మాట్లాడొద్దని మా అన్న సైగ చేశాడు. కళ్ళతోనే కొన్ని ఆత్మీయ క్షణాలని పంచుకున్నా. ఏ నిమిషంలో నయినా వీడుకోలని తెలుసు. పిల్లలం అయినా చాలా భరిచ్చాం.

ఆపి... 'మంచినీళ్ళు' అంది.

తెచ్చి ఇస్తే తాగి కళ్ళు మూసుకుని గోడకి ఆనుకుంది.

పెద్దగా ఊపిరి ఒదిలి తరవాత...

'ఈ కథ చెప్పాలంటే చాలా జవజీవాలు కూడ తీసుకోవాలి. ఇవ్వాల్టికి ఒదిలెయ్యి. రేపు చెబుతా' అని కళ్ళు మూసుకుంది.

❖ ❖ ❖ ❖

కాల్చిన రొట్టెల్ని ఒక చెక్క ముక్క మీదేసి, టమాటాల్ని ఆలివ్ నూనెతో కలిపి వండిన కూరని రాతితో కలిపి, అన్నిటిపయినా అరిటాకు మూసి ఆనంద్ కోసం గెంట మోగిచ్చింది. అడుగుల శబ్దం వచ్చి చూత్తే ఆనంద్, సీతారాం బాబా ఉండారు. చేతిలో రవ్వ, పెసర మొలకలతో చేసిన పాయసం గిన్నె ఉంది. అందరికీ అరిటాకుల్లో రొట్టెలు, కూర, కాల్చిన వంకాయలు, పన్నీర్, క్యారెట్ ముక్కలు, పచ్చి వెన్నతో తిన్నాం. ఆఖరున పాయసంతో మా విందు అయ్యింది. ఆనంద్, బాబా ఇద్దరూ కొద్ది దూరంలో రాళ్ళ మీద మాట్లాడతా ఉండారు.

నేనూ మీరా కోతుల సంగతికి మళ్ళీ వచ్చాం.

'కోతులని ఒక ఫ్రెంచ్ సినిమా కోసం తెప్పిచ్చారు. వచ్చే నెల నించీ ఇక్కడ తీత్తారు. నికోలస్ గై, ఫెదరిక్ అనే ఇద్దరు సోదరులు దర్శకులు. అందులో కథానాయకి భారతీయురాలు. కథానాయకుడు ఫ్రెంచ్ అతను. అనుకోకుండా మాఫియా ముఠా చేతిలో పడి ఒక దొంగతనం కోసం హంపీ వత్తాడు. ఇక్కడ టీచరమ్మ అయిన కథానాయకితో ప్రేమలో పడతాడు. ఆ ముఠాని నాశనం చేసి, దొంగలని పోలీసులకి పట్టిచ్చి, వీళ్ళ పెళ్ళి జరగడానికి కోతులు సాయపడతయి. అదీ కథ. నాకు సరిగ్గా తెలవదు. ఇంతే తెలుసు.'

'అయితే నేనెందుకు?'

'కొన్ని భారతీయ పాత్రలని అలంకరించాలి.'

'నేనా సినిమాలకా, అమ్మో అసలు ఇష్టం లేదు. అంత పనిచెయ్యలేను'.

'ఇక్కడ నువ్వే ఉండావని మాటిచ్చాను. 'ఆళ్ళు చాలా మర్యాదగా చూస్తారు. ఎప్పుడు నీకు కష్టం కలిగినా తప్పుకో. డబ్బు, బీమా సౌకర్యం కూడా ఉంది. పని చేసేది జంతువులతో కదా. చాలా జాగర్తగా ఉంటారు.'

'ఇంకా'

'రోజుకి నాలుగ్గెంటలు పని, మూడు వేల చొప్పున ఇత్తారు. నెల రోజులు అవసరం. కావలసిన జాబితా ఇయ్యి. ఆళ్ళు తెచ్చిత్తారు.'

'ఆలోచించుకోనియ్యి. సమయం కావాలి'

'కానీ రేపొద్దిన కల్లా చెప్పాలి'.

ఇక 'సరే' అని చెప్పా.

'చాలా చాలా సంతోషం' అంది.

'మరి ఈ కోతులకి నువ్వు తిండి పెట్టడం...'

'తర్ఫీదు అయ్యి, చలి ప్రదేశం నించీ వచ్చినయ్యి. ఇక్కడ వేడి వాతావరణం, తిండి అలవాటయ్యేందుకు ముందు పంపారు. ప్రపంచ జంతు సంరక్షణ సమితి వాళ్ళు పరిశీలిత్తా ఉంటారు. వీటితో పని అయినాక ఒక సంవత్సరం పాటు తిండి పెట్టి నిదానంగా ఇక్కడ అడివికి అలవాటు చేసి వదలాలి. ఆ విషయాలు నన్ను చూసుకోమని అప్పచెప్పారు.'

బయట కొండల్ని ముద్దాడుతా మమ్మల్ని తాకుతున్న చల్లగాలి, బాబా ఏవో తత్వాలు పాడతన్నాడు. ఎక్కడో ఐర్లాండ్‌లో పుట్టాడు. భారత్ వచ్చి జ్యోతిష్యం, తత్వశాస్త్రం చదివి సీతారాంబాబాగా పేరు మార్చుకుని ఇక్కడ గుహలో ఉంటున్నాడు.

'ఈమె చెయ్యి చూడు' అంది మీరా.

కాసేపు బ్యాటరీ ఎలుగులో చెయ్యి చూసి 'మీ అమ్మంటే నీకు చాలా ఇష్టం. నీ కోసం ఒక రాజకుమారుడు గుర్రం ఏసుకొచ్చి మబ్బుల్లోకి తీసుకుపోతాడు'.

ఎక్కడినించో ఒక పిట్ట రెట్ట ఏసి ఎగిరింది. ఇంతలో ఆనంద్ 'అది మగ పిట్ట రెట్టేసింది. గుర్రం తెచ్చుద్ది' అన్నాడు. ఇక నవ్వులే నవ్వులు.

❖ ❖ ❖ ❖


నెల రోజుల్లో మా ఇంట్లో దాదాపుగా అందర్నీ చంపేశారు. అందరు బాబాయిల్ని, మావయ్యల్ని, పిల్లలు, జరాలతో, చాలీచాలని తిండితో బతికి ఉండాళ్ళతో గుంటలు తీపిచ్చి చచ్చిపోయిన వాళ్ళని గుట్టలుగా పూడిపిచ్చేవాళ్ళు. ఒకసారికి మేం కూడా ఈ ఎముకల గుప్పల మీద కుళ్ళతాం అని తెలుసు.

ఎముకల పయిన తోళ్ళు కప్పినట్టుగా, జుట్టు అట్టలు కట్టుకుపోయి, గుడ్డలయితే మురికీడులు, మసిపాతలే. బహుశా నాకు ఎనిమిదో, పదో సంవత్సరం అనుకుంటా. మమ్మల్ని 'బ్రాండే' (డెత్ క్యాంప్) అనే ఇంకో పేరు లేని క్యాంప్‌కి పంపిచ్చారు. దారిలోనే చాలామంది చచ్చిపోయారు. పీనుగుల మీద కాళ్ళు పెట్టుకుని కూచ్చునే వాళ్ళం. జనం దయతలచి ఒకటి రెండు బ్రెడ్డు ముక్కలు ఇసిరితే ఆడిమీదకి కోళ్ళలాగా మూగేవాళ్ళం. గార్డులు అందులో సగం మందిని కాల్చేసేవాళ్ళు.

మగవాళ్ళకి వళ్ళంతా కురుపులు, చీము, వార్డు మొత్తంలో కొందరు మాత్రం ఆడపిల్లలు ఉండేవాళ్ళు. మా యవ్వనం ఎదుగుదల కనపడకుండా మాసిన తోలు చొక్కాలతో రొండు మూడేళ్ళు గడిపాం. అయ్యి కూడా చిరిగిపోవచ్చినయ్యి. అయినా అవయవాల ఎదుగుదలని ఎట్టా ఆపుతాం. అమెరికాలో బంధువులు ఉండవాళ్ళని మాత్రం కొద్దిగా దయతో చూసేవాళ్ళు.

స్థానికులు కొందరు ఒకరోజు బ్రెడ్డు ఇసిరారు. గార్డులు కనపడలేదు. చాలా ఆకలిగా ఉండి ఏరుకోటానికి ఎల్లా. అంతే నరరూప రాక్షసులు ఇద్దరు చూడనే చూశారు. నన్ను బట్టలు ఇప్పమన్నారు. సిగ్గుతో ఇంకోసారి చచ్చిపోయాను. అదీ మా అన్నయ్యా, అతని స్నేహితుల ముందు. ఎట్టాగో బట్టలు ఇప్పాను. ఉల్లిపాయలు కోసే కత్తితో అప్పుడే పెరుగుతూ ఉండ నా కుడి స్థనాన్ని, తొడ కండల్నీ కర్కశంగా కోసి పారేశారు. ఎనక్కి కూడా తిరిగి చూడకుండా ఎల్లిపోయారు.

గుండెలు బాదుకునేలాగా ఏడుత్తా మా అన్న ఇంకా ఇద్దరు నన్ను తీసుకుని వైద్యులు ఉండే ప్రాంతానికి చేర్చారు. మాకు అమెరికాలో బంధువులున్నారని తెలిసిన నర్సు ఒకామె ఉంది. ఆమె నన్ను ఆపరేషను చేసే గదిలో ఏసి మలాములు రాసి కట్టు కట్టి ఎన్నో తంటాలు పడి రక్తస్రావాన్ని ఆపింది. ఆ గాయాల నెప్పులు, సలపరింతలకి చావే నయం అనుకునే ఓపిక కూడా లేకుండా పోయింది. గార్డులు రెండో రోజు డ్యూటీకి వచ్చి చచ్చిపోయానా లేదా కనుక్కోటానికి అంతా ఎతికారు.



ఆమె నన్ను ఇడిసిన బట్టల కింద దాచింది. కష్టంగా ఆళ్ళొచ్చినప్పుడు మూలుగుని ఆపుకున్నాను. ఒక పక్కన చలి. కష్టం మీద గాయాల పయిన పేళ్ళు కట్టినయ్యి.

1945 మే మొదటి వారం లేక మధ్యవారం అదీ ఆదివారం నాజీ గార్డులని అమెరికన్ దళాలు చుట్టుముట్టి, యుద్ధ ట్యాంకులతో కాల్చి చంపినయ్యి. కొందరిని ప్రాణాలతో పట్టుకున్నయ్యి. ఎవరో వచ్చి 'బయటకెళ్లిపోండి, మీ ప్రాంతాల్లో స్వేచ్ఛగా బతకండి' అన్నారు. మేం నమ్మలా. నాజీ గార్డులే చంపడానికి ఇట్టా చెబుతున్నారని భయపడ్డాం. కాని తరవాత అర్థం అయ్యింది. అమెరికన్ దళాలు మా దేశంలో ప్రవేశించాయని. కొద్దిగా విముక్తి దొరికిందని, మా అన్నా, నేనూ మిగతా వాళ్ళూ ఒకళ్ళనొకళ్ళు పట్టుకుని ఏడ్చాం.

కొన్ని వారాలకి ఇల్లు చేరుకున్నాం. మా కుటుంబాలలో 200 మందికి ఏడుగురం మిగిలాం. అలా ఎన్నో బాధలు మూటకట్టుకుని అమెరికా చేరుకుని చదువుకున్నాం.

కొంచెం సేపు ఆగి 'కొద్దిగా టీ ఇస్తావా' అని అడిగింది. సరే అని టీ కోపాలోకి వంచి ఇచ్చాను. తాగుతా పడుకుందో, పడుకుని తాగిందో.. కళ్ళు మూసుకుంది. తనకి ఇష్టమయినప్పుడు చెప్పుద్దని బలవంతం చెయ్యలా.

గంట నిద్దర తరవాత లేచింది. మళ్ళీ చెబుతోంది.

అమెరికాలో స్థిరపడిన ఓ జ్యూ ప్రొఫెసర్ని నేను, బ్యాంకు ఉద్యోగినీ మా అన్న పెళ్ళాడాం. నాకు ముగ్గురు పిల్లలు, తొమ్మిది మంది మనవల్తో కాలం గడుస్తా ఉంది. నాజీ పాలనలో భయంకర అనుభవాలని కోడళ్ళకి, మనవలకీ చెబుతా ఉండేదాన్ని. కొంతకాలానికి నా భర్త మరణించాడు.... మళ్ళీ ఒంటరితనం. రొండోసారి తిరిగొచ్చిన చేదు జ్ఞాపకాల బాల్యాన్ని తప్పిచ్చుకోటానికి ప్రపంచం చుట్టి రావాలి అనుకున్నా. ఆఫ్రికా, ఈజిప్టు, ఆసియా తిరుగుతా భారత్ చేరుకున్నా. ఈ దేశం చాలా పెద్దది.. నచ్చింది.

మొదట నేపాల్ వైపుగా మొదలుపెట్టి హిమాలయాల సౌందర్యం, డార్జిలింగ్, సిక్కిం, కులు, మనాలి, కలకత్తా కాళీ ఉత్సవాలు, ఢిల్లీ, ఫతేపూర్ సిక్రి, గులాబీ అందాల జైపూర్, బొంబాయి తళుకులు, హైదరాబాద్ గోల్కొండ కోటలు, పాతబస్తీ, ముత్యాల నగలు, చెన్నై దేవాలయాలు, రమణాశ్రమ ధ్యానం, అరోవెల్లీ జీవనం, కన్యాకుమారి సముద్రంలో సూర్యాస్తమయం చూడడం, తోటి ప్రయాణికుల వలన హంపి విజయనగర సామ్రాజ్యం గురించి తెలుసుకుని ఇక్కడకి వచ్చా. మొదటిసారి ఒక ఇంటో మూడు నెలలు అద్దెకి ఉండా. రొండోసారి కొంత డబ్బుతో వచ్చి ఒక సంవత్సరం ఉండిపోయా. ఎక్కడ తిరిగినా ఈ ప్రదేశం ప్రశాంతతా, ఈ కొండలు తుంగభద్ర పిలుస్తా ఉంటయ్యి. అట్టా అలవాటయ్యి ఇదే సరయిన ప్రదేశం అనుకుని, చుట్టూ తుంగభద్ర మజ్జలో రొండు కొండలు, ఈ చిన్నకొండ కింద ఉండ గుహే నా గూడు. నెలకొకసారెల్లి బ్యాంకులో డబ్బు తెచ్చుకుంటా. బ్యాంకు ఎకౌంటులో డబ్బు డ్రా చేస్తే నేను బతికి ఉండట్టుగా మా వాళ్ళకి లెక్క. ఆళ్ళకి కూడా పెద్దగా ఫోన్లు చేయను, ఉత్తరాలు రాయను. ఓ రొండేళ్ళ కింద మా పిల్లలూ, మనవళ్ళూ వచ్చి నన్ను చూసి ఎల్లారు. ప్రశాంతంగా ధ్యానం అలవాటయ్యింది. హిందూ ధర్మం పాటించాలనిపించింది. 'మీరాబాయి' అని పేరు ధరించి జీవిస్తున్నా. పాటలు, భక్తిగీతాలు, పద్యాలు దగ్గిరలో ఉండ పంపా సరోవరం సాధువుల దగ్గిర నేర్చుకున్నా. అలా నటాల్కాని మీరాబాయిగా గడుపుతున్నా" అంది.

'ఉష్' అనుకున్నా.

చాలా సేపు మౌనంగా ఉన్నాం. మాటలు లేవు. ప్రపంచమంతా హింసే రూపాలు మార్చుకుంటా ఉంటది. ఆ వేదనకి బలయ్యేది ఎక్కువగా ఆడవాళ్ళే...

'సరే ఇప్పటి గురించి మాట్లాడుకుందాం. హంపీ వచ్చినాక జీవితం?'

భయంకరమైన, మనిషి చేసిన మారణకాండ అనుభవాల నించీ తేరుకోలేక, తేరుకున్నట్టు నటిస్తూ కొండల్లో బతుకుతున్నా. ఒక్కోసారి నెలరోజులు కూడా మనిషితో మాట్టాడని రోజులుండయ్యి. కొండ మీద కుందేళ్ళూ, పక్షులూ వాటంతట అయ్యే వచ్చి చేరినయ్యి. దారిన పోతా, పోతా రోజూ నర్సప్ప(శేషగిరి నాన్న) కూరగాయలూ మంచినీళ్ళు తెచ్చేవాడు. అట్టా రోజూ తేటం అతనికి అలవాటయ్యింది. అతని కోసం వండటం నాకూ అలవాటయ్యింది. ఇద్దరం హిందీలో మాట్టాడుకునేవాళ్ళం. తిని పడుకున్నాక దుప్పటి కప్పి ఎళ్లిపోయేవాడు. అట్టా అతను ఆత్మీయుడయ్యాడు. అతని భార్యా, పిల్లలూ ఏదో ఒకటి ఒండుకుతేటం, నాకు తినిపిచ్చటం చేత్తారు. ఆ పిల్లలు నా పిల్లల్లా అయిపోయారు. నాతో కలిసి ఈ గుహలో ఉంటారు. ఇక్కడ కుటుంబాలు వాళ్ళు కూడా స్నేహితులయిపోయారు.

ఒకరోజు పూజ ధ్యానం ముగిచ్చి గుహలోనించి బయటకొచ్చాను. ఆకాశాన్ని నల్లటి బొగ్గు మబ్బులు మూసినయ్యి. ఎపుడూ లేనంతగా ఎముకలు నెప్పి పుట్టే గాలి కొట్టింది. కాకులు, గెద్దలు, కొంగలు, గొయిగలు గోలగోలగా పట్టపగలే గూళ్ళకి మళ్ళినయ్యి. చల్లటి గాలికి మబ్బులు కరిగి, మొగుడు కొడితే ఏడిసిన పెళ్ళాంలాగా, ఆకాశం కూడా తనని తనే కడుక్కున్నట్టుగా వాన కురిసింది. ఎంత పోత అంటే రొండు తాళ్ళు ఎత్తుండే కొండ మీద గుహలోకి కూడా నీళ్ళొచ్చినయ్యి. సమయానికి సీతారాం బాబా కూడా లేడు. కులూ మనాలీ ఎల్లాడు. గుహ మొత్తం మునుగుతోంది. అన్నీ కొట్టుకుబయటకొత్తన్నయ్యి. సామాన్లన్నీ వీడుకోలు చెప్పినయ్యి. పురుడయిన ఆడదాని లాగా తుంగభద్రమ్మ ఎర్రమట్టి నీళ్ళతో పొంగిపోతంది. దాహంతో నాలిక ఎండిన ఒగుడాకే అయ్యింది. నిదానంగా చేతితో మిగిలిన ఉన్ని రగ్గుతో కొండెక్కటం మొదలుపెట్టా. ముందు నా కాళ్ళూ, ఎనకాల నీళ్ళూ కొండను తడుపుతున్నాం. ఎదురుగా తేలివత్తన్న శవాలు, పైనించీ చినుకులు, మజ్జలో చలిగాలి, ఆకలి, దాహం అన్నీ చూత్తంటే చిన్నప్పటి రోజులు, కాన్సన్ట్రేషన్ క్యాంపు, ఆకలి చావులు మళ్ళీ గురుతొచ్చినయ్యి. రొండో రోజూ కూడా వరద ఉధృతే. ప్రకృతి తూకం, నేచర్ లా ఇయ్యి వదలవు. ఎక్కడకెల్లినా వెంటపడతయ్యి. ఎంతో కాలంగా ఆకులు, అలములు తిని బతుకుతున్న నేను కొట్టుకొచ్చిన చచ్చిన చేపని తిని నా కుచ్చుల లంగాలో నీళ్ళుపట్టుకుని పిండుకు తాగాను. జీవితం ఎవ్వరినీ వదలదు. ఎవడి బతుకు పాఠాలు ఆళ్ళు చదువుకోవాల్సిందే.

కాసేపటికి వాంతులు, ఇరోచనాలు మొదలయ్యి గొొట్టంతో కొట్టినట్టుగా మారినయ్యి. మళ్ళీ ఒకసారి ఇది జీవితానికి 'లాస్ట్ ఫ్రేమ్' అని అర్థం అయ్యింది. ఇపుడు భయం లేదు. బతకాలనే కోరికా లేదు. ప్రశాంతత కావాలి. బండ మీద నా విరోచనం మీద నేనే కూచ్చుని ప్రకృతిని వేడుకున్నా.

ఎక్కడ పుట్టానో ఎక్కడ పెరిగానో ఈ నేల మీద స్వేచ్ఛగా కాళ్ళు కదిలించాను. గాలి తీసుకున్నాను. తిండి తిన్నాను. ఈ గాలికీ, నీటికీ, భూమికీ శరణు, శరణు, శరణు అనుకుంటూ ప్రశాంతంగా ఊపిరి వదలటానికి సిద్ధపడ్డాను. ఇంతలో 'మీరా, మీరా' అనే నర్సప్ప మాటలు, 'పెరుగన్నం తిని, మంచినీళ్ళు తాగు' అనే శేషగిరి మాటలు. అంతే....

మూడు రోజులకి బతికి, బట్టకట్టి, ఒంటి మీద ఇంకా మెయ్యాల్సినయ్యి మిగిలి, ఆస్పత్రిలో కళ్ళు తెరిచా. అన్నిటికన్నా చెప్పాల్సింది – నాకు వానలో కూడా అన్నం ఒండి, తాగటానికి నీళ్ళు పంపిన నర్సప్ప పెళ్ళాం వరదల్లో కొట్టుకుపోయింది. అయినా గుండెల్ని రాళ్ళు చేసుకుని ప్రాణాల్ని పరకల్లాగా నాకు అడ్డం ఏశారు. ఇంతకన్నా గొప్ప మడుసులు ఎక్కడ దొరుకుతారు. ఈళ్ళని మళ్ళీ నా కోసం ఎవడు చేత్తాడు. పంపుతాడు.

ప్రాణాపాయంలో ఉన్న ఈ జూయిష్ ని రక్షించిన వాళ్ళని ప్రేమించడం, కీర్తించడం మా ధర్మం. అట్టా అతనికి నా సర్వస్వం పయినా హక్కులు ఉండయ్యి. నాకు బ్యాంకులో నెలనెలా పడే డబ్బుతో నాకేం పని లేదు. అది అతనికి ఉపయోగపడతందని ఇత్తాను.


బహుశా ఇక ఈ జన్మకి నేను పుట్టిన ఊరికి చేరను. నా భస్మం తుంగభద్రలో కలిపిచ్చుకోటం నా ఆఖరి కోరిక.

తుంగభద్ర ఎంత పుణ్యాత్మురాలు. ఎంత ఉగ్రరూపం చూపిచ్చినా, జనం ప్రేమని పొందుతా, ఇంతమందిని కలుపుకుంటూ చల్లగా పారతంది.

❖ ❖ ❖ ❖

అంకితం: ముంబయి నారిమన్ పాయింట్ ఉగ్రవాదుల దాడిలో కుటుంబాన్ని కోల్పోయిన రెండేళ్ళ పిల్లవాడు మోషే (Moshe Holdzberg) కి, తనని కాపాడి అక్కున చేర్చుకున్న క్రిస్టియన్ మావి శాండా శామ్యూల్‌కి.

– మన్నం సింధుమాధురి
8790906686





వేదంలా ఘోషించే గోదావరి

ఆరుద్ర గొప్పగా గోదావరిని కీర్తించారు. అంతకు ముందు గాని ఆ తర్వాత గాని గోదావరిని వేదమయం చేసిన వారు లేరు. గంగ తీరవాసులు ఆ పేరు చెబితే ఎంత పొంగిపోతారో, గోదావరి ప్రాంతీయులు కూడా అంత గర్వపడతారు. గోదావరికి పుష్కరాలు వస్తున్నాయి. గోదావరి యిప్పుడు అధిక పవిత్రమవుతుంది. లక్షలాది మంది పుణ్యస్నానాలు చేస్తారు. పుష్కర తీర్థంలో గతించిన పెద్దలకు పిండప్రదానాలు చేసి విధులు నిర్వహిస్తారు. గోదావరి మహా మేళా జూలై నెల మధ్య నుంచి ఆరంభం అవుతుంది. జీవనది గోదావరిని అందరూ స్మరిస్తారు, పూజిస్తారు, శిరసున ధరిస్తారు. "గోదాశబరి" క్రమేణా గోదావరి అయిందంటారు. ఎక్కడో మొదలై ఎన్నో రాష్ట్రాలను పలకరిస్తూ, దారిలో తారసపడిన వాగుల్ని వంకల్ని కలుపుకుని రాజమహేంద్రవరం వచ్చే సరికి అఖండ గోదావరిగా విస్తరించి సముద్రంలో ఐక్యమవుతుంది. గోదావరి తీరాలకు గొప్ప చరిత్ర ఉంది. మహాభారతం పుట్టిన నేల. గొప్ప సంస్కారం వుంది. వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు, చిలకమర్తి లాంటి దేశభక్తులు సంస్కర్తలు ప్రభవించిన నేల. ఆదికవి నన్నయ్య అవతరించిన నేల. ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. కోనసీమలో వెన్నల ఆకుపచ్చగా వుంటుందిట! మొట్టమొదటి సినిమా స్టూడియో "దుర్గా సినీటోన్"ని రాజమండ్రి నిడమర్తి సూరయ్య స్థాపించారు. అనేక చలన చిత్రాలను గోదావరి మీద నిర్మించారు. మూగ మనసులు నించి గోదావరి దాకా దాదాపు నలభైకి పైగా సినిమాలలో గోదావరి దర్శనమిస్తుంది. పాపికొండలు నించి భద్రాచలం దాకా సినిమా కథలు నడిచాయి. బాపు రమణలు యీ ప్రాంతం వారవడం వల్ల వారికి గోదావరి అంటే ప్రాణం. అందుకే వారి చాలా సినిమాల్లో గోదావరిని ఒక పాత్రగా ప్రవహింప చేశారు.

సర్ ఆర్థర్ కాటన్ గోదావరిని జన సామాన్యానికి అందుబాటులోకి తెచ్చారు. ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి, గలగలా సాగే గోదావరిని సార్థకం చేశారు. లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేశారు. క్రిందటి తరం రాజమండ్రి వాసులకు "స్టీమ్‌లాంచ్‌డరో" ఒక్క గొప్ప జ్ఞాపకం. కడియం, కడియపులంక పూలపండ్ల నర్సరీలు దేశానికే గర్వకారణం. తెలుగుజాతిని చెల్లియో చెల్లకో..., జెండాపై కపిరాజు అంటూ పద్యనాటకాలతో ఓలలాడించిన కవిద్వయంలో ఒకరైన చెళ్ళపిళ్ల కడియం వారే! బంగారు కడియం వారే! కొంచెం గోదావరికి అటు వెళితే ఎందరు కవులు? కథా చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, తల్లావఝుల శివశంకరస్వామి, భమిడిపాటి, మధురకవి నాళం కృష్ణారావు, శరభయ్య, మధునాపంతుల, ఇంద్రగంటి, హనుమచ్ఛాస్త్రి – వైతాళికులలో గోదావరీయులు కాని వారెవ్వరో చెప్పడం కష్టం. ప్రఖ్యాత చిత్రకారులు దామెర్ల రామారావు, సత్యవాణి, పిలకా నరసింహమూర్తి స్మరణీయులు. కవి పండితులు పిలకా గణపతి శాస్త్రి, గొప్ప కవి 'చెట్టు' ఇస్మాయిల్ ఆ తీరం వారే. టంగుటూరి ప్రకాశాన్ని తీర్చిదిద్దిన హనుమంతరావు నాయుడు, వారి నాటక కళా విన్యాసాలు గోదావరి సాక్షిగానే సాగాయి. వందేళ్లనాడు అక్కడకి ప్రింటింగ్ ప్రెస్‌లు వచ్చాయి. ఎన్నో గొప్ప గ్రంథాలు ప్రచురితమైనాయి. గొప్ప రచయితలతో బాటు, నాణ్యమైన ఫౌంటెన్‌పెన్‌ల తయారీ సంస్థలున్నాయి. గాంధీజీ మెచ్చిన కలం (రత్నం పెన్) యిక్కడే తయారైంది. ఆయుర్వేద మందులు తయారు చేసే ప్రసిద్ధ సంస్థలు ఇక్కడే ఉన్నాయి. కోనసీమ వేదపండితులకు, పంచాంగగణికులకు పెట్టింది పేరు. చుట్టూ అడివి ప్రాంతం కావడం వల్ల కలపవ్యాపార కేంద్రంగా స్థిర పడింది. వెదురు పుష్కలంగా పండుతుంది. పక్కనే కాగితం మిల్లు ఆ వెదురుని గుజ్జుచేసి తెల్లకాగితంగా చుడుతూ వుంటుంది. పక్కనే ఉన్న ధవళేశ్వరంలో ప్రతి యిల్లూ ఒక చేతిపరిశ్రమ. తాళాలు, కాటాలు, ట్రంకు పెట్టెలు, బెల్లం వండే రేకుకాగులు తయారవుతూ వుంటాయి. ఆ వూరు వూరంతా సుత్తి మోతలతో సందడి సందడిగా వుంటుంది. అక్కడ ప్రసిద్ధ నటులు ఎస్వీరంగారావు పుట్టినిల్లు కనిపిస్తుంది. రామ పాదాల రేవు పక్కన ముళ్లపూడి వెంకటరమణ పుట్టిన యిల్లు వుంది. రాజమండ్రి పరిసరాలలో ఆగష్టు నెలలో వరదగోదావరిని చూడడం ఒక గొప్ప అనుభవం. అడవి బాపిరాజు వరదగోదావరిపై రాసిన పాట చాలా ప్రసిద్ధికెక్కింది. నేతలు, జరీచేతలు, లేసుల అల్లకం బాగా తెలిసిన ప్రాంతమిది.

గోదావరి వైభవమే వైభవం! పనసతొనలు, మామిడిపళ్లు చక్కెర కేళీలు, బెల్లపు చెరుకులు వారికే సొంతం. గోదావరి తెల్లవంకాయల రుచేరుచి. ఆకుకూరల నవనవలే నవనవలు. కూర అరటి, అరటి పువ్వు, అరటిదూట మహాద్భుతం! గుండ్రంగా ఉండి వర్షాకాలం ఆరంభంలో వచ్చే ఆకాకరకాయలు అమోఘం. అక్కడి రుచులే రుచులు. తాపేశ్వరం మడత ఖాజా, ఆత్రేయపురం పూతరేకులు, ఇంకో పేట బెల్లపు జిలేబి, నువ్వుజీళ్లు ...ఎన్నో? ఇంకా ఎన్నో చెప్పచ్చు గాని నోరూరిపోతుంటే ఎలా? గోదారి నోళ్లకు ఆకలెక్కువ, ఆరోగ్యమెక్కువ ఆపైన తెలివీతేటా ఎక్కువంటారు అనుభవజ్ఞులు.

పుష్కర గోదారికీ గొజ్జంగి పూదండ.



శ్రీరమణ

చెక్కిలిగిలి

– మోహన్

వర్గమా వర్ణమా



వెంకటేశ్వర్లు మార్క్సిస్టు అవగాహన బాగా ఉన్నవాడు. జర్మన్ ఐడియాలజీ నుంచి, ఆన్ కాంట్రడిక్షన్ వరకూ తిరగేసిన వాడు.

కానీ, తృతీయ ప్రపంచ వ్యవసాయిక విప్లవాల్లో కూడా కార్మిక వర్గం ఇరుసై నాయకత్వం వహిస్తుందనీ, ఇందులో లుంపెన్ ప్రొలిటేరియట్ కు కూడా పాత్ర ఉంటుందనీ వాదిస్తాడు. అదే నాకు ఒళ్ళుమంట.

అయినప్పటికీ వెంకు దళితుడు. మాలమాదిగల ఐక్యపోరాటం సకల పీడిత ప్రజల జాతీయ విముక్తి పోరాటంలో విడదీయలేని అంతర్భాగమని చెప్తాడు. నాకు నచ్చింది. కానీ ఈ కోస్తా మాల వలసవాది చెప్తే వింటానికి మా చెవుల్లో పువ్వులున్నాయా అని తెలంగాణా విప్లవ మాదిగలు డప్పు బజాయించి చిందులేసినప్పుడు నాకేం తోచలేదు.



అమానవీయమైన బ్రాహ్మణవాద మనువాద నిచ్చెనమెట్ల సమాజంలో మాలమాదిగ డెక్కలి, చాకలి, మంగలి, బలిజ, ఒంటరి, లంబాడీ, కోయ, చెంచు తదాది వర్ణాల విముక్తి వర్గ పోరాటాల ఉధృతితో నూతన ప్రజాస్వామిక విప్లవ వ్యూహం, ఎత్తుగడలతో ముడిపడి ఉందని వెంకూ చెప్పినప్పుడు సంతోషమయ్యింది.

కానీ, ఈ అగ్రవర్ణ ఉక్కు పదఘట్టనల నుంచి విముక్తి కోసం సాగే సుదీర్ఘ సంకుల సమరానికి అగ్రవర్ణాల వాళ్లు కూడా నాయకత్వం వహించ వచ్చంటాడు వెంకూ! అక్కడే తగువొస్తుంది నాకు. తన్నబుద్ధేస్తుంది.

మరి విప్లవాన్ని ఒంటరి చేయకుండా విశాల ఐక్య సంఘటనను విస్తృతం చేసేటప్పుడు జాతీయ బూర్జువా వర్గానికి కూడా ప్రగతిశీల పాత్ర ఉంటుందని వెంకూ చెప్పినప్పుడు నిజమేననిపించింది. వర్గ శత్రు నిర్మూలనలో నిర్ణయాత్మకమైన తిరుగులేని దెబ్బ తీసే ఈ విప్లవ అగ్రగామి దళంలో మాలమాదిగల నాన్ యాంటాగనిస్టిక్ కాంట్రడిక్షన్ అగ్రవర్ణ నేతల యాంటాగనిస్టిక్ కాంట్రడిక్షన్ కలిసి పేలితే ఏమౌతుంది?

❖

విజయాన్ని అందించే తాత్విక దృక్పథం



మీరు మీ లాభాలను గురించి ఆలోచించవద్దు. ప్రజలకు మరింత ప్రయోజనం, మరింత సౌకర్యం ఎలా కలిగించాలని ఆలోచించండి. ప్రజలకు మేలు చేయాలన్న తాత్విక దృక్పథం ఎవరినైనా విజయంవైపు నడిపిస్తుంది.

విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న తర్వాత చాల మంది యువకులు ఏదో ఒక వ్యాపారాన్ని ప్రారంభించి, జీవితంలో స్థిరపడాలని తహ తహలాడుతుంటారు. పెట్టుబడిని సమీకరించి, తమ పూర్తి శక్తి సామర్థ్యాలు కేంద్రీకరించి, తమ సమయాన్నంతటినీ వెచ్చించుతూ వ్యాపారాన్నిగాని, పరిశ్రమనుగాని ప్రారంభించిన వారిని ఓ పది సంవత్సరాల తర్వాత కలిసి వారు లాభాలబాటలో సాగుతున్నారో లేదో పరిశీలించబోతే, అందులో 90శాతం మంది తీవ్ర నిరాశా నిస్పృహలను వ్యక్తపరుస్తారు. తాము ప్రారంభించినప్పుడు ఆశించిన దొకటి, జరిగింది మరొకటి అని పెదవి విరుస్తారు. తాము తెలిసి ఒక తప్పు కూడ చేయలేదని, రోజుకు ఇరవై గంటలు కష్టపడ్డామని, ఎన్నెన్నో అప్పులు చేశామని, నష్టాల్లో కూరుకు పోయామని, తాము చేస్తున్నది మాని మరో వ్యాపారం ప్రారంభించినా తిరిగి అదే అనుభవం పునరావృతమయిందని చెప్పబోతారు.

అసలెందుకలా జరుగుతుంది? పొరపాటు ఎక్కడ ఉంది? లాభం సంపాదించడంకోసం ప్రారంభించిన పనిలో నష్టాలు ఎందుకు వస్తాయి? ఇందుకు ఏకైక కారణం ఇలా వివిధ పనులు ప్రారంభించేవారి తప్పు దృక్పథం మాత్రమే. లాభాలు సంపాదించడమే లక్ష్యంగా ఎంచుకున్నవారికి లాభాలు ఎన్నటికీ చేకూరవు.

రాజమండ్రిలో వస్త్రాలు హోల్‌సేల్‌గా అమ్మే దుకాణం ఒకటి ఉంది. దాని యజమాని అతితక్కువ లాభంతో చీరలు, ఇతర దుస్తులు అమ్మేవాడు. అతని దుకాణంలో అమ్మకాలు విపరీతంగా సాగేవి. ఈ అనుభవంతో అతనొక వ్యాపార రహస్యాన్ని అవగతం చేసుకున్నాడు. తక్కువ ధరకు అమ్మితే ఏదయినా అధిక సంఖ్యలో అమ్ముడుపోయి అధిక లాభాలు వస్తాయని అతను గుర్తించాడు. కొనుగోలుదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యత కల్పించడమే ఏ వ్యాపారానికైనా అతి ముఖ్యమని అతనికి అర్థమైంది. ఆ తరువాత తన దృష్టిని తన వ్యాపార క్రమం ఎలా మొదలవుతుందో పరిశీలించాడు. ఒక కర్మాగారం చీరలు తయారు చేస్తుంది. ఆ కర్మాగారం నుండి అవి తనకు చేరడానికి మధ్యలో స్టాకిస్టులు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు వంటి ఏడు అంచెలు ఉంటాయి. ఇందులో ప్రతి అంచెలోని వారు అసలు ధరకు తమ లాభాలను జోడిస్తారు. అందుకే కర్మాగారంలో 75రూపాయలకు ఇచ్చే చీర తనకు వచ్చేసరికి రెండు వందల రూపాయలవుతోంది.


తీరా షాపుకు వెళ్ళేసరికి రెండు వందల యాభై రూపాయలకు అమ్మబడుతోంది. ఆ విషయం గుర్తించిన తరువాత ఆ వ్యాపారి నాణ్యమైన వస్త్రాలు తయారుచేసే ఒక కర్మాగారానికి వెళ్ళి తాను నెలకు లక్ష చీరలు కొంటానని ఫ్యాక్టరీ ధరకే తనకు ఇవ్వమని కోరాడు. ఆ ఫ్యాక్టరీ యజమాన్యం అందుకు అంగీకరించింది.

అక్కడ నుంచి తెచ్చిన చీరలు కేవలం పది శాతం లాభాన్ని కలుపుకుని అమ్మినా, మార్కెట్ ధరకు సగం ధరకే లభ్యమయ్యేవి. దాదాపు 35సంవత్సరాల క్రితం ఆ వ్యాపారి రాజమండ్రిలో ప్రారంభించిన ఈ ప్రయోగం అమిత సంచలనం కలిగించింది. గృహిణులు, చిన్నచిన్న వ్యాపారులు అతను షాపు తెరవకముందే వందల సంఖ్యలో రావడం, తోపులాటలు జరుగకుండా నిలువరించడానికి పోలీసులు కాపలాకాయడం నిత్యకృత్యమైంది. ఆ తరువాత ఆ వ్యాపారి ముఖ్య పట్టణాల్లో పెద్దపెద్ద దుకాణాలు తెరిచాడు.

ఫ్యాక్టరీలలో కోట్ల సంఖ్యలో తయారయ్యే దుస్తుల ధరలను గణనీయంగా తగ్గించడంలో ఈ వ్యాపారులు కీలక పాత్ర పోషించగలిగారు. కాని గ్రామాలలో పట్టుచీరలు నేసే చేనేత కార్మికుల వద్ద వాటి ధరలను గణనీయంగా తగ్గించడానికి ఏం చేయాలి? ఎటువంటి పెట్టుబడి పెట్టలేని చేనేత కార్మికులు అధిక ధరలకు పట్టుదారాన్ని, జరీని కొనడం ఫలితంగా చీరల ధరలు అధికంగా ఉండటం గమనించిన ఈ వ్యాపారులు పట్టుదారం ఉత్పత్తి దారుల నుంచి అతితక్కువ ధరలకు కొని, గుజరాత్‌లోని జరీదారం ఉత్పత్తి దారుల నుంచి దానిని కూడ అతితక్కువ ధరకు కొని, చేనేత కార్మికులకు వాటిని సరఫరా చేసి, వాటికి కొత్త కొత్త డిజైన్లు రూపొందించే నిపుణులకు తామే జీతమిచ్చి నియమించి, వారి పర్యవేక్షణలో తయారు చేయించడం ప్రారంభించారు. ఈ వ్యాపారులు చొరవతో పట్టు చీరల ధరలు సైతం క్రమబద్ధీకరించబడి, వినిమయదారులకు తక్కువ ధరకు లభించడం మొదలైంది.

రాజమండ్రిలో 1980లో మొదలైన ఈ ప్రక్రియ వాల్టన్ అనే వ్యక్తి 1962లో అమెరికాలో వాల్‌మార్ట్ పేరిట ప్రారంభించాడు. నేరుగా ఉత్పత్తి దారుల నుంచి వివిధ వస్తువులు కొనుగోలు చేసి, తన ఖర్చులు, లాభానికిగాను కేవలం అయిదు శాతం అధికధరలకు అమ్మడానికి అతను నిర్ణయించుకున్నాడు. ఆ సంస్థ విపరీతంగా విస్తరించినప్పటికీ ఆ నిర్ణయానికి కట్టుబడి అంటే 5శాతం లాభంతో తన వ్యాపారాన్ని సాగిస్తోంది. అమెరికాలో యువతులు ధరించే దుస్తులు రెండు మూడు వేల రూపాయల ఖరీదు ఉంటే, అవే దుస్తులు బంగ్లాదేశ్‌లో వెయ్యి రూపాయలంకంటే తక్కువ ధరకే తయారవుతున్నాయి. బంగ్లాదేశ్‌లో వాటిని కొని, కేవలం అయిదు శాతం లాభం కలుపుకుని అమెరికాలో అమ్మడం ప్రారంభించిన తరువాత అమెరికాలో దుస్తుల తయారీ పరిశ్రమ మూలపడింది. ఈ వాల్‌మార్ట్ సంస్థ ప్రపంచంలో చిల్లర వాణిజ్యంలో ఒక అపూర్వ విప్లవాన్ని కొని తెచ్చింది. అన్ని దేశాలలోనూ ఏర్పడుతున్న మాల్స్ అన్నింటికీ ప్రేరణ వాల్‌మార్ట్ వ్యాపార సూత్రాలే. ఈ అనుభవాలు నేర్పే గుణపాఠాలేమిటి? మీరు మీ లాభాలను గురించి ఆలోచించవద్దు. ప్రజలకు మరింత ప్రయోజనం, మరింత సౌకర్యం ఎలా కలిగించాలని ఆలోచించండి. సెల్‌ఫోన్లు నెట్ ద్వారా రీఛార్జింగ్ చేసుకోగల సౌకర్యం కల్పించిన ఓ వ్యక్తి స్థాపించిన సంస్థకు కొద్దికాలంలోనే లాభాల వరద వచ్చిపడింది. కిరాణా సరుకులు తక్కువధరకు ఇంటికి సరఫరా చేసే వ్యాపారం దినదిన వృద్ధి చెందుతోంది.

తోటివారికి అధిక ప్రయోజనం కలిగించడమెలాగని ఆలోచించిన బిల్‌గేట్స్, వేల కోట్ల రూపాయలు ప్రజాసేవకు విరాళంగా ఇవ్వడం చూస్తే ఏమనిపిస్తుంది? అతను ప్రారంభించిన మైక్రోసాఫ్ట్ వ్యాపారంగాని, అతని భూరి విరాళాలుగాని, ప్రజలకు ప్రయోజనం కలిగించాలన్న అతని తాత్విక దృక్పథానికి అనుగుణంగానే రూపుదిద్దుకున్నాయి. ప్రజలకు మేలు చేయాలన్న తాత్విక దృక్పథం ఎవరికైనా విజయంవైపు నడిపిస్తుంది.



– సి నరసింహారావు
మనోవైజ్ఞానిక విశ్లేషకులు

వెండితెర వెనుక

ఎన్టీఆర్ నటనా తపస్సు


చాలామంది సినీతారలు తాము ధరిస్తున్న పాత్ర పట్ల చూపవలసిన శ్రద్ధ కంటే, తమకు ఏర్పాటు చేసిన వసతులు, సౌకర్యాల విషయంలో చాలా పట్టింపుగా ఉంటారు. ఆ విషయంలో ఏ చిన్నలోటు జరిగినా, నిర్మాత సమస్యల గురించి ఆలోచించకుండా నానా రభసా చేస్తుంటారు. అలాంటి తారలకు ఎన్.టి.రామారావు గారి నటజీవితంలోని ఈ అనుభవం ఓ గుణపాఠం కావాలి. ఇది ఏవిఎమ్ వారి 'భూకైలాస్'(1958) చిత్రం షూటింగ్ జరిగినప్పటి సంగతి. ఎన్టీఆర్ రావణుడి పాత్రలో ఘోరతపస్సు చేసే ఘట్టం. గడ్డం, మీసాలతో ఎన్టిఆర్ పుట్టల మధ్య దిగువన కూర్చుని ఉన్నారు. కొన్ని దృశ్యాలు తీశాక ఆయన చుట్టూ ఉన్న పుట్టలు, పొదల్లాంటివి అంతకంతకూ దట్టమవుతున్నట్లు అమరుస్తూ, ఆ షాట్స్ చిత్రీకరిస్తున్నారు. 'లంచ్‌టైమ్' అయింది. "భోజనానికి రండి సార్" అని ఎన్టీఆర్‌ను



దర్శకుడు కె.శంకర్ పిలిచారు. "పరవాలేదు.. మీరు చేసి రండి" అని ఎన్టీఆర్ అంటుంటే, దర్శకుడు ఆయన్ని రమ్మని మరీమరీ అభ్యర్థించారు. "చూడండి బ్రదర్.. ఎంతో కష్టపడి చుట్టూ ఈ పొదలు, పుట్టలూ వేశారు. నేను లేవాలంటే, వీటిని తొలగించి మళ్లీ వేయాలి. నాకు ఈ గడ్డం అదీ చక్కగా అమరింది. నేను పైకి లేస్తే ఈ కంటిన్యుటీ అంతా దెబ్బతింటుంది. అంచేత ఏదీ కదిలించకండి. ఈ ఒక్కపూట నాకు భోజనం లేకపోతే, కొంపమునిగేదేమీ లేదు. డోన్ట్ వర్రీ.. మీరంతా వెళ్లి భోంచేసి రండి" అంటూ రాత్రి ఆ సీన్స్ అన్నీ ముగిసేవరకూ ఆహారమేమీ తీసుకోకుండా అలా నటనా తపస్సులో నిమగ్నమైపోయారు ఎన్టీఆర్.

రివర్స్ షాట్

ఇప్పుడంటే గ్రాఫిక్స్ అవీ ఉపయోగిస్తూ సినిమా సన్నివేశాల్లో బోలెడు అద్భుతాలు చూపిస్తున్నారు. గతంలో దర్శక నిర్మాత బి.విఠలాచార్య గారు ఇటువంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలు లేని రోజుల్లో 'ట్రిక్ ఫోటోగ్రఫీ'తో రకరకాల గమ్మత్తులు చూపించి ప్రేక్షకులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేలా చేసేవారు. ఐతే, ఒకసారి మాత్రం ఓ ప్రయోగం బెడిసికొట్టడాన్ని సినీ పరిశ్రమలోని అనుభవజ్ఞులు ఇప్పటికీ గుర్తు చేసుకుని



నవ్వుకుంటూ ఉంటారు. అదేమిటంటే ఒక జానపద చిత్రంలో ఓ నటుడు (పాపం.. పేరెందుకులెండి!) వీరోచితంగా గుర్రం మీదకి ఎగిరి కూర్చుని ముందుకు దూసుకుపోయేలా ఓ దృశ్యాన్ని 'ప్లాన్' చేశారు విఠలాచార్య. ఐతే, ఆయన అనుకున్నరీతిలో ఆ నటుడు అంత హుషారుగా గుర్రం మీదకి ఎక్కడం ఎంత ప్రయత్నించినా కుదరడం లేదు. అప్పుడు ఛాయాగ్రాహకుడు ఓ ఉపాయం చెప్పాడు. "సార్‌ను మామూలుగానే గుర్రంపైకి ఎక్కించి కూర్చోబెట్టండి. గుర్రం మీద నుంచి వీరోచితమైన ఎక్స్‌ప్రెషన్‌తో కిందకి దూకమనండి. ఆ షాట్ నేను రివర్స్‌లో తీస్తాను. తెరమీద చూసినప్పుడు వేగంగా గుర్రంపైకి ఎగిరి కూర్చున్నట్లు కనిపిస్తుంది" అన్నాడు. ఆ ఉపాయం విఠలాచార్యగారికి బాగా నచ్చింది. ఆ సన్నివేశాన్ని అలాగే తీశారు. ఇది జరిగిన నాలుగైదు రోజుల తర్వాత 'ల్యాబ్'లో అంతవరకూ తీసిన చిత్రం 'రషెస్' చూడడానికి ఏర్పాట్లు జరిగాయి. విఠలాచార్యగారు కూడా ఆ 'రివర్స్‌షాట్' ఎలా వచ్చిందో చూడాలనే ఉత్సాహంలో ఉన్నారు. తెరమీద ఆ సన్నివేశం రానే వచ్చింది. ల్యాబ్‌లో సినిమా చూస్తున్న వాళ్లంతా ఒక్కసారి గొల్లున నవ్వారు.విఠలాచార్యగారు తల పట్టుకుని కూర్చున్నారు.ఇంతకీ జరిగిందేమిటంటే, సదరు నటుడు గుర్రం మీద నుంచి కిందికి దూకుతున్న ఆ సమయంలోనే గుర్రం లద్దె వేసింది. అదెవరూ గమనించలేదు. రివర్స్ షాట్ చూస్తున్నప్పుడు, ఆ నటుడు గుర్రం మీదకి ఎంత ఉధృతంగా ఎగిరారో, అంతే ఉధృతంగా ఆ లద్దె కూడా పైకి వెళ్లినట్లు కనిపించింది!

'రియల్'హీరో

'హీరోలు నిజ జీవితంలో కూడా హీరోలుగానే ఉ



ంటారా?' అనే సందేహం అప్పుడప్పుడు ప్రేక్షకుల్లో కలుగుతూ ఉంటుంది. 'డబుల్ వో సెవెన్'(007) జేమ్స్‌బాండ్ పాత్రలో విశేషమైన పేరు తెచ్చుకున్న షీన్ కోనరీ ఒకసారి న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్. కెన్నడీ విమానాశ్రయంలో తన స్నేహితుడొకరు కనిపిస్తే, కుడి చేతిలో ఉన్న బ్రీఫ్‌కేస్ కిందపెట్టి, అతనితో కరచాలనం చేశాడు. పిచ్చాపాటీ మాట్లాడుతూ, ఒక నిమిషం తర్వాత చూసుకుంటే, అప్పటికే ఓ చోర శిఖామణి–ఆయన బ్రీఫ్‌కేసును కొట్టేశాడు. జేమ్స్‌బాండేమిటి–బ్రీఫ్‌కేసును పోగొట్టుకోవడమేమిటని అప్పట్లో అందరూ నవ్వుకున్నారు. ఇప్పుడు హాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు వద్దాం.. ఒకసారి సూపర్‌స్టార్ కృష్ణ ఇంట్లోకి ఓ దొంగ దూరాడు. విజయనిర్మలగారిని గాయపరచి దొంగతనం చేయాలని ప్రయత్నించాడు. అప్పుడామె కేకలు విన్న మన ఆంధ్రా జేమ్స్‌బాండ్ కృష్ణ 'రియల్ హీరో'లా అక్కడకు వచ్చి ఆమెను రక్షించి, ఆ దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు! ఇప్పుడు చెప్పండి–నిజమైన హీరో ఎవరో!

తొలి సంపాదన



జీవితంలో విజయం సాధించిన ప్రముఖులూ లక్షలు, కోట్లు సంపాదించినా, తమ మొదటి సంపాదనలోని 'థ్రిల్'ను మరచిపోలేరు. ఉదాహరణకు ప్రసిద్ధ నేపథ్యగాయని పి.సుశీల తొలి సంపాదన. ఆమె తన 12వ యేట సంగీతం నేర్చుకుని పాటలు పాడుతూ మొట్టమొదటిసారిగా శ్రీకాకుళంలో ఓ గాజుల వ్యాపారి ఇంట్లో ఏదో ఫ్యామిలీ ఫంక్షన్ సందర్భంగా పాటకచేరీ చేశారు. అందరికీ ఆ బాలకోకిల పాటలు పాడిన తీరు బాగా నచ్చింది. కచేరీ అయిన తర్వాత ఆ షావుకారు కూడా అభినందిస్తూ, కొంత సొమ్మును మూటల్లో కట్టి తీసుకొచ్చి ఆమెకు బహూకరించాడు. ఇంటికి వెళ్లాక ఆ మూటలు విప్పి చూస్తే, ఒక్కో మూటలో వంద అణా బిళ్లలు ఉన్నాయి! పి.సుశీల ఆ తొలిసంపాదన గురించి ఇప్పుడు తలచుకున్నా, ఎంతగానో మురిసిపోతుంటారు!



– బి.కె. ఈశ్వర్

పాత రోజుల్లో గ్రామాలలో కల్తీ తగలని తెలుగుమాటలు పుష్కలంగా వినిపించేవి. సామెతలు, జాతీయాలు, ఊతపదాలు సంభాషణల్లో ఆశువుగా దొర్లేవి. దానివల్ల మాటలు వినుసొంపుగా వుండడమే గాక సంగతులు చక్కగా అర్థమయ్యేవి. "చేటలో వెలక్కాయల్లా వున్నవి కనిపిస్తూనే వున్నాయి", "అద్దం మీది ఆవాల్లా జారిపోతుంటే ఏం చేస్తాం"? ఇలాంటివి గడప గడపకీ ఘడియఘడియకీ వినిపిస్తూ వుండేవి. కాల ప్రవాహంలో ఎన్నో మాటలు, వాడుకలు కొట్టుకుపోయాయి. వాటి రూపాల్ని చాలా మాటలు మార్చుకున్నాయి. ప్రవాహంలో దొర్లుకుంటూ వచ్చిన కొండ రాళ్లు, కొంత దూరం వెళ్లాక శివలింగాలుగా, బాణాలు (పూజలో వుంచే చిన్న శిలలు)గా, ఆఖరికి గచ్చకాయలుగా మారడం మనం చూస్తూనే వున్నాం. నీటి వురవడికి, మట్టి ఇసుకల వొరిపిడికి కొండరాళ్లు తమ పరిమాణాన్ని, రూపాన్ని కోల్పోతాయి. భాష కూడా యిలాంటిదే. ప్రవాహాలకు, ప్రభావాలకు లొంగుతుంది. తన అసలు స్వరూపాన్ని కోల్పోతుంది. భాష ప్రయాణిస్తుంది. మనిషి దాన్ని మోసుకు వెళతాడు. చెట్లు చేమలు రకరకాల పద్ధతుల్లో బీజవ్యాప్తి చేసుకున్నట్టు, భాష కూడా తనని తాను దూర తీరాలకు విస్తరింప చేసుకుంటుంది. అలా చేసుకోవడంలో కొంత మేర తన రూపరేఖా విలాసాల్ని మార్చుకుంటుంది. భాషకి ప్రాణం వుంది. అది ఎప్పుడూ సజీవంగా వర్ధిల్లాలని కోరుకుంటుంది. అందుకు మనం సహకరించాలి.

– సంపాదకుడు

శబ్దార్థ చంద్రిక

తెలుగులో కొన్ని జంటపదాలు రోజువారీ వాడకంలో వినిపిస్తూ వుంటాయి. ప్రసిద్ధ చిత్రకారుడు బాపు పై శీర్షికన కొన్ని కార్టూన్లు వేసి, వాటిలో ఆ శబ్దాలను నిక్షిప్తం చేశారు. ఉదాహరణకి ఈ పేజీలో ఆయన కార్టూన్లు కొన్ని చూడండి.



మరికొన్ని జంటల్ని పలకరిద్దాం. విసవిస, మిసమిస, కసకస, రుసరుస, బసబస, ముసముస, తుసతుస, తసతస, పసపస, పుసపుస – ఇంకా కటకట, పుటపుట, పిటపిట, పటపట, మిటమిట, మటమట, లాంటివి మనకు తెలుసు. "యంత్రాతి అడవి లోపల గుంత్రాతికి కాళ్లు వచ్చి గునగున నడిచెన్". ఇది సమస్యాపూరణ. రాముని పాదస్పర్శతో గుండురాయిగా పడివున్న అహల్య విముక్త అయి గునగున నడిచిందని అవధాని పూరించారు. ఘుమఘుమలు మనకు తెలుసు. దొడదొడ శ్రీనాథుడి ప్రయోగం. పుటుక్కు జరజర డబుక్కుమే –దీన్ని విప్పితే ఒక కథ. ఇక్కడ జరజర జారింది గుమ్మడికాయ.

"బిరబిరా కృష్ణమ్మ, గలగలాగోదారి పరుగులిడుతుంటే బంగారు పంటలే పండుతాయి" అని కవి రాస్తే, పరుగులిడితే లాభం లేదు. ఆనకట్టలు కట్టి ఆపైన కాలవలు తవ్వి పొలాలకు నీరందిస్తే అప్పుడు పంటలు పండుతాయన్నారు, చమత్కారంగా అయ్యదేవర కాళేశ్వరరావు ఆనాటి స్పీకర్. కలకల, గలగల, వలవల, సలసల, మలమల, చిలచిల, జలజల, మిలమిల, గులగుల – వీటిని ఎప్పుడెప్పుడు వాడాలో తెలిసిందే. పావురాలు, కవుజు పిట్టలు కువకువ లాడతాయి. గటగటా తాగడం, చివరి దశలో గుటగుట లాడడం మామూలే. పురుగులు లోకలుకలాడుతున్నాయి. లోపాయికారి గొడవలు నడుస్తూంటే "లుకలుకలు" అంటారు. వెలవెల, కణకణ మనకు తెలుసు. వాన వెలిశాక డొంకదారులు చితచిత లాడుతుంటాయి. కొందరు లొడలొడ వాగుతారు. నిండు సభలోకి ద్రౌపదిని బరబర యీడ్చుకురాగా ఆమె భోరుభోరున విలపించింది. పరపర చింపాడు, కోశాడు. పునరుక్తితో క్రియని ధ్వనింప చేయడం దీని ప్రత్యేకత. కిచకిచ అనగానే కోతులు గుర్తొస్తాయి. బాపు లాంటి రామభక్తుడికి హనుమ స్ఫురిస్తాడు. గడగడ అప్పగించడం, టకటకా పని పూర్తి చేయడం, చర చర వెళ్లిపోవడం, గిరగిర తిరగడం మనం నిత్యం వినేవి. "సరిసరి" ఒక చిత్రమైన పదం. దీన్ని చాలా సందర్భాలకు వాడచ్చు. ప్రజ్ఞగల వారు సరిసరి ని నవరసాల్లో పలకించి ఆయా భావాలు స్ఫురింపచేయవచ్చు. "బుడబుడ" శబ్దం దశరథుణ్ణి ఏమార్చి, ఆఖరుకు రామాయణానికి దారితీసింది. పప్పు తుకతుక వుడుకుతుంది. మనసు రెపరెపలాడుతున్నా, టకటక స్ఫురించని కారణంగా బరబర రాయలేకపోతున్నా. ఇలాంటివి ఎన్ని చెప్పినా తెలుగులో యింకా కొన్ని మిగిలే వుంటాయి. ఇదొక తరగనిగని.



పొడుపు – విడుపు

పొడుపు:
పోరోరి లచ్చన్న
వళ్లంత గిచ్చున్న
కారాకు పచ్చున్న
కొండ తియ్యున్న

[illegible]

మాటలు – వాటి వేళ్లు

మాటలకు వేళ్లుంటాయి. కొన్ని మాటలు బాగా చేవదేలి ఊడల్ని కూడా దించుతాయి. ఆ ఒక్క మాట చిలువలు పలువలుగా పెరిగి వందపదాలకు మొదలవుతుంది. అలాంటి పదాల కుదుళ్ల గురించి ప్రస్తావించుకుందాం.

పొదుగు అనగానే స్ఫురించేది పాలపొదుగు. పక్షులు గుడ్లను పొదగడం తర్వాత గుర్తొస్తుంది. చేపే పొదుగు, చేపని పొదుగు అంటుంటారు. "పాలు చేపడం" అనేది ఒక ధర్మం. దూడని వదుల్తారు. అది చెంగున వెళ్ళి తల్లి పొదుగు ముందు వాలుతుంది. తల్లి అంగీకారంగా చేపుతుంది. దూడ అక్రమంగా తాగుతుంటే, యజమాని దాన్ని తప్పించి తాను కూర్చుని పాలుపితుకుతాడు. "పుట్టబోయెడి బుల్లి బుజ్జాయి కోసమై పొదుగుగిన్నెకు పాలు పోసి పోసి ..." అన్నారు హృదయశ్రీ కరుణశ్రీ. కాసులు రాల్చని వానిని "చేపే గొడ్డుకాదు" అంటారు. 'ఆశపడ్డాడు గాని ఆయనేమీ చేపలేదు'. ఇలాంటి మాటలు వాడుకలో వున్నాయి. పొదుగులెండినాయి, ఒట్టిపోయింది, యివన్నీ ఆ కుదురులో మాటలే. "పొదగనేర్చిన" అంటే చాలా విద్యలు వచ్చినవాడని అర్థం. కోకిలకి పొదగడం చేతరాదని, కాకి చేత పొదిగిస్తుందనీ ప్రతీతి. కూతరాగానే కోకిల పిల్లల్ని తన గూట్లోంచి వెళ్లగొడుతుందట. పొదగడం అంటే కూర్చడమని కూడా అర్థం. గాజులకు ముత్యాలు పగడాలు పొదిగారు. ఉంగరంలో నవరత్నాలు పొదిగారు. "పొదుగు" అనే ఒక్క మాటకి సందర్భాన్ని బట్టి అర్థాలు వేరు వేరు.

కర్పూరం హరించింది. ఆస్తి కర్పూరంలా హరించింది. ఆస్తి కర్పూరంలా హరించింది. ఆ మందువల్ల వాతం హరించింది. ఇక్కడ అన్నిచోట్లా హరించబడుతుంటే యిగిరిపోవడం, తరిగిపోవడం అనే అర్థంలోనే వినియోగమైంది. వాడి పాపమే వాడిని హరించింది. అన్నప్పుడు కూడా భావం ఒకటే. ఏ కాళిదాసు లాంటివాడో ఒక వెన్నెల రాత్రి హరించడాన్ని వర్ణించినపుడు హరించడమంటే యిదా అనిపిస్తుంది.

పచ్చి గడ్డి పలహారం

విషయాన్ని హత్తుకునేలా చెప్పడానికి సామ్యాలు, జాతీయాలు, సామెతలు అలవోకగా వాడడం తెలుగు వారికి అలవాటు. "వృథా" అని చెప్పడానికి – అడివిగాచిన వెన్నెల, బూడిదలో పోసిన పన్నీరు, గోడకికొట్టిన సున్నం, గంగలో పోసినట్టు, చెవిటివాని ముందు శంఖం వూదినట్టు, కంచిగరుడసేవ, గంథంలో పులుసు లాంటి నానుడులతో అర్థవంతం చేస్తారు.

